రామోపాఖ్యానం

(సరళ వ్యాఖ్యాన సహితం)

వ్యాఖ్యాత

డా॥ నందూరి రామకృష్ణమాచార్య

ప్రచురణ

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

2018

RAMOPAKHYANAM
with Commentary

Commentary by
Dr. Nanduri Ramakrishnamacharya

T.T.D. Religious Publications Series No. 1294
© All Rights Reserved

First Print : 2018

Copies : 2000

Published by :
Sri Anil Kumar Singhal, I.A.S.
Executive Officer
Tirumala Tirupati Devasthanams
Tirupati

D.T.P.
Publications Division
T.T.D., Tirupati.

Printed at
Tirumala Tirupati Devasthanams Press
Tirupati - 517 507

ముందుమాట

భారతీయ సనాతన సంస్కృతీ, సంప్రదాయాలకు వేదాలు, పురాణాలు, ఇతిహాసాలు మూలాధారాలుగా ఖ్యాతిగాంచాయి. వేదాలలోని సారాన్ని రంగరించి భగవాన్ వేదవ్యాసుల వారు మహాభారత ఇతిహాసాన్ని పంచమవేదంగా తీర్చిదిద్దారు. మహాభారతం మన జాతీయ కావ్యం. చతుర్విధ పురుషార్థాల సాధనకు కావలసిన విజ్ఞానమంతా ఇందులో చక్కగా వేదవ్యాసుల వారు ఇమిడ్చారు. మహాభారతం పంచమవేదంగానే కాక భారతీయ విజ్ఞాన శాస్త్ర సర్వస్వంగా ప్రశస్తికెక్కింది.

వేదవ్యాసుల వారు భారత కథను జయేతిహాసంగా తీర్చిదిద్ది తన శిష్యులద్వారా వివిధ లోకాలలో వ్యాపింపజేశారు. వైశంపాయనుడు జనమేజయ మహారాజుకు ఈ కథను వినిపించాడు. అలా వినిపించగా పెంపొందిన కథను భారతం అన్నారు. ఆ తరువాత రోమహర్షణుని కుమారుడైన ఉగ్రశ్రవసుడు నైమిశారణ్యంలో సత్రయాగం చేస్తున్న శౌనకాది మహామునులకు వివరించాడు. మునులడిగిన ప్రశ్నలకు ఉగ్రశ్రవసుడు చెప్పిన కథార్థాలతో కలిపి భారతం **"మహాభారతం"** అయ్యింది.

"యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి న తత్ క్వచిత్"

ఇందులోఉన్నది ఎక్కడైనా ఉంటుంది. ఇందులో లేనిది ఎక్కడా ఉండదు – అని సూత పౌరాణికులు శౌనకాది మహామునులకు మహాభారత ప్రాశస్త్యాన్ని వివరించాడు.

పంచమవేదంగా, భారతీయ విజ్ఞాన శాస్త్రంగా ఖ్యాతిగొన్న సంస్కృత వ్యాసభారతాన్ని ఆదికవి నన్నయ, కవిబ్రహ్మ తిక్కన, ప్రబంధ పరమేశ్వరుడు ఎఱ్ఱన ఆంధ్రీకరించారు.

తిరుమల తిరుపతి దేవస్థానములు ధర్మప్రచారంలో భాగంగా కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతానికి తెలుగులో సుప్రసిద్ధ పండితులచే చక్కటి వ్యాఖ్యానాన్ని వ్రాయించి 15 సంపుటాలుగా ముద్రించి తెలుగు ప్రజలకు అందించింది. తి.తి.దే. ముద్రించిన కవిత్రయ విరచిత శ్రీమహాభారతం విశేష ప్రజాదరణను పొంది ఇప్పటికే దాదాపు 25,000లకు పైగా ప్రతులు అమ్ముడుపోయాయి.

ఇదివరకు తి.తి.దే. ముద్రించిన కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతంలోని ప్రశస్తమైన నలోపాఖ్యానం, సావిత్రి ఉపాఖ్యానం వంటి ఉపాఖ్యానాలను, సుప్రసిద్ధ ఘట్టాలను, కథలను వ్యాఖ్యానంతోపాటు ప్రత్యేకించి చిన్న చిన్న పుస్తకాలుగా ముద్రిస్తే నేటి తరం సమాజానికి చాలా ఉపయోగకారి అవుతుందని తి.తి.దేవస్థానములు సంకల్పించింది. ఆ సంకల్పానికి ప్రతిరూపమే ఈ భారతోపాఖ్యానాలు గ్రంథమాల. ఈ గ్రంథమాలలో భాగంగా ఉదంకోపాఖ్యానం, గరుడోపాఖ్యానం, యయాతి చరిత్ర, దుష్యంతోపాఖ్యానం, శిశుపాలుని కథ, నలోపాఖ్యానం, ధర్మవ్యాధోపాఖ్యానం, రామోపాఖ్యానం, సావిత్ర్యుపాఖ్యానం, కీచకుని కథ, శ్రీకృష్ణరాయబారం, అంబోపాఖ్యానం, హంసకాకీయోపాఖ్యానం, నాడీజంఘుని కథ, బ్రాహ్మణగీతలు అనే 15 శీర్షికలను ఎంపిక చేసి తెలుగు రాష్ట్రాలలో సుప్రసిద్ధులైన పండితులచే చక్కటి పీఠికలను వ్రాయించి, ముద్రించి ప్రజలకు అందుబాటులోనికి తీసుకువస్తున్నది. ఇందులో భాగమే ప్రస్తుతం మీకందిస్తున్న **రామోపాఖ్యానం.**

భక్తమహాశయులు, సాహితీ ప్రియులు ఈ గ్రంథమును ఆదరిస్తారని మనసార కోరుకుంటూ...

సదా శ్రీవారిసేవలో...

కార్యనిర్వహణాధికారి
తి.తి.దేవస్థానములు, తిరుపతి



పీఠిక

ఎఱ్ఱాప్రెగడ

రాజరాజనరేంద్రుని సూచన, కోరిక మేరకు నన్నయభట్టు భారతాంధ్రీకరణకు పూనుకున్నాడు. తన కిష్టుడున్ సహాధ్యాయుడు అయిన నారాయణ భట్టు తోడుకాగా, ఆది, సభాపర్వాలు పూర్తిగా, అరణ్యపర్వం 4వ ఆశ్వాసం 142 పద్యం వరకు నన్నయగారి గంటం సాగి ఆగిపోయింది.

"శారదరాత్రు లుజ్వలలసత్తరతారకహారపంక్తులం
జారుతరంబులయ్యె, వికసన్నవకైరవగంధబంధురో
దారసమీర సౌరభము దాల్చి, సుధాంశు వికీర్యమాణ క
ర్పూరపరాగపాండురుచిపూరములంబరపూరితంబులై"

ఆ తరువాత 143వ పద్యం

చ. **స్ఫురదరుణాంశురాగరుచిఁ బొంపిరివోయి నిరస్తనీరదా**
వరణములై దళత్కమల వైభవజృంభణ ముల్లసిల్ల ను
ద్ధురతరహంససారసమధువ్రతనిస్వనముల్ సెలంగఁగాఁ
గరము వెలింగె వాసరముఖంబులు శారదవేళఁ జూడగన్

ఇలా ఎఱ్ఱన గంటం తోడై పర్వం పరిసమాప్తమైంది. పై నన్నయ్య పద్యం చివర పాండురుచిపూరములన్–పరపూరితంబులై అని ఋషివంటి నన్నయ అక్కడినుండి భారతం యితర కవులచే పూరింపబడుతుందని ధ్వనింపజేశాడు. అలాగే అరుణాంశు అన్న ఎఱ్ఱన తన మూర్తిని తెలియజేశాడు అన్నది సహృదయ విమర్శకుల చమత్కారోక్తి.

భవ్యచరిత్రుఁ, డాపస్తంబసూత్రుండు, శ్రీవత్సగోత్రుండు, శివపదాబ్జ
సంతతధ్యాన సంసక్తచిత్తుఁడు, సూరనార్యునకును బోతమాంబికకును

నందనుండిలఁ బాకనాటిలో నీలకంఠేశ్వరస్థానమై యెసకమెసఁగు
గుడ్లూరు నెలవుగ గుణగరిష్ఠత నొప్పు, ధన్యుఁడు. ధర్మైక తత్పరాత్ముఁ
డెఱ్ఱనార్యుండు సకలలోకైక విదితుఁడయిన నన్నయభట్ట మహాకవీంద్రు
సరససారస్వతాంశ ప్రశస్తి దన్నుఁజెందుటయు, సాధుజనహర్ష సిద్ధిఁగోరి

కం. ధీరవిచారుఁడు తత్కవితారీతియుఁ గొంతదోఁపఁ దద్రచనయ కా
నారణ్యపర్వ శేషము పూరించెఁ గవీంద్రకర్ణపుటపేయముగాన్

ఈ విధంగా అరణ్యపర్వం సప్తమాశ్వాసం చివర ఎఱ్ఱన తన వివరాలు చెప్తూ, నన్నయ కవితారీతి కొంత ప్రతిఫలించగా నన్నయ రచనే అన్నట్లు తానీ పర్వాన్ని పూర్తిచేశానంటూ, అశ్వాసాంత పద్యాలు రాజరాజనరేంద్రుని సంబోధన పరంగానే చెప్పి గద్యలో కూడా “సకల సుకవిజనవినుత నన్నయభట్ట ప్రణీతంబైన శ్రీమహాభారతంబు నందరాణ్య పర్వంబునందు... సర్వంబును సప్తమాశ్వాసము” అని పూర్తిచేయడం జరిగింది.

నన్నయ అరణ్యపర్వాన్ని పూర్తిగానే రచింపగా కొంతభాగం శిథిలం కాగా శిథిలభాగ పూరణం ఎఱ్ఱన చేశాడన్న విమర్శకోక్తికి కాలం చెల్లిపోయింది కాబట్టి ఆ విషయం చర్చించనవసరంలేదు.

ఎఱ్ఱన వంశీయులు అపస్తంబసూత్రులు. శ్రీవత్సగోత్రులు. విప్రనారాయణ చరిత్ర కవి చదలువాడ మల్లన “ప్రతిభతో నారణ్యపర్వ శేషముజెప్పెఁగవులకు జెవులపండువులుగాగ” అన్న సీసపద్యంలో ఎఱ్ఱన తన వంశ కర్త అని, చదలువాడ నివాసి అని చెప్పాడు. దీన్నిబట్టి ఎఱ్ఱన ఇంటి పేరు చదలువాడ అవుతోంది. కానీ ఎఱ్ఱన తాత ఎఱపోతసూరి వేగినాటిలోని కరాపర్తిలో వృత్తిగాగలవాడని వుంది. ఎర్రన రాసిన మరో పద్యభాగంలో “పాకనాటిలో నీలకంఠేశ్వరస్థానమై ఎసకమెసగు గుడ్లూరి నెలవున గుణగరిష్ఠతనొప్ప, ధన్యుడద్వైత తత్పరాత్ముడెర్రనార్యుడు” అరణ్య పర్వశేషాన్ని పూరించినట్లు చెప్పబడింది. దీన్ని బబట్టి అరణ్యపర్వశేష

పూరణ సమయంలో ఎఱ్ఱన గుడ్లూరి గ్రామంలో నివసించి యున్నట్లు తెలుస్తోంది. అంటే కరాపర్తి నుండి గుడ్లూరికి నివాసం మారివుంటుంది. అనంతరం ఎఱ్ఱనకు వేమారెడ్డి సోదరుడైన మల్లారెడ్డితో పరిచయం ఏర్పడడంతో అతనితో చదలువాడకు వెళ్లి వేమారెడ్డి ఆస్థానకవియై రామాయణ, హరివంశాన్ని రచించుకాలంలో అద్దంకిలో కొంతకాలం వుండి, వార్ధక్యంలో తిరిగి చదలువాడకు వచ్చివుండవచ్చు. వేటూరి ప్రభాకర శాస్త్రిగారు ఎఱ్ఱన రామాయణంలోనిదని “నిను సేవించినగల్గు మానవులకున్” ఇత్యాది నీలకంఠేశ్వర స్తుతిలో కూడా ఎఱ్ఱన నీలకంఠేశ్వర భక్తుడని. ఆ స్వామికి నెలవైన గుడ్లూరుగ్రామంలో కొంతకాలం వున్నట్లు పేర్కొన్నారు. ఎఱ్ఱన తన గురువు శ్రీ శంకరస్వామి అని నృసింహ పురాణంలో పేర్కొన్నాడు.

ఎఱ్ఱన కృతులు:

ఎఱ్ఱన కృతులు నాలుగు, అరణ్యపర్వ శేషం, శ్రీలక్ష్మీనృసింహాతారం (నృసింహపురాణం), రామాయణం, హరివంశం, కవిసర్పగారుడమనే ఒక ఛందోగ్రంథాన్ని కూడా ఎఱ్ఱన రచించినట్లు కస్తూరిరంగకవి తన ఆనందరంగరాట్ఛందంలో ఉదహరించిన కొన్ని పద్యాలవల్ల తెలుస్తోంది కాని ఈ విషయాన్ని ఎఱ్ఱనగాని, యితరులింకెవరూగాని పేర్కొనలేదు.

ఎఱ్ఱన రచనలలో ఏది ముందు, ఏది వెనక అన్న విషయంలో విమర్శక లోకంలో భిన్నాభిప్రాయాలున్నాయి. నృసింహ పురాణ అవతారికలో తాత ఎఱపోతసూరి తనను నృసింహపురాణాన్ని రచింపుమని ఆదేశించినట్లు

ఉన్నతసంస్కృతాదిచతురోక్తిపథంబులఁ గావ్యకర్తవై
యెన్నికమైఁ బ్రబంధపరమేశుఁ డనంగ నరణ్యపర్వ శే
షోన్నయ మంద్రభాష సుజనోత్సవ మెప్పఁగ నిర్వహించి తా
నన్నయభట్ట తిక్కకవినాథుల కెక్కిన భక్తి పెంపునన్ (1-17)

అని పేర్కొన్నాడు. దీన్నిబట్టి నృసింహపురాణానికి ముందే ఎఱ్ఱన అరణ్యపర్వ శేషాన్ని రచించినట్లు తెలుస్తోంది. ఇక హరివంశ పీఠికలో ఎఱ్ఱనను ప్రోలయ వేమారెడ్డి సవినయంగా పూజించి.

నాతమ్ముండు ఘనుండు మల్లరథినీనాథుండు ని న్నాతత
శ్రీతోడన్ సముసేతుఁజేసి యెలమిం జేపట్టి మాకిచ్చుటన్
జేతోమోదమెలర్ప రామకథ మున్ జెప్పించి యత్యుత్తమ
ఖ్యాతిం బొందితి నింకనుం దనియ నేఁ గావ్యామృతాస్వాదనన్
భారతపరాంశమని యింపారఁగఁ జెప్పుదురు బుదులు హరివంశము నీ
వారమ్యకథ తెనుంగుగ ధీరోత్తమ నిర్వహించి తెలుపుము మాకున్

అని కోరడం జరిగింది. దీన్ని బట్టి హరివంశానికి ముందే రామాయణాన్ని ఎఱ్ఱన రచించినట్లు వ్యక్తమౌతోంది. పై విధంగా అరణ్యపర్వశేష, నృసింహపురాణాలు ఒక జంటగా, రామాయణ హరివంశాలు మరొక జంటగా ఏర్పడుతున్నాయి.

అరణ్యపర్వశేషం నన్నయపేర రచించినపుడు ఎఱ్ఱనకు ఏ బిరుదులు లేవు. ఆ రచనానంతరం ఎఱ్ఱనకు ప్రబంధ పరమేశ్వరుడనే బిరుదు లోకంలో వ్యాపించినట్లు ఎఱ్ఱన తాతగారి మాటవల్ల తెలుస్తోంది. శ్రీనాథుడు కాశీఖండంలో వచియింతు వేములవాడ భీమనభంగి ఇత్యాది పద్యంలో "పరిఢవింతు ప్రబంధ పరమేశ్వరుని శేవ సూక్తి వైచిత్రి నొక్కొక్కమాటు" అన్న ప్రశంస ప్రసిద్ధం గదా!

ఈ నేపథ్యంలో ఎఱ్ఱనకు వేమారెడ్డి ప్రాపు లభించడానికి పూర్వమే తనతాత ఆదేశంతో అరణ్యపర్వశేష రచనానంతరం నృసింహపురాణాన్ని రచించి, తన ప్రియదైవతమైన అహోబల నృసింహస్వామికి అంకితం చేసియున్నాడనియు అనంతరం. రామాయణ హరివంశాన్ని రచించెననియు

ఓ అభిప్రాయం. నృసింహపురాణ పీఠికలో "కతిపయాక్షర పరిగ్రహ జనితంబైన నైసర్గిక చాపలంబు కతంబున.

మించినవేడ్క వీనులకు మిక్కుటమై మధువృష్టి గ్రమ్మ రా
యంచలు కూయఁ గ్రౌంచమును నావలఁ గూయఁ గడంగు భంగి బ్రౌ
ఢాంచితశబ్దసారులు మహాకవు లాద్యులు కావ్యశయ్యఁ గీ
లించిన కీర్తిసంగసుఖలీలకు నేనును గాంక్షఁ జేసితిన్ (1-13)

అనడంలో తనకవితా ప్రారంభదశను సూచించినట్లు తెలుస్తోంది. "ప్రాచీన కాలంలో ఒక పరిపాటి వుండేది. ఎవరైనా భారతం వ్రాయదలచుకుంటే ముందుగా రామాయణాన్ని రచించేవారట. దాన్ని అనుసరించి నన్నయ భారతానికి ముందు రాఘవాభ్యుదయాన్ని వ్రాసేడనే ఒక వదంతి వుంది. తిక్కన నిర్వచనోత్తర రామాయణం రచన చేయడం ప్రసిద్ధం. ఆ బాటలో నడచిన ఎఱ్ఱన అరణ్యపర్వశేష, హరివంశరచనలకు ముందే రామాయణం రచించి వుండవచ్చు. ఇది ఊహమాత్రమే" అంటారు తిరుపతి దేవస్థానం ఆంధ్రమహాభారత ప్రధాన సంపాదకులు ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యంగారు. ఇలా ఎఱ్ఱన గ్రంథాల పౌర్వాపర్యం వెనక్కి ముందుకి సాగుతూనే వుంది.

ఎఱ్ఱనకు ప్రబంధపరమేశ్వరబిరుదంతోపాటు, శంభుదాసుడన్న బిరుదం కూడా వున్నట్లు.

"గిరిశ పదభక్తిరస తత్పరభావముకలిమి శంభుదాసుడనంగా
పరగియు గోవింద గుణాదరసంభృత సౌమనస్యధన్యుడనెందున్"
(నృసింహ1-18)

అని ఎఱ్ఱనే తెలిపాడు. శంభుదాసు బిరుదం అతని శివభక్తి పరాయణతను, నృసింహపురాణ, రామాయణ, హరివంశ రచనలు విష్ణుభక్తి పరాయణతను సూచించడంలో అతని శివకేశవాద్వైతభావం చక్కగా వ్యక్తమౌతోంది.

ఎఱ్ఱన కృతులలో రామాయణం వినబడుతోంది కాని, కనబడలేదు. హరివంశంలో "నా తమ్ముండు ఘనుండు" ఇత్యాది పద్యాన్ని బట్టి హరివంశానికి ముందు ప్రోలయవేమారెడ్డి ప్రేరణతో రామాయాణాన్ని రచించినట్లు తెలుస్తోంది. అంతేకాదు ఎఱ్ఱన వంశీయుడైన చదలువాడ మల్లయకవి "వల్మీకభవు వచోవైఖరి రామాయణంబు నాంధ్రప్రబంధంబు జేసె" అని చెప్పడం. ఎఱ్ఱన రామాయణ కర్తగా ప్రసిద్ధిచెందినట్లు తెలుస్తోంది. కూచిమంచి తిమ్మకవి సర్వలక్షణసార సంగ్రహంలో ఎఱ్ఱన రామాయణంలోనివని 9పద్యాలు ఉదహరించినట్లు వేటూరివారు పేర్కొన్నారు. ఇప్పుడు ముద్రితమైయున్న భాస్కర రామాయణంలో కూడ ఎఱ్ఱన రామాయణ పద్యాలు అనేకం చేరియున్నట్లు తెలుస్తోందంటారు వారు. "ఎఱ్ఱాప్రగడ రామాయణం అతని నాటి నుండి కూచిమంచి తిమ్మకవి నాటి దాకా ప్రచారము కలదిగా తెలియవచ్చుచున్నది" 180 ఏండ్ల క్రిందటిదాక సురక్షితమైయున్న ఈ గ్రంథ మీనాడు గూడ ఎక్కడనేని అపరిజ్ఞాతముగా వుండవచ్చును. గోదావరీ మండలంలో కందరాడ, చంద్రం పాలెం (తిమ్మకవి వూళ్ళు)ల చుట్టుపక్కల గాని, కృష్ణా, గుంటూరు, నెల్లూరు, కడప, కర్నూలు మండలములలోగాని అని దొరకదగునను కొందును. ఆయా చోట్ల అపరిచితముగా నున్న తాటియాకు కట్టలను పరిశీలించి ఎఱ్ఱాప్రెగ్గడ రామాయణమును ఏ పుణ్యాత్ముడేని ఉద్ధరింపగల్గు నని విశ్వసించు చున్నాను" అన్నది వేటూరివారి అకాంక్ష (తెలుఁగు మెఱుఁగులు - ఎఱ్ఱాప్రగడ రామాయణం) కావచ్చు. మానవల్లి వారు నన్నిచోడుని కుమార సంభవాన్ని అందించినట్లు.

శ్రీరామాయణం:

వేదవేద్యే పరే పుంసి జాతే దశరథాత్మజే ।
వేదః ప్రాచేతసా దాసీత్ సాక్షాత్ రామాయణాత్మనా ॥

వేదవేద్యుడైన శ్రీమన్నారాయణుడు దశరథకుమారుడు శ్రీరామచంద్రుడుగా అవతరిస్తే వేదం వాల్మీకి మహర్షి ద్వారా రామాయణంగా రూపొందింది. అంతేకాదు ప్రపంచ భాషలన్నిటిలో సంస్కృత భాష గొప్పదని అందులో రామాయణం వేదం వంటిదని "విశ్వభాషాసు గీర్వాణవాణీ వరా తత్ర రామాయణం వేదవత్ పావనం" అన్నారు. అలా ఆదికవి వాల్మీకి అందించిన రామాయణం. రామకథ భారతీయ భాషల్లో, ప్రపంచ భాషల్లో కూడ కావ్యంగా నాటకంగా జానపద రూపంగా వివిధ రూపాల్లో చోటుచేసుకుంది. రామకథ వ్యాప్తి చెందినంతగా మరేదీ విశ్వవాఙ్మయంలో చోటుచేసుకోలేదనడం స్వభావోక్తి సుందరం. సంస్కృతంలో వాల్మీకం తరువాత ఆధ్యాత్మ రామాయణం. ఆనంద రామాయణం, అద్భుత రామాయణం. భోజుని చంపూ రామాయణం ఇలా ఎన్నో రామకథ ఆధారంగా ఆవిర్భవించేయి. తులసీదాస రామాయణం ప్రసిద్ధి చెందింది కదా! ఇక తెలుగులోకి వస్తే భాస్కర రామాయణం. రంగనాథ రామాయణం. నిర్వచనోత్తర రామాయణం, రామాభ్యుదయం. మొల్లరామాయణం, రఘునాథ రామాయణం వంటివి ప్రసిద్ధి గాంచేయి.

"జాతే జగతి వాల్మీకౌ కవి రిత్యభిధాభవత్
తతః కవీఇతివ్యాసే..."

వాల్మీకి పుట్టేక లోకంలో కవి అనే పేరు ఏర్పడింది. వ్యాసావిర్భావంతో కవీ అనే ద్వివచనం ఏర్పడింది. అంటే వాల్మీకి వ్యాసుల స్థానం తెలుస్తోంది. అందుకే విశ్వనాథఅంటారు. "ఒక వాల్మీకి కాక వేరొక్కడెవడు సుకవి శబ్దవాచ్యుడు" అని.

మహాభారతం:

వాల్మీకి రామకథ వ్యాసమహాభారతంలో కూడ అందగించింది. మహాభారతంలో ప్రధాన కథతో పాటు ఎన్నో ఉపాఖ్యానాలు

కథాగమనానికి తోడ్పడ్డాయి. అరణ్యపర్వంలో నలోపాఖ్యానం. రామోపాఖ్యానం, సావిత్రి ఉపాఖ్యానం ప్రధానంగా కనపడతాయి. మహాభారత సంహిత నన్నయ ఇలా ప్రస్తుతించాడు.

అమితాఖ్యానక శాఖలంబొలిచి వేదార్థామలచ్ఛాయమై
సుమహద్వర్గ చతుష్కపుష్పవితతిన్ శోభిల్లి కృష్ణార్జునో
త్తమ నానాగుణ కీర్తనార్థ ఫలమై ద్వైపాయనోద్యాన జా
త మహాభారత పారిజాతమమరున్ ధాత్రీసురప్రార్థ్యమై

(ఆది.1-66)

అనేక ఉపాఖ్యానాలనే కొమ్మలతో ఒప్పి, వేదార్థాల నిర్మలమైన నీడకలదై నాలుగు పురుషార్థాల పూలతో ప్రకాశించి, కృష్ణార్జునుల గుణకీర్తనల ఫలభరితమై వ్యాసమహర్షిరూప ఉద్యానవనంలో పుట్టిన మహాభారతకల్పవృక్షం భూసుర ప్రార్థనలతో ఒప్పుతోంది.

వ్యాసభారతంలో కూడ.

ఇదం శతసహస్రాఖ్యం శ్లోకానాం పుణ్యకర్మణామ్ ।
ఉపాఖ్యానై సృహజ్ఞేయం శ్రావ్యం భారతముత్తమమ్ ॥ (1-108)

అని లక్షశ్లోక పరిమితమై ఉపాఖ్యానాలతో కూడినది. ప్రధానంగా మూలకథకు సహకరించేవి ఉపాఖ్యానాలే. కానీ ఉపాఖ్యానాలను వేరుగా పెడితే.

చతుర్వింశతి సాహస్రీం చక్రే భారతసంహితామ్ ।
ఉపాఖ్యానైః వినా తావత్ భారతం ప్రోచ్యతే బుధైః ॥ (1-109)

దీన్నిబట్టి మూలభారత కథ 24,000కు పరిమితమైంది. అంటే రామాయణం, భారతం కూడా 24,000 శ్లోకపరిమితాలు కావడం ఆశ్చర్యజనకం కదా!

ప్రధానకథ అఖ్యానం అయితే దానికి ఉపబలకంగా, అఖ్యానకం నిలుస్తుంది.

స్వయం దృష్టార్థ కథనం ప్రాహు రాఖ్యానకం బుధాః

కవి తాను స్వయంగా చూసినదానిని చెప్పడం అఖ్యానం.

శ్రుతస్యార్థస్య కథనం ఉపాఖ్యానం ప్రచక్షతే

ఇతరుల వలన విన్నదాన్ని చెప్పడం ఉపాఖ్యానం అన్నారు. (శిరోమణి సన్నిధానంసూర్యనారాయణ శాస్త్రిగారి కావ్యాలంకార సంగ్రహ వివరణ). ఉపాఖ్యానాలు ఉదాహరణగా కాని, ఉపరంజనంగాగాని, ఉపశమనంగా కాని ప్రధాన కథకు బలాన్నిస్తాయి. 'ఉపాఖ్యానాలు ఎన్ని విధాలుగా సాహిత్యలోకంలో ప్రవర్తిల్లడానికి వీలుందో, వాటినన్నిటినీ ఆవిష్కరించడానికే అరణ్యపర్వం అవిర్భవించిందా అన్నట్లు కనబడుతుంది. నన్నయ ఎఱ్ఱనలు కలిసి ఉపాఖ్యాన శిల్ప సర్వస్వాన్ని నిర్మించి తరువాత కవులకు సమర్పించిన ఉజ్జ్వల ఘట్టం అరణ్యపర్వం' అన్న ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యం గారి వివరణం ఉపాఖ్యాన స్వరూపానికి నిలువెత్తు దర్పణం.

భారత ప్రతిపర్వంలోనూ కథాగమనానికి తోడ్పడే ఉపాఖ్యానాలున్నాయి. అరణ్యపర్వానికి వస్తే అనేక అఖ్యానక ఉపాఖ్యానాలు చోటుచేసుకున్నాయి. నన్నయ అరణ్య పర్వభాగంలో ప్రధానమైనవి 12. నన్నయ నలోపాఖ్యానం ఎంత ప్రసిద్ధి గాంచిందో. ఎఱ్ఱన అరణ్య పర్వ భాగంలో రామోపాఖ్యానం అంతే స్థాయి గాంచింది. అక్కడి వక్త బృహదశ్వమహర్షి అయితే ఇక్కడ మార్కండేయ మహాముని.

అరణ్యపర్వంలో ధర్మరాజు తాను సోదరులు. ద్రౌపదిపడుతున్న కష్టాలను భావిస్తున్న సమయంలో బృహదశ్వమహర్షి రావడం జరిగింది. ధర్మరాజు.

పుడమియు రాజ్యము బంధులవిడిచి మృగావలులఁ గలసి విపినంబులలో
గడుకొని మాయట్లిడుమలబడిన నృపులుగలరె యొరులు పరమమునీంద్రా
(అరణ్యం 2-3)

అంటే ధర్మరాజుతో బృహదశ్వముని

నరసుతుడు తొల్లి నలుడను ధరణీశుడు జూదమాడి తన విభవము పు
ష్కరుచేత నోటువడియొక్కరుడ కరంబిడుమలబడడె కానన సీమన్ (2-6)

అంటూ నలోపాఖ్యానాన్ని వినిపిస్తాడు.

ఇక ఎఱ్ఱన భాగంలోనికి వస్తే సైంధవుడు ద్రౌపదిని ఎత్తుకుపోవడం మొదలు సైంధవ పరాభవాది వృత్తాంతం జరిగేక కామ్యకవనంలో బ్రాహ్మణ బృందంతోపాటు ఉన్నట్టి ధర్మరాజుని వద్దకు మార్కండేయ మహర్షి రావడం జరుగుతుంది. అతనితో ధర్మరాజు ద్రౌపది జయద్రథునివల్ల పొందిన అవమానాన్ని వివరించి.

ద్రుపదునందనక్రియ కడుదుఃఖపడిన
నృపవధూటియు నాయట్లనియత శోక
వనధినిర్మగ్నుడైన భూవరసుతుండు
గలడె వినజూడ ననఘ యెక్కాలమునను (అరణ్య 6-263)

అని అడగగా మార్కండేయమహర్షి

కడుదుఃఖమునొందితినని యుడుగక యిటు వగచెదేల యుర్వీశ్వర నీ
పడుటేటిది? రఘురాముడు గడగి యిడుమ వడడె తొల్లి కాఱడవులలోనన్

అలా అనే సరికి "మునీంద్రా! రాముడెవ్వని వంశంబునవాడు? రావణుండెవ్వని తనయుండు? ఏమి నిమిత్తంబున సీతాపహరణంబు సేసె? రామరావణులకు సంగ్రామం బెట్లు వర్తిల్లె? చెప్పవే?" అని రామాయణ కథాశ్రవణ కుతూహలియై

ధర్మరాజుతో అమ్మహాముని ఇట్లనియె. అనడంతో రామోపాఖ్యానం ప్రారంభమౌతుంది.

వ్యాసభారతంలో ఇలాగే వుంది.

కస్మిన్ నామకులేజాతః ? కింవీర్యః ? కిం పరాక్రమః ?
రావణః కస్యవాపుత్రః ? కిం వైరం తస్య తేన హి?

మూలంలో 19 అధ్యాయ్యాల్లో 727 శ్లోకాల్లో వ్యాపించి వున్న రామకథ ఎఱ్ఱన అరణ్యపర్వం 6వ అశ్వాసంలో 145 గద్య పద్యాలతో (267-412) సప్తమాశ్వాసంలో ప్రారంభంనుండి 167 గద్య పద్యాలతో అంటే మొత్తం 312 గద్యపద్యాలలో రచించాడు. సంస్కృతంలో శ్లోకాలు చిన్నవే కాబట్టి సంఖ్య ఎక్కువగా కనబడినా తెనుగున పద్యాలు. గద్యాలు పెద్దవి కాబట్టి సంఖ్యలో 312 అయిన ఎఱ్ఱన వివరంగా రాసేడనే చెప్పాలి.

వాల్మీకంలో ప్రారంభంలో రావణజననాది వృత్తాంతం లేదు. కానీ ఇందులో దశరథునికి 3 భార్యలని చెప్పి పుత్రకామేష్టి. పాయసప్రదానాది వృత్తాంతాలేవీ లేకుండా, "అందు కౌసల్యకు రాముడును, కైకేయికి భరతుండును. సుమిత్రకు లక్ష్మణ, శత్రుఘ్నులును జనియించిరి. అందు రామునకు విదేహరాజనందన అయిన సీత ప్రియాంగనయయ్యె ఇంక రావణు జన్మంబు చెప్పెద వినుము" అని కథ సూక్ష్మంగా కనబడుతుంది. విశ్వామిత్రుని రాక, యాగసంరక్షణ, అహల్యాశాపవిమోచనం, శివ ధనుర్భంగం, సీతాకళ్యాణాది కథలన్నీ దాటించి రావణాసురుని జన్మ వృత్తాంతాన్ని 23 గద్య పద్యాలలో చెప్పడం జరిగింది.

వాల్మీకి రామాయణంలో కిష్కింధాకాండలో సుగ్రీవుడు వానరులను నల్దిక్కులకు పంపడం హనుమదాదులు దక్షిణదిక్కుకు వెళ్లడంతో కాండం ముగుస్తుంది. హనుమ సముద్ర లంఘనంతో సుందరకాండ ప్రారంభ

మవుతుంది. కానీ వ్యాసభారతంలో కథ చాలాచాలా మార్పులతో ముందువెనుకలుగా ఉంటుంది. సుగ్రీవుడు వానరసేనలను వర్షాకాలం దాటేక పంపేడని చెప్పేక – అక్కడ రావణాసురుడి చెఅలో సీతమ్మ పరిస్థితి వర్ణింపబడుతుంది. రాక్షసకాంతలందరూ ఆమెను ఖండిస్తాం. భక్షిస్తాం అని భయపెట్టడం. సీత చావుకు తెగించిన పరిస్థితిలో త్రిజట స్వప్న వృత్తాంతంతో సీతను ఊరడించడం. రావణుడు సీతతో తన గొప్పతనాన్ని చెప్పి, రాముడ్ని తక్కువచేసి దుర్భాషలాడగా సీత ఒక గడ్డిపరకను మధ్యనుంచి రావణునితో అనునయవాక్యాలు పలకడం రావణుడు కోపంతో వెళ్లిపోవడం ఇలా ఆరవ ఆశ్వాసం పూర్తవుతుంది.

సప్తమాశ్వాసంలో రాముడు లక్ష్మణునితో "సుగ్రీవుడు భోగలాలసుడై మన విషయం మరిచేడు ఇలా వుంటే వాలిని నేను చంపినట్లు నీ వాతనిని సంహరించిరా. ఒక వేళ అతడు మనకు సహాయం చేసే ప్రయత్నంలో వుంటే అతనిని తీసుకురా' అని పంపుతాడు. వాల్మీకంలో "నచ సంకుచితో మార్గో యేన వాలీ గతః" వాలి చని వెళ్లిన మార్గం ఇంకా తెఅచియే ఉంది అని చెప్పమంటాడు. లక్ష్మణునితో రాముడు. సుగ్రీవుడు తమ వానర సేనను నలుదెసలా పంపిన వార్తను విని రాముడు సంతోషిస్తాడు. వాల్మీకి రామాయణంలో సుందరకాండ చివర హనుమ జానకిని చూచివచ్చిన ఆనందంలో వానరులంతా మధువనంలో విహరించడం వర్ణితంకాగా ఇందులో మొదట్లోనే మధువనాన్ని అంగద హనుమదాదులు విహరించిన వృత్తాంతం. సముద్రలంఘనం, లంకా ప్రవేశం. సీతాదర్శనం. రామసుగ్రీవమైత్రి రాముని అంగులీయక వృత్తాతం. ఇవేవీ రాకుండానే సీత చూడామణిని రాముని కిమ్మని ఇవ్వడం వుంది. అనంతరం వానరసేన సేతునిర్మాణం. విభీషణుని శరణం, లంక చేరిన రాముడు అంగదుని రాయబారిగా పంపడం, ఇంద్రజిత్, లక్ష్మణుల యుద్ధం, చివరిగా రామరావణ యుద్ధం, రావణవధ (అదిత్య హృదంయ లేదు). విభీషణుని పట్టాభిషేకం. సీతను రాముడు నీ ఇష్టంవచ్చిన చోటుకు

పొమ్మనడం, సీత అగ్నిప్రవేశం చేస్తాననడం. చేయకుండానే సమస్త దేవతలు, పంచభూతాలు సీతాదేవి పాతివ్రత్యాన్ని రామునికి విన్నవించడం, చివరిగా పుష్పకవిమానంపై అందరూ అయోధ్యకు రావడం శ్రీరామ పట్టాభిషేకంతో రామోపాఖ్యానం పూర్తవుతుంది.

ఎఱ్ఱన ఆంధ్రీకరణ విధానం : ఎఱ్ఱన రామోపాఖ్యానంలో ప్రధానంగా మూలభారతాన్ని ఆధారంగా చేసుకొని ఆంధ్రీకరించినా వాల్మీకి రామాయణాన్ని కూడా కొన్ని సందర్భాల్లో అనుసరించేడు. జటాయువు నోడించి రావణుడు లంకాభిముఖుడై సీతను కొనిపోతున్నప్పుడు సీత తన ఆభరణాల్ని మూటగా కట్టి అక్కడక్కడ జారవిడిచినట్లు భారతంలో వుంది.

యత్ర యత్రతు వైదేహీ పశ్యత్యాశ్రమ మండలమ్
సరోవా సరితోవాపి తత్ర ముంచతి భూషణమ్
సా దదర్శ గిరిప్రస్థే పంచవానరపుంగవాన్
తత్ర వాసో మహద్దివ్య ముత్ససర్జ మనస్వినీ
(అరణ్య,అధ్యా.278–శ్లో.7,8)

ఈ సందర్భంలో వాల్మీకి

హ్రియమాణాతు వైదేహీ కంచిన్నాథ మపశ్యతీ
దదర్శ గిరిశృంగస్థాన్ పంచ వానర పుంగవాన్
తేషాం మధ్యే విశాలాక్షీ కౌశేయం కనకప్రభం
ఉత్తరీయం వరారోహా శుభాన్యాభరణాని చ
ముమోచ యది రామాయ శంసేయు రితి మైథిలీ.
(అరణ్య సర్గ54 శ్లో.1-3)

అని ఒక్కవానరసంచారమున్న చోటనే ఆభరణాలను విడిచిందని వర్ణించగా ఎఱ్ఱన వాల్మీకాన్ననుసరించే "జానకి తనకి దిక్కెవ్వరు లేమింజేసి నిరాశయై యొక్క శైలశృంగంబునందు కొందరు వానరులు మెలంగు

చున్నంగని తన కట్టిన పుట్టంబు కొంగు చించి భూషణంబులు ముడిచి తత్ప్రదేశంబున విడిచె'నని వర్ణించెను.

లక్ష్మణరేఖ వాల్మీకంలోనూ లేదు. వ్యాసభారతంలోనూ లేదు. ఎఱ్ఱన కూడా వర్ణించలేదు. కానీ యితర రామాయణాల్లో మాత్రం ఇది చోటుచేసుకుంది. అందుకే తెలుగు ప్రజలు అవాల్మీకకల్పనలున్న రామాయణాలనే అదరిస్తారంటారు ఆచార్య జి.వి.యస్.

ఉపాఖ్యానం కథకు ఉపబలకంగా వుండాలి తప్పా మరీ దీర్ఘం కాకూడదు కాబట్టే వాల్మీకి రామాయణ ఘట్టాన్ని కుదించి రామోపాఖ్యానం కూర్చబడింది. కాబట్టే వాల్మీకంలో సుగ్రీవుడు మొదటిసారి వాలితో పోటీ పడి దెబ్బలు తిని వెనక్కి రావడం రెండవసారి వెళ్ళినపుడు అతని మెడలో లక్ష్మణుడు గుర్తింపుగా మాలవేసినట్లు ఉంది. భారతంలో మొదటిసారి యుద్ధం చేసినపుడే రాముడు సుగ్రీవుని గుర్తించలేని సమయంలో హనుమంతుడు సుగ్రీవుని మెడలో మాలవేసినట్లు వర్ణితం. అట్లే వాల్మీకంలో రెండవసారి సుగ్రీవుడు వాలిని యుద్ధానికి పిలిచి నప్పుడు తార వాలితో సుగ్రీవుడు రామసఖ్యంతో బలవంతుడై వచ్చాడు కాబట్టి వెళ్ళవద్దు అని చెప్పగా భారతంలో మొదటిసారి యుద్ధానికి వెళ్ళినపుడే తార వద్దని వారించినట్లు వర్ణితం. అశోకవనంలో హనుమ సీతకు తన గురించి, రామసుగ్రీవుల మైత్రి గురించి చెప్పి తనని నమ్మినట్లు ప్రయత్నిస్తాడు. భారతంలో మాత్రం హనుమంతునితో సీత "అన్నా నిన్నెఱింగితి" అంటూ మాట్లాడి చూడామణి ఇవ్వడం వర్ణితం. ఇలా కథాగమనాన్ని వేగం చేస్తూ, ఉపాఖ్యానం ప్రధాన కథ వర్ణించడం జరిగింది.

ఎఱ్ఱన వర్ణనా వైచిత్రి:

మూలంలో భరతుడు చిత్రకూటంలో శ్రీరాముని దర్శించడం ఓ ముఖ్యఘట్టం. ఈ సందర్భంలో

"దదర్శ చిత్రకూటస్థం సరామం సహలక్ష్మణమ్
తాపసానా మలంకారం ధారయంతం ధనుర్ధరమ్"
(38-276 అధ్యాయం)

అని వుండగా ఎఱ్ఱన తన ప్రబంధ పరమేశ్వరత్వాన్ని ప్రకటిస్తూ

కనియెం గోమలనీలమేఘసుభగాకారున్ జటావల్కలా
జినధారున్ సితభూతిభూషితుని రాజీవాక్షుఁ గల్యాణ కీ
ర్తనుఁ గాకుత్స్థ కులప్రదీపకున్ సీతాలక్ష్మణోపేతు స
న్మని లోకార్చితు సత్యపాభరణు రామున్ రాజచూడామణిన్
(అరణ్య 6-309)

కనియెన్ అంటూ ప్రారంభించడం తరువాతి ప్రబంధకవులకు మార్గదర్శకంగా నిలిచింది.

మాయామృగాన్ని పట్టితెచ్చుటకై రాముడు ప్రయత్నిస్తున్నపుడు ఆ బంగరు లేడి ఎలా వ్యవహరిస్తోందో అద్భుతంగా వర్ణించాడు ఎఱ్ఱన సహజమైన లేడి చేష్టలను ఇలా

మ. పఱచున్ దవ్వుగఁ జేయలంతి నిలుచుం, బట్టీక యాసాసలం
బిఱువోవుం, బొదలందు డిందుఁ బొడమున్ బిట్టుల్కి నే దాఁటుఁ గ్ర
మ్మఱి చూచుం, జెవి దార్చి నిల్చు, మలయున్, మట్టాడు, గోరాడు, నే
మఱి నట్లుండుఁ దృణంబు మేయు నెలయున్ మాయామృగం బిమ్ములన్
(6-327)

కబంధుడు గంధర్వుడైన పిదప అతడు చెప్పినట్లు రామలక్ష్మణులు చని చని పంపాసరస్సును చూసినట్లు ఎఱ్ఱన సరోవర వర్ణనాన్ని ప్రాబంధిక రీతిలో అద్భుతంగా వర్ణించాడు.

సీ. కమనీయకమలినీకహ్లారదళకేసరాన్వితజలముల నర్థ్వవిధియుఁ
దరళతరంగహస్తములంబాద్యంబు, నున్మదచక్రసారసమధుపహంస

రుతులం బ్రియోక్తులు, రుచిరవానీరనివేశనచ్ఛాయల విశ్రమంబు
మందసంచారితమారుతంబుల నురుతాపనోదనమును దగిలి యెపుడు

ఆ. నాచరించుచును, సమంచితాతిథి జన సేవనమునం దనదుజీవనంబు
ఫలమునొంద నొప్ప, పంపాసరోవరం బెదురం గాంచి రన్నరేంద్రసుతులు
(6-364)

హనుమ అంగదాదులు మధువనంలో విహరించు ఘట్టం మూలంలో ఇలా వుంది.

హనుమత్ ప్రముఖాశ్చాపి విశ్రాంతాస్తే ప్లవంగమాః
అభిజగ్ముః హరీంద్రం తం రామలక్ష్మణ సన్నిధౌ

ఈ సందర్భంలో వాల్మీకి సుందరకాండ 62వ సర్గలో వానరుల మధువన విహారాన్ని వాళ్ళచేష్టలను సహజంగా వర్ణించాడు. ఎఱ్ఱన కూడా ఈ ఘట్టంలో చక్కని అనుప్రాసాలంకారంతో వానరచేష్టలను మధురంగా వర్ణించాడు.

తేనెలు గ్రోలిక్రోలి, కడుం దియ్యని కమ్మని పండు లింపుసొం
పానంగ నానియాని, పరపందిన నీడలు మెచ్చి మెచ్చి, మం
దానిలశైత్యసౌరభ సమగ్రతకుం గడుంజొక్కి చొక్కి యు
ద్యానమునందు మారుతసుతప్రముఖుల్ విహరించి తృప్తులై. (7-11)

అరణ్యపర్వ శేషంలో రామకథ కథకొరకు చెప్పింది కాదు. కవిత్వకళ కొరకు చెప్పింది. మూలంలో రూపుకట్టని ఎన్నోచిత్రాలు తెలుగులో మధురంగా మనోహరంగా, సజీవంగా కళ్లఎదుట నిలుస్తాయి. దానిక్కారణం ఎఱ్ఱన ప్రబంధ శయ్య, ఒక చిన్న ఉపాఖ్యానంలో రామాయణంలోని ప్రధాన పాత్రల అక్షరరూపశిల్పాలను నిలిపి ఒక ఆర్ట్ గేలరీనే సృష్టించాడు ప్రబంధపరమేశ్వరుడు.

సంస్కృత మహాభారతంలో కూడా రామాయణ కథ సంగ్రహంగానే ఉంది. ఎఱ్ఱాప్రెగడ తెలుగు భారతంలో ఆ కథను సంక్షిప్తసుందరం గావించాడు. రామాయణ కథలో బాలకాండనంతటినీ రెండుమూడు పద్యాల్లో సంగ్రహీకరించాడు. సీతాకళ్యాణం వంటి ప్రధాన ఘట్టాన్ని కూడా వర్ణించలేదు. వాల్మీకి రామాయణంలోలేని నూతనాంశాలెన్నియో ఇందు చోటుచేసుకున్నాయి. రావణ కుంభకర్ణాదుల పూర్వజన్మ వృత్తాంతం వాలిసుగ్రీవుల యుద్ధంలో హనుమంతుడు సుగ్రీవుని హారాలంకృతుణ్ణి చేయడం. త్రిజటా కథా సందర్భంలో అవింధ్యుడనే వృద్ధరాక్షసుని వృత్తాంతం వంటివి అందుకు నిదర్శనాలు. “ఎఱ్ఱన రామాయణం దొఱకలేదన్న దిగులు ఈ కథ చదువుకొన్న తెలుగు వారికి తీరిపోతుంది” అంటారు ఆచార్య జి.వి.యస్.

చివరిగా నన్నయ భట్టు తిక్క కవినాథుల యెడగల భక్తి పెంపు, తండ్రి సూరకవి శిక్షణ, గురువు శంకర స్వామి పాదుకాధ్యానం. మల్లారెడ్డి మైత్రి, ప్రోలవేముని ప్రాపు ఇవన్నీ కలిసి కవిత్రయంలో ఎఱ్ఱనను సర్వవిధాల ధన్యశబ్దవాచ్యుని చేశాయంటారు కవిసమ్రాట్ నోరి నరసింహ శాస్త్రిగారు.

ఆంధ్ర మహాభారతంలోని ఉపాఖ్యానాలను విడిగా పీఠికలతో ప్రచురించి పాఠకులకు ప్రధానంగా విద్యార్థులకు అందించే సదుద్దేశ్యంకల తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురణల ప్రధాన సంపాదకులకు ధన్యవాదాలు సమర్పిస్తూ ఆ మార్గంలో రామోపాఖ్యానానికి పీఠిక వ్రాసే అదృష్టం కలిగించి నందులకు శ్రీవేంకటేశ్వరస్వామికి, సంపాదక వర్గానికి నాకృతజ్ఞతాభి వందనాలు.

సహృదయ విధేయుడు

- డా॥ అయలసోమయాజుల గోపాలరావు

రామోపాఖ్యానం

ధర్మజునకు మార్కండేయుఁడు రామాయణకథ సెప్పుట (సం. 3-258-4)

వ. అనిన విని ధర్మజుండు 'మునీంద్రా! రాముఁ డెవ్వనివంశంబున వాఁడు? రావణుం డెవ్వని తనయుం? డేమి నిమిత్తంబున సీతాపహరణంబు సేసె? రామరావణులకు సంగ్రామం బెట్లు వర్తిల్లెం? జెప్పవే!' యని రామాయణ కథాశ్రవణకుతూహలియై యడిగిన నమ్మహాముని యిట్లనియె. 1

ప్రతిపదార్థం: అనినన్= అని మార్కండేయుడు చెప్పగా; విని= ఆలకించి; ధర్మజుండు= ధర్మనందనుడు; ముని+ఇంద్రా!= మునులలో శ్రేష్ఠుడవైనవాడా, ఓ మార్కండేయ మహామునీ!; రాముండు= శ్రీరాముడు; ఎవ్వని వంశంబున వాఁడు?= ఎవరి కుటుంబానికి చెందినవాడు?; రావణుండు; ఎవ్వని, తనయుండు?= ఎవరి కుమారుడు?; ఏమి నిమిత్తంబునన్= ఏ కారణం వలన; సీతా+అపహరణంబు+చేసెన్= సీతను ఎత్తుకొని పోయాడు?; రామ రావణులకున్= రామునకును రావణునకును; సంగ్రామంబు= యుద్ధం; ఎట్లు= ఏ రీతిగా; ప్రవర్తిల్లెన్?= జరిగింది?; చెప్పవే= వినిపించవా; అని= అంటూ; రామయణ, కథా, శ్రవణ, కుతూహలి+ఐ= రామాయణ కథను వినటానికి ఆసక్తి కలవాడై; అడిగినన్= ప్రశ్నించగా; ఆ+మహా, ముని= మార్కండేయుడు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని మార్కండేయుడు చెప్పగా ఆలకించి ధర్మరాజు- 'ఓ మార్కండేయ మహామునీ! శ్రీరాముడు ఏ వంశానికి చెందినవాడు? రావణుడు ఎవరి కుమారుడు? ఏ కారణాన రావణుడు సీతాదేవిని అపహరించాడు? రాముడికీ రావణుడికీ యుద్ధం ఏ విధంగా జరిగింది? దయచేసి వివరించి

చెప్పవా?' అని రామాయణకథను వినవలె ననే వేడుకతో ప్రశ్నించాడు. మార్కండేయమహర్షి ఈ విధంగా సమాధానం చెప్పాడు.

విశేషం: (1) ఇది మహాభారతంలో అంతర్గర్భితమైన రామాయణ కథ. ఎఱ్ఱన మహాకవి ప్రత్యేకంగా రామాయణాన్ని వ్రాశాడు. ఆ విషయంలో సందేహానికి ఎట్టి ఆస్కారమూ లేదు. కాని, దురదృష్టవశాన ఎఱ్ఱనరామాయణం నేడు ఉపలబ్ధం కాదు. ప్రాచీనాలంకారికులు ఎఱ్ఱన రామాయణంలోనివని ఉదాహరించిన పద్యాలు భారతాంతర్గతమైన ఈ రామాయణభాగంలో కన్పించవు. ఇక ఎఱ్ఱనరామాయణం ఏమైనట్లు? అది భవిష్యత్కాల పరిశోధకులు తేల్చవలసిన అంశం.

(2) రామాయణం అనగా శ్రీరామునియాత్ర వనవాసగమనం. నలోపాఖ్యానంవలె రామాయణ గాథ కూడ విషాదాత్మకం; భావితాంతఃకరణప్రవృత్తిని సహృదయులకు సంఘటించేవృత్తం. నవరసరుచిరం. పలువురు రామాయణ మహాభారత కథలను అనుసరించి తులనాత్మక పరిశోధనకు పూనుకోవటం కద్దు. కురుక్షేత్ర సంగ్రామం మహాభారతకథకు వెన్నె ముక. రామరావణ సంగ్రామం గూడ యుద్ధవర్ణనలో ప్రపంచసారస్వతంలో పేర్కొనదగిన ఘట్టం.

(3) ప్రాచీనభారతీయవాఙ్మయాన వీరగాథలు, విషాదాత్మకగాథలు సుప్రసిద్ధాలు. యుగయుగాంతరాల సహృదయుల హృదయాలను ఉర్రూతలూగించిన నలోపాఖ్యానం, రామాయణ గాథ మహాభారతంకంటె మిక్కిలి ప్రాచీనాలనిన్నీ పృథగ్భూతాలైన ఆ ప్రాచీనతను వీరవిషాదగాథలు మహాభారతంలో తరువాత చేర్చబడినవనిన్నీ పాశ్చాత్య విమర్శకులు పలువురి అభిప్రాయం. రామాయణగాథ మిక్కిలి ప్రాచీన మైన దనటానికి నిర్వికల్పనిదర్శనం నవీనశాస్త్రజ్ఞులు నరుడికి ప్రపితామహులుగా భావించే 'వానర' పాత్రలు అందులో కన్పించటం.

క. 'విను మిక్ష్వాకుకులంబున ।
జనియించె నజుండు నాఁ బ్రశస్తచరితుఁ డా
తని కొడుకు దశరథుఁడు; ముద ।
మున నాతఁడు పెండ్లియయ్యె ముువ్వురు సతులన్. 2

ప్రతిపదార్థం: వినుము= ఆలకించుము; ఇక్ష్వాకు, కులంబునన్= ఇక్ష్వాకుల యొక్క వంశంలో; అజుండు; నాన్= అనగా; ప్రశస్త, చరితుఁడు= మంచి స్వభావం కలవాడు; జనించెన్= పుట్టాడు; ఆతని కొడుకు= ఆతడి యొక్క (అజుడి యొక్క) పుత్రుడు; దశరథుఁడు= దశరథుడు అనేవాడు; ఆతఁడు= ఆ దశరథుడు; ముదమునన్= వేడుకతో; ముువ్వురు= ముగ్గురు; సతులన్= పతివ్రతలను; పెండ్లి+అయ్యెన్= వివాహమాడాడు.

తాత్పర్యం: చెపుతున్నాను సావధానంగా వినుము. ఇక్ష్వాకువంశంలో అజుడు అనే మంచి నడవడిక కల రాజు జన్మించాడు. అతడికి దశరథుడు అనే కొడుకు పుట్టాడు. ఆ దశరథుడు వేడుకతో ముువ్వురు సతులను పెండ్లాడాడు.

వ. అందుఁ గౌసల్య కురాముండును, గైకేయికి భరతుండును, సుమిత్రకు లక్ష్మణ శత్రుఘ్నులును జనియించి; రందు రామునకు విదేహరాజనందన యైన సీత ప్రియాంగన యయ్యె; నిఁక రావణుజన్మంబు సెప్పెద వినుము. 3

ప్రతిపదార్థం: అందున్= ఆ ముువ్వురియందు; కౌసల్యకున్= కౌసల్యఅనే సతికి; రాముండును= రాముడు అనేవాడును; కైకేయికిన్; భరతుండును; సుమిత్రకున్; లక్ష్మణ; శత్రుఘ్నులును; జనియించిరి= పుట్టారు; అందున్= ఆ పుత్రులలో; రామునకున్; విదేహ, రాజ, నందన+ఐన= విదేహరాజుయొక్క కుమారి అయిన; సీత; ప్రియ+అంగన= ఇష్టమైన వనిత- భార్య; అయ్యెన్= అయింది; ఇఁకన్= ఇకమీద; రావణు జన్మంబు= రావణుడి పుట్టుకను గురించి; చెప్పెదన్= వచిస్తాను; వినుము= ఆకర్ణించుము.

తాత్పర్యం: ఆ దశరథుడిభార్యలలో కౌసల్యకు రాముడు, కైకేయికి భరతుడు, సుమిత్రకు లక్ష్మణ శత్రుఘ్నులున్నూ జన్మించారు. వారిలో రాముడికి విదేహరాజకుమారి సీత అనుగు భార్య అయింది. ఇక రావణుడిపుట్టుకను గూర్చి చెప్పుతాను. ఆలకించుము.

ఉ. అఖిలలోకకర్త యగు విరించికిం బులి ।
స్త్యుండు నాఁగ మానసుఁడు దనూజుఁ
డుద్భవించె; నతని కుదయించె వైశ్రవ ।
ణాభిధానుఁడైన యాత్మజుండు. 4

ప్రతిపదార్థం: అఖిల, లోక, కర్త,+అగు= సమస్తలోకాలను సృష్టి చేసేవాడైన; విరించికిన్= బ్రహ్మదేవుడికి; పులస్త్యుండు; నాఁగన్= అనఁగా; మానసుఁడు= మనస్సుకు సంబంధించిన వాడు; తనూజుఁడు= కొడుకు; ఉద్భవించెన్= జనించాడు; అతనికిన్= వాడికి (ఆ పులస్త్యుడికి); వైశ్రవణ+అభిధానుఁడు+ఐన= వైశ్రవణుడు అనే పేరు కల వాడైన; ఆత్మజుండు= కొడుకు; ఉదయించెన్= పుట్టాడు.

తాత్పర్యం: సమస్తలోకాలను సృజించే బ్రహ్మదేవుడికి 'మానస పుత్రుడై' పులస్త్యుడు అనేవాడు పుట్టాడు. ఆ పులస్త్యుడికి వైశ్రవణుడు అనే కుమారుడు జన్మించాడు.

విశేషం: కుమారుడు జన్మించటం అనగా వైవాహికధర్మాచరణలో భార్యాభర్తలకు సంతానం కలగటం. ఇట- పులస్త్యుడు సృష్టి కర్తకు ఆ విధంగా పుట్టిన కొడుకు కాడు. బ్రహ్మదేవుడి మనస్సునుండి పుట్టినవాడు. అనగా పులస్త్యుడు బ్రహ్మమానసపుత్రుడు.

వ. ఆ వైశ్రవణుండు దన తండ్రి యగు పులస్త్యుని విడిచి, తాత యగు చతుర్ముఖు నకుం దపంబు సేసి నలకూబరుం డను కొడుకును లోకపాలకత్వం బును ధనేశ్వరత్వంబును లంక యను పురంబును శంకరుతోడి సఖ్యంబును వరంబులుగాఁ బడసి, మహావిభూతితో వర్తిల్లుచున్నంగని, యలిగి, పులస్త్యుండు నిజశరీరంబునం దర్ధంబున విశ్రవసుం డను వాని సృజియించి, యా వైశ్రవణున కహితంబు సేయు మని పనిచిన నెఱింగి, కిన్నరేశ్వరుండు విశ్రవసుపాలి కరుదెంచి 'మహాత్మా!

యేను నీకుం బుత్త్రుండ నయ్యెద; నాకుం గరుణింపు' మని యతనిం బ్రసన్నునిం జేసి నృత్తగీత విద్యావిశారద లయిన రాక్షసస్త్రీలం బుష్పోత్కటయు, మాలినియు, బకయు నను వారి మువ్వుర నవ్విప్రవరునకుఁ బరిచారికలంగా నిచ్చిన. 5

ప్రతిపదార్థం: ఆ వైశ్రవణుండు= ఆ వైశ్రవణుడు; తన తండ్రి+అగు= తన యొక్క జనకుడు అయిన; పులస్త్యుని విడిచి= పులస్త్యుడిని వదలిపెట్టి; తాత+అగు= పితామహుడు అయిన; చతుర్ముఖునకున్= నాలుగు మోములు కల బ్రహ్మదేవుడిని గూర్చి; తపంబు+చేసి= తపస్సు చేసి; నలకూబరుండు+ అను, కొడుకును= నలకూబరుడు అనే పేరు కల పుత్రుడిని; లోక పాలకత్వంబును= లోకాన్ని పరిపాలించటమున్నూ; ధన+ఈశ్వరత్వంబును= ధనానికి ఆధిపత్యం వహించట మున్నూ; లంక+అను పురంబును= లంక అనే పేరు కల పట్టణమున్నూ; శంకరుతోడి సఖ్యంబును= శివుడితోడి మైత్రియున్నూ; వరంబులుగాన్= వరాలుగా; పడసి= పొంది; మహా, విభూతితోన్= గొప్ప సంపదతో; వర్తిల్లు చున్నన్= సాగుతూ ఉండగా; కని= చూచి; అలిగి= కోపం పొంది; పులస్త్యుండు= పులస్త్యుడు (బ్రహ్మమానస పుత్రుడు); నిజ, శరీరంబు నందున్= తన దేహంలో; అర్ధంబునన్= సగం భాగంతో; విశ్రవసుండు+ అను వానిన్= విశ్రవసుడు అనే పేరు కల వాడిని; సృజియించి= పుట్టించి; ఆ వైశ్రవణు నకున్; అహితంబు= కీడు; చేయుము+అని= సలుపుము అని; పనిచినన్= నియోగించగా; ఎఱింగి= తెలిసికొని; కిన్నర+ఈశ్వరుండు= కిన్నరులకు ప్రభువు; విశ్రవసుపాలికిన్!= విశ్రవసుడి దగ్గరకు; అరుదెంచి= వచ్చి; మహా+ఆత్మా= మహానుభావుడవైన ఓ విశ్రవసూ! ఏను= నేను; నీకున్= నీకు; పుత్త్రుండన్+అయ్యెదన్= కొడుకును కాగలను; నాకున్+కరుణింపుము= నాయెడ దయ చూపుము; అని= వచించి; అతనిన్= వాడిని- విశ్రవసుడిని; ప్రసన్నునిన్+ చేసి= అనుకూలుడుగా చేసికొని;

నృత్త, గీత, విద్యా, విశారదలు+అయిన= నాట్యంలోను, గానంలోను నేర్పుకలవారు అయిన; రాక్షస స్త్రీలన్= రాక్షస వనితలను; పుష్పోత్కటయు, మాలినియు, బకయున్+అనువారిన్= పుష్పోత్కట, మాలిని, బక అనే వారిని; ముప్పురన్= ముగ్గురిని; ఆ+విప్ర, వరునకున్= ఆ బ్రాహ్మణోత్తముడికి; పరిచారికలుగాన్= సేవకురాండ్రుగా; ఇచ్చినన్= అర్పించగా.

తాత్పర్యం: ఆ వైశ్రవణుడు తన తండ్రి అయిన పులస్త్యుడిని సరకుగొనక, పితామహుడు అయిన బ్రహ్మదేవుడిని గూర్చి తపస్సు చేసి, నలకూబరుడు అనే కొడుకును, లోకపాలకత్వాన్నీ (కిన్నరలోక ప్రభుత్వాన్ని), ధనానికి ఆధిపత్యాన్నీ, లంకాపట్టణాన్నీ, శివుడితో స్నేహాన్నీ వరాలుగా పొందాడు. ఆ వైశ్రవణుడి సంపద చూచి కోపగించుకొని పులస్త్యుడు తన శరీరపు సగంభాగంనుండి విశ్రవసుడు అనేవాడిని సృజించి, ఆ వైశ్రవణుడికి కీడు చేయు మని నియోగించాడు. వైశ్రవణుడు ఆ వృత్తాంతాన్ని, తెలిసికొని, విశ్రవసుడి కడ కేగి 'మహాత్మా! నేను నీకు కొడుకుగా ఉండగలను; నాయందు దయ చూపుము' అని ప్రార్థించి, అతడి అనుగ్రహాన్ని చూరగొని, నృత్తంలోనూ గానంలోనూ ప్రావీణ్యం గల ముప్పురు రాక్షసవనితలను- 'పుష్పోత్కట, మాలిని, బక' అనే పేరుకల వారలను ఆ బ్రాహ్మణోత్తముడికి సేవకురాండ్రుగా సమర్పించాడు.

విశేషం: (1) ప్రాచీన పురాణవాఙ్మయంలో వైశ్రవణుడికి 'కుబేరుడు' అనే నామాంతరం ఉన్నది. అతడు కిన్నరలోకపాలకుడు. కిన్నరులు అశ్వముఖం నరశరీరం కల వేల్పులు. కిన్నరులు సంగీతప్రియులు.

(2) విశ్రవసుడికి పరిచారికలు ముప్పురు. పుష్పోత్కట, మాలిని, బక. బకకు పాఠాంతరం కొన్ని ప్రతులలో "పాక"గా కనుపిస్తున్నది. ఇట "బక" పాఠమే గ్రహించబడింది. కారణం-273 సంఖ్య గల గద్యంలో ఎఱ్ఱన బకకు ఖరుండును శూర్పణఖ యను కన్యకయు- 'మిథునంబై' ప్రభవించినట్లు వ్రాశాడు. సంస్కృత

మూలం దాక్షిణాత్యప్రతిలో "బకాయాం మిథునమ్ జజ్ఞే ఖరః శూర్పణఖా తథా' అని ఉన్నది. దీనినిబట్టి ఎఱ్ఱన దాక్షిణాత్యప్రతినే ప్రామాణికంగా ఎన్నినట్లు తలపవచ్చును. కావున ఖరుడికి శూర్పణఖకు తల్లి అయిన పరిచారిక పేరు "బక" అని నిర్ణయించవచ్చును. కొన్ని ఔత్తరాహప్రతులందు ఆమె పేరు "పాక" అని ఉన్నది.

క. పురుడున నయ్యువతులు నొం।
డొరులం గడవంగ విలసదుపచారసమా
చరణప్రవీణభంగులఁ।
బరితోషితుఁ జేసి రా తపస్వివరేణ్యున్. 6

ప్రతిపదార్థం: ఆ+యువతులు= ఆ జవరాండ్రు; పురుడునన్= పోలికలో (పోటీపడుతూ); ఒండు+ఒరులన్= ఒకరినొకరు; కడవంగన్= అతిక్రమించేటట్లుగా; విలసత్+ఉపచార, సమ్+ఆచరణ, ప్రవీణ భంగులన్= శోభిల్లే పరిచర్యలు బాగా చేసే సామర్థ్యంలోని రీతులలో; ఆ తపస్వి, వరేణ్యున్= ఆ మునులలో శ్రేష్ఠుడు అయినవాడిని; పరితోషితున్= మిక్కిలి సంతోషం చెందిన వాడినిగా; చేసిరి= ఒనరించారు.

తాత్పర్యం: సమానులయందుండే స్పర్ధతో ఆ జవ్వనులు ఆ మునిశ్రేష్ఠుడైన విశ్రవసుడికి పరిచర్య చేశారు. ఒకరి నొకరు మించవలెననే కోరికతో ఆతడిని మిక్కిలి సంతోషపెట్టారు.

వ. ఇట్లు ప్రీతుండై యతండు వారలకుఁ బుత్త్రదానంబు సేసిన నందుఁ బుష్పోత్కటకు రావణ కుంభకర్ణులును, మాలినికి విభీషణుండును, బకకు ఖరుండును శూర్పణఖ యను కన్యకయు మిథునంబై ప్రభవించి; రక్కుమారులకు నలువురకుఁ దజ్జనకుండు జాతకర్మాదిసంస్కారంబు లొనరించి సగౌరవంబుగాఁ బెనిచి యుపనీతులం జేసె; నందు. 7

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; ప్రీతుండు+ఐ= సంతుష్టి చెందినవాడై; అతండు= అతడు- విశ్రవసుడు; వారలకున్= ఆ ముగ్గురు పరిచారికలకు; పుత్త్ర దానంబు+చేసినన్= సంతానాన్ని దానం చేయగా; అందున్= వారిలో; పుష్పోత్కటకున్= పుష్పోత్కట అనే ఆమెకు; రావణ, కుంభకర్ణులును= రావణుడు కుంభకర్ణుడు అనే వారున్నూ; మాలినికిన్= మాలిని అనే ఆమెకు; విభీషణుండును= విభీషణుడును; బకకున్= బక అనే ఆమెకు; ఖరుండును= ఖరుడును; శూర్పణఖ= శూర్పణఖ అనే పేరు కల; కన్యకయున్= కన్నెయు; మిథునంబు+ఐ= జతగా, కవలై; ప్రభవించిరి= పుట్టారు; ఆ కుమారులకున్= ఆ బిడ్డలకు; నలువురకున్= నలుగురికి - రావణ కుంభకర్ణ విభీషణ ఖరులకు; తత్+జనకుండు= వారి తండ్రి విశ్రవసుడు; జాతకర్మ+ఆది, సంస్కారంబులు= పుట్టినప్పుడు చేసే కర్మలు మున్నగు క్రియలు; ఒనరించి= చేసి; స గౌరవంబుగాన్= మంచి మర్యాదలతో; పెనిచి= పెంచి; ఉపనీతులన్+ చేసెన్= వడుగులు అయినవారిగా చేశాడు; అందున్= వారిలో.

తాత్పర్యం: ఈ విధంగా పరిచారికలయెడ ప్రీతి కలవాడై; విశ్రవసుడు వారలకు సంతానం ప్రసాదించాడు. పుష్పోత్కటకు రావణుడు కుంభకర్ణుడు జన్మించారు. మాలినికి విభీషణుడు పుట్టాడు. బకకు ఖరుడు శూర్పణఖ అనే ఆడ, మగజంట కవలబిడ్డలై ఉద్భవించారు. ఆ నలుగురు కుమారులకు తండ్రి అయిన విశ్రవసుడు జాత కర్మాది సంస్కారాలు చేసి వారలకు వడుగులు చేశాడు. వారిలో.

విశేషం: జాతకర్మలు పదునారు. జీవుడు పుట్టటానికి పూర్వంనుండి గిట్టేవరకు జరుగవలసిన వైదికసంస్కారాలు. 1. గర్భాదానం 2. పుంసవనం 3.సీమంతం 4. జాతకర్మం 5. నామకరణం 6. అన్నప్రాశనం 7. చౌలం 8. ఉపనయనం 9. ప్రాజాపత్యం 10. సౌమ్యం 11. ఆగ్నేయం 12. వైశ్వదేవం 13. గోదానం 14. సమావర్తం 15. వివాహం 16. అంత్యసంస్కారం.

ఉ. ఆతతతేజుఁ డున్నతభుజాగ్రుఁడు లోకభయంకరుండు వి
ఖ్యాతపరాక్రముండు దశకంఠుఁడు సంతతరోషమానసుం;
డాతనియట్ల దుర్మదమయాత్ముఁడు క్రూరుఁడు గుంభకర్ణుఁడున్;
భీతివిదూరుఁ డార్యుఁడు విభీషణుఁ డుత్తమచిత్తుఁ డారయన్. 8

ప్రతిపదార్థం: దశకంఠుఁడు= పదికంఠాలు కలవాడు- రావణుడు; ఆతత+ తేజుఁడు= విస్తార మయిన ప్రకాశం కలవాడు; ఉన్నత, భుజ+అగ్రుఁడు= ఎత్తయిన బాహువుల కొనలు కలవాడు; లోక భయంకరుండు= జగత్తులకు భీతి కలిగించే వాడు; విఖ్యాత, పరాక్రముండు= పేరు ప్రతిష్ఠల నార్జించిన శౌర్యం కలవాడు; సంతత, రోష, మానసుండు= ఎల్లప్పుడూ ప్రజ్వలించిన క్రోధం కలవాడు; కుంభకర్ణుఁడున్= కుంభకర్ణుడు అనేవాడు కూడ; ఆతని+అట్లు+అ= ఆతని వంటివాడే (రావణుడి వంటివాడే); దుర్మద, మయ+ఆత్ముఁడు= చెడు గర్వంతో కూడిన ఆత్మ కలవాడు; క్రూరుడు= కఠిన చిత్తుడు; భీతి విదూరుఁడు= భయం లేని వాడు; విభీషణుడు= విభీషణుడు అనేవాడు; ఆర్యుఁడు= మంచి లక్షణాలు కలిగి పూజించ తగినవాడు; ఆరయన్= పరిశీలించగా; ఉత్తమ, చిత్తుఁడు= మంచి మనస్సు కలవాడు.

తాత్పర్యం: వారిలో రావణుడు విస్తారమైన వర్చస్సు కలవాడు, ఎత్తయిన భుజాలు కలవాడు, పేరుప్రతిష్ఠలను ఆర్జించిన పరాక్రమం కలవాడు, పదితలలు కలవాడు, ఎల్లప్పుడు ప్రజ్వలించే క్రోధంతో ఉండేవాడు. ఆతడివంటివాడే కుంభకర్ణుడు కూడ. మిక్కిలి కఠినచిత్తం కలవాడు, చెడుగర్వంతో నిండిన హృదయం కలవాడు. కాని, విభీషణుడు మాత్రం నిర్భయుడు, మంచిగుణాలు కలిగి మన్నించతగినవాడు. పరిశీలించి చూస్తే గొప్పమనస్సు కలవాడు.

విశేషం: ఎత్తైన భుజాలు కలిగి ఉండటం శౌర్యలక్షణంగా సాముద్రికశాస్త్రవేత్తలు భావిస్తారు.

క. ఖరుఁడు ఖరతేజుఁ డవనీ।
సుర పరిభవకారి మాంసశోణితభుజుఁ డు
ద్ధురచిత్తుఁడు శూర్పణఖయు।
దురితచరిత ధర్మకర్మదూషిత యెపుడున్. 9

ప్రతిపదార్థం: ఖరుఁడు= ఖరుడు అనే పేరు కలవాడు; ఖర తేజుఁడు= వాడిమి, వేడిమి కలవాడు; అవనీ సుర, పరిభవ, కారి= బ్రాహ్మణులకు అపకారం చేసేవాఁడు; మాంస శోణిత భుజుఁడు= మాంసం నెత్తురు భుజించేవాడు; ఉద్ధుర చిత్తుఁడు= కఠిన మైన మనస్సు కలవాడు; శూర్పణఖ యున్= శూర్పణఖ అనే పేరు కలదికూడ; దురిత చరిత= పాపం చేసే స్వభావం కలది; ఎపుడున్= ఎల్లప్పుడును; ధర్మ, కర్మ, దూషిత= ధర్మమైన పనులచే తిరస్కరించబడేది.

తాత్పర్యం: ఖరుడు అనేవాడు వాడిమి, వేడిమిగల వర్చస్సు కలవాడు. బ్రాహ్మణులను అవమానించేవాడు. మాంసాన్ని నెత్తురును ఆహారంగా స్వీకరించేవాడు. కఠినమైన మనస్సు కలవాడు. శూర్పణఖ పాపాత్మురాలు. ధర్మకర్మలను తిరస్కరించేస్వభావం కలది.

విశేషం: రామాయణపాత్రలకు ఆయాపేరులు సార్థకనామధేయాలుగా కన్పిస్తాయి. ఖరుడు వాడిమి వేడిమి కలవాడనే కాక గాడిదవంటివాడు అని అర్థం కూడ ఏర్పడుతుంది. శూర్ప+నఖ= శూర్పణఖ= చేటలవంటి గోళ్లు కలది. కుంభకర్ణుఁడు= కుండల వంటి చెవులు కలవాడు. రావణుడు= జగద్రావణం చేసేవాడు.

వ. ఆ రాక్షసకుమారులు దండ్రివలన నఖిలవేదవేదాంగ ధనుర్వేదపారగులై గంధమాదన గిరియందు సుఖం బుండి యొక్కనాఁ డతనికి మ్రొక్కవచ్చువాని నధికవిభవసమన్వితు వైశ్రవణుం జూచి తత్ప్రభావంబు తపోలబ్ధం బగుట విని జాతమత్సరు లయి తారును బితామహు నుద్దేశించి తపంబు సేయం దొడంగిరి; తత్ప్రకారంబు వినుము. 10

ప్రతిపదార్థం: ఆ రాక్షస కుమారులు= ఆ రక్కసుల బిడ్డలు; తండ్రివలనన్= జనకుడివలన; అఖిల వేద, వేద+అంగ, ధనుః+వేద, పారగులు+ఐ= సమస్త వేదాలు, వేదాలయొక్క అంగాలు, విలువిద్యలయొక్క అవ్వలిగట్టును చేరినవారై; గంధమాదన, గిరియందున్= గంధమాదనం అనే పర్వతంలో; సుఖంబు+ఉండి= సౌఖ్యంతో నివసించి ఉండి; ఒక్కనాఁడు= ఒకరోజున; అతనికిన్= విశ్రవసునికి; మ్రొక్కన్ వచ్చు వానిన్= నమస్కరించటానికై వచ్చిన వాడిని; అధిక, విభవ, సమన్వితున్= గొప్ప సంపదతో కూడిన వాడిని; వైశ్రవణున్+చూచి= కుబేరుడిని కాంచి; తత్+ప్రభావంబు= ఆతడి యొక్క మహిమ; తపస్+ లబ్ధంబు+అగుట= తపస్సువలన సిద్ధించింది. అగుట; విని= ఆలకించి; జాత మత్సరులు+అయి= అసూయ కలవారయి; తారును= తాముకూడా; పితామహున్= బ్రహ్మదేవుడిని; ఉద్దేశించి= లక్ష్యంగా పెట్టుకొని; తపంబు+చేయన్+తొడంగిరి= తపస్సు చేయడానికి పూనుకొన్నారు; తత్+ప్రకారంబు= ఆ తపస్సు యొక్క వృత్తాంతం; వినుము= ఆలకింపుము.

తాత్పర్యం: ఆ రాక్షసకుమారులు జనకుడిదగ్గర వేదాలు వేదాంగాలు విలువిద్య అన్నింటిని క్షుణ్ణంగా అభ్యసించి, గంధమాదనపర్వతంలో సుఖంగా ప్రొద్దుపుచ్చుతూ ఉన్నారు. ఒకనాడు కుబేరుడు విశ్రవసుడికి అభివాదం చేయటానికై అచటికి వచ్చాడు. కుబేరుడివైభవం, మహిమలు, అతడికి తపస్సువలననే సంక్రమించినట్లు విని, అసూయ చెంది తాముకూడ బ్రహ్మదేవుడినిగూర్చి తపస్సు చేయటానికి పూనుకొన్నారు. వారి తపోవృత్తాంతం వివరిస్తాను. వినుము.

తే. మండు వేసవిఁబంచాగ్ని మధ్యమున, ఘ।
నాగమంబున బయల, నత్యంత తుహిన
సమయమున నీరియందు, నిశ్చలత నిలిచి।
దశముఖుఁడు వాయుభక్షుఁ డై తప మొనర్చె. 11

ప్రతిపదార్థం: దశముఖుఁడు= పది మొగాలు కలవాడు; వాయు భక్షుఁడు+ఐ= గాలినిమాత్రమే ఆహారంగా భుజించినవాడై; మండు వేసవిన్= ఎండలు చెండుతున్న వేసవి కాలంలో; పంచ+అగ్ని, మధ్యమునన్= అయిదు అగ్నుల మధ్యలో ఉండి; ఘన+ ఆగమంబునన్= వర్షాకాలంలో; బయలన్= బహిరంగ ప్రదేశంలో; అత్యంత, తుహిన, సమయమునన్= మిక్కుటంగా మంచు కురిసే కాలంలో; నీరియందున్= జలంలో; నిశ్చలతన్= చలించకుండా; నిలిచి= నిలబడిఉండి; తపము= తపస్సు; ఒనర్చెన్= చేశాడు.

తాత్పర్యం: పదిమొగాలు కల రావణుడు కఠినతపస్సు చేశాడు. వేసవి మండుటెండల సమయంలో అయిదు అగ్నులనడుమ నిలిచి తపస్సు చేసేవాడు. వానకాలంలో ఆరుబయట, మంచుకురిసేకాలంలో నీటిలోనూ నిష్ఠతో నిలబడి రావణుడు కేవలం గాలినిమాత్రమే ఆహారంగా గైకొని తపస్సు చేశాడు.

విశేషం: పంచాగ్నులు= పంచ+అగ్నులు= అయిదు అగ్నులు. 1. ఆహవనీయం 2. దక్షిణాగ్ని 3. గార్హపత్యం 4. సభ్యం 5. అవసథ్యం. వాటిని వరుసగా వేదికకు పూర్వ దక్షిణ పశ్చిమ-దిక్కులలోనూ, సభ్యం అవసథ్యం ఈశాన్యదిక్కునను నిలుపుతారు.

మ. నియతాహారుఁడు నిర్జితేంద్రియుఁడు నై నిష్కంపవృత్తిన్ మహీ
శయనుండై వ్రతముల్ చరించె నధికేచ్ఛం గుంభకర్ణుండు ధై
ర్యయుతుండై; ఘనుఁ డవ్విభీషణుఁడు పర్ణాహారవృత్తిన్ జపా
ధ్యయనాసక్తిఁ దపంబు సేసె మది నత్యంతంబు సంశుద్ధితోన్. 12

ప్రతిపదార్థం: కుంభకర్ణుండు; నియత+ఆహారుఁడు= కట్టడికి లోనైన తిండి తినే వాడు; నిర్జిత+ఇంద్రియుఁడున్+ఐ= గెలువబడిన ఇంద్రియాలు కలవాడై, ఇంద్రియాలను అదుపులో పెట్టిన వాడై; నిష్కంపవృత్తిన్= చలించని

వ్యాపారం కలవాడై; మహీ, శయనుండు+ఐ= నేలమీద పడుకొంటున్నవాడై; అధిక+ఇచ్ఛన్= మిక్కుటమైన కోరికతో, లక్ష్యసిద్ధియందు తదేకధ్యానం కలవాడై; వ్రతముల్= నోములు; చరించెన్= ఆచరించాడు; ఘనుఁడు= గొప్పవాడు; ధైర్యయుతుండు+ఐ= వికారాలు లేనట్టి స్థిర చిత్తం కలవాడై; ఆ+విభీషణుఁడు; పర్ణ+ఆహార, వృత్తిన్= ఆకులు మాత్రమే తిండిగా భుజిస్తూ; జప+అధ్యయన+ఆసక్తిన్= మంత్రాల ఆవృత్తి, వేదాల పారాయణంలోని కోరికచేత; మదిన్= చిత్తంలో; అత్యంతంబున్= మిక్కుటంగా; సంశుద్ధితోన్= స్వచ్ఛమైన పవిత్రతతో; తపంబు+చేసెన్= తపస్సు చేశాడు.

తాత్పర్యం: కుంభకర్ణుడు ఆహారనియమాలను పాటిస్తూ, ఇంద్రియాలను నిగ్రహించి చలించనిమనస్సు కలవాడై వ్రతాల నాచరించాడు. గొప్పవా డైన ఆ విభీషణుడు ఆకులుమాత్రమే ఆహారంగా భుజించినవాడౌతూ మంత్రాలను ఆవృత్తి చేస్తూ, వేదాలను వల్లెవేస్తూ మనస్సును నిర్మలంగా పవిత్రంగా ఒనరించుకొంటూ తపస్సు చేశాడు.

విశేషం: ఇంద్రియాలను నిగ్రహించటం తపస్సుకు అపరిహార్యమైన లక్షణం.

వ. ఖరుండును శూర్పణఖయు వారికిం దగిన పరిచర్యలు సేయుచుండి; రంత సహస్రవర్షంబులు నిండినం బంక్తివదనుండు దనమస్తకం బొక్కటి ఖండించి మండెడు నగ్నియందు వేల్చి మఱియు వేయేండ్ల కొక్కటిగాఁ దలలు తొమ్మిదియుం దఱిగి వేల్చిధైర్యంబు దఱుఁగక పదియగు తలయును ద్రెంప సమకట్టినఁ బితామహుండు ప్రత్యక్షంబై వారించి, వాని శిరంబు లెప్పటి యట్ల కలుగ నొసంగి 'యమరత్వంబు దక్కనొండు నీ కభిమతం బగునది యెయ్యది యైనను నడుగు' మనుటయు నన్నిశాచరుండు. 13

ప్రతిపదార్థం: ఖరుండును= ఖరుడును; శూర్పణఖయున్= శూర్పణఖయు; వారికిన్= (రావణ, కుంభకర్ణ, విభీషణులకు); తగిన= సరిపోయే; పరిచర్యలు=

సేవలు; చేయుచున్+ ఉండిరి; అంతన్= అంతట; సహస్ర వర్షంబులు= వేయిఏండ్లు; నిండినన్= పూర్తి అయిన పిమ్మట; పంక్తి వదనుండు= దశకంఠుడు - రావణుడు; తన మస్తకంబు= తన శిరము; ఒక్కటి= ఒక్కటి; ఖండించి= కత్తిరించి; మండెడు= జ్వలించే; అగ్నియందున్= నిప్పులో; వేల్చి= ఆహుతి చేసి; మఱియున్= ఇంకను; వేయేండ్లకున్= వేయి సంవత్సరాలకు; ఒక్కటిగాన్= ఒక శిరస్సుగా; తలలు= శిరములు; తొమ్మిదియున్= తొమ్మిదింటిని; తఱిగి= నరికి; వేల్చి= ఆహుతి చేసి; ధైర్యంబు= చిత్తంలోని దిటవుతనం; తఱుఁగక= తగ్గక; పది+అగు, తలయును= పదియవ శిరస్సును; త్రెంపన్= త్రుంచటానికి; సమకట్టినన్= పూనగా; పితామహుండు= బ్రహ్మదేవుడు; ప్రత్యక్షంబు+ఐ= సాక్షాత్కరించి; వారించి= ఆపి; వాని శిరంబులు= ఆతని తలలు- రావణుడి తలలు; ఎప్పటి+అట్ల= యథా ప్రకారం; కలుగన్= ఏర్పడేటట్లు; ఒసంగి= వరం ఇచ్చి; అమరత్వంబు, తక్కన్= చావు లేకపోవటం తప్ప; ఒండు= ఇంకొకటి; నీకున్+అభిమతంబు+ అగునది= నీకు ఇష్టం అయినది; ఎయ్యది+ఐనను= ఏది అయినప్పటికి; అడుగుము= కోరుము; అనుటయున్= అని చెప్పటమున్నూ; ఆ+ నిశాచరుండు= ఆ రాక్షసుడు- రావణుడు.

తాత్పర్యం: ఖరుడును శూర్పణఖయు తమ అన్నగారలు అయిన రావణుడికి కుంభకర్ణుడికి విభీషణుడికి అవసరమైన సేవలు చేస్తూ ఉన్నారు. వేయి సంవత్సరాలు ఆ విధంగా తపస్సు చేసినను బ్రహ్మదేవుడు సాక్షాత్కరించలేదు. అయినను రావణుడు తనదీక్షను వీడక తన పదితలలలో ఒక తలను ఖండించి అగ్నిలో ఆహుతి చేశాడు. అట్లే రావణాసురుడు మరి తొమ్మిదివేల సంవత్సరాలు కఠోరతపస్సు చేసి తన వేయి సంవత్సరాల కొక శిరస్సువంతున ఆహుతి చేస్తూ, చివరకు తన పదవ శిరస్సును కూడ ఖండించి అగ్నిలో వేల్చటానికి సంసిద్ధుడైనపుడు బ్రహ్మదేవుడు సాక్షాత్కరించాడు. అప్పుడు పితామహుడు రావణుడి తలలు తొమ్మిది యథాప్రకారం మొలిచేటట్లు

వరాన్ని ఇచ్చి 'అమరత్వం తప్ప మరి యేదైన ఇంకొక వరాన్ని కోరుకొను' మని చెప్పాడు. అంతట ఆ రావణుడు.

విశేషం: (1) రావణుడు చేసింది తామస తపస్సు. అహంకారంతో, స్వార్థబుద్ధితో తన శక్తిసామర్థ్యాలు పెంచుకొనటానికై చేసే తపస్సు ఒక యెత్తు. విశ్వశ్రేయాన్ని కాంక్షించే తపస్సు మరియొక యెత్తు. (2) రావణుడు పదివేల సంవత్సరాలు తపస్సు చేసినట్లు ఇందులో ఉన్నది. ఈ కాలమానం ఎట్టిది? ఈ విషయంపై పండితులలో ఏకాభిప్రాయం కుదరలేదు.

శా. 'దేవా! యేను సమస్త దేవ పితృదైతే యాహి గంధర్వ ర
క్షో విద్యాధర యక్షజాతులకు నక్షోభ్యుండఁగాఁ బ్రీతితో
నీ విశ్వంబునఁ గామరూపగతి నాత్మేచ్ఛావిహారుండఁగా
నీవే' నావుడు వాని కవ్వర మజుం డిచ్చెం గృపాలోలతన్. 14

ప్రతిపదార్థం: దేవా!= ఓ బ్రహ్మదేవుడా!; ఏను= నేను; సమస్త, దేవ, పితృ, దైతేయ+అహి, గంధర్వ, రక్షస్+విద్యాధర, యక్షజాతులకున్= వేల్పులు, పిశాచాలు, దితి సంతతివారైన రాక్షసులు, పన్నగులు, గంధర్వులు, రక్కసులు, విద్యాధరులు, యక్షులకు సంబంధించిన అందరకును; అక్షోభ్యుండన్+కాన్= కలత చెందనివాడనుగా; ప్రీతితోన్= వేడుకతో; ఈ విశ్వంబునన్= ఈ సృష్టిలో; కామ, రూప, గతిన్= ఇచ్చ వచ్చిన ఆకృతిని ధరించే తీరులో; ఆత్మ+ఇచ్ఛా, విహారుండన్+కాన్= స్వయం సంకల్పాన్ని బట్టి పయనం కొనసాగించ గలవాడిగా; (వరమును); ఈవే= ఇయ్యవా, ఇమ్ము; నావుడున్= అని (రావణుడు) అనగా; వానికిన్= అతడికి- రావణుడికి; ఆ+వరము= ఆ కోరిక; అజుండు= బ్రహ్మదేవుడు; కృపాలోలతన్= దయతో కూడిన ఆసక్తితో; ఇచ్చెన్= ఇచ్చాడు.

తాత్పర్యం: 'ఓ బ్రహ్మదేవా! ఈ వరాలను నాకు అనుగ్రహించుము. దేవతలచేత, పితరులచేత, దితిసంతతిచేత, పన్నగులచేత, గంధర్వులచేత,

రాక్షసులచేత, విద్యాధరులచేత, యక్షజాతులచేత నేను ఓడిపోరాదు. వేడుకగా ఈ సువిశాల సృష్టిలో ఎక్కడికైనా కోరిన రూపంతో సంచరించే శక్తి కలవాడను కావలెను' - అని రావణుడు ప్రార్థించగా, బ్రహ్మదేవుడు దయాతత్పరుఁడై ఆతడికి కోరినవరం ఇచ్చాడు.

బ్రహ్మ రావణ కుంభకర్ణ విభీషణులకు వరంబు లిచ్చుట (సం. 3-259-26)

వ. 'మనుష్యజాతి యొక్కండుదక్క నీ చెప్పిన యందఱవలనను నీకు మరణభయంబు లే దని పలికి, పరమేష్ఠి గుంభకర్ణుం జూచి 'వరం బడుగు' మనిన వాఁడు దైవోపహతుండై తనకు నాత్యంతికం బయిన నిద్ర యడిగిన నట్ల యగు నని, విభీషణున కభిముఖుం డగుటయు నతండు కృతాంజలియై జలజాసనుఁ బ్రస్తుతించి. 15

ప్రతిపదార్థం: మనుష్యజాతి= మనుజులు అనే తెగ; ఒక్కండు= ఒకటి; తక్కన్= తప్ప; నీ చెప్పిన= నీవు వచించిన; అందఱవలనను= అందరి మూలంగా; నీకున్; మరణభయంబు= చావువలని భీతి; లేదు= కలుగదు; అని పలికి= అని చెప్పి; పరమేష్ఠి= బ్రహ్మదేవుడు; కుంభకర్ణున్= కుంభకర్ణుడిని; చూచి= కాంచి; వరంబు+ అడుగుము= కోరికను కోరుకొనుము; అనినన్= అని చెప్పగా; వాఁడు= అతడు- కుంభకర్ణుడు; దైవ+ఉపహతుండు+ఐ= దైవంచేత కొట్టబడినవాడై; తనకున్= తనకు; ఆత్యంతికంబు+అయిన= మిక్కిలి అయిన; నిద్ర= నిద్దుర; అడిగినన్= కోరగా; అట్ల+అగున్+అని= నీవు కోరినట్లే నీకు నిద్ర ఒనగూడునుగాక అని చెప్పి; (బ్రహ్మ) విభీషణునకున్; అభిముఖుండు+అగుటయున్= ఎదురుగా మొగము పెట్టిన వాడు అగుటయును; ఆతండు= అతడు (విభీషణుడు); కృత+అంజలి+ఐ= ఘటించబడిన కైమోడ్పు కలవాడై; జలజ+ఆసనున్= పద్మం ఆసనంగా కలవాడిని- బ్రహ్మదేవుడిని; ప్రస్తుతించి= పొగడి.

తాత్పర్యం: 'మనుజులచేత తప్ప నీవు కోరినమేరకు ఇతరజాతులవారిచేత నీకు చావువలనిభయం లేదు' అని రావణుడితో పలికి బ్రహ్మదేవుడు కుంభకర్ణుడిని చూచి వరం కోరుకొనుమని పలికాడు. ఆ కుంభకర్ణుడు దురదృష్టానికి చిక్కి, తనకు మిక్కిలి ప్రీతిగల నిద్ర కావాలి అని కోరాడు. 'సరే అటులే నీ కోరిక ఈడేరుగాక' అని చెప్పి, బ్రహ్మదేవుడు విభీషణుడికి ఎదురు మొగం పెట్టి నిలిచాడు. అంతట విభీషణుడు బ్రహ్మకు నమస్కరించి అతడిని ప్రస్తుతించాడు.

క. 'పరమాపద యైనపుడును।
దురితంబులు నా మనంబు దొడరమియునుభా
సుర మగు బ్రహ్మాస్త్రమ్మును।
గరుణింపవె' యనిన నిచ్చి కమలజుఁ డనియెన్. 16

ప్రతిపదార్థం: పరమ+ఆపద= గొప్పదైన కీడు; ఐనపుడును= వచ్చి నప్పటికిని; దురితంబులు= పాపాలు; నామనంబున్= నా చిత్తాన్ని; తొడరమియును= చొరబడ కుండటమున్నూ; భాసురము+అగు= ప్రకాశించేటటువంటి; బ్రహ్మ+ అస్త్రమ్మును= బ్రహ్మకు సంబంధించిన దివ్యమహిమగల ఆయుధాన్ని; కరుణింపవె= అనుగ్రహించవా; అనినన్= అని అడుగగా; ఇచ్చి= ఒసగి; కమలజుఁడు+అనియెన్= పద్మంలో పుట్టినవాడు- బ్రహ్మదేవుడు పలికాడు.

తాత్పర్యం: 'ఎంతటి కీడు దాపురించినా నా మనస్సు పాపానికి పూనకుండేటట్లుగా వరం ఇచ్చి నాకు బ్రహ్మాస్త్రం అనుగ్రహించుము' అని విభీషణుడు ప్రార్థించాడు. విభీషణుడు కోరిన వరా లిచ్చి, అతనితో బ్రహ్మదేవుడు ఇట్లా పలికాడు.

క. 'నిరతము రాక్షసభవమును।
బొరసియు నీ విట్లు ధర్మబుద్ధి వగుట య

చ్చెరు విది గావున నీకును ।
దిరముగ నమరత్వ మిచ్చితిం గృప వత్సా!   17

ప్రతిపదార్థం: వత్సా!= కుమారా!; నీవు= ఈవు; ఇట్లు= ఈ రీతిగా; రాక్షసభవమును= రక్కసి పుట్టుక; పొరసియున్= పొందినా; నిరతమున్= ఎల్లప్పుడు; ధర్మబుద్ధివి= ధర్మంతో కూడిన చిత్తం కలవాడవు; అగుట= అయి ఉండటం; అచ్చెరువు+ఇది= ఇది ఆశ్చర్యం; కావునన్= కాబట్టి; నీకును= నీకు మాత్రమే; తిరముగన్= స్థిరంగా; కృపన్= దయతో; అమరత్వము= చావు లేని స్థితి; ఇచ్చితిన్= ఇచ్చాను.

తాత్పర్యం: వత్సా, విభీషణా! 'నీవు రాక్షసవంశంలో జన్మించినప్పటికిని' ధర్మంలోనే బుద్ధి నిల్పటం ఆశ్చర్యకరం. అందుచేత నీకు అమరత్వం దయతో ఇస్తున్నాను'.

వ. అని పలికి పితామహుం డంతర్హితుం డయ్యెఁ; దదనంతరంబ. 18

ప్రతిపదార్థం: అని పలికి= అని చెప్పి; పితామహుండు= బ్రహ్మదేవుడు; అంతర్హితుండు+అయ్యెన్= మాయమయ్యాడు; తత్+అనంతరంబు+అ= అటు పిమ్మట.

తాత్పర్యం: అని పలికి బ్రహ్మదేవుడు అదృశ్యమయ్యాడు. అటు పిమ్మట.

మ. వరగర్వోన్నతుఁ డై దశాననుఁడు దుర్వారోద్ధతిన్ దాడిమై
నరిగెం గిన్నరనాథుపై; నతఁడు కార్యం బాత్మ నూహించి సం
గరసన్నద్ధుఁడు గాక కింపురుష యక్షశ్రేణితోఁ గూడఁ దా
నరిగెన్ లంకఁ బరిత్యజించి రభసోద్యత్పుష్పకారూఢుఁడై.   19

ప్రతిపదార్థం: వర, గర్వ+ఉన్నతుఁడు+ఐ (బ్రహ్మదేవుడు ఇచ్చిన) వరంచేత వర్ధిల్లిన దర్పంచేత గొప్పవాడై; దశ+ఆననుఁడు= పది మొగాలు కలవాడు-రావణుడు; దుః+వార+ఉద్ధతిన్= వారించటానికి శక్యంగాని అతిశయంతో;

కిన్నరనాథుపైన్= కుబేరుడిపై; దాడిమైన్+అరిగెన్==దండెత్తివెళ్ళాడు; అతఁడు= కుబేరుడు; కార్యంబు+ఆత్మన్+ ఊహించి= సామంతో జరుగదగిన కర్తవ్యాన్ని మనస్సులో ఊహించి; సంగర సన్నద్ధుఁడు+కాక= యుద్ధ సన్నాహాలను చేయక; కింపురుష, యక్ష, శ్రేణితోన్+కూడన్= కింపు రుషుల యక్షుల సముదాయాలతోకూడుకొని; తాన్= తాను (కుబేరుడు); లంకన్= లంకను; పరిత్యజించి; రభస+ఉద్యత్+పుష్పక+ఆరూఢుఁడు+ఐ= సంభ్రమంతో, శోభిల్లే పుష్పకం అనే విమానంలో ఎక్కినవాడై; తాన్+అరిగెన్= తాను వెళ్ళాడు.

తాత్పర్యం: బ్రహ్మదేవుడివలన తాను పొందిన వరాలచేత మిక్కుటమైన దర్పం కలవాడై రావణుడు వారించటానికి వీలుకాని పరాక్రమప్రాభవంతో కిన్నరపతి అయిన కుబేరుడిపై దండెత్తి వెళ్లాడు. కుబేరుడు ఇంక రావణుడిని ఎదిరించి యుద్ధం చేయటం లాభంలేదని గ్రహించి, తత్తరపాటుతో తన పుష్పకవిమానాన్ని అధిరోహించి లంకను వదలిపెట్టి పారిపోయాడు.

విశేషం: (1) లంక - నాలుగు వైపుల సముద్రం చేత ఆవరింపబడిన ద్వీపం. (2) కింపురుషుడు - అశ్వముఖాన్నీ నరశరీరాన్నీ కల వేల్పుతెగకు చెందినవాడు. (3) పుష్పకం - సంకల్పమాత్రంచేత గమ్యం తెలిసి చేరగల యథేచ్ఛాగమనం కొనసాగించగల విమానం. (4) కార్యం - సామవిధానం అనుసరించే రాజనీతి. కార్యనీతి × ఖడ్గనీతి. కార్యం ఖడ్గనీతికి అనగా యుద్ధానికి వ్యతిరేకం.

వ. ఇ ట్లతండు గంధమాదనంబునకుం జనునెడ వెన్నడిం దగిలి దానవుండు వాని మానంబుతోన విమానంబు నపహరించినం గనలి యక్షేశ్వరుండు 'గురుండ నగు నన్ను నవమానించితివి గావున నివ్విమానంబు నీ పగతు పా లయ్యెడు' మని శపించె నంత.   20

ప్రతిపదార్థం: ఇట్లు+అతండు= ఈ విధంగా; అతండు= కుబేరుడు; గంధమాదనంబు నకున్= గంధమాదనం అనే పర్వతానికి (వేల్పులు విహరించే

కొండకు); చను+ఎడన్= వెడలేటప్పుడు; వెన్నడిన్+తగిలి= వెంబడించి; దానవుండు= రాక్షసుడు - రావణుడు; వాని మానంబుతోన= అతడి (కుబేరుడి యొక్క) అభిమానం (పరువు)తోపాటే; విమానంబున్= అంతరిక్షవాహనం - పుష్పకం; అపహరించినన్= వంచించి తీసికొని పోవగా; కనలి= కలత చెంది; యక్ష+ఈశ్వరుండు= యక్షులకు ప్రభువు - కుబేరుడు; గురుండన్+అగు= పెద్దవాడను అయిన; నన్నున్= నన్ను; అవమానించితివి= అగౌరవించావు; కావునన్= కాబట్టి; ఈ+విమానము; నీ పగతుపాలు= నీ విరోధివశం; అయ్యెడున్+అని= ఔగాక అని; శపించెన్= శాపం ఇచ్చాడు; అంతన్= పిమ్మట.

తాత్పర్యం: ఈ విధంగా కుబేరుడు వేల్పులు విహరించే గంధమాదన పర్వతానికి పారిపోతూ ఉండగా, రావణుడు ఆతడిని వెంబడించి ఆతడి గౌరవాన్నేకాక పుష్పకవిమానాన్నికూడ అపహరించాడు. అంతట యక్షులకు రాజు అయిన కుబేరుడు ఆగ్రహించి, పెద్దవాడయిన తనను పరాభవించటం చేత ఆ విమానం శత్రువు పాలవుతుందని రావణుడిని శపించాడు.

విశేషం: శాపం - వరానికి వ్యతిరేకార్థకం.

క. రాక్షసలక్ష్మీమహిమకు ।
రక్షకుఁడుగఁ బంక్తిముఖుని రాక్షసమాయా
దక్షు నభిషిక్తుఁ జేసిరి ।
రాక్షసబేతాళవరులు రాగం బెసఁగన్. 21

ప్రతిపదార్థం: రాక్షస బేతాళ వరులు= రక్కసులలోని బేతాళులలోని నాయకులు; రాగంబు= ప్రేముడి; ఎసఁగన్= అతిశయించగా; రాక్షస లక్ష్మీమహిమకున్= రక్కసులయొక్క సంపద అనే గొప్పతనానికి; రక్షకుఁడుగన్= కాపాడేవాడుగా; రాక్షస, మాయా, దక్షున్= రక్కసుల మోసంలో నేర్పరిని; పంక్తిముఖునిన్= పదిమోములు కలవాడిని - రావణుడిని; అభిషిక్తున్+చేసిరి= పట్టం కట్టారు.

తాత్పర్యం: రాక్షస మాయలలో నేర్పరి అయిన రావణుడిని రాక్షస సామ్రాజ్యాన్ని కాపాడే సార్వభౌముడిగా రక్కసుల బేతాళుల నాయకులు అనురాగంతో పట్టాభిషిక్తుడిని చేశారు.

విశేషం: (1) బేతాళులు - పిశాచులు. ఈ తెగ మాంసభక్షకులు, నెత్తురు త్రాగేవారు. మృతదేహపరాయణులుగా పురాణాలలో అభివర్ణించబడ్డారు. రాక్షసులకూ వీరికీ పొత్తు ఉన్నది.

వ. వాఁడును బలదర్పమోహితుండై కడంగి యింద్రాదిదేవతల నొడిచి తత్పదంబు లాక్రమించి, యీసు మిగిలి జగద్రావణంబు సేయుటం జేసి, రావణుం డను పేరం బ్రఖ్యాతి వహించి సకలభూత భయంకరుం డయ్యె; నట్టియెడ దేవర్షులును, రాజర్షులునుం గూడి చని తత్ప్రకారం బగ్నిదేవునకుం జెప్పిన, నతండు వారిం దోడ్కొని వారిజాసనుపాలికిం జని యి ట్లనియె. 22

ప్రతిపదార్థం: వాఁడును= దశకంఠుడును; బల, దర్ప మోహితుండు+ఐ= పరాక్రమ ప్రాభవాలచేత భ్రాంతి పొందినవాడై; కడంగి= పూనిక వహించి; ఇంద్ర+ఆది, దేవతలన్= ఇంద్రుడు మున్నగు వేల్పులను; ఒడిచి= ఓడించి; తత్+పదంబులు= వారి స్థానాలు; ఆక్రమించి= తన అధీనం చేసికొని; ఈసు మిగిలి= అసూయతో అతిశయించి; జగత్+రావణంబు= లోకం అరచేటట్లు చేయుటయున్+చేసి= సలుపుట చేత; రావణుండు= రావణుడు; అను పేరన్= అను నామంతో; ప్రఖ్యాతి= కీర్తి; వహించి= ధరించి; సకల, భూత, భయంకరుండు+అయ్యెన్= సమస్తచేతనా చేతనాలకు వెఱపు గొలిపేవాడు అయ్యాడు; అట్టి +ఎడన్= అట్టి తరుణంలో; దేవ+ఋషులును, రాజ+ ఋషులను= దేవతలలోని మునులును, రాజులలోని మునులును; కూడి= కలిసి; చని= వెడలి; తత్+ప్రకారంబు= ఆ విధాన్ని; అగ్నిదేవునకున్= అగ్నిహోత్రుడికి; చెప్పినన్= వచించగా; అతండు= అతడు (అగ్నిదేవుడు);

వారిన్= వారిని (రాజర్షులను దేవర్షులను); తోడ్కొని= వెంటనిడుకొని; వారిజాసను, పాలికిన్= బ్రహ్మదేవుడి కడకు; చని= వెడలి ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: రావణుడు గర్వంతో విజృంభించి, దేవేంద్రుడు మున్నగువారి నోడించి వారిస్థానాలను ఆక్రమించి జగత్తు ఆక్రోశించేటట్లుగా చేయటంచేత 'రావణుడు' అనే సార్థకనామధేయుడై సర్వభూతములకు భీతి కలిగించాడు. ఆ తరుణంలో దేవతలలో ఋషులును రాజులయిన ఋషులును కలిసి వెళ్ళి ఆ ఉపద్రవాన్నిగూర్చి అగ్నిదేవుడికి తెలిపారు. ఆ అగ్నిదేవుడు వారిని తన వెంటబెట్టికొని, బ్రహ్మదేవుడిపాలికి వెళ్ళి, ఇట్లు విన్నవించాడు.

ఉ. 'భూరిభుజుండు విశ్రవసుపుత్త్రుఁడు పంక్తిముఖుండు దర్పదు
ర్వారుఁడు రాక్షసేంద్రుఁడు భవద్వరశక్తి నవధ్యుఁ డై మహా
ఘోరముగాఁ ద్రిలోకములకుం గడుఁ బీడ యొనర్పఁ జొచ్చె వృ
త్రారి పురోగమత్రిదశు లందఱుఁ గింకరు లైరి వానికిన్. 23

ప్రతిపదార్థం: భూరి భుజుండు= గొప్ప బాహువులు కలవాడు, మిక్కుటమైన పరాక్రమం కల వీరుడు; విశ్రవసు పుత్త్రుఁడు= విశ్రవసుడి కుమారుడు; పంక్తి, ముఖుండు= పది మొగాలు కలవాడు; దర్పదుర్వారుఁడు= పరాక్రమ ప్రకర్ష చేత వారించటానికి వీలుగానివాడు; రాక్షస+ఇంద్రుఁడు= రాక్షసులయొక్క ప్రభువు; భవత్+వర శక్తిన్= నీవు అనుగ్రహించిన వరాల బలంవలన; అవధ్యుఁడు+ఐ= చంపటానికి వీలులేనివాడై; మహా ఘోరముగాన్= మిక్కిలి దారుణంగా; త్రిలోకములకున్= మూఁడు లోకాలకున్నూ; కడున్= మిక్కుటంగా; పీడ= హింస; ఒనర్పన్+చొచ్చెన్= చేయటానికి పూనుకొన్నాడు; వృత్ర+అరి, పురోగమ, త్రిదశులు, అందఱున్= వృత్రుడికి విరోధి అయిన దేవేంద్రుడు మొదలుగాగల దేవతలు అందరును; వానికిన్= అతడికి - ఆ రావణుడికి; కింకరులు+ఐరి= సేవకులు అయ్యారు.

తాత్పర్యం: 'గొప్పపరాక్రమప్రాభవం గల వీరుడు, విశ్రవసుడికుమారుడు, దశముఖుడు, రాక్షససార్వభౌముడు అయిన రావణుడు తన బలదర్పంచేత విర్రవీగుతూ వృత్రుడిని జయించిన దేవేంద్రుడు మున్నగు దేవతలను అందరిని జయించాడు. వారు వేరే గతిలేక ఆ రావణుడికి సేవకులైపోయారు.

విశేషం: త్రిదశులు= ఎల్లప్పుడును ముప్పదేండ్లప్రాయంలోనే ఉండేవారు; దేవతలు.

ఉ. దానవుచేతఁ గష్టపడి దైన్యము నొందుట కోర్వలేక నీ
దైన పదాంబుజంబు లభయం బని చేరితి; మింక మమ్ము నె
ట్లైనఁ గృపార్ద్రమానసుఁడ వై తగఁ జేకొనవయ్య! మాకు ది
క్కైనను గాకయున్నఁ గమలాసన ! నీవ కదయ్య యెయ్యెడన్.' 24

ప్రతిపదార్థం: కమల+ఆసన!= పద్మం పీఠంగా కలవాడా, ఓ బ్రహ్మదేవుడా!; దానవు చేతన్= రాక్షసుడిచేత, రావణుడి చేత; కష్టపడి= బాధలను అనుభవించి; దైన్యమున్+ఒందుటకున్= హీనత్వాన్ని పొందటానికి; ఓర్వలేక= భరించలేక; నీదు+ఐన= నీ యొక్క; పద+అంబుజంబులు= పద్మాలవంటి చరణాలు; అభయంబు+అని= శరణం అని తలపోసి; చేరితిమి= వచ్చాము; ఇంకన్= ఇక మీదట; మమ్మున్= మమ్మల్ని; ఎట్లు+ఐనన్= ఏ రీతిగా అయినా; కృపా+ఆర్ద్ర, మానసుఁడవు+ఐ= దయతో తడిసిన (మెత్తనైన) చిత్తం కలవాడవై; తగన్= సరిపడేటట్లుగా; చేకొనవు+అయ్యా= స్వీకరించవా దేవా; మాకున్; దిక్కు+ఐననున్= గతి అయినను; కాక, ఉన్నన్= గతికాక పోయినప్పటికి (అంటే రక్షించినా రక్షింపక పోయినా); ఏ+ఎడన్= ఏదిక్కైనా; నీవు+అ= నీవే; కద+అయ్యా= కదా.

తాత్పర్యం: ఓ బ్రహ్మదేవా! రావణాసురుడిచేత పెక్కుకష్టాలు అనుభవించి, ఇక ఆ బాధలకు ఓర్వజాలక నీ చరణారవిందాలే శరణ్యాలని ఇక్కడకు చేరాం. రక్షించినా రక్షింపకపోయినా మాకు వేరే దిక్కు లేదు. నీవే అన్నింటా దిక్కువు. దయామయుడవై మమ్మల్ని మన్నించుము. మా విన్నపాలు ఆలకించుము'.

వ. అనినంబరమేష్ఠివారల కిట్లను; నిక్కార్యంబునకు నేను మున్న తగిన యుపాయంబు నిశ్చయించి నారాయణుం బ్రార్థించితి; నద్దేవుండు మనుష్యభావంబున నవతరించి, యా రాక్షసు వధియించువాఁ డయ్యె; నింద్రాది సురులునుం దమ తమ యంశంబులంజేసి ఋక్షవానర జాతులయందు జనియింపఁగలవారు; మీకు భయంబు వలవ' దని యగ్ని ప్రముఖు లైన యమ్మహామునుల సమ్ముఖంబున దుందుభి యను గంధర్వ కామినిం బిలిచి 'నీవు కుబ్జరూపంబున మంథర యను పేర భూలోకంబున నుద్భవించి నీ నేర్చు విధంబున దేవకార్యంబులు నిర్వహింపు' మని పనిచి వారి వీడ్కొలిపెఁ; బదంపడి దివిజుల యంశావతారంబులం. జేసి. 25

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; పరమేష్ఠి= బ్రహ్మదేవుడు; వారలకున్= (బ్రహ్మర్షి, రాజర్షి, అగ్ని, ప్రభృతులకు); ఇట్లు+అనున్= ఈ రీతిగా చెప్పాడు; ఈ+కార్యంబునకున్= ఈ పనికి; ఏను= నేను; మున్న+అ= ఇంతకు ముందే; తగిన= సరి అయిన; ఉపాయంబు= వెరవు; నిశ్చయించి= నిర్ణయించి; నారాయణున్= విష్ణుదేవుడిని; ప్రార్థించితిన్= వేడుకొన్నాను; ఆ+దేవుండు= విష్ణువు; మనుష్య భావంబునన్= మనుజరూపంతో; అవతరించి= జన్మించి; ఆ రాక్షసున్= ఆ రక్కసుని (రావణుడిని); వధియించువాఁడు+అయ్యెన్= సంహరించగలవాడు అయ్యాడు; ఇంద్ర+ఆది, సురులునున్= ఇంద్రుడు మున్నగు వేల్పులును; తమ తమ పాళ్ల చేత; ఋక్ష, వానర, జాతులయందున్= ఎలుగుల, కోతుల తెగలలో; జనియింపన్+కలవారు= పుట్టగలరు; మీకున్= మీకు (అగ్ని ప్రభృతులకు); భయంబు= భీతి; వలవదు= అనవసరం; అని= అంటూ; అగ్ని ప్రముఖులు+ఐన= అగ్ని నాయకత్వాన వచ్చిన; ఆ+మహా, మునుల; సమ్ముఖంబునన్= సన్నిధిలో; దుందుభి+అను= దుందుభి అనే పేరు కల; గంధర్వ, కామినిన్= గంధర్వ జాతికి చెందిన కాంతను; పిలిచి= ఆహ్వానించి; నీవు= ఓ దుందుభీ! నీవు; కుబ్జ రూపంబునన్= మరుగుజ్జు ఆడదాని ఆకారాన; మంథర అను పేరన్= మంథర అనే నామంతో; భూలోకంబునన్=

భూమిపై; ఉద్భవించి= జన్మించి; నీ నేర్చు విధంబునన్= నీ నేర్పును బట్టి; దేవ కార్యంబు= దేవతల పని; నిర్వహింపుము= నెరవేర్చుము; అని పనిచి= అని నియోగించి; వారిన్= వారిని (అగ్ని ప్రభృతులను); వీడ్కొలిపెన్= సెలవు నిచ్చి పంపాడు; పదంపడి= పిదప; దివిజుల+అంశ+ అవతారంబులన్+చేసి= దేవతలయొక్క పాళ్లను పంచుకొని జన్మించిన వారై;

తాత్పర్యం: అగ్ని మొదలైనవారలకు బ్రహ్మదేవుడు ఈ రీతిగా సమాధానం చెప్పాడు. ఈ సమస్యనుగూర్చి నేను ఇదివరకే ఆలోచించి ఒకనిర్ణయం తీసికొన్నాను. ఇంతకుముందే నేను ఈ విషయాన్ని శ్రీమన్నారాయణుడికి నివేదించి ఉన్నాను. ఆ దేవుడు భూలోకంలో మానవుడుగా అవతరించి రావణాసురుడిని సంహరించగలడు. ఇంద్రుడు మున్నగు దేవతలుకూడ, తమ తమ అంశాలతో వానరులుగా, ఎలుగులుగా అవతరించగలరు. ఇక మీకు భయం వద్దు. అంతేకాక, బ్రహ్మదేవుడు అగ్నిప్రభృతుల సమక్షంలోనే, 'దుందుభి' అనే యక్షకాంతను పిలిచి, ఆమెను దేవకార్యం నిర్వహించటం కొరకై భూలోకంలో 'మంథర' అనే కుబ్జగా జన్మించుమనికూడా నియోగించాడు. ఆ తరువాత బ్రహ్మ అగ్నిప్రభృతులను వీడ్కొలిపి పంపాడు. పిదప దేవతల అంశలతో.

మ. గురుశైలోన్నతగాత్రు లుద్ధత భుజో గ్రుల్ వజ్రపాషాణ క
ర్కరు లర్కప్రతిమానతేజులు, గుణాకల్పుల్, మహాకల్పభీ
కరకాలాంతకకల్పు లాజినిపుణుల్ గర్వోన్నతుల్ ఋక్షవా
నర వీరుల్ జనియించి రెల్లయెడలన్ నాగాయుతప్రాణులై. 26

ప్రతిపదార్థం: గురు, శైల+ఉన్నత, గాత్రులు= పెద్దకొండలవలె ఎత్తైన శరీరాలు కలవారు; ఉద్ధత, భుజ+ఉగ్రుల్= దర్పంతో కూడిన భుజ పరాక్రమంతో అతిశయించిన వారు; వజ్ర, పాషాణ కర్కరులు= వజ్రాలవలె రాళ్లవలె కఠినాలైన దేహాలు కలవారు; అర్క, ప్రతిమాన, తేజులు= సూర్యుడితో సరిపోలే వర్చస్సు కలవారు; గుణ+ఆకల్పుల్= మంచిగుణాలు అనే భూషలు

కలవారు; మహా, కల్ప, భీకర, కాల+అంతక, కల్పులు= గొప్ప ప్రళయసమయంలోని భయంకరమైన యముడితో సమానులు; ఆజి నిపుణుల్= యుద్ధంలో నేర్పరులు; గర్వ+ఉన్నతుల్= గొప్ప దర్పం కలవారు; ఋక్ష, వానర, వీరుల్= ఎలుగులకు కోతులకు సంబంధించిన శూరులు; నాగ+అయుత, ప్రాణులు+ఐ= పదివేల ఏనుగులకు ఉండే శక్తి కలవారై; ఎల్ల+ఎడలన్= అన్ని తావులలో; జనియించిరి= పుట్టారు.

తాత్పర్యం: పలుతావులలో ఎలుగులుగా కోతులుగా దేవతల అంశలు పంచుకొని వీరులు ఉద్భవించారు. ఆ వీరులు పెద్దకొండలవలె ఎత్తైనశరీరాలు కలవారు. దర్పంతో కూడిన పరాక్రమప్రాభవం కలవారు. వజ్రాల వలె, పాషాణాలవలె కఠినంగా ఉండే దృఢమైన దేహాలు కలవారు. సూర్యుడివంటి తేజస్సు కలవారు. మంచి గుణాలే ఆహార్యంగా కలవారు. ప్రళయకాలంలోని యముడితో సమానులు. యుద్ధంలో నేర్పరులు. పదివేల ఏనుగుల బలం కలవారు.

క. అన విని యుధిష్ఠిరుం డ ।
మ్మునివరుతో 'నసఘ! ధర్మమూర్తిని నా రా
ముని నేల యరణ్యంబున ।
కనిచెను దశరథుఁడు సెపుమ యక్కథ నెల్లన్'. 27

ప్రతిపదార్థం: అనన్ విని= అని చెప్పగా ఆలకించి; యుధిష్ఠిరుండు= ధర్మరాజు; అమ్మునివరుతోన్= ఆ ఋషిశ్రేష్ఠుడితో (మార్కండేయుడితో); అనఘ!= పుణ్యాత్ముడా, మార్కండేయ మహర్షీ!; దశరథుఁడు; ధర్మమూర్తిని= ధర్మమే మానవాకృతి ధరించినవాడిని; ఆ రామునిన్= ఆ శ్రీరాముడిని; ఏల= ఎందుకు; అరణ్యంబునకున్= అడవికి; అనిచెను= పంపాడు; ఆ+కథను= ఆ గాథను; ఎల్లన్= సమస్తం; చెపుమ= వచింపుము.

తాత్పర్యం: ధర్మరాజు ఇట్లా పలికాడు: 'పుణ్యాత్ముడవైన ఓ మార్కండేయ మహామునీ! "మూర్తీభవించిన ధర్మం' అని పేరు గాంచిన శ్రీరాముడిని దశరథమహారాజు ఏల అడవికి పంపాడు? దయచేసి, ఆ కథను తెలుపుము'.

విశేషం: రాముడు ధర్మమూర్తి. "రామో విగ్రహవాన్ ధర్మః" అని వాల్మీకి రామాయణంలో ఉన్నది.

వ. అని యడుగుటయు మార్కండేయుం డిట్లనియె: 'దశరథుండు నిజ సుకృత పాకంబునం జేసి రామ ప్రముఖులయిన కొడుకుల నలువురం గని, త్రైలోక్యరాజ్యంబు సంప్రాప్తం బయినయట్లు సంతసిల్లె; నక్కుమారులు క్రమంబున నుపనీతులు నఖిలవేదవేదాంగవినీతులు, యథాక్రమ పరిణీతులు నై విలసిల్లి రంత. 28

ప్రతిపదార్థం: అని+అడుగుటయున్= అని ప్రశ్నించటమున్నూ; మార్కండేయుండు; ఇట్లు+అనియెన్; దశరథుండు; నిజ, సుకృత, పాకంబునన్+చేసి= తన పుణ్యం పండటంవలన; రామ, ప్రముఖులు+అయిన= రాముడు మున్నగువారు అయిన; కొడుకులన్= కుమారులను; నలువురన్= నలుగురను; కని= కాంచి; త్రైలోక్య, రాజ్యంబు= మూడులోకాలపై ప్రభుత్వం; సంప్రాప్తంబు+అయిన+అట్లు= లభించినట్లు; సంతసిల్లెన్= సంతోషించాడు; ఆ+కుమారులు= ఆ కొడుకులు, (రాముడు, లక్ష్మణుడు, భరతుడు, శత్రుఘ్నుడు); క్రమంబునన్= వరుసగా; ఉపనీతులున్= ఉపనయనం (వడుగు) చేయబడినవారలు; అఖిల, వేద, వేదాంగ (వేద+అంగ) వినీతులు= సమస్త మైన వేదాలు, వేదాంగాలు నేర్చినవారు; యథాక్రమ పరిణీతులును+ఐ= క్రమము ననుసరించి వివాహితులును అయి; విలసిల్లిరి= శోభిల్లారు; అంతన్= అటు పిమ్మట.

తాత్పర్యం: ధర్మరాజుకు మార్కండేయుడు ఈ విధంగా చెప్పాడు: 'దశరథమహారాజు తాను చేసికొనిన పుణ్యం పండి, శ్రీరాముడు మున్నగు

కొడుకులను కన్నాడు. పుత్రలాభం వలన తనకు మూడులోకాల సార్వభౌమత్వం చేకూరినట్లు దశరథుడు సంతోషించాడు. దశరథకుమారులు పెరిగి కాలక్రమాన వటువు (వడుగు) లయ్యారు. వేద వేదాంగాలను చదివారు. మరికొంతకాలానికి వరుసగా వివాహితులు అయ్యారు. అంతట.

విశేషం: వేదాలు:- ఋగ్వేదం, సామవేదం, యజుర్వేదం, అథర్వవేదం. వేదాంగాలు:- శిక్ష, వ్యాకరణం, ఛందస్సు, నిరుక్తం, జ్యోతిషం, కల్పం. ధనుర్వేదం మున్నగు ఉపవేదాలుకూడా వేదాలలో అంతర్భాగాలే.

సీ. అభినవపద్మదళాక్షు నక్షీణవి।
స్తృతవక్షు నాజానుదీర్ఘబాహు
మధురస్మితానను మదగజగమను నా।
రూఢయౌవను నభిరూపతేజు
శ్రీరమణీయుఁ బ్రసిద్ధయశోరమ్యు।
నిఖిలవిద్యాగమనిపుణచిత్తు,
నింద్రసమాను జితేంద్రియు ధర్మజ్ఞుఁ।
బౌరబాంధవజనప్రార్థనీయు

ఆ. దుష్టనిగ్రహైకధుర్యు విశిష్టసం।
రక్షణాభిలోలు రామభద్రుఁ
గులపవిత్రుఁ బెద్దకొడుకుఁ గనుంగొని।
రాజవరుఁడు గరము రాగ మెసఁగ. 29

ప్రతిపదార్థం: రాజ, వరుఁడు= రాజులలో శ్రేష్ఠుడు, దశరథుఁడు; అభినవ, పద్మ, దళ+అక్షున్= కొంగ్రొత్త తమ్మిపూరేకులవంటి కన్నులు కలవాడిని; అక్షీణ, విస్తృత, వక్షున్= విశాలమైన పెద్దవక్షం గలవాడిని; ఆజాను, దీర్ఘ, బాహున్= మోకాళ్లవరకు వ్రేలాడే పొడుగుపాటిచేతులు కలవాడిని; మధుర,

స్మిత+ఆననున్= తియ్యనైన చిరునవ్వులతో కూడిన మొగం కలవాడిని; మద, గజ, గమనున్= మదించిన యేనుగునడకవంటి నడక కలవాడిని; ఆరూఢ, యౌవనున్= వికసించిన జవ్వనంలో ఉన్నవాడిని; అభిరూపతేజున్= ఒప్పిదమగు కాంతిగలవాడిని; శ్రీ రమణీయున్= సిరికళతో అందమైనవాడిని; ప్రసిద్ధ, యశస్+రమ్యున్= వెల్లడి అయిన కీర్తితో సుందరుడు అయినవాడిని; నిఖిల, విద్యా, ఆగమ, నిపుణ, చిత్తున్= సమస్తమైన విద్యలలో వేదాలలో ప్రావీణ్యం సంపాదించిన మనస్సు కలవాడిని; ఇంద్ర సమానున్= దేవేంద్రుడితో సాటి వచ్చేవాడిని; జిత+ఇంద్రియున్= ఇంద్రియాలను జయించినవాడిని; ధర్మజ్ఞున్= ధర్మాన్ని ఎఱిగినవాడిని; పౌర, బాంధవ, జన ప్రార్థనీయున్= పౌరులచేత, చుట్టాలచేత ఆరాధించదగినవాడిని; దుష్ట, నిగ్రహ+ఏక, ధుర్యున్= దుర్జనులను శిక్షించటంలో పరిపూర్ణమైన శక్తి కలవాడిని; విశిష్ట, సంరక్షణ+అభిలోలున్= మంచివారిని కాపాడటంలో తత్పరత కలవాడిని; కుల, పవిత్రున్= వంశాన్ని పవిత్రం కావించినవాడిని; పెద్ద కొడుకున్= కుమారులలో పెద్దవాడిని; రామభద్రున్= శ్రీరాముడిని; కనుంగొని= చూచి; కరము= మిక్కిలి; రాగము= ప్రేమ; ఎసఁగన్= అతిశయిల్లగా.

తాత్పర్యం: అప్పటి కప్పుడే వికసించిన కొంగ్రొత్త తామరపువ్వురేకులవంటి కన్నులు కలవాడు. విశాలమైన వక్షం కలవాడు, ఆజానుబాహువయినవాడు, తియ్యనైన చిరునవ్వుదొంతరలు వెల్లివిరిసే ముఖం కలవాడు, మత్తేభంవంటి గంభీరగమనం కలవాడు, ఎలజవ్వనంలో ఉన్నవాడు, తన తనువునకు తగిన కాంతి గలిగి ప్రకాశిస్తున్నవాడు, తేజస్సు కలవాడు; సిరికళతో విలసిల్లుతున్నవాడు, పేరుప్రతిష్ఠలను ఆర్జించినవాడు, వివిధవిద్యలు వేదవేదాంగాలు క్షుణ్ణంగా చదివినవాడు, వేలుపుదొర అయిన దేవేంద్రుడికి సాటి వచ్చేవాడు, ఇంద్రియాలను జయించినవాడు, ధర్మం ఎఱిగినవాడు, పౌరులచేత బంధువులచేత ఆరాధించ దగినవాడు, దుష్టశిక్షణ శిష్టరక్షణ చేయగల ఆదర్శపరిపాలకుడు, రఘువంశాన్ని పావనం చేసేవాడు, తన

పెద్దకుమారుడూ ఐన శ్రీరామచంద్రమూర్తిని దశరథమహారాజు ప్రేమ జాలువారగా కనుగొన్నాడు.

విశేషం: అభినవపద్మదళాక్షుఁడు - అనే పదగుంఫనంలో శ్రీరాముడు విష్ణుదేవుడి అవతారం అనే ధ్వని ఉన్నది. పద్మదళాక్షుడు అనేది విష్ణువుకు రూఢ్యర్థంలో పర్యాయపదం.

వ. యౌవరాజ్యపదంబునకు నతని నభిషేకం బాచరింపం గోరి యాప్తమంత్రిజనసమ్మతంబునఁ బురోహిత నిరూపితం బైన శుభదినంబున నక్కార్యంబునకు సమకట్టునెడ భరతు దాది మంథర యనునది యమంద గతిం గైకేయిపాలికిం జని యిట్లనియె. 30

ప్రతిపదార్థం: అతనిన్= శ్రీరాముడిని; యౌవ రాజ్య పదంబునకున్= యువరాజు పదవికి; అభిషేకంబు+ఆచరింపన్+కోరి= పట్టం కట్టటానికి (పవిత్రస్నానం చేయించటానికి); తలపోసి; ఆప్త, మంత్రి జన సమ్మతం బునన్= శ్రేయోభిలాషుల, మంత్రుల, ప్రజల అంగీకారం చొప్పున; పురోహిత నిరూపితంబు+ఐన= పురోహితులచేత ఏర్పరచబడిన; శుభ, దినంబునన్= మంచిరోజున; ఆ+కార్యంబునకున్= యౌవరాజ్య పట్టాభిషేకానికి; సమకట్టు+ఎడన్= పూనిన తరుణంలో; భరతు దాది= భరతుడిని పెంచిన సేవకురాలు; మంథర+అను+అది= మంథర అనే పేరు కలది; న+మంద, గతిన్= వేగం గల నడకతో; కైకేయి పాలికిన్+చని= కైక దగ్గరకు వెళ్లి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికింది.

తాత్పర్యం: యువరాజుపదవికి శ్రీరాముడిని పట్టాభిషిక్తుడిగా చేయదలచి దశరథ మహారాజు శ్రేయోభిలాషులను, మంత్రులను, పౌరులను సంప్రదించి వారి అనుమతి పొందాడు. పురోహితుడిచేత శుభముహూర్తం నిర్ణయించ బడింది. ఆ తరుణంలో భరతుడిని పెంచిన దాది మంథర అనే పేరు గల పరిచారిక, కైకదగ్గరకు వెళ్లి ఈ విధంగా చెప్పింది.

ఉ. 'అక్కట నీదెసం బతికి నాఁబడి కూరిమి యయ్యెఁ; మాయపుం
జొక్కులు నీవు నిక్కముగఁ జూచి మనంబున మోసపోయి; తా
టక్కరి కోసలాత్మజయెడం బ్రియుఁడై యదె తత్తనూజు నిం
పెక్కఁగ యౌవరాజ్యమున నిప్పుడ పట్టము గట్టఁ బూనెడున్. 31

ప్రతిపదార్థం: అక్కట!= అయ్యో!; నీదెసన్= నీ యెడ; పతికిన్= భర్తకు-దశరథుడికి; ఆఁబడి కూరిమి+అయ్యెన్= వ్యర్థమైన ప్రేమ అయింది; మాయము+చొక్కులు= కపటపు మోహాలు; నీవు= నీవు, (ఓ కైకా! నీవు); నిక్కముగన్+చూచి= నిజమనే భ్రాంతిలో పడి అరసి; మనంబునన్= చిత్తంలో; మోసపోయితి(వి)= వంచించబడ్డావు; ఆ టక్కరి= ఆ జిత్తులమారి; కోసల+ఆత్మజ+ఎడన్= కోసలరాజపుత్రిక అయిన కౌసల్యపట్ల; ప్రియుఁ డు+ఐ= ప్రీతికలవాడై; అదె= అదిగో; తత్+తనూజున్= ఆమె కొడుకును; ఇంపు+ఎక్కఁగన్= ప్రీతి అతిశయించగా; యౌవరాజ్యమునన్= యువరాజు పదవియందు; ఇప్పుడు= ఈ వేళ; పట్టము= పట్టాభిషేకాన్ని; కట్టన్+పూనెడున్= కట్టటానికి సిద్ధపడ్డాడు.

తాత్పర్యం: 'అయ్యో! నీ భర్త అయిన దశరథుడికి నీపట్ల అచ్చమైన కూరిమి లేనట్లు తేలిపోయింది కదా. ఆహా! నీ యెడ ఎంతటి మోసపువలపును వెల్లడించాడు! ఆతడి నటనలు నీవు నిజాలని నమ్మి భ్రాంతిలో పడ్డావు. ఇదుగో ఇప్పుడు తెలిసింది కదా దశరథుడికి కోసలాత్మజ కౌసల్యపై గల అనురాగం. ఆమెకొడుకైన శ్రీరాముడికే నేడు యువరాజపట్టం కట్టుతున్నాడు. టక్కరికౌసల్య గెలిచింది. నీవు ఓటమి చెందావు.

ఆ. పుడమిఁదేని మదికి నెడ యైతి నీ వింక;
నేమి సెప్పఁగలను వామనయన!
కడఁగి నిన్నుఁ గొడుకుఁ బెడవడ వైచి యా
సవతికొడుక యేలు నవని యింక'. 32

ప్రతిపదార్థం: వామనయన!= అందమైన కన్నులు కలదానా!, ఓ కైకేయీ!; నీవు= నీవు; పుడమి ఱేని మదికిన్= రాజుగారి చిత్తానికి; ఎడ+ఐతి(వి)= దూరం అయినావు; ఇంకన్= ఇకమీద; ఏమి+చెప్పన్‌కలను= ఏమని నీకు చెప్పేది?; కడఁగి= పూని; నిన్నున్= నిన్నును; కొడుకున్= నీ కొడుకు భరతుడిని; పెడవడవైచి= ప్రక్కకు నెట్టి, తొలగించి; ఆ, సవతి, కొడుకు+అ= ఆ సపత్ని అయిన కౌసల్య పుత్రుడు మాత్రమే; ఇంకన్= ఇక మీద; అవని= భూమి; ఏలున్= పరిపాలిస్తాడు.

తాత్పర్యం: అందమైన కన్నులు గల ఓ కైకేయీ! నీవు కన్నులు మూసికొని ఉన్నావు. ఇక నేను ఏమి చేయగలను? ఏమి చెప్పగలను? దశరథమహారాజు చిత్తానికి నీవు దూరమైనావు; నిన్నును నీ కొడుకు భరతుడిని దూరంగా నెట్టి తొలగించి, నీ సవతి కౌసల్యకొడుకు శ్రీరామచంద్రుడు భూరాజ్యా న్నంతటిని ఏలుకొంటాడు'.

క. అనిన నుదరిపడి కేకయ ।
తనూజ గడుసంభ్రమమునఁ దత్‌క్షణమ నరేం
ద్రునిపాలికిఁ జని యేకత ।
మున నిట్లనుఁ బ్రణయపూర్వముగ నాతనితోన్. 33

ప్రతిపదార్థం: అనినన్= అని (మంథర) చెప్పగా; ఉదరిపడి= వేగంగా కలత చెంది; కేకయ, తనూజ= కేకయ రాజు కూతురు, కైకేయి; కడు, సంభ్రమమునన్= మిక్కుటమైన తత్తరపాటుతో; తత్+క్షణము+అ= ఆ నిమేషంలోనే; నర+ఇంద్రుని, పాలికిన్= దశరథ మహారాజు వద్దకు; చని= వెడలి; ఏకతమునన్= ఒంటరిగా; ప్రణయ, పూర్వముగన్= అనురాగ పురస్సరంగా; ఆతనితోన్= దశరథమహారాజుతో; ఇట్లు+అనున్= ఈ విధంగా పలికింది.

తాత్పర్యం: మంథర చెప్పిన మాటలు విని కైకేయి అదరిపడి, తత్తరపాటుతో తత్‌క్షణమే బయలుదేరి దశరథ మహారాజువద్దకు వెళ్లి, ఒంటరిగా కలిసికొని, అనురాగం చిందే మాటలు చెప్పి, ఈ విధంగా పలికింది.

క. 'ధరణీశ! తొల్లి నాకుం ।
గరుణించిన వర మొకండు గల; దది మదిలోఁ
బరికించి యిప్పు డొసఁగుము; ।
చిరముగ సత్యవ్రతంబు సెల్లింపు తగన్.' 34

ప్రతిపదార్థం: ధరణీ+ఈశ!= భూమికి అధినేత వైనవాడా, ఓ దశరథ మహారాజా!; తొల్లి= పూర్వం; నాకున్= నాకు; కరుణించిన= అనుగ్రహించి ఇచ్చిన; వరము= శపథం ప్రకారం తీర్చుకోరిక; ఒకండు= ఒకటి; కలదు= ఉన్నది; అది= ఆ వరం; మదిలోన్= మనస్సులో; పరికించి= అరసి; ఇప్పుడు= ఈ సమయంలో; ఒసఁగుము= ఇమ్ము; చిరముగన్= శాశ్వతంగా; సత్యవ్రతంబు= నిజాన్ని పాలించే నోమును; తగన్= సముచితంగా; చెల్లింపు= ఆచరింపుము.

తాత్పర్యం: 'భూమికి అధిపతి వైన ఓ దశరథమహారాజా! తొల్లి నీవు నాకు ఒకవరాన్ని అనుగ్రహించి ఉన్నావు. జ్ఞాపకం ఉన్నది కదా! దానిని నీ మనస్సులో పరికించుము. ఇప్పుడు నేను ఆ వరాన్ని కోరుకొంటున్నాను. నీవు సత్యవాక్యపరిపాలకుడవు కదా! ఆ వరాన్ని దయచేసి ఇప్పుడు నాకు ప్రసాదించుము'.

విశేషం: (1) సంస్కృత మూలభారతంలోకూడా రామాయణ కథ సంగ్రహంగానే ఉన్నది. ఎఱ్ఱాప్రెగ్గడ తెలుగుభారతంలో ఆ కథను మరింత సంక్షేపించి వ్రాశాడు. ఆరణ్యపర్వంలోని రామాయణకథలో బాలకాండాన్ని అంతటిని రెండు మూడు పద్యాలలో ఎఱ్ఱన సంగ్రహీకరించాడు. శ్రీరాముడి యౌవరాజ్యపట్టాభిషేకంతో కథ ప్రారంభిస్తున్నది. సీతాకల్యాణాన్ని కూడా ఎఱ్ఱన వదలిపెట్టాడు. (2) కైకకు

తొల్లి దశరథుడు ఎందుకు వరం ఇచ్చాడు? ఆ విషయాన్ని ఎఱ్ఱన వివరించలేదు. ఆతడి ప్రణాళిక ననుసరించి అది వివరించ నవసరం లేదు. ఈ విషయం పెక్కురామాయణాలలో పెక్కురకాలుగా కన్పిస్తున్నది. సుప్రసిద్ధమైన ఆ కథ సంక్షేపంగా ఇది: ఒకసారి దశరథుడు యుద్ధం చేస్తూ ఉండగా అతడి రథచక్రాని కున్న సీల విరిగి పడిపోయింది. భర్తతోపాటు రణరంగాని కేగిన కైక సీలకు బదులు తన వ్రేలిని నిలిపి దశరథుడిని అపాయంనుండి కాపాడింది. అందుకు దశరథుడు సంప్రీతుడై ఆమెకు రెండువరాలు ఇచ్చాడు. కైకేయి భర్తకు ధన్యవాదాలు తెలిపి యథోచితసమయంలో తా నా వరాల నుపయోగించుకొనగలనని తెలిపింది. ఇప్పుడు ఆమె కోరుకొన దలచింది.

వ. అనిన నతం డయ్యతివం గనుంగొని 'యవధ్యుల వధియించుటయును, వధ్యులం గాచుటయును, బ్రాహ్మణ ధనంబులు దక్క నన్యులధనం బపహరించుటయును, నభీష్టధనంబు నిచ్చుటయును మొదలుగా నతి దుష్కరంబులైన వాని నైనను భవత్ప్రియార్థము సేసెద; నెయ్యది సెప్పు' మనిన ప్రీత యై భరతమాత యి ట్లనియె. 35

ప్రతిపదార్థం: అనినన్= అని (కైకేయి) చెప్పగా; అతండు= అతడు= (దశరథుడు); ఆ+అతివన్= ఆ వనితను- కైకేయిని; కనుంగొని= చూచి; అవధ్యుల వధియించుట యును= చంపరానివారిని చంపటమున్నూ; వధ్యులన్= చంపదగిన వారిని; కాచుటయును= రక్షించటమున్నూ; బ్రాహ్మణ ధనంబులు= విప్రుల విత్తాలు; తక్కన్= తప్ప; అన్యుల ధనంబున్= ఇతరుల ద్రవ్యం; అపహరించుటయును= బలాత్కారంగా సంగ్రహించటమున్నూ; అభీష్ట, ధనంబున్= కోరిన డబ్బులు ఇచ్చుటయును= ఇవ్వటమున్నూ; మొదలుగాన్= మున్నగునవి; అతి, దుష్కరంబులు= చేయటానికి మిక్కిలి చెడ్డవి; వానిని ఐన+ఐనను= అట్టి పనులను సయితం; భవత్+ప్రియ+ అర్థము= నీకు ప్రీతి ఘటించే కొరకు; చేసెదన్= చేస్తాను; ఏ+అది= ఏది;

చెప్పుము; అనినన్; ప్రీత+ఐ= సంతుష్టి చెందినదై; భరతమాత= భరతుడి తల్లి; ఇట్లు+అనియెన్= ఈ రీతిగా అన్నది.

తాత్పర్యం: అని కైకేయి పలికింది. అంతట దశరథమహారాజు ఆమెకు ఇట్లా బదులు పలికాడు. 'చంపరానివారిని చంపటమున్నూ, చంపదగినవారిని కాపాడటమున్నూ, విప్రుల విత్తాల నపహరించటమున్నూ తప్ప, తక్కిన పనులు మిక్కిలి పాపకృత్యాలైనాసరే ఇతరుల ధనాన్ని హరించటం, కోరిన ధనాలను దానం చేయటం, మొదలైన చెడుపనులను సయితం నీ సంతృప్తికొరకై ఆచరించగలను. ఇక, నీకు ఇష్టమైనవరం వేడుకొనుము' అని అన్నాడు. అనగా భరతుడితల్లి కైక, దశరథుడితో ఇట్లా అన్నది.

తే. 'యౌవరాజ్యపదంబునయందు భరతు ।
నధిప! యభిషేక మొనరింపు; మడవిలోన
నొలసి పదునాల్గువర్షంబు లుండ నాన ।
తిమ్ము రాముని; నురువర మ్మిదియ నాకు'. 36

ప్రతిపదార్థం: అధిప!= రాజా, (ఓ దశరథ మహారాజా!); యౌవరాజ్య, పదంబున+ అందున్= యువరాజుస్థానంలో; భరతున్= భరతుడిని; అభిషేకము+ఒనరింపుము= పట్టాభిషిక్తుడిని కావించుము; రామునిన్= శ్రీరాముడిని; అడవిలోనన్= అరణ్యంలో; ఒలసి= కడగి; పదునాల్గు వర్షంబులు= పదునాలుగు ఏండ్లు; ఉండన్= నివసించేటట్లుగా; ఆనతి+ఇమ్ము= ఆజ్ఞను ఒసంగుము; ఇది+అ= ఈ కోరిక తీర్చుటయే; నాకున్= నాకు; ఉరు, వరమ్ము= గొప్ప వరం.

తాత్పర్యం: 'ఓ దశరథమహారాజా! భరతుడికి యౌవరాజ్యపట్టాభిషేకం చేయుము. శ్రీరాముడిని పదునాలుగు సంవత్సరాలు అడవిలో నివసించు మని ఆనతిమ్ము. ఇదియే నేను కోరుకొనే గొప్పవరం.

క. అనవుడు వీనులు గొఱవిం।
గొని చూఁడిన యట్టు లైనఁ గువలయపతి పె
ల్చన పిడు గడఁ చిన క్రియఁ జే।
తనరహితుం డగుచు ధరణితలమునఁ బడియెన్. 37

ప్రతిపదార్థం: అనవుడున్= అని (కైక) వచించగా; కువలయపతి= భూమండలానికి అధినేత అయినవాడు, (దశరథమహారాజు); వీనులు= చెవులు; కొఱవిన్+కొని= మండుతున్న కొయ్యను గైకొని; చూఁడిన= కాల్చిన; అట్టులు+ఐనన్= అట్టి విధంగా కాగా; పెల్చన= అధికంగా; పిడుగు+అడఁచిన, క్రియన్= పిడుగు మీదపడి క్రిందకు నొక్కిన రీతిగా; చేతన రహితుండు+అగుచున్= కదలిక మెదలిక లేనివాడు ఔతూ, స్పృహ తప్పినవాడు ఔతూ; ధరణితలమునన్= నేలపై; పడియెన్= కూలాడు.

తాత్పర్యం: కైకేయి చెప్పిన మాటలు వినేసరికి, చెవులలో మండేకట్టె దూర్చినట్లుగా మిక్కుటమైన వెత చెంది, ఆకస్మికంగా పిడుగుపాటుకు గురిఅయిన వాడివలె దశరథమహారాజు స్పృహ తప్పి నేలపై పడి మూర్ఛ చెందాడు.

విశేషం: అలం: ఉపమలు. క్రియన్= వలె. క్రియ అనే మాటకు 'వలె' అనే అర్థం తెలుగులో మాత్రమే కనివస్తున్నది. క్రియ అనేది ఇక్కడ తద్భవం. సంస్కృతంలో ఈపదానికి ఈ అర్థం లేదు.

వ. అంతయు నెఱింగి రాఘవుండు నిజజనకుండు సత్యప్రతిజ్ఞుండు గావుతమని యాక్షణంబ సీతాసమేతుండయి వనంబునకు వెడలె; నతని పిఱుందన లక్ష్మణుండునుం జనియెఁ; దదనంతరంబ. 38

ప్రతిపదార్థం: అంతయున్= ఆ జరిగిన సమస్తాన్నీ; ఎఱింగి= తెలిసికొని; రాఘవుండు= (రఘువు మహారాజు వంశానికి చెందినవాడు) శ్రీరాముడు; నిజ, జనకుండు= తన తండ్రి; సత్య ప్రతిజ్ఞుండు= సత్యమైన ప్రతిజ్ఞ కలవాడు - అనగా తానుపల్కిన మాటను (వరాన్ని) నెరవేర్చినవాడు; కావుతమని(కావుతన్+అని)= అగు గాక అని తలపోసి; ఆ క్షణంబు+అ= ఆ త్రుటిలోనే, వెను వెంటనే; సీతా, సమేతుండు+అయి= సీతాదేవితో పాటుగ; వనంబునకున్= అరణ్యానికి; వెడలెన్= వెళ్లాడు; అతని పిఱుందన్+అ= అతడి (శ్రీరాముడి) వెంబడే; లక్ష్మణుండునున్= లక్ష్మణుడున్నూ; చనియెన్= వెళ్లాడు; తత్+అనంతరంబు+అ= అటు పిమ్మటనే.

తాత్పర్యం: జరిగింది అంతా తెలిసికొని- అనగా కైకేయి వరం కోరటం, దశరథుడు మూర్ఛిల్లటం విని, శ్రీరాముడు తనతండ్రి అయిన దశరథుడు ఆడినమాట తప్పని సత్యసంధుడుగా ఉండుగాక అని తలపోసి, ఆ క్షణంలోనే బయలుదేరి సీతతో కలిసి అరణ్యవాసానికి వెళ్ళాడు. లక్ష్మణుడుకూడ ఆతడిని అనుసరించాడు. అటు పిమ్మట.

విశేషం: (1) రాఘవుడు అనగా రఘువంశానికి చెందినవాడు. వాచ్యార్థాన్నిబట్టి దశరథుడు, భరతుడు, లక్ష్మణుడు - ఆ కుటుంబంలోనివారు అందరూ రాఘవులే. అయినా, రూఢ్యర్థంలో రాఘవశబ్దం శ్రీరాముడిపరంగానే బహుళంగా వాడబడింది.

2) రాముడిని దేవుడిని చేసింది ఆతడి స్వచ్ఛంద స్వార్థత్యాగం. వ్యావహారికమైన కర్మజగత్తు స్వార్థపరాయణం. ఏ ఆదర్శంలోనైనా కొంత దివ్యత్వం ఇమిడి ఉంటుంది. త్యాగంలో లోకోత్తరమైన దివ్యత్వం మిక్కుటంగా ఉన్నది. 'న కర్మణా న ప్రజయా న ధనేన త్యాగే నైకే అమృతత్వ మానశుః'' సత్క్రియలవలన కానీ, సత్సంతానంవలన కానీ, ధనంవలన కానీ అమృతత్వం లభించదు. అది త్యాగంవలన మాత్రమే సిద్ధిస్తుంది.

దశరథుఁడు రామవిశ్లేషముచే సురలోకగతుం డగుట (సం.3-261-29)

క. రాముఁడు సనుట విని మహో।
ద్దామం బగు శోకవహ్ని దరికొనఁగను హా
రామ! గుణధామ! యని యని।
భూమీశ్వరుఁ డసువియోగముం బ్రాపించెన్. 39

ప్రతిపదార్థం: భూమి+ఈశ్వరుఁడు= పుడమికి అధిపతి, దశరథ మహారాజు; రాముఁడు+చనుట, విని= శ్రీరాముడు అరణ్యానికి వెళ్ళినవార్త విని; మహా+ఉద్దామంబు+అగు= మిక్కిలి ఎక్కువయింది అయిన; శోక వహ్ని= దుఃఖం అనే అగ్ని; దరికొనఁగను= అలముకొని మండగా; హా! రామ!= అయ్యో రామా! (నీవు వెడలి పోయావా?); గుణధామ!= మంచి గుణాలకు నెలవైన వాడా!; అని+అని= అని మాటిమాటికి పలవరిస్తూ; అసు, వి, యోగమున్= ప్రాణాలను విడవటం; ప్రాపించెన్= పొందాడు.

తాత్పర్యం: రాముడు అరణ్యవాసానికి వెడలిన వార్త విని, దశరథ మహారాజు మిక్కుటమైన ఆవేదనతో, 'హా రామా! సద్గుణాలకు నెలవైనవాడా! అతిలోకం, మహోన్నతం అయిన త్యాగం ప్రదర్శించి అడవులకు వెళ్ళావు; నీ గొప్పతనం ఋజువు అయింది. నిన్ను వదలి నే నెట్లా బ్రదుకగలను?' అని విలపించి విలపించి మరణించాడు.

వ. ఇట్లు దశరథుండు సురలోకగతుం డగుటయుఁ, గైకేయి దనకొడుకు రావించి 'భూవల్లభుండు దేవభావంబు నొందె, రాముండును వనంబున కరిగె, నింక నర్హుండవు నీవ కావున నఖిలమహీరాజ్య రక్షణంబు సేయు' మనిన నక్కుమారుండు క్రోధశోకదందహ్యమానమానసుం డగుచుఁ దల్లి కి ట్లనియె. 40

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; దశరథుండు; సుర, లోక, గతుండు+ అగుటయున్= దేవతలలోకానికి వెళ్ళటమున్నూ- మరణించటమున్నూ; కైకేయి= కేకయ రాజపుత్రి; తన కొడుకున్= తన పుత్రుడిని, భరతుడిని; రావించి= రప్పించి; భూవల్లభుండు= పుడమిపతి, రాజు (దశరథుడు); దేవ భావంబున్+ఒందెన్= దేవత్వాన్ని పొందాడు, మరణించాడు; రాముండును= శ్రీరాముడుకూడా; వనంబునకున్= అడవికి; అరిగెన్= వెళ్ళాడు; ఇంకన్= ఇకమీద; అర్హుండవు= తగినవాడవు; నీవు+అ= నీవే; కావునన్= కాబట్టి;

అఖిల, మహీ, రాజ్య రక్షణంబు= సమస్తమైన భూరాజ్యాన్ని కాపాడటం; చేయుము= సల్పుము; అనినన్= అని చెప్పగా; ఆ+కుమారుండు= ఆ పుత్రుడు (భరతుడు); క్రోధ, శోక, దందహ్యమాన, మానసుండు+అగుచున్= కోపంచేతను దుఃఖం చేతను మిగుల దహించబడిన చిత్తం కలవాడు ఔతూ; తల్లికిన్= మాతకు (కైకేయికి); ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: ఈ విధంగా దశరథుడు దివంగతు డయ్యాడు. శ్రీరాముడు వనవాసానికి వెళ్ళాడు. కైకేయి భరతుడిని రప్పించి, 'మహారాజు (దశరథుడు) స్వర్గస్థుడైనాడు; రాముడు వనవాసానికి వెళ్లాడు; కనుక అర్హుడవైన నీవు రాజ్య భారాన్ని వహించు' మని కోరింది. కాని, భరతుడు ఆగ్రహంతో దుఃఖంతో కూడిన మనస్సు కలవాడై తల్లికి ఇట్లా బదులు పలికాడు.

విశేషం: (1) భరతుడికి - క్రోధం కలగటానికి కారణం - తల్లి నిర్వహించిన భూమిక. (2) దుఃఖానికి రెండు కారణాలు ఉన్నాయి. తండ్రిమరణం, అన్న అయిన శ్రీరాముడి అరణ్యగమనం.

సీ. 'దురితంబు లెన్నఁడుఁ బొరయక వెలుఁగొందు।
కమలాప్తకులమునఁ గసటు గలిపి,
పరమధర్మాత్మకుఁ బురుహూతసన్నిభుఁ।
బతి మ్రింగికొని, కృపఁ బాఱవైచి
యాయతబాహుఁ దేజోయుక్తు మాయన్నఁ।
బటుధైర్యు నడవులపాలు వఱిచి,
జీవితహంత్రివై త్రోవంగరాని దు।
ష్కీర్తి నా యొదలఁ గీలుకొల్పి,

ఆ. శ్రీకి నెడలి సకలలోకంబుచేతను।
దిట్టు గుడిచి కోర్కి దీర్చుకొంటి

పాపజాతురాల! యీ పాతకం బేమి ।
సేయ? దింక నేమి సేయువాఁడ?' 41

ప్రతిపదార్థం: పాప జాతురాల= పాపం చేసిన వర్గానికి చెందిన దానా, పాపాత్మురాలా!; దురితంబులు= పాపాలు; ఎన్నండున్= ఎప్పుడును; పొరయక= సంక్రమించకుండా; వెలుఁగు+ఒందు= ప్రకాశించే; కమల+ఆప్త, కులమునన్= సూర్యవంశంలో; కసటు+కలిపి= మాలిన్యం కలిగించి; పరమ, ధర్మ+ఆత్మకున్= గొప్ప ధార్మికుడిని; పురుహూత, సన్నిభున్= దేవేంద్రుడివంటివాడిని; పతిన్= భర్తను; మ్రింగికొని= కబళించి; కృపన్= దయను (జాలి అనే మంచి గుణాన్ని); పాఱన్వైచి= దూరంగా విసరివేసి; ఆయత బాహున్= పొడుగైన చేతులు కలవాడిని (పరాక్రమవంతుడిని); తేజస్+యుక్తున్= వర్చస్సు కలవాడిని; మా+అన్నన్= మా అన్న అయిన శ్రీరాముడిని; పటుధైర్యున్= గొప్పదైన చిత్తబలం కలవాడిని; అడవుల, పాలు, పఱిచి= అరణ్యాలపాలు చేసి; జీవిత హంత్రివి+ఐ= బ్రదుకులను హరించే దానివయి; త్రోవంగన్‌రాని= వదలించి వేయటానికి (నివారించటానికి) వీలులేని; దుష్కీర్తి= చెడ్డ పేరు; నా ఔదలన్= నా నడినెత్తిమీద; కీలు కొల్పి= ప్రతిష్ఠించి; శ్రీకిన్+ఎడలి= శ్రీకి దూరమైన (శోభ, కాంతి మున్నగు లక్షణాలకు దూరమై); సకల లోకంబుచేతను= సమస్త జగత్తుచేతను; తిట్టు+కుడిచి= తిట్లు తిని, నిందించబడి; కోర్కి+తీర్చుకొంటి(వి)= నీ అభిలాషను నెరవేర్చుకొన్నావు; ఈ పాతకంబు+ఏమి+చేయదు?= ఈ పాపం ఇంక ఏమి చేయకుండా ఉంటుంది? (అన్ని అనర్థాలకు ఈ ఒక్క పాపం చాలు); ఇంకన్= ఇక; ఏమి+చేయువాఁడన్?= నేను ఏమిచేసేది? (చేసిన పాపానికి ఎటువంటి నిష్కృతి లేదు కాబట్టి నేను అయోమయంలో ఉన్నానని భావం).

తాత్పర్యం: 'పాపాలచేత మలినంగాని స్వచ్ఛమైన సూర్యవంశానికి మచ్చతెచ్చి, పరమధార్మికుడు దేవేంద్రుడితో సమానుడు అయిన భర్తను కబళించి,

హృదయంలో ఇసుమంత జాలి లేకుండా దేదీప్యమానమైన వర్చస్సు కలవాడును, గొప్ప పరాక్రమవంతుడును ఐన మా అన్న శ్రీరాముడిని అడవులలో ప్రవాసానికి పంపించి, జీవితాలను హరించేదానివై, నా నెత్తిమీద తొలగించ వీలుకాని అపకీర్తి బరువును మోపి, శ్రీకి ఎడబాటయి సమస్తలోకాల చేత నిందను పొంది నీ కోరిక నెరవేర్చుకొన్నావు. ఓ పాపాత్మురాలా!, ఇంతటి దురితానికి ఒడిగట్టావు; ఈ పాతకానికి ఏ నిష్కృతి అయినా ఉన్నదా? ఇక నే నేమి చేయగలను?'

వ. అని దుఃఖించి, భరతుండు దండ్రికి నుచితక్రియలు నిర్వర్తించి, యనంతరంబ సమస్త మంత్రి సామంత భూసుర పౌర జానపద సహితుండై కదలి, ముప్వురు దల్లులను వసిష్ఠ వామదేవులనుం బురస్కరించుకొని తానును శత్రు ఘ్నుండును రామానునయార్థంబు చిత్రకూటశైలంబున కరిగి యందు. 42

ప్రతిపదార్థం: అని దుఃఖించి= అనుచు పరితపించి; భరతుండు; తండ్రికిన్= జనకుడికి; ఉచిత క్రియలు= తగిన సంస్కారాలు (దినవార క్రియలు); నిర్వర్తించి= నిర్వహించి; అనంతరంబు+అ= ఆపైన వెంటనే; సమస్త, మంత్రి, సామంత, భూసుర, పౌర, జానపద సహితుండు+ఐ= అందరు అమాత్యులతో, కప్పం చెల్లించే రాజులతో, బ్రాహ్మణులతో, పట్టణవాసులతో, పల్లెలలో నివసించేవారలతో కూడుకొని; కదలి= పయనించి; ముప్వురు= ముగ్గురు; తల్లులను= జననులను; వసిష్ఠ, వామదేవులనన్= వసిష్ఠుడు, వామదేవుడు అనే పురోహితులను; పురస్కరించుకొని= ముందు పెట్టుకొని; తానును= తానున్నూ (భరతుడును); శత్రుఘ్నుండును= (సౌమిత్రి అయిన తమ్ముడు శత్రుఘ్నుడును); రామ+అనునయ+అర్థంబు= రాముడిని ఊరడించటంకొరకై; చిత్రకూట శైలంబునకున్= చిత్రకూటం అనే పేరుకల కొండకు; అరిగి= వెడలి; అందున్= అక్కడ.

తాత్పర్యం: అని పరిపరివిధాల దుఃఖించి, భరతుడు తన తండ్రికి అంత్యక్రియలు నిర్వహించాడు. పిదప అందరు మంత్రులతో, కప్పం చెల్లించే సామంతరాజులతో, బ్రాహ్మణులతో, పట్టణంలో నివసించే పౌరులతో, పల్లెటూళ్లలో నివసించే జానపదులతో కలిసి, ముఫ్ఫురు తల్లులైన కౌసల్య, సుమిత్ర, కైకేయి అనే రాణులతో, పురోహితులైన వసిష్ఠవామదేవులతో పాటు తానున్నూ, శత్రుఘ్నుడున్నూ శ్రీరాముడిని ప్రసన్నుడిని చేసి కొనటానికై చిత్రకూటపర్వతానికి వెళ్లి అక్కడ.

మ. కనియెం గోమలనీలమేఘసుభగాకారున్, జటావల్కలా
జినధారున్, సితభూతిభూషితుని, రాజీవాక్షుఁ, గల్యాణ కీ
ర్తనుఁ, గాకుత్స్థకులప్రదీపకుని, సీతాలక్ష్మణోపేతు, స
న్మునిలోకార్చితు, సత్కృపాభరణు, రామున్, రాజచూడామణిన్. 43

ప్రతిపదార్థం: కోమల నీల మేఘ సుభగ+ఆకారున్= లలితమైన నల్లని మబ్బువంటి మనోహరమైన రూపం కలవాడిని; జటావల్కల+అజిన, ధారున్= జడలు, నారబట్టలు, జింకతోలు ధరించిన వాడిని; సిత భూతి భూషితునిన్= తెల్లని బూడిదను అలంకరించు కొన్నవాడిని; రాజీవ+అక్షున్= పద్మాలవంటి కనులు కలవాడిని; కల్యాణ కీర్తనున్= మంచి ప్రవర్తన కలవాడుగా ప్రశంసించ బడే వాడిని; కాకుత్స్థ, కుల, ప్రదీపకునిన్= కకుత్స్థ వంశాన్ని వెలుగొంద జేసేవాడిని; సీతా, లక్ష్మణ+ఉపేతున్= సీతతో లక్ష్మణుడితో కూడుకొని ఉన్నవాడిని; సత్+ముని, లోక+అర్చితున్= ఉత్తములైన ఋషుల సముదాయంచేత పూజించ బడునట్టి వాడిని; సత్+కృపా+ఆభరణున్= మంచి దయ అనే ఆభరణంచేత అలంకరించబడిన వాడిని; రాజ చూడామణిన్= రాజులలో తలమానికం వంటివాడిని, రాజశ్రేష్ఠుడిని; (భరతుడు); రామున్= రాముణ్ణి; కాంచెన్= సందర్శించాడు.

తాత్పర్యం: భరతుడు శ్రీరాముడిని చిత్రకూటపర్వతంపై సందర్శించాడు. ఆ శ్రీరాముడు సుకుమారమైన నీలమేఘంవలె మనోహరంగా ఉన్నాడు.

జడలు, నారబట్టలు, జింకతోలు ధరించాడు. తెల్లని విభూతి దేహానికి అందంగా పూసుకొన్నాడు. పద్మాలవంటి కనులు కలిగిఉన్నాడు. కకుత్స్థ వంశాన్ని వెలుగొంద జేసేవాడు, మహర్షుల చేత మన్నింపబడేవాడు, దయార్ద్ర హృదయుడు, రాజులలో శ్రేష్ఠుడు.

విశేషం: (1) రాముడు రాజీవాక్షుడు. సంస్కృత రామాయణంలో పలుతావుల వాల్మీకిమహర్షి శ్రీరాముడిని 'రామో రాజీవలోచనః' అని అభివర్ణించాడు. (2) కకుత్స్థుడు సూర్యవంశంలో పుట్టిన వంశకర్త. వికుక్షిశశాదుల కుమారుడు. బ్రహ్మ విష్ణువుల ఆదేశంతో ఇంద్రుడిని వృషభ వాహనంగా చేసికొని దానవులపై దాడిచేసి వారిని సంహరించి దేవతలకు మేలు చేశాడు. కకుత్స్థంలో కూర్చుండి వెళ్ళి దానవులతో యుద్ధం చేశాడు కాబట్టి కకుత్స్థుడని పేరు వచ్చింది. ఇంద్రవాహనుడనీ, పురంజయుడనీ అతడు ప్రసిద్ధుడు. అతని వంశానికి వన్నె తెచ్చినవాడు శ్రీరాముడు.

వ. కని యంతంత నాక్రందన పరుం డగుచుం జని తదీయచరణంబుల పయిం బడి పితృమరణప్రకారం బంతయు నెఱింగించి, 'దేవా! సకలసామ్రాజ్య ధురీణుండ వై మమ్ముందఱ ననుశాసింపవే!' యని యర్హజన సహితంబుగా నతనిం బ్రార్థించిన. 44

ప్రతిపదార్థం: కని= చూచి; అంతన్+అంతన్= సమీపానికి చేరుతూ వస్తుండగా; ఆక్రందన పరుండు+అగుచున్= ఏడుస్తున్నవాడై; చని= వెళ్లి; తదీయ చరణంబుల పయిన్+పడి= (ఆ శ్రీరాముడియొక్క) పాదాల మీద పడి; పితృ, మరణ, ప్రకారంబు+ అంతయున్= తండ్రి చావునుగూర్చిన వివరాలను సంపూర్ణంగా; ఎఱింగించి= తెలిపి; దేవా!= ప్రభూ!; సకల, సామ్రాజ్య, ధురీణుండవు+ఐ= సమస్తమైన గొప్ప రాజ్యాన్ని భరించేవాడవు అయి; మమ్ము్మన్+అందఱను; అనుశాసింపవే= ఏలుకొనవా; అని= అంటూ; అర్హజన సహితంబుగాన్= యోగ్యులైన వారందరినీ కలుపుకొని; అతనిన్= అతడిని (శ్రీరాముడిని); ప్రార్థించినన్= వేడుకొనగా.

తాత్పర్యం: భరతుడు శ్రీరాముడిని సమీపించటానికి మునుముందుగనే రోదించ సాగాడు. సమీపించి పెద్దపెట్టున ఏడుస్తూ భరతుడు శ్రీరాముడిపాదాలపై పడి, తండ్రి దశరథుడి మరణవృత్తాంతం సాకల్యంగా తెలిపి, 'దేవా! నీవు అయోధ్యకు తిరిగివచ్చి సింహాసనం అధిష్ఠించి మమ్ముల నందరిని ఏలుకొమ్ము' అని ప్రార్థించాడు. అతడితో పాటు వచ్చిన పెద్దలందరు భరతుడివాక్యాలను బలపరచారు.

క. గురువాక్యరక్షణైకా।
దరచిత్తుం డైన యయ్యుదాత్తచరితుఁ డె
ప్పరుసున నొడఁబడఁ డయ్యెను।
సరసమహీరాజ్యసమనుశాసనమునకున్. 45

ప్రతిపదార్థం: గురు, వాక్య, రక్షణ+ఏక+ఆదరచిత్తుండు+ఐన= తండ్రి పలికిన మాటలను కాపాడటంలోనే అభిమానం కలిగిన మనస్సు కలవాడయిన; ఆ+ఉదాత్త, చరితుఁడు= ఆ గొప్ప శీలం కలవాడు (శ్రీరాముడు); సరస మహీరాజ్య సమనుశాసనమునకున్= మనోహరమైన భూరాజ్యాన్ని పరిపాలించటానికి; ఏ+పరుసునన్= ఏ విధంగాకూడా; ఒడంబడఁ డు+అయ్యెను= సమ్మతించ జాలకపోయాడు.

తాత్పర్యం: పితృవాక్యపరిపాలనలోనే లగ్న మైన మనస్సు గలిగిన ఆ గొప్పశీలం కల శ్రీరాముడు ఎన్నివిధాల తనను బ్రతిమాలినప్పటికీ తిరిగి భూరాజ్యాన్ని పరిపాలించటానికి ఎంతమాత్రం సమ్మతించలేదు.

వ. భరతుండును రాముచేతఁ బ్రత్యాఖ్యాతుండై తదీయపాదుకంబులు గొని చని, వాని నర్చించుచు నంది గ్రామంబునందు వసియించి రాజ్యానుసంధానంబు సేయుచుండె; నిట రాఘవుం డయోధ్యాపుర సమీపం బగుటం జేసి క్రమ్మఱ భరతాగమనంబు శంకించి, చిత్రకూటంబు వాసి శరభంగుపాలికిం జని, యతని చేత సత్కృతుండై దండకారణ్యంబు

సొచ్చి, యందు గోదావరీ తీరంబున ననుజవధూసహితంబుగాఁగృత నివాసుండై యున్నంత; దశగ్రీవుచెలియలు శూర్పణఖ సనుదెంచి, వారికి నపకారంబు సేయ మొనసినం గినిసి, యా రాజపుత్త్రులు దత్కర్ణనాసికా వైకృతం బొనరించినం బదంపడి. 46

ప్రతిపదార్థం: భరతుండును; రాముచేతన్= శ్రీరాముడిచేత; ప్రతి+ ఆఖ్యాతుండు+ఐ= బదులు చెప్పబడి మరలించబడిన వాడై; తదీయ పాదుకంబులు= ఆతనియొక్క (శ్రీరాముడియొక్క) పాదుకలు; కొని= స్వీకరించి; చని= వెడలి; వానిన్= వాటిని, ఆ పాదుకలను; అర్చించుచున్= ఆరాధిస్తూ; నందిగ్రామంబునందున్= నందిగ్రామం అనే స్థలంలో; వసియించి= నివసించి; రాజ్య+అనుసంధానంబు= రాజ్య పరిపాలన; చేయుచున్+ఉండెన్= చేస్తున్నాడు; ఇట= ఇచట (రాముడు ఉండేచోట); రాఘవుండు= రఘువంశానికి చెందినవాడు - శ్రీరాముడు; అయోధ్యా, పుర, సమీపంబు+అగుటన్+ చేసి= అయోధ్య పట్టణం దగ్గరగా ఉండటంచేత; క్రమ్మఱన్= మరల; భరత+ ఆగమనంబున్= భరతుడియొక్క రాకను; శంకించి= అనుమానించి; చిత్రకూటంబు+ పాసి= చిత్రకూటపర్వతాన్ని వదలిపెట్టి; శరభంగు పాలికిన్+చని= శరభంగుడు అనే ఋషిదగ్గరకు వెళ్ళి; అతనిచేతన్= (ఆ శరభంగుడిచేత); సత్కృతుండు+ఐ= సమ్మానించ బడినవాడై; దండక+అరణ్యంబు= దండకం అనే పేరు కల అడవి; చొచ్చి= ప్రవేశించి; అందున్= ఆ దండకవనంలో; గోదావరీ తీరంబునన్= గోదావరి అనే నది ఒడ్డున; అనుజ, వధూ, సహితంబుగాన్= తమ్ముడితోడను, భార్యతోడను కూడినవాడై; కృత నివాసుండు+ఐ= నెలవు ఏర్పరచుకొనినవాడై; ఉన్న+అంతన్= నివసించినంతట; దశగ్రీవు, చెలియలు= రావణుడి సోదరి; శూర్పణఖ= శూర్పణఖ యనే పేరు కలది; చనుదెంచి; వచ్చి; వారికిన్= వారికి (సీతారామ లక్ష్మణులకు); అపకారంబు+చేయన్= కీడు చేయటానికి; మొనసినన్= సమకట్టగా; కినిసి= కోపగించి; ఆ, రాజ, పుత్త్రులు= ఆ రాచబిడ్డలు; తత్+కర్ణ, నాసికా, వైకృతంబు+ఒనరించినన్= ఆమె చెవులకూ,

ముక్కుకూ వికారం కలిగించగా (ముక్కూ చెవులూ కోయగా); పదంపడి= పిమ్మట.

తాత్పర్యం: భరతుడు శ్రీరాముడిచేత బదులు చెప్పబడి మరలింపబడినవాడై, అన్నగారి పాదుకలను అర్థించి కైకొని అయోధ్యకు దగ్గరగా ఉన్న నందిగ్రామం చేరి అక్కడ రాముడిపాదుకలను నెలకొల్పి, తాను రాముడి ప్రతినిధిగా రాజ్యం చేయసాగాడు. ఇట శ్రీరాముడు తాను చిత్రకూటంలోనే ఉంటే భరతుడు తిరిగి వచ్చి తనను అయోధ్యకు రమ్మని మరల ప్రార్థించవచ్చుననే భయంతో అటనుండి కదలి శరభంగమహర్షియొక్క ఆశ్రమానికి చేరాడు. శరభంగుడు శ్రీరాముడికి స్వాగతం చెప్పి సమ్మానించాడు. తదుపరి శ్రీరాముడు దండకారణ్యంలో ప్రవేశించి, అందులో గోదావరీతీరంలో తమ్ముడితో తన భార్యతో పర్ణశాలను నిర్మించుకొని నివసించసాగాడు. అప్పుడు రావణుడిసహోదరి శూర్పణఖ అక్కడికి వచ్చి వారికి కీడు చేయబోగా వారు ఆగ్రహించి ఆమె ముక్కుచెవులు వికారం చేశారు. అంతట.

ఉ. శూర్పణఖానిమిత్తమున శూరు లనేకులు రక్కసుల్ మహో
త్సర్పితరోషులై బహుళ సైన్యయుతంబుగ నెత్తి వచ్చుడున్
దర్పితవైరిభంజనుఁ డుదారుఁడు రాఘవుఁ డస్త్రవిద్య నే
ర్పేర్పడఁ గేలిఁ బోలె సమయించె రణాంగణభూమి నందఱన్. 47

ప్రతిపదార్థం: శూర్పణఖా, నిమిత్తమునన్= శూర్పణఖ మూలాన, అంటే, శూర్పణఖకు జరిగిన పరాభవానికి ప్రతీకారంగా; శూరులు= వీరులు; అనేకులు= పెక్కుమంది; రక్కసుల్= రాక్షసులు; మహా+ఉత్+సర్పిత, రోషులు+ఐ= మిక్కుటంగా విజృంభించిన కోపం కలవారై; బహుళ, సైన్య, యుతంబుగన్= పెక్కు సంఖ్య గల భటులు గల సేనలతో కూడుకొని; ఎత్తి వచ్చుడున్= దండెత్తి యుద్ధం చేయటానికై అరుదెంచుటయును; దర్పిత, వైరి, భంజనుఁడు= గర్వించిన శత్రువులను నాశనం చేసేవాడు; ఉదారుఁడు= గొప్పవాడు; రాఘవుఁడు= రఘువంశంలో పుట్టినవాడు; అస్త్ర, విద్య,

నేర్పు+ఏర్పడన్= మంత్రమహిమ గల బాణాలను ప్రయోగించటంలో తనకు లభించిన కౌశలంతో; కేలిన్+పోలెన్= ఆట మాదిరిగా; రణ+అంగణ భూమిన్= యుద్ధరంగంలో; అందఱన్= అందరిని (రాక్షసభటులను అందఱను); సమయించెన్= సంహరించాడు.

తాత్పర్యం: శూర్పణఖకు జరిగిన పరాభవానికి ప్రతీకారంగా పెక్కుమంది రక్కస వీరులు మిక్కిలి రోషంతో పెక్కు సేనలతో శ్రీరాముడిపై దండెత్తి వచ్చారు. మహా పరాక్రమోపేతుడు గొప్పవాడు శత్రుసంహారకుడు మంత్ర బాణాలను ప్రయోగించటంలో ఆరితేరినవాడు అయిన శ్రీరాముడు యుద్ధరంగంలో ఆ రక్కసిమూకలను సంహరించాడు.

వ. ఇట్లు ఖరదూషణాదులం గొట్టి పదునాలుగువేలరాక్షసులం జంపి దండకారణ్యంబు విగతకంటకంబు గావించె; నంత శూర్పణఖయు రయంబున రావణుపాలికిం జని తచ్చరణంబులపయిం బడి యేడ్చినం, జెలియలి కైన వైకృతం బేర్పడం జూచి యన్నిశాచరనాథుం డి ట్లనియె.48

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; ఖర, దూషణ+ఆదులన్+కొట్టి= ఖరుడు దూషణుడు మొదలుగా గల వారిని ఓడించి; పదు, నాలుగు వేల రాక్షసులన్= పదు నాలుగువేల మంది రక్కసులను; చంపి= సంహరించి; దండక+ అరణ్యంబున్= దండకం అనే పేరు గల అడవిని; విగత కంటకంబు= పోగొట్టబడిన ముండ్లు (శత్రువులు) కలదిగా; కావించెన్= చేశాడు; అంతన్= అటు పిమ్మట; శూర్పణఖయున్; రయంబునన్= శీఘ్రంగా; రావణు పాలికిన్+చని= రావణుడివద్దకు వెళ్లి; తత్+చరణంబుల పయిన్+ పడి= ఆతడియొక్క పాదాలమీద వ్రాలి; ఏడ్చినన్= బిగ్గరగా శోకించగా; చెలియలికిన్+ఐన= సహోదరికి జరిగిన; వైకృతంబు= వికారం; ఏర్పడన్+ చూచి= స్పష్టంగా పరిశీలించి; ఆ+నిశాచర, నాథుండు= ఆ రాక్షసపతి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: రాముడు, ఈ విధంగా, ఖరుడు దూషణుడు అనే రాక్షసులను వారిభటులను ఓడించి, పదునాలుగు వేలమంది రక్కసులను సంహరించి, దండకారణ్యంలో రాక్షసబాధ లేకుండా చేశాడు. అంతట శూర్పణఖ శీఘ్రంగా తన అన్న అయిన రావణాసురుడిపాలికి వెళ్ళి, ఆతడి పాదాలపై పడి బిగ్గరగా శోకించింది. రావణాసురుడుకూడా తన సహోదరికి జరిగిన పరాభవాన్ని గుర్తించి ఆమెకైన అంగవికారాన్ని పరిశీలించి చూచి శూర్పణఖతో ఇట్లా పలికాడు.

సీ. ‘ఎఱిఁగి యెఱింగి నేఁ డెవ్వాఁడు నిశిత వి ।
స్ఫారశూలాగ్రంబుపయికి నుఱికె?
దలయంపియం దగ్గి దరికొల్పి యెవ్వండు ।
నేఁడు నెమ్మది శయనింపఁ జూచె?
నుగ్రవిషానలం బుమియుచున్న యహీంద్రుఁ ।
గడఁగి నేఁ డెవ్వండు గాలఁదన్నె?
హుంకారఘోరమై యుదరు బెబ్బులి మీస ।
లుఱక యెవ్వాఁడు నేఁ డూఁచికొనియె?

ఆ. నిన్ను నెవ్వఁ డకట! నేఁ డిట్లు గడు భంగ ।
పఱిచెఁ జెపుమ నాకుఁ బద్మనయన!
యాయువును సిరియును నవశంబు లయ్యె నేఁ ।
డెవ్వనికొ తలంప నిజ్జగమున.’ 49

ప్రతిపదార్థం: పద్మనయన!= తామరపువ్వుల వంటి కన్నులు కలదానా!; ఎఱిఁగి+ఎఱింగి= తెలిసి- తెలిసి అంటే బాగా తెలిసికూడ; నేఁడు= ఈవేళ; ఏ+వాఁడు= ఎవడు; నిశిత, విస్ఫార, శూల+అగ్రంబు, పయికిన్= వాడి అయిన విశాలమైన, బల్లెం మొనపైకి; ఉఱికెన్= దూకాడు?; ఎవ్వండు= ఎవడు; నేఁడు= ఈ వేళ; తలయంపియందున్= తలగడపై; అగ్గి= నిప్పు;

దరికొల్పి= ప్రజ్వలింపచేసి; నెఱ+మదిన్= నిండు మనస్సుతో (హాయిగా); శయనింపన్= నిదురించటానికి; చూచెన్= యత్నించాడు?; నేఁడు= ఈ వేళ; ఎవ్వండు= ఎవడు; ఉగ్ర, విష+అనలంబు= దారుణమైన విసం అనే అగ్గి; ఉమియుచున్న= నోటినుండి కక్కుతూ ఉన్న; అహి+ఇంద్రున్= పాములరేనిని; కడఁగి= పూని; కాలన్= కాలితో; తన్నెన్= మర్దించాడు? ఏ+వాఁడు= ఎవడు; నేఁడు= ఈ వేళ; హుంకార ఘోరము+ఐ= గాండ్రిస్తూ ఉండటంచేత భయంకరమై; ఉదరు బెబ్బులి= బెదరు గొలిపే పెద్దపులి (యొక్క); మీసలు= మూతిపై ఉండే వెంట్రుకలు; ఉఱక= లక్ష్యపెట్టక; ఊఁచి కొనియెన్?= లాగాడు?; అకట= ఔరా!; నేఁడు= ఈ వేళ; ఎవ్వఁడు= ఎవడు; నిన్నున్= నిన్ను, (ఓ శూర్పణఖా నిన్ను); ఇట్లు= ఈ రీతిగా; కడున్= మిక్కిలి; భంగపఱిచెన్= పరాభవించాడు; నాకున్= నాకు; చెపుము+అ= వచింపవే; ఈ+జగమునన్= ఈ లోకంలో; తలంపన్= ఆలోచించగా; ఎవ్వనికిన్+ఒ= ఎవడికో; ఆయువును= బ్రదికి ఉండే కాలం; సిరియును= ఐశ్వర్యం; అవశంబులు+అయ్యెన్= నశించాయి సుమా!

తాత్పర్యం: ‘పద్మాలవంటి కన్నులు కలదానా!, నా ప్రియసహోదరీ! శూర్పణఖా! నీకు ఈ రీతిగా పరాభవం చేసిన నీచుడు ఎవ్వడు? నేటితో వాడికి ఆయువు తీరిపోయింది. ఐశ్వర్యం అడుగంటింది సుమా! ఈ లోకంలో వాడిని నే నింక బ్రదుకనిస్తానా? ఎవడు వాడు? తెలిసి తెలిసి ఎవడు వాడిఅయిన బల్లెం మొనపయికి ఉరికాడు? ఎవడు వాడు తలగడపై నిప్పు రగిల్చి, హాయిగా నిదురపోవాలని యత్నిస్తున్నాడు? ఎవడు వాడు దారుణ మైన విషాగ్ని క్రక్కే సర్పరాజాన్ని కాలితో త్రొక్కేడు? ఎవడు వాడు గాండ్రిస్తున్న పెద్దపులి మీసాలను పట్టుకొని ఊగాడు? వా డెవడో చెప్పుము’.

క. అని పలుకునప్పు డాతని ।
ఘనతరముఖనేత్రనాసికాకర్ణములం

దనవరతరోషపావక।
జనితశిఖావితతు లక్కజంబుగ వెడలెన్. 50

ప్రతిపదార్థం: అని పలుకునప్పుడు= అని మాటాడేసమయంలో; ఆతని= ఆ రావణుడి; ఘనతర, ముఖ, నేత్ర, నాసికా, కర్ణములందున్= మిక్కుటంగా పెద్దవిగా ఉన్న మొగాలనుండి, కన్నులనుండి, ముక్కులనుండి, చెవులనుండి; అనవరత, రోషపావక, జనిత, శిఖా, వితతులు= ఎడతెగక ప్రజ్వలించిన కోపం అనే అగ్నినుండి పుట్టిన జ్వాలల సముదాయాలు; అక్కజంబుగన్= ఆశ్చర్యకరంగా; వెడలెన్= వెలువడ్డాయి.

తాత్పర్యం: అని వచించేటప్పుడు పెద్దవి అయిన ఆ రావణాసురుడి మొగాలనుండి, కనులనుండి, ముక్కులనుండి, చెవులనుండి కోపం అనే అగ్నినుండి ఆవిర్భవించిన జ్వాలలు అచ్చెరువు కొలుపుతూ బయటకు వెలువడ్డాయి.

వ. శూర్పణఖయు నతనికి రాఘవు లున్న తెఱంగును, నిజపరిభవంబు దత్కృతం బగుటయు, ఖరదూషణాది రాక్షసవధయునుం జెప్పిన విని, ధనదానుజుం డాక్షణంబ పురసంరక్షణంబునం దాప్తజనంబుల నియోగించి, సన్నద్ధుండై యొక్కరుండ వెలువడి త్రికూటకాలపర్వతంబులు గడచి సముద్రతీరంబునఁ బరమేశ్వరనివాసం బైన గోకర్ణస్థానంబునకుం జని, యచ్చటం దొల్లి రామువలనం బ్రాప్తపరాభవుండై ప్రవ్రజనంబు నొంది తపంబు సేయుచున్నవానిం దనపూర్వామాత్యు మారీచుం గనిన, నతండును బ్రియసంభ్రమంబులతోడ నతనిం బూజించి కుశలం బడిగి, 'భవదాగమన నిమిత్తం బేమి?' యని యడిగిన నసురేశ్వరుం డి ట్లనియె.51

ప్రతిపదార్థం: శూర్పణఖయున్= శూర్పణఖయును; అతనికిన్= వాడికి (రావణుడికి); రాఘవులు= రఘువంశంలోనివారు (రాముడును లక్ష్మణుడును);

ఉన్న, తెఱంగును= ఉన్న తీరును; నిజ పరిభవంబు= తనకు జరిగిన అవమానం; తత్+కృతంబు+అగుటయున్= వారిచేత జరుపబడింది కావటమున్నూ; ఖర, దూషణ+ఆది, రాక్షస, వధయునున్= ఖరుడు దూషణుడు మున్నగు రక్కసులను సంహరించటమున్నూ; చెప్పినన్= వచించగా; విని= ఆలకించి; ధనద+అనుజుండు= కుబేరుడి తమ్ముడు; పురరక్షణంబునందున్= (లంకా) పట్టణాన్ని కాపాడటంకొరకై; ఆ క్షణంబు+అ= ఆ నిమిషంలోనే; ఆప్త జనంబులన్= తనకు కూరిమి కలవారిని; నియోగించి= ఏర్పాటు చేసి; సన్నద్ధుండు+ఐ= సన్నాహాలు అన్నీ చేసికొన్నవాడై; ఒక్కరుండు+అ= ఏకాకిగా; వెలువడి= బయలుదేరి; త్రికూట, కాల, పర్వతంబులు= త్రికూటం, కాలం అనే కొండలు; కడచి= దాటి; సముద్రతీరంబునన్= కడలిఒడ్డున; పరమ+ఈశ్వర, నివాసంబు+అయిన= పరమశివుడు ఉండేచోటు అయిన (శివుడికోవెల ఉన్నచోటు); గోకర్ణస్థానంబునకున్+చని= గోకర్ణం అనేపేరు కల స్థలానికి వెళ్ళి; అచ్చటన్= ఆ స్థలంలో; తొల్లి= పూర్వం; రామువలనన్= శ్రీరాముడిచేత; ప్రాప్తపరాభవుండు+ఐ= అవమానం చెందినవాడై; ప్రవ్రజనంబున్+ఒంది= సన్న్యాసాన్ని స్వీకరించి; తపంబు+చేయుచున్+ఉన్నవానిన్= తపస్సు చేస్తున్న వాడిని; తనపూర్వ+అమాత్యున్= తనకు అంతకుముందు మంత్రిగా వ్యవహరించి ఉన్నవాడిని; మారీచున్= మారీచుడు అనేవాడిని; కనినన్= చూడగా; అతండును= ఆ మారీచుడును; ప్రియ సంభ్రమంబుల తోడన్= ప్రీతితోను తత్తరపాటుతోను; అతనిన్= ఆ రావణుడిని; పూజించి= అర్చించి; కుశలంబు+అడిగి= యోగక్షేమాలు విచారించి; భవత్+ఆగమన, నిమిత్తంబు= నీరాకకు కారణం; ఏమి+అని, అడిగినన్= ఏమి అని ప్రశ్నించగా; అసుర+ఈశ్వరుండు= రాక్షసులకు ప్రభువు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: శూర్పణఖ తన అన్నఅయిన రావణుడితో రామలక్ష్మణులు ఉన్న స్థలాన్ని, తనకు జరిగిన పరాభవాన్నీ, ఖరుడు దూషణుడు మున్నగు

రాక్షసులను వారు సంహరించిన తీరును సవిస్తరంగా చెప్పి దుఃఖించింది. రావణుడు లంకాపట్టణాన్ని సంరక్షించటంకొరకై తనకు ఆప్తులైనవారిని నియోగించి, తాను సన్నాహాలు చేసికొని, ఒంటరిగా బయలుదేరి త్రికూట పర్వతాన్ని కాలపర్వతాన్ని అతిక్రమించి సముద్రతీరంలో ఉన్న గోకర్ణానికి వెళ్ళాడు. అక్కడ గోకర్ణేశ్వరాలయం ఉన్నది. శ్రీరాముడిచేత పరాభవం పొంది ఈశ్వరుడినిగూర్చి మారీచుడు అక్కడే తపస్సు చేస్తున్నాడు. ఆ మారీచుడు ఒకనాడు రావణాసురుడికి విశ్వాసపాత్రుడైన మంత్రిగా పనిచేసి ఉన్నవాడే. రావణుడి రాకను గమనించి మారీచుడు సంతోషించి అతడికి స్వాగతం చెప్పి, యోగక్షేమాలను గూర్చి ప్రశ్నించి, ఆతడిరాకకు గల కారణాన్ని తెలిసికొన గోరాడు. అప్పుడు, రావణుడు మారీచుడితో ఇట్లా అన్నాడు.

ఉత్సాహము.

'వినవె రాముఁ డనఁగ నొకఁడు విపులదర్పహృదయుఁ డై
మన ఖరుండు లోనుగా సమగ్రశౌర్యు లైన య
ద్దనుజవరులఁ దునిమి, యిపుడు దండకస్థలంబునం
దొనర నిర్భయత్వ మొప్ప నున్నవాఁడు మేటి యై. 52

ప్రతిపదార్థం: వినవె?= వినలేదా?; రాముఁడు+అనఁగన్= రాముడు అనే పేరు కలవాడు; ఒకఁడు= ఒకవ్యక్తి; విపుల, దర్ప, హృదయుఁడు+ఐ= మిక్కుటమైన గర్వంతో కూడిన డెందం కలవాడై; మన ఖరుండు= మనవాడైన ఖరుడు; లోనుగాన్= మొదలైనట్టి; సమగ్ర, శౌర్యులు+ఐన= పరాక్రమంలో ఆరితేరినవారైన; ఆ+దనుజ, వరులన్= ఆ రాక్షస శ్రేష్ఠులను; తునిమి= సంహరించి; ఇపుడు= ఈ సమయంలో; దండకస్థలంబునన్= దండకం అనే పేరు కల ప్రదేశంలో; ఒనరన్= శోభిల్లేటట్లుగా; మేటి+ఐ= గొప్పవాడయి; నిర్భయత్వము= వెరపులేకుండటం; ఒప్పన్= శోభిల్లగా; ఉన్నవాఁడు= ఉన్నాడు.

తాత్పర్యం: 'ఓ మారీచా! నీవు వినలేదా? శ్రీరాముడు అనే పేరు కలవాడు ఒకడు గర్వంతో విఱ్ఱవీగేవాడు మన రక్కసులను పరాక్రమవంతులను, ఖరుడు మున్నగు వారిని సంహరించి దండకం అనే ప్రదేశంలో జంకుగొంకులు లేక ధైర్యంగా ఉన్నాడు.

విశేషం: ఉత్సాహవృత్తంలోని ప్రతిపాదంలోనూ ఏడు సూర్యగణాలపై ఒక గురువు ఉంటుంది. అయిదవ గణం మొదటి అక్షరం యతి.

ఆ. వానిఁ బరిభవింపవలయు నప్పనికి సా।
హాయ్యకం బొనర్పు మనఘ! నాకు'
ననిన నధికభయసమావిష్టహృదయుఁడై।
యమరవైరి కిట్టు లనియె నతఁడు. 53

ప్రతిపదార్థం: అనఘ!= పుణ్యాత్ముఁడా, ఓమారీచా!; వానిన్= అతడిని (శ్రీరాముని); పరిభవింపన్వలయున్= అవమానించాలి; ఆ+పనికిన్= ఆ కార్యానికి; నాకున్= నాకు; సాహాయ్యకంబు= సాయం; ఒనర్పుము= చేయుము; అనినన్= అని (రావణుడు) అనగా; అతఁడు= మారీచుడు; అధిక, భయ, సమావిష్ట, హృదయుఁడు+ఐ= మిక్కిలి వెఱపుతో కూడిన డెందం కలవాడై; అమర, వైరికిన్= వేల్పులవిరోధికి (రావణుడికి); ఇట్టులు+అనియెన్.

తాత్పర్యం: 'ఆ రాముడిని అవమానించి అతడిపై పగతీర్చుకోవాలి. పుణ్యాత్ముఁడ వైన ఓమారీచా! ఆ పనిలో నీవు నాకు చిన్న సాయం చేయాలి' అని రావణాసురుడు పలుకగా, మిక్కిలి భయంతో గజగజవణికే గుండెతో మారీచుడు ఇట్లా బదులు పలికాడు.

చ. 'ఎఱుఁగవు గాక రాఘవు నుదీర్ణభుజాబలరూఢి నాజిలో
నుఱక తదీయబాణరయ మోర్వ వశంబె పినాకికైన? ను
క్కఱ మఱి నీకు నిత్తెఱఁగు గాదన కే ఖలుఁ డొక్కొ బుద్ధిగాఁ
గఱపినవాఁడు సేటునకుఁ గాలము సేరెనొ గాక యిమ్మెయిన్. 54

ప్రతిపదార్థం: ఎఱుఁగవు+కాక= నీవు తెలియనేరవు గాని; ఆజిలోన్= యుద్ధంలో; రాఘవు+ఉదీర్ణ; భుజా, బలరూఢిన్= శ్రీరాముడి యొక్క గొప్పదైన బాహువులయొక్క శక్తి సామర్థ్యాన్ని; పినాకికిన్+ఐనన్= పినాకం అనే ధనువును ధరించిన వాడికి, (శివుడికి) అయినను; తదీయ, బాణ, రయము= ఆతడియొక్క (శ్రీరాముడి) బాణాల యొక్క వేగం; ఉఱక= మాటలాడక; ఓర్వన్+వశంబు+ఎ= సహించటానికి శక్యమా; ఉక్కు+అఱన్= బలం నశించగా; మఱి= వెండియు; నీకున్= ఓరావణా నీకు; ఈ+తెఱఁగు= ఈ మార్గం; కాదనక= వలదు అని చెప్పక; ఏ ఖలుఁడు+ఒక్కొ= ఏ దుర్మార్గుడో కదా; బుద్ధి+కాన్+కఱపిన వాఁడు= నీకు ఈ సంకల్పం కలిగేటట్లు చేసినవాడు; ఈ+మెయిన్= ఈరీతిగా; చేటునకున్= కీడునకు; కలము+చేరెనొకాక!= సమయం దాపురించిందేమో!

తాత్పర్యం: ఓ రావణా! నీకు శ్రీరాముడితో యుద్ధం చేయటం అంటే ఏమిటో తెలియదు. శ్రీరాముడు గొప్ప పరాక్రమవంతుడు. రామబాణం ఎటువంటిదో నీకు తెలియదు. పినాకపాణి అయిన ఆ పరమశివుడు సయితం రామబాణం ధాటికి ఓర్వజాలడు. ఈ ప్రయత్నం వ్యర్థం సుమా. మఱి ఏదుష్టుడు నీకు ఈ చెడుబుద్ధి కల్గించాడో కదా! నీకు వినాశకాలం దాపురించి ఈ విపరీతబుద్ధి పుట్టింది.

ఆ. రాముతోడఁ దొల్లి రణమునఁ గడు భంగ।
మొంది కాదె దైన్యయుక్తి నిట్లు
దపసి నైతి; నేఁడు తగ దమ్మహాత్ముని।
యందు వైరబుద్ధి యధిప! నీకు.' 55

ప్రతిపదార్థం: అధిప!= ఓ రాజా! (ఓ రావణా!); తొల్లి= పూర్వం; రాముతోడన్= శ్రీరాముడితో; రణమునన్= యుద్ధంలో; కడున్= మిక్కిలి; భంగము+ఒంది, కాదె= పరాభవం అనుభవించే కదా; ఇట్లు= ఈ విధంగా; దైన్య, యుక్తిన్= దీనత్వంతో కూడికొని; తపసిన్+ఐతిన్= సన్యాసిని అయినాను; నీకున్= నీకు; ఆ+మహా+ఆత్మ నియందున్= ఆ గొప్ప ఆత్మకలవాని యందు (ఆ శ్రీరాముడియందు); వైరబుద్ధి= శత్రుత్వం; నేఁడు= ఈసమయంలో; తగదు= కూడదు.

తాత్పర్యం: రాజా, రావణా! ఇంతకుముందు నేను శ్రీరామచంద్రుడిశౌర్యం యుద్ధంలో చవిచూచి ఉన్నాను. ఆతడిని జయించ శక్యం కాదని తెలిసికొనటం చేతనే కదా ఇపుడు ఇక్కడ నేను ఈ విధంగా సన్యాసం స్వీకరించి తపస్సు చేసికొంటూ ఉంటున్నాను. కానిచో, నేను ఇంతటి దీనస్థితికి దిగజారేవాడిని కాను. శ్రీరాముడితో శత్రుత్వం వహించటం నీకు ఎంతమాత్రం మంచిది కాదు.

వ. అనినం గలుషించి లంకేశ్వరుండు వానిం జూచి 'నా పనుపు సేయ వైతివేని నిన్నిప్పుడ కృతాంతగోచరుం జేయుదు' ననిన, వాఁడును దనమనంబున 'వీనిచేతం జచ్చుటకంటెను రాఘవకృతం బైన మరణంబు మే' లని తలపోసి, 'మహాత్మా! నీకు హితంబుఁగోరి చెప్పితి; నిది యిష్టంబు గాదేని భవదీయ శాసనంబు గైకొని చేసెదం; బనుపు' మనినఁ బౌలస్త్యుం డిట్లను; 'నీవు రత్నమయతనూరుహం బగు కనకమృగంబ వై చని, జానకిం బ్రలోభింప వలయు; సీతాచోదితుండై రాముండు నిన్నుం బట్ట సమకట్టి నీ చేతనతి దూరంబు గొనిపోవంబడు; నప్పు డేను దద్భామిని నపహరించెదఁ ; బ్రియావిరహదుర్మనస్కుండై యతండు చెడిపోవు' ననిన 'నట్ల కాక' యని మారీచుండు. 56

ప్రతిపదార్థం: అనినన్= అని(మారీచుడు) చెప్పగా; లంకా+ఈశ్వరుండు= లంకకు అధిపతి-రావణుడు; కలుషించి= కోపించి; వానిన్= అతడిని (మారీచుడిని); చూచి= కాంచి; నాపనుపు= నాయొక్క ఆజ్ఞ; చేయవైతివి+ఏని= నెరవేర్పకున్నచో; నిన్నున్= నిన్ను; ఇప్పుడు+అ= ఈ సమయంలోనే; కృతాంత, గోచరున్+చేయుదున్= యముడికి కన్పించే వాడినిగా చేస్తాను. సంహరించ

గలను; అనినన్= అని (రావణుడు) చెప్పగా; వాఁడును= మారీచుడును; తన, మనంబునన్= తన మనస్సులో; వీనిచేతన్= ఇతడిచేత (ఈ రావణుడిచేత); చచ్చుటకంటెను= మరణించటంకంటెను; రాఘవు, కృతంబు+ఐన= రాముడిచేత కావింపబడిన; మరణంబు= చావు; మేలు+అని= మంచిది అని; తలపోసి= ఆలోచించి; మహా+ఆత్మా!= మహానుభావుడవైన ఓ రావణా!; నీకున్= నీకు; హితంబున్= శ్రేయం; కోరి= కాంక్షించి; చెప్పితిన్= వచించాను; ఇది= (శ్రీరాముడితో శత్రుత్వం మంచిది కాదు అని) నేనే చెప్పిన హితవు; ఇష్టంబు కాదు+ఏని= నీకు సమ్మతం కానిచో; భవదీయ శాసనంబు= నీయొక్క ఆజ్ఞను; కైకొని= స్వీకరించి; చేసెదన్= ఆచరిస్తాను; పనుపుము= నన్ను నియోగించుము; అనినన్= అని (మారీచుడు) చెప్పగా; పౌలస్త్యుండు= పులస్త్యుడి కొడుకు-రావణుడు; ఇట్లు+అనున్= ఈ విధంగా అన్నాడు; నీవు= నీవు; రత్న, మయ, తనూ రుహంబు+అగు= మణులతో కూడిన వెంట్రుకలు కల; కనక, మృగంబవు+ఐ= బంగారులేడిని అయి; చని= వెళ్ళి; జానకిన్= జనకుడికూతురు అయిన సీతను; ప్రలోభింపన్వలయున్= దురాశకు లోనయినట్టి దానినిగా (ఆకర్షించబడిన దానినిగా) చేయాలి; సీతా చోదితుండు+ఐ= సీతచేత పురికొల్పబడినవాడై; రాముండు= శ్రీరాముడు; నిన్నున్= నిన్ను (బంగారులేడిరూపంలో విహరిస్తుండే నిన్ను); పట్టన్= బంధించటానికి; సమకట్టి= ప్రయత్నించి; నీచేతన్; అతిదూరంబు= మిక్కిలిదవ్వు; కొనిపోవన్+పడున్= తీసికొని పోబడతాడు; అప్పుడు= ఆ సమయంలో; ఏను= నేను; తత్+భామినిన్= ఆ శ్రీరాముడియొక్క భార్యయైన సీతను; అపహరించెదన్= బలాత్కారంగా గైకొంటాను; ప్రియా, విరహ, దుర్మనస్కుండు+ఐ= ప్రియురాలియొక్క ఎడబాటుచేత పాడైన చిత్తం కలవాడై; అతండు= శ్రీరాముడు; చెడిపోవున్= పాడౌతాడు; అనినన్= అని (రావణుడు) చెప్పగా; అట్లు+అ, కాక= అటులే జరుగునుగాక; అని= అని చెప్పి; మారీచుండు= మారీచుడు.

తాత్పర్యం: మారీచుడు చెప్పినమాటలకు లంకాధిపతి అయిన రావణునకు కోపంవచ్చింది. 'ఓ మారీచా! నేను చెప్పినట్లు నీవు చేయకపోతే, నిన్ను ఇప్పుడే సంహరిస్తాను' అని కత్తి దూశాడు. అంతట మారీచుడు - 'ఇప్పు డిక్కడ ఈ రావణుడిచేత మరణించటం కంటె ఆ రాముడి చేతిలోనే చావటం మంచిది'- అని తన మనస్సులో ఆలోచించి, 'మహాత్మా! నీకు హితవు చెప్పాను. నీ కది ఇష్టంగానిచో, నీ ఆజ్ఞను నేను శిరసావహిస్తాను. ఆజ్ఞాపించుము' అని అన్నాడు. రావణుడు ఈవిధంగా బదులు పలికాడు. 'రాముడినియుద్ధంలో జయించటం వేరుమాట. ముందు' నీవు రత్నమయమైన వెంట్రుకలతో రాజిల్లే బంగారు లేడిగా కామరూపం ధరించి, సీతకు కన్పించి ఆమెను ఆకర్షించవలయును. అంతట సీతాదేవి తనకు బంగారులేడి కావలెనని రాముడిని కోరుతుంది. అప్పుడు రాముడు బంగారులేడి రూపంలో ఉన్న నిన్ను వెంబడిస్తాడు. నీవు ఆవిధంగా శ్రీరాముడిని దవుదవ్వులకు కొనిపోతే, నేను సీతాదేవిని అపహరిస్తాను. ప్రియురాలిని ఎడబాసిన దుఃఖం చేత రాముడు చెడిపోతాడు'. మారీచుడు అందుకు సమ్మతించాడు.

మారీచుండు మాయామృగంబై చనుదెంచుట (సం. 3-262-24)

క. కనకమృగరూపమునఁ జని ।
యినవంశ్యుఁడు సతియు నున్నయెడ మెలఁగుటయుం
గని జానకి కౌతూహల ।
మునఁ బ్రియుఁ బ్రార్థించె హరిణపుంగవుఁబట్టన్. 57

ప్రతిపదార్థం: కనక, మృగరూపమునన్= బంగారులేడి ఆకారంలో; చని= వెళ్ళి; ఇనవంశ్యుఁడు= సూర్యవంశంలో పుట్టినవాడు, శ్రీరాముడు; సతియున్= భార్యయును; ఉన్న+ఎడన్= ఉన్నస్థలంలో; మెలఁగుటయున్= సంచరించటాన్ని; కని= చూచి; జానకి= జనకుడి కూతురు అయిన సీత; హరిణపుంగవున్+పట్టన్= లేళ్ళలో శ్రేష్ఠమైన దానిని (హరిణరాజాన్ని) పట్టటానికై; కౌతూహలమునన్= వేడుకతో; ప్రియున్= భర్తను; ప్రార్థించెన్= వేడింది.

తాత్పర్యం: మారీచుడు బంగరులేడిరూపం ధరించి, సూర్యవంశజుడైన రాముడు, సీత నివసిస్తున్న ప్రదేశానికి పోయి విహరించసాగాడు. జానకి ఆ బంగరులేడిని చూచి, వేడుకపడి తనకు దానిని తెచ్చిపెట్టుమని తనభర్త శ్రీరాముడిని ప్రార్థించింది.

ఆ. ధరణిసుతయు విధియుఁ దన్నుఁ బ్రేరేపంగ।
వివశబుద్ధి యగుచు నవనివిభుఁడు
మృగముఁ బట్టఁ దివిరె మృగనేత్రఁ గావ స।
ద్వినుతబలు సుమిత్రతనయు నునిచి. 58

ప్రతిపదార్థం: అవనివిభుఁడు= భూభర్త- శ్రీరాముడు; ధరణిసుతయున్= భూదేవి కూతురు- సీతయును; విధియును= భాగధేయం, అదృష్టశక్తి; తన్నున్= తనను (రాముడిని); ప్రేరేపంగన్= ప్రేరేపణ చేయగా, ప్రోత్సహించగా; వి, వశ, బుద్ధి+అగుచున్= వశం తప్పిన మతి కలవాడు ఔతూ; మృగనేత్రన్= లేడికన్నుల వంటి కన్నుల కలదానిని - సీతను; కావన్= కాపాడటం కొరకై; సత్+వినుత, బలున్= మంచివారిచేత పొగడబడిన పరాక్రమం కలవాడిని; సుమిత్రతనయున్= సుమిత్రయొక్క కొడుకును - లక్ష్మణుడిని; ఉనిచి= ఉంచి; మృగమున్= లేడిని; పట్టన్+తివిరెన్= బంధించటానికి పూనుకొన్నాడు.

తాత్పర్యం: సీతాదేవి ప్రోత్సాహంతోమాత్రమేకాక విధివిలాసంవలన కూడ ఉచితజ్ఞుడు మేధావి అయిన శ్రీరాముడు వివశుడై లేడిని పట్టుకొనటానికై బయలుదేరాడు. సీతాదేవిని కాపాడటంకొరకై సుప్రసిద్ధపరాక్రమం గల లక్ష్మణుడిని నియోగించాడు.

విశేషం: బంగరులేడి వృత్తాంతం రామాయణగాథలో ఒక అద్భుత సన్నివేశం. ఇతివృత్తం ఇట ఒక మలుపు తిరిగింది. రామలక్ష్మణులు ప్రక్కనుండగా రావణుడు సీత నపహరించటం సాధ్యంకాదు. ఆ విషయం తెలిసినవాడు కనుకనే రావణుడు ఈ పన్నాగం పన్నాడు. సీత బంగరులేడిపై వ్యామోహం చెందటంలో వింత

లేదు. రావణుడు ఆవిషయం ముందే ఊహించగలిగాడు కదా! ఇక-శ్రీరాముడు సీతమాట విని బంగరులేడిని వెంబడించటమా? శ్రీరాముడికి కామరూపు లైన రాక్షసుల మాయలు అనుభవామైడితాలేకదా! అంతటి మేధావి బంగరులేడి వెంటపడటం వింతలలో వింత. అంతే కాదు. అతడు కేవలం భార్యావిధేయుడై, ఆమెకోరిక తీర్చటంకొరకు తన ఉచితజ్ఞతను, బుద్ధిసంపదను మంట కలిపాడా? రాముడు తాత్కాలికంగా విచక్షణాజ్ఞానాన్ని కోల్పోయినట్లే. ఇది ఎట్లా జరిగింది? ఎందుకు జరిగింది? ఇది కేవలం సీతాదేవి కల్పించిన ప్రోత్సాహంమాత్రమే కాజాలదు. అది విధివిలాసం. ఇట్టి సన్నివేశాలు మానవజీవితంలో అప్పుడప్పుడు జరుగుతుంటాయి. అందుచేతనే 'మానవులు విధిచేతి కీలుబొమ్మలు' అనేవిశ్వాసం పలుతావుల రేకెత్తుతుంది.

క. అసదృశకార్ముకధరుఁడై।
మసలక యామృగము వెనుక మర్దితరిపుఁ డే
ఎసఁగంగ నరుగఁ దొడఁగెను।
వెస రుద్రుఁడు యజ్ఞమృగము వెనుకొను మాడ్కిన్. 59

ప్రతిపదార్థం: అసదృశ, కార్ముక, ధరుఁడు+ఐ= సాటిలేని కోదండమును ధరించినవాడై; మసలక= ఆలస్యం చేయక; ఆ, మృగము, వెనుకన్= ఆ లేడి వెంబడి; మర్దితరిపుఁడు= మర్దించబడిన శత్రువులు కలవాడు- శత్రుసంహారకుడు; ఏపు= అతిశయం; ఎసఁగంగన్= శోభిల్లేటట్లుగా; వెసన్= శీఘ్రంగా; రుద్రుఁడు= శివుడు; యజ్ఞమృగమున్= క్రతువుకు ఉద్దేశించబడిన పశువును; వెనుకొను మాడ్కిన్= వెంబడించిన మాదిరిగా; అరుగన్+తొడఁ గెను= వెడలసాగాడు.

తాత్పర్యం: సాటిలేని కోదండమును ధరించిన వాడై శ్రీరాముడు తడయక ఆ లేడిని వెంబడిస్తూ అలనాడు పరమశివుడు యజ్ఞమృగాన్ని వెన్నాడిన మాదిరిగా శీఘ్రంగా వెళ్ళాడు.

విశేషం: (1) అలం: ఉపమ. (2) శివుడు యజ్ఞమృగాన్ని వెంబడించిన సుప్రసిద్ధగాథ ఇక్కడ ఉదాహరించబడింది.

వ. అట్టి యవసరంబున. 60

తాత్పర్యం: అటువంటి సమయంలో.

విశేషం: 'అవసరము' అనే సంస్కృతపదం సంస్కృతవాఙ్మయంలోనూ, కవిత్రయకాలంలోనూ 'కాలము' 'సమయము' అనే అర్థంలో ప్రయోగించబడింది. అర్థవిపరిణామం చెంది నేడు- అక్కర, కావలసినట్టిది- అనే అర్థాల నిస్తున్నది. ఇది అనవసరం= ఇది అక్కరలేదు- అని నేటి వ్యవహారం.

మ. పఱచున్ దవ్వుగఁ, జేయలంతి నిలుచుం, బట్టీక యాసాసలం
బిఱువోవుం, బొదలందు డిందుఁ, బొడమున్, బిట్టుల్కి వే దాఁటుఁ, గ్ర
మ్మఱి చూచుం, జెవి దార్చి నిల్చు, మలయున్, మట్టాడు, గోరాడు, నే
మఱినట్లుండుఁదృణంబు మేయు నెలయున్ మాయామృగం బిమ్ములన్. 61

ప్రతిపదార్థం: మాయా, మృగంబు= మాయ బంగారులేడి; ఇమ్ములన్= ఇంపుగా; దవ్వుగన్= దూరంగా; పఱచున్= పరుగెత్తుతుంది; చే+అలంతి= చేతికి అందేటంత తక్కువ దూరంలో; నిలుచున్= నిలబడుతుంది; పట్టు+ఈక= పట్టుబడకుండు; ఆసాసలన్= ఆసలు ఆసలు రేకెత్తించి; పిఱుపోవున్= వెనుకకు పోతుంది; పొదలందున్= పొదరిళ్ళలో; డిందున్= కనపడకుండా మాయమౌతుంది; పొడమున్= కన్పిస్తుంది; బిట్టు+ఉల్కి= మిక్కుటంగా భయపడి; వేదాఁటున్= వేగంగా గెంతుతుంది; క్రమ్మఱి= మరలి వెనక్కు; చూచున్= చూస్తుంది; చెవి+తార్చి, నిల్చున్= చెవులు నిక్కబొడి చేటట్లుగా చేసి నిలబడుతుంది; మలయున్= ప్రక్కదారి బట్టుతుంది; మట్టాడున్= త్రొక్కుతుంది; కోరాడున్= దుమ్ము రేపుతుంది; ఏమఱినట్లు+ఉండున్= పరధ్యానంగా కన్పిస్తుంది; తృణంబు= పచ్చగడ్డి; మేయున్= తింటుంది; ఎలయున్= విజృంభిస్తుంది.

తాత్పర్యం: ఆ సమయంలో ఆ బంగరు మాయలేడి ఒకసారి దూరంగా పారిపోతుంది. ఒకతూరి చేతికి చిక్కినట్లుగా దగ్గరకు వస్తుంది. కాని, పట్టుబడదు. ఆసలు రేకెత్తిస్తూ వెనుకకు తగ్గుతుంది. పొదలలో అణగిపోతుంది. అవతల ప్రత్యక్షమవుతుంది. భీతి చెందినట్లు నిలబడిపోతుంది. అంతలో వేగంగా దాటుతూ పరుగెత్తుతుంది. మరలిచూచి చెవులు నిక్కించి నిలిచి చూస్తుంది. నేల త్రొక్కుతూ దుమ్మురేపుతుంది. కొమ్ములతో రాస్తుంది. పరాకుగా ఉన్నట్లు కన్పిస్తుంది. పచ్చగడ్డి మేస్తుంది. ఒక్కసారి పైకెగసి పారిపోతుంది.

విశేషం: అలం: స్వభావోక్తి. ఆంధ్రవాఙ్మయంలో హృదయంగమమైన స్వభావోక్తి అలంకారానికి ఈపద్యం చక్కని ఉదాహరణం.

ఇది నన్నయభట్టుగారి ఒరవడికిగాక ఎఱ్ఱనగారి స్వకీయప్రతిభకే ఉదాహరణం. ఇది ఎఱ్ఱాప్రెగ్గడ ప్రబంధశైలికి నిదర్శనంగా ఎన్నదగింది.

వ. ఇట్లతిదూరంబుగా నెలయించి యలయించిన నది రాక్షసమాయగా నూహించి రాఘవుం డమోఘబాణంబు దొడిగి తడయక యమ్మృగంబు నేసిన. 62

ప్రతిపదార్థం: ఇట్లు= ఈరీతిగా; అతిదూరంబుగాన్= దవుదవ్వులుగా; ఎలయించి= ప్రేరేపించి; అలయించినన్= అలసిపోయేటట్లుగా చేయగా; అది= ఆ బంగరులేడి చర్యలు; రాక్షసమాయగాన్= రక్కసులు పన్నిన మోసంగా; ఊహించి= తలపోసి; రాఘవుండు= రఘువంశంలోనివాడు- శ్రీరాముడు; అ+మోఘ, బాణంబు= వ్యర్థం కాని అమ్ము; తొడిగి= సంధించి; తడయక= ఆలసించక; ఆ+మృగమును= ఆ లేడిని; ఏసినన్= కొట్టగా.

తాత్పర్యం: ఈ విధంగా ఆ బంగరులేడి రాముడిని మోసగించి దూరప్రదేశానికి కొనిపోయింది. అంతవరకు ఆ బంగరులేడిని ప్రాణాలతోనే పట్టుకొనాలని శ్రీరాముడి ఆలోచన. కాని, అది అంతా రాక్షసమాయ అని

గుర్తించి వెనువెంటనే ఆ లేడిపై రాముడు తిరుగులేని బాణాన్ని ప్రయోగించాడు. రామబాణం వ్యర్థం కాని మహిమ కలది. ఆ బాణం ప్రయోగించటం అంటే బంగరులేడి మరణించటం తథ్యం. ఇక సీతకోరిక ఈడేరదు.

క. వాలమ్ము దాఁకి యొఱలుచు ।
నాలోనన రాము నెలుఁగునట్టి యెలుఁగు గా
'హా! లక్ష్మణ! సీతా!' యని ।
కూలి కపటమ్మృగము తన్నికొనుచుం జచ్చెన్. 63

ప్రతిపదార్థం: వాలు+అమ్ము= వాడిఅయిన (రామ) బాణం; తాఁకి= తగిలి; ఒఱలుచున్= అరుస్తూ; ఆ లోనన్+అ= ఆ లోపలనే; రాము+ఎలుఁ గు+అట్టి+ఎలుఁగు+కాన్= శ్రీరాముడి కంఠస్వరాన్ని పోలిన కంఠస్వరంతో; హా లక్ష్మణ! = ఓ లక్ష్మణ!; సీతా= హా సీతా!; అని= అని అరుస్తూ; కూలి= నేలవ్రాలి; కపటమ్మృగము= మాయలేడి; తన్నికొనుచున్= గిజగిజ అవయవాలు కంపింపచేస్తూ; చచ్చెన్= మరణించింది.

తాత్పర్యం: వాడిఅయిన రామబాణం తాకి, అరుస్తూ మాయలేడి నేలపై పడి, రాముడికంఠస్వరాన్ని పోలిన కంఠస్వరంతో 'హా లక్ష్మణా! హా సీతా!' అని బిగ్గరగా అరుస్తూ అవయవాలు కంపిస్తూండగా గిజగిజ తన్నుకొని చచ్చింది.

విశేషం: రామాయణగాథలో నాటకీయసన్నివేశాలలో ఇది ఒకటి. రాక్షస మాయామహిమ పరాకాష్ఠ చెందింది. 'రామబాణమహిమ మారీచుడికి అంతకుపూర్వం తెలిసిందే. కాని రావణుడికి రామబాణప్రభావం తెలియదు. రాముడికి మారీచుడి మాయామహిమ తెలియదు కాని రావణుడికి మాత్రం తెలియును. అందుచేతనే లంకనుండి రావణుడు గోకర్ణం చేరి మారీచుడి సాయం కోరాడు. జిత్తులమారి మారీచుడు మరణసమయంలో కూడ విడనాడని సద్యస్ఫూర్తితో శ్రీరాముడి కంఠస్వరాన్నిపోలిన కంఠస్వరంతో 'హా లక్ష్మణా హా

సీతా' అని అరిచాడు. రామబాణం మారీచుడి ప్రాణాలను అపహరించగల్గింది. కాని, అతడి మోసపుతెలివితేటలు సీతాదేవినే అపహరింపజేశాయి.

తరువోజ.

ఆ యెలుఁ గేర్పడ నవనీతనూజ । యాలించి తల్లడం బడరు చిత్తమున
'నోయన్న! లక్ష్మణ! యొలసి మీయన్న । యుగ్రరాక్షసబాధ నొందంగఁ బోలు;
నాయతభుజ! వింటె యమ్మహాభాగుఁ । డత్యంతదుఃఖార్తుఁ డై నిన్నుఁ జీరె;
బోయి వే కావు విస్ఫురితపుణ్యైక । భూషణోదార! యప్పురుషరత్నంబు'. 64

ప్రతిపదార్థం: అవనీ, తనూజ= భూదేవి కూతురు- సీతాదేవి; ఆ+ఎలుఁగు+ ఏర్పడన్= ఆ కంఠస్వరం సుస్పష్టంగా; ఆలించి= విని; తల్లడంబు+అడరు, చిత్తమునన్= తత్తర పాటుతో వ్యాకులమైన మనస్సుతో; ఓ+అన్న, లక్ష్మణ!= ఓ అన్నా! లక్ష్మణా!; ఒలసి= కోరి; మీ+అన్న= శ్రీరాముడు; ఉగ్ర, రాక్షస, బాధన్= భయంకరమైన రక్కసులు కల్పించిన ఆవేదనను, ఒందంగన్+ పోలున్= చెందియుండ వచ్చును; ఆయత భుజ!= నిడివిఅయిన బుజాలు కలవాడా!; పరాక్రమవంతుఁడవు+ఐన ఓ లక్ష్మణా!; వింటి(వి)+ ఎ= ఆలకించితివిగదా; ఆ+మహా, భాగుఁడు= ఆ మహానుభావుడు - శ్రీరాముడు; అతి+అంత, దుఃఖ+ఆర్తుఁడు+ఐ= మిక్కుటమైన ఆవేదనకు లోనయినవాడై; నిన్నున్= నిన్ను; చీరెన్= పిలిచాడు; పోయి= వెళ్ళి; వి, స్ఫురిత, పుణ్య+ఏక, భూషణ+ఉదార!= బాగా ప్రకాశించే సుకృతం ముఖ్యమైన ఆభరణంగా కల గొప్పవాడా!; ఆ+పురుష, రత్నంబున్= మగవారలలో శ్రేష్ఠుడు అయిన శ్రీరాముడిని; వే కావు(ము)= వేగంగా రక్షించుము.

తాత్పర్యం: ఆ మాయలేడినుండి వెలువడిన కంఠస్వరం శ్రీరాముడి కంఠస్వరంగా సుస్పష్టంగా గుర్తించి, తత్తరపడిన చిత్తంతో సీతాదేవి లక్ష్మణుడితో ఇట్లా పలికింది. 'ఓ లక్ష్మణా! విన్నావుకదా మీఅన్నగారి ఆర్తనాదం. ఆయన రాక్షసులు పన్నిన బాధకు గురి అయినట్లు తెల్లమౌతున్నది. పరాక్రమవంతుడవైన లక్ష్మణా! మిక్కుటమైన దుఃఖంలో మునిగిఉన్న

పురుషరత్నం మీఅన్న. అతడిని రక్షించటం నీకర్తవ్యం. దేదీప్యమాన మైన పుణ్యమే నీకు 'ఏకైకభూషణంకదా!'

విశేషం: వృత్త లక్షణానికి చూడు- 4.302 విశేషాంశం.

వ. అనిన నతం డా మానిని కి ట్లనియె. 65

తాత్పర్యం: అని సీత పల్కగా, ఆమెతో లక్ష్మణుడు ఈ విధంగా అన్నాడు.

ఆ. 'అబల! వెఱవకుండు; మఖిలలోకములను ।
రాఘవేశ్వరునకు రణములోన
నెదురఁ గలఁడె శూరుఁ డెవ్వాఁడు? నతనికి ।
నెట్టియెడల దురిత మేల పొందు? 66

ప్రతిపదార్థం: అబల= సీతా!; వెఱవక+ఉండుము= భయపడకుండా ఉండుము; అఖిలలోకములను= అన్నిభువనాలలోను; రాఘవ+ఈశ్వరునకున్= రఘుకులానికి చెందిన ప్రభువుకు, శ్రీరాముడికి; రణములోనన్= యుద్ధంలో; శూరుఁడు+ ఎవ్వాఁడున్= ఎట్టివీరుడు అయినను; ఎదురన్+కలఁడు+ఎ= ఎదిరించి నెగ్గగలడా?; అతనికిన్= శ్రీరాముడికి; ఎట్టి+ఎడలన్= ఎట్టి పరిస్థితులలో కూడా; దురితము= పాపం, మిక్కుటమైనదుఃఖం; ఏల పొందున్?= ఎందుకు కలుగుతుంది? (కలుగదని భావం).

తాత్పర్యం: 'ఓ సీతా! భయపడకుము. రాఘవేశ్వరుడైన శ్రీరాముడిని యుద్ధంలో గెలువగల శూరుడు ఈ లోకంలోనే కాక ఏ లోకంలోనూ లేడు. శ్రీరాముడికి ఎక్కడైనాసరే ఎప్పుడైనా సరే ఎట్టి ఆపదా సంభవించదు.

క. ఇనవంశోత్తముఁ డిప్పుడ ।
చనుదెంచుఁ బ్రియంబు నొందు జలజానన!' నా
విని జానకి లక్ష్మణు నెడ ।
జనితాశంక యయి క్రోధసంభ్రాంతమతిన్. 67

ప్రతిపదార్థం: జలజ+ఆనన!= పద్మాలవంటి ముఖం కలదానా, సీతాదేవీ!; ఇన, వంశ+ఉత్తముఁడు= సూర్యవంశంలో శ్రేష్ఠుడు- శ్రీరాముడు; ఇప్పుడు+ అ= ఇప్పుడే- ఇక కొన్నిక్షణాలలోనే; చనుదెంచున్= వస్తాడు; ప్రియంబున్+ ఒందు(ము)= సంప్రీతిని చెందుము; నాన్= అనగా; విని= ఆలకించి; జానకి= జనకుడి కూతురు - సీత; జనిత+ఆశంక+అయి= పుట్టిన సందేహం కల్గినది అయి; క్రోధ, సంభ్రాంత, మతిన్= కోపంవలన తిరుగుడువడిన చిత్తంతో.

తాత్పర్యం: 'పద్మంవంటి ముఖం కలదానా! సీతాదేవీ! ఇప్పుడే ఇక కొన్ని క్షణాలలోపలనే సూర్యవంశంలో శ్రేష్ఠుడైన శ్రీరాముడు రాగలడు' అని లక్ష్మణుడు పలికాడు. సీతకు లక్ష్మణుడియెడ అనుమానం రేకెత్తింది. కోపం వచ్చింది. కోపం రావటంచేత ఏర్పడిన అపోహతో ఆమె ఇట్లా అన్నది.

విశేషం: సీత లక్ష్మణుడిని సందేహించవచ్చునా? ఈ ప్రశ్నకు పలువురు విమర్శకులు పలురీతుల సమాధానం చెప్తున్నారు. ఇట లక్ష్మణుడి సంబోధనం సీతనుగూర్చి- 'జలజానన!= పద్మంవంటి ముఖం కలదానా!' అనేది మాత్రం అందుకు హేతువు కాజాలదు. అట్టి పదాలు సర్వసాధారణంగా మర్యాదాసూచకాలు మాత్రమే. అబల, అంబుజేక్షణ, అరవిందలోచన, మానిని ఇత్యాదిశబ్దాలు అన్నీ స్త్రీసామాన్యవాచకాలే. నన్నయ భారతంలో గరుడుడు కన్నతల్లిని - 'పయోరుహానన' అని సంబోధిస్తాడు. ఆపత్సమయంలో సీతకు మతిపోయి అట్లా పలికినట్లుగనే భావించనగును. తదుపరి ఆమె పశ్చాత్తాపం చెంది లక్ష్మణుడికి క్షమాపణ అందించింది (ఆంజనేయుడిద్వారా).

సీ. 'నీతలం పెఱుఁగుదు; నీ కేల వలవని ।
జాలి నీ కి ట్లేల సంభవించె?
నతిఘోరశస్త్రవిషాగ్నులయం దొంట ।
వేగంబ ప్రాణముల్ విడుతుఁగాక

యే నేల నిను వరియింతు? బెబ్బులికాంత ।
యక్కట! నక్కపొం దాస పడునె?'
యని యిట్లు సత్పురుషాగ్రణి సౌమిత్రిఁ ।
బడఁతి యప్రియములు వలుకుటయును,

ఆ. జెవులు మూసికొనుచుఁ జిత్తంబు గలఁగ ల ।
క్ష్మణుఁడు దత్క్షణంబ మహిత శౌర్యుఁ
డతులబాణచాపహస్తుఁడై తనయన్న ।
చనిన చొప్పునంద చనఁ దొడంగె. 68

ప్రతిపదార్థం: నీతలంపు= నీయొక్కయోచన; ఎఱుఁగుదున్= తెలియుదును; నీకున్+ఏల= నీకు ఎందుకు; వలవని= కూడని; జాలి= దయ; నీకున్= నీకు; ఇట్లు= ఈ విధంగా; ఏల= ఎందులకు; సంభవించెన్?= కలిగింది?; అతి, ఘోర, శస్త్ర, విష+అగ్నులయందున్= మిక్కిలిదారుణం అయిన ఆయుధాలు, విసం, నిప్పులలో; ఒంటన్= ఏదియో ఒకదానితో; వేగంబు+అ= శీఘ్రంగా; ప్రాణముల్= అసువులు; విడుతున్+కాక= విడుస్తానుగాని; ఏన్= నేను; ఏల= ఎందుకు; నినున్= నిన్ను; వరియింతున్?= వరిస్తాను?; అక్కట= అయ్యో; బెబ్బులికాంత= ఆడుపెద్దపులి; నక్కపొందు= జంబుకంతోడి కలయిక; ఆస+పడునె?= ఆశిస్తుందా? (ఆశించదు); అని= అని పలికి; యిట్లు= ఆ రీతిగా; సత్+పురుష+అగ్రణి= మంచి మగవారలలో శ్రేష్ఠుడైన వాడిని; సౌమిత్రిన్= సుమిత్రకొడుకును లక్ష్మణుడిని; పడఁతి= వనిత - సీత; అప్రియములు= కఠినవాక్యాలు; పలుకుటయును= పలకటమున్నూ; లక్ష్మణుఁడు; చిత్తంబు= మనస్సు; కలఁగన్= సంక్షోభంచెందగా; చెవులు; మూసికొనుచున్= కప్పుకొంటూ; తత్+క్షణంబు+అ= ఆ త్రుటిలోనే; మహితశౌర్యుఁడు= గొప్పపరాక్రమం కలవాడు; అతుల, బాణ, చాప, హస్తుఁడు+ఐ= సాటిలేని విల్లును అమ్ములను చేతిలో పూనినవాడై; తన అన్న= తన అగ్రజుడు- శ్రీరాముడు; చనిన చొప్పునందున్+అ= వెడలిన మార్గంలోనే; చనన్+తొడంగెన్= వెడలసాగాడు.

తాత్పర్యం: 'ఓ లక్ష్మణా! నీ ఆంతర్యం నాకు ఇప్పటికి అర్థమైంది. నీకు ఎందుకు నామీద ఇంతజాలి కలిగిందో నాకు తెలుసు. నేను భయంకరమైన ఆయుధాలచేతనో, విసంచేతనో, అగ్నిచేతనో ఆత్మహత్యకు పాల్పడతానుగాని, నిన్ను ప్రేమించి నీకు లొంగను. శ్రీరాముడు లేకపోతే నేను నీకు దక్కుతానని ఎంతమాత్రం భావించకుము. ఆడుపెద్దపులి గుంటనక్కపొందుకు సమ్మతిస్తుందా?' అని సత్పురుషులలో శ్రేష్ఠుడు అయిన లక్ష్మణుడితో సీత కఠోరవాక్యాలు పలికింది. ఆ మాటలు వినలేక సౌమిత్రి చెవులు మూసికొంటూ, ఆక్షణంలోనే విల్లు అమ్ములు ధరించి బయలుదేరి అంతకు ముందు అన్నగారు శ్రీరాముడు వెళ్ళిన మార్గంలోనే తానును వెళ్ళాడు.

వ. అయ్యవసరంబున దశాననుండు. 69

ప్రతిపదార్థం: ఆ సమయంలో పదిమోములు కలవాడైన రావణుడు.

మ. కమనీయం బగు జన్నిదంబు శిఖయుం గౌపీనమున్ ధాతువ
స్త్రము దండంబును గుండియుం గుశపవిత్రంబుం గడున్ వృద్ధభా
వము సంధిల్లఁ ద్రిదండివేషధరుఁడై వచ్చెం బధిశ్రాంతి దే
హమునం దోఁపఁగ సీతయున్నెడకు మాయాదక్షుఁ డక్షీణతన్. 70

ప్రతిపదార్థం: కమనీయంబు+అగు= అందమైన; జన్నిదంబున్= జందెమున్నూ (యజ్ఞోపవీతం); శిఖయున్= జుత్తుముడియున్నూ; కౌపీనమున్= గోచిగుడ్డయున్నూ; ధాతువస్త్రమున్= దేహాన్ని కప్పుకోటానికి మాత్రమే సరిపోయే బట్టయున్నూ; దండంబును= (చేతి) కఱ్ఱయున్నూ; కుండియున్= కమండలమున్నూ; కుశ, పవిత్రంబున్= దర్భలతో చుట్టబడిన అంగులీయకమున్నూ; కడున్= మిక్కిలి; వృద్ధభావము= ముసలితనం; సంధిల్లన్= ఏర్పడగా; త్రిదండివేషధరుఁడు+ఐ= ఏకదండంగా కట్టిన మూడు దండాలను తాల్చే

సన్న్యాసి ఆహార్యం ధరించిన వాడై; పధి శ్రాంతి= మార్గాయాసం; దేహమునన్= శరీరంలో; తోఁపఁగన్= కన్పించగా; సీత+ ఉన్న+ఎడకున్= సీత నివసించే చోటికి; మాయాదక్షుఁడు= మోసం చేయటంలో నేర్పరి అయినరావణుడు; అక్షీణతన్= గొప్పతనంతో; వచ్చెన్= వచ్చాడు.

తాత్పర్యం: ఆ సమయంలో పదిమొగాలుకల రావణుడు మారువేషంతో సీతాదేవి ఉన్నచోటికి అరుగుదెంచాడు. మనోహరమైన యజ్ఞోపవీతం, చిన్నజుత్తుముడి, గోచిగుడ్డ, దేహాన్ని కప్పిన చిన్నబట్ట, చేతికర్ర, కమండలువు, దర్భలతో చుట్టబడిన ఉంగరం ధరించి, మిక్కిలిముసలితనం తోచేటట్లుగా త్రిదండి సన్యాసివేషం ధరించి మాయావి అయిన ఆ రావణుడు మార్గాయాసంచేత అలసిపోయినట్లుగా కనిపిస్తూ సీతవద్దకు వచ్చాడు.

విశేషం: (1) త్రిదండం- వాగ్దండ కర్మదండ మనోదండాల సమాహారం. మనస్సు-వాక్కు-కర్మ త్రికరణాలు. వీటిశుద్ధి ఏర్పడటం ఆధ్యాత్మికోన్నతికి పరాకాష్ఠ.

తే. **వాని నిక్కంపుమునియ కా వగచి రాము ।**
వనిత గడుభక్తిఁ బూజించి వన్యఫలము
లొసఁగుటయు వానిఁ జేకొననొల్ల కసుర ।
మదనవివశుఁడై యిట్లను మగువఁజూచి. **71**

ప్రతిపదార్థం: వానిన్= అతడిని (ఆ త్రిదండి సన్యాసివేషంలో) వచ్చిన రావణుడిని; నిక్కంపు, ముని+అ, కా= నిజమైన యతిగనే; వగచి= భావించి, రామువనిత= శ్రీరాముడిభార్య- సీత; కడు= మిక్కిలి; భక్తిన్= పూజ్యభావంచేత; పూజించి= ఆరాధించి; వన్యఫలములు= అడవిలో కాచినపండ్లు; ఒసఁగుటయున్= ఇచ్చుటయున్నూ; వానిన్= వాటిని (ఆ వన్యఫలాలను); చేకొనన్= స్వీకరించటానికి; ఒల్లక= ఇష్టపడక; అసుర= రాక్షసుడు-రావణుడు; మదన, వివశుఁడు+ఐ= మన్మథుడికి లొంగిపోయిన వాడై; మగువన్+చూచి= వనితను- సీతను చూచి; ఇట్లు+అనున్.

తాత్పర్యం: యతివేషంలో వచ్చిన రావణుడిని నిజమైన మునిగనే భావించి శ్రీరాముడిభార్య అయిన సీత అతడిని పూజ్యభావంతో ఆరాధించి అతిథి సత్కారాలు చేసి అడవిపండ్లను సమర్పించింది. రావణుడు కామవికారానికి లోనయి, ఆపండ్లను స్వీకరించనొల్లకుండా సీతనే చూస్తూ ఇట్లా పలికాడు.

మత్తకోకిలము.

'ఏను దానవనాయకుండ నహీనసత్త్వుఁడ రావణా
ఖ్యానిరూఢుఁడ లంక నాఁగ జగత్ప్రసిద్ధము మత్పురం
బానతాంగి! మదీయవల్లభ వై భజింపఁగ రాదె ది
వ్యానుభోగము లిష్టచేష్టితహారియౌవనలీలలన్. **72**

ప్రతిపదార్థం: ఆనత+అంగి!= వంగినదేహంకలదానా, సౌకుమార్యంగల సుందరీ!; ఏను= నేను; దానవ, నాయకుండన్= రాక్షసులకు అధినేతను; అహీనసత్త్వుఁడన్= గొప్పబలం కలవాడను; రావణ+ఆఖ్యా, నిరూఢుఁడన్= రావణుడు అనేపేరుతో ప్రసిద్ధుడను; మత్+పురంబు= నా రాజధాని; లంక= లంక; నాఁగన్= అనగా; జగత్+ ప్రసిద్ధము= లోకంలో పేరు కెక్కింది; మదీయవల్లభవు+ఐ= నీవు నా ప్రేముడికి పాత్ర మైన భార్యవై; దివ్య+అనుభోగములు= స్వర్గసౌఖ్యాలు అనుభవించటాలు; ఇష్టచేష్టిత, హారి, యౌవనలీలలన్= కోరిన పనులతో మనోహరాలైన జవ్వనపు ఆటలను; భజింపఁగన్ రాదె= అనుభవించరాదా!

తాత్పర్యం: 'సౌకుమార్యం వెల్లివిరుస్తున్న సుందరీ!; నేను రాక్షసులకు సార్వభౌముడను, జగత్ప్రసిద్ధమైన లంకాపట్టణం నా రాజధాని. నాపేరు రావణుడు. నాకు ప్రేయసివై నీవు పడుచుదనపు కోరికలతో రంగరించబడిన ఆటలలో తేలియాడుతూ స్వర్గసౌఖ్యాలను అనుభవించుము.

విశేషం: వృత్త లక్షణానికి చూడు- 4.267 విశేషాంశం.

క. ఎక్కడి రాఘవుఁ డక్కట! ।
తక్కువ యగు పేదమనుజుఁ దగిలి వనమునం
బెక్కిడుమలఁ బడఁ దగునే! ।
తక్కుము మది నింక నొండుదలఁపులు తరుణీ!' 73

ప్రతిపదార్థం: తరుణీ!= జవరాలా, సీతా!; ఎక్కడి రాఘవుఁడు= రఘు వంశంలో జనించిన శ్రీరాముడు ఎంతటివాడు; అక్కట!= అయ్యో! (నీకు ఎంత లోటు ఏర్పడింది); తక్కువ+అగు= హీనుడు అయిన; పేదమనుజున్= దరిద్రుడు అయిన మానవుడిని; తగిలి= కూడుకొని; వనమునన్= అడవిలో; పెక్కు+ఇడుమలన్= అనేకాలైన కష్టాలను; పడన్+ తగునే?= అనుభవించటం ఎందుకు?; మదిన్= (నీ)మనస్సులో; ఇంకన్= ఇకమీద; ఒండు, తలఁపులు= వేరేఆలోచనలు; తక్కుము= విడనాడుము.

తాత్పర్యం: పడుచుదనంలో ఉన్న సీతాదేవీ!; అయ్యో పాపం, నీకు ఎటువంటి కష్టం దాపురించింది! ఈ అడవులలో ఇన్ని కష్టాలు పడటం ఎందుకు? ఒక మనుజుడిని, ఒక దరిద్రుడిని పెళ్ళాడి అతడితో కలిసి ఉండటమా? నీ మనస్సులో వేరే ఆలోచనలు పెట్టుకోకుండా నన్ను చేరుము.

వ. అనిన విని వైదేహి భయకంపిత దేహ యగుచు నతని కి ట్లనియె. 74

తాత్పర్యం: అనగా విని భయంతో వణికే శరీరంతో సీత అతడితో ఇట్లా అన్నది.

సీ. 'ఇట్లాడ నర్హమే యే నేడ? నీ వేడ?
నక్షత్రతారాగణంబుతోడ
నాకసం బంతయు నవనిపైఁ గూలిన ।
వసుమతి వ్రస్సిన, వనధు లెల్ల
నింకినఁ, జంద్రదినేశ్వరు లన్యోన్య ।
విపులతేజంబులు వీడుపడిన

నే నేల యన్యుని నెడలోనఁ గామింతుఁ? ।
గరిణి యేనాఁట సూకరముఁ గలయు?

ఆ. మహితకమలమధురమధురసాస్వాదన ।
పరవశాత్మ యైన భ్రమరకాంత
రిత్తబుద్ధి నకట! రేఁగుఁబువ్వుల రసం ।
బాను నెట్లు? బేలవైతి గాక.' 75

ప్రతిపదార్థం: ఇట్లు+ఆడన్= ఈ విధంగా మాట్లాడటం; అర్హమే= తగునా?; ఏన్+ఏడ= నేను ఎక్కడ?; నీవు+ఏడన్= నీవు ఎక్కడ?; నక్షత్ర, తారాగణంబుతోడన్= చుక్కలగుంపులతో; ఆకసంబు+అంతయున్= గగనం సర్వమున్నూ; అవనిపైన్= భూమిపై; కూలినన్= క్రిందకు పడినా; వనధులు= సముద్రాలు; ఎల్లన్= అన్నియును; ఇంకినన్= ఎండిపోయినా; వసుమతి= భూమి; వ్రస్సినన్= బ్రద్దలు అయినా; చంద్ర, దిన+ఈశ్వరులు= చంద్రుడున్నూ, సూర్యుడున్నూ; అన్యోన్య, విపుల, తేజంబులు= ఒకరికొకరికి సంబంధించి విస్తరించిన కాంతులు; వీడుపడినన్= ప్రసరించటం మానినప్పటికి; ఏన్= నేను; ఏల= ఎందుకు; ఎడలోనన్= హృదయంలో; అన్యునిన్= ఇతరుని; కామింతున్?= కోరుతాను?; కరిణి= ఆడుఏనుగు; ఏనాఁటన్= ఎక్కడైనా, ఎప్పుడైనా; సూకరమున్= పందిని; కలయున్= కూడునా?; మహిత, కమల, మధుర, మధు, రస+ఆస్వాదన, పర, వశ+ఆత్మ+ఐన= గొప్ప తమ్మిపువ్వులలోని తియ్యనైన తేనెద్రవాన్ని క్రోలుతూ తనను తాను ఒడలు మరచి ఆనందించే; భ్రమరకాంత= తుమ్మెద పడుచు; రిత్తబుద్ధిన్= మతిచెడి; అకట!= అయ్యో!; రేఁగు+పువ్వుల రసంబు= రేగుపూలలోని ద్రవాన్ని; ఎట్లు= ఏరీతిగా; ఆనున్?= ఆస్వాదిస్తుంది?; బేలవు+ఐతి(వి)+కాక= నీవు అవివేకివి అయినావు సుమా!

తాత్పర్యం: రావణుడిమాటలు ఆలకించి విదేహ రాజకుమారి అయిన సీత ఆతడితో ఇట్లా బదులు పలికింది. 'ఓరావణా! నీవు అవివేకివని తేలింది.

నీపలుకులు ఎంతమాత్రం ఉచితాలు కావు సుమా! నేను ఎక్కడ? తులువ వైన నీవు ఎక్కడ? తారతమ్యం గుర్తించక నీవు నీ నోటికి వచ్చినట్లు వాగుతున్నావు. సమస్తతారాగణంతో క్రాంతి వలయంతోసహా ఆకాశం అంతా భూమిపై పడుగాక! భూమిఅంతా బ్రద్దలైపోనీగాక! సముద్రాలు అన్నీ ఎండిపోనీగాక! సూర్యచంద్రులు కాంతివిహీనులై గతులు తప్పనీగాక, నేను పరపురుషుడిని మనసులో కోరనే, కోరను. ఆడుఏనుగు ఎన్నడును పందిని కలయగోరునా? తమ్మిపువ్వులలోని తియ్యతేనెను గ్రోలి ఒడలు మరచి ఆనందించే ఆడుతుమ్మెద రేగుపువ్వులరసం ఆస్వాదించ కోరదు కదా! ఓరీ బుద్ధిహీనుడా! జాగ్రత్త. నన్ను ఎన్నడు నీవు కాంక్షించరాదు'.

విశేషం: (1) అలం: నిదర్శనం (2) నక్షత్రాలు అన్నా తారకలు అన్నా ఆకసంలో చుక్కలు అనియే అర్థం. నక్షత్రాలు-ఇరువదియేడు. అశ్విని, భరణి మున్నగునవి సూర్యుడిగతిలో గ్రహాలగతులలో ఉన్నట్టివి. అనగా, కాంతివలయంలో ఉన్నట్టివి. ఇక-తారలు అసంఖ్యాకా లైన నక్షత్రాలు - కాంతివలయానికి బయట ఉండే చుక్కలు అని చెప్పవచ్చును. ఈ విధంగా పునరుక్తిదోషాన్ని పరిహరించటం సులువు. కవిహృదయాన్ని స్వీకరించటం సహృదయలక్షణం.

రావణుఁడు సీత నెత్తికొని లంకకుఁ బోవుట (సం. 3-262-39)

వ. అని పలుకుచు నొయ్యనొయ్యన తొలంగం జనిన నద్దురాత్ముఁ డతిభయంకరంబుగా జంకించి యమ్మగువం బట్టికొని గగనంబున కెగసి లంకాపురాభిముఖుండై యరుగఁ దొడంగిన నయ్యింతి యెంతయుం దలరి యిట్లని విలాపంబు సేసె. 76

ప్రతిపదార్థం: అని పలుకుచున్= అని అంటూ; ఒయ్యన+ఒయ్యన= మెల్లగా మెల్లగా; తొలంగన్+చనినన్= దూరంగా పోగా; ఆ+దురాత్ముఁడు= ఆ చెడ్డవాడు (ఆ రావణుడు); అతిభయంకరంబుగాన్= మిక్కిలి భీతికలిగే టట్లుగా; జంకించి= బెదరేటట్లుగా చేసి; ఆ+మగువన్= ఆమెను(ఆసీతను); పట్టికొని= (బలాత్కారంగా) పట్టుకొని; గగనంబునకున్= ఆకసానికి; ఎగసి=ఎగిరి; లంకాపుర+అభిముఖుండు+ఐ= లంకానగరం వైపు మొగం కలవాడై; అరుగన్+తొడంగినన్= పోసాగగా; ఆ+ఇంతి= సీతాదేవి; ఎంతయున్= మిక్కుటంగా; తలరి= ఆవేదనచెంది; ఇట్లు+అని, ఈ విధంగా పలుకుతూ; విలాపంబు+చేసెన్= ఆక్రోశించింది.

తాత్పర్యం: ఆ విధంగా రావణుడిని అధిక్షేపిస్తూ సీతాదేవి అతడికి దూరంగా మెలమెల్లగా తొలగిపో సాగింది. అంతట రావణుడు ఆమెను బెదిరించి భయంకరంగా ఆమెను పట్టుకొని ఆకసానికి ఎగిరి లంకాపట్టణం వైపు పోసాగాడు. అప్పుడు సీతాదేవి మిక్కుటమైన ఆవేదనతో ఈ రీతిగా ఆక్రోశించింది.

ఉ. 'దేవతలార! యో ధరణిదేవతలార! జగత్త్రయోన్నతుం
డై వెలుఁగొందు రామునికులాంగన జానకి నేను; నన్ను మో
హావిలుఁ డొక్క రక్కసుఁ డనర్గళుఁడై కొనిపోయెడుం; గృపం
గావరె! పుణ్యమున్ యశముఁ గైకొనరే! యిదె మీకు మ్రొక్కెదన్'. 77

ప్రతిపదార్థం: దేవతలార!= ఓవేల్పులారా!; ఓధరణి, దేవతలార!= ఓపుడమివేల్పులారా- ఓబ్రాహ్మణులారా!; జగత్+ త్రయ+ ఉన్నతుండు+ఐ= మూడులోకాలలో గొప్పవాడై; వెలుఁగొందు= ప్రకాశించే; రామునికుల+ అంగనన్= శ్రీరాముడిభార్యను; ఏను= నేను; జానకిన్= జనకరాజుకూతురను - సీతను; నన్నున్= నన్ను; మోహ+ఆవిలుఁడు= కామంచేత కలగినవాడు; ఒక్క రక్కసుఁడు= ఒక రాక్షసుడు; అనర్గళుఁడు+ఐ= అడ్డు లేనివాడై, స్వేచ్ఛతో కూడినవాడై; కొనిపోయెడున్= బలాత్కారంగా తీసికొనిపోతున్నాడు; కృపన్= దయతో; కావరె= కాపాడరా? (కాపాడండి); పుణ్యమున్= సుకృతాన్ని; యశమున్= కీర్తిని; కైకొనరే= గ్రహింపరా (దయచేసి నన్ను రక్షించి పుణ్యాన్ని కీర్తిని ఆర్జించండి); ఇదె= ఇదుగో; మీకున్= మీకు; మ్రొక్కెదన్= నమస్కరిస్తున్నాను.

తాత్పర్యం: 'ఓ వేల్పులారా! ఓ బ్రాహ్మణులారా! మూడులోకాలలోనూ గొప్పవాడై వెలుగొందే శ్రీరాముడిభార్యను నేను. జనకుడి కూతురిని సీతను. కాముకుడైన ఒకరాక్షసుడు నన్ను బలాత్కారంగా పట్టుకొని ఈ విధంగా తీసికొని పోతున్నాడు చూడండి. ఇతడిని అడ్డగించేవారు లేరా? దయచేసి నన్ను కాపాడండి. దీనురాల నయిన నన్ను రక్షిస్తే మీకు పుణ్యం, కీర్తి లభిస్తాయి. ఇదుగో మీకు నమస్కరిస్తున్నాను.

క. అని యేడ్వఁగఁ దద్వచనము ।
లనఘుఁడు గిరిగహ్వరాంతరాలయగతుఁడై
విని యరుణసుతుఁడు తేజో ।
ఘనుఁడు జటాయు వను పక్షి కారుణ్యమునన్. 78

ప్రతిపదార్థం: అని+ఏడ్వఁగన్= అని (సీతాదేవి) విలపించగా; తత్+వచనములు= ఆ సీతయొక్క మాటలు; అనఘుఁడు= పాపంలేనివాడు, పుణ్యాత్ముడు; గిరి, గహ్వర+అంతర+ఆలయ, గతుఁడు+ఐ= కొండగుహ లోపల నున్న ఆవాసంలో ఉన్నవాడై; తేజస్+ఘనుఁడు= దేదీప్యమాన మైన కాంతితో శోభిల్లే గొప్పవాడు; అరుణ, సుతుఁడు= అరుణుడికొడుకు; జటాయువు+అనుపక్షి= జటాయువు అనే పేరుగల పెద్దగ్రద్ద; విని= ఆలకించి; కారుణ్యమునన్= జాలితో.

తాత్పర్యం: ఆవిధంగా సీతాదేవి బిగ్గరగా ఆక్రోశించటం విని, అరుణుడి కొడుకు అయిన జటాయువు అనే పక్షిరాజు- పుణ్యాత్ముడు, దేదీప్యమాన మైన కాంతితో ప్రకాశించేవాడు, కొండగుహ లోపల నివసించేవాడు జాలితో.

క. ఎఱకలు గల కులశైలము ।
తెఱఁగు మెయిన్ రయము మెఱయ దివికి నెగసిబె
ట్టుఱుము జలధరముక్రియ ను ।
క్కఱి భువనం బెల్ల నద్రువ నార్చుచుఁ గడిమిన్. 79

ప్రతిపదార్థం: ఎఱకలు+కల= రెక్కలుకల; కులశైలము, తెఱఁగు మెయిన్= కులపర్వతంవలె; రయము= వేగం; మెఱయన్= ప్రకాశించగా; దివికిన్= ఆకసానికి; ఎగసి= ఎగిరి; బెట్టు+ఉఱుము= మిక్కుటంగా గర్జన చేస్తూ; జలధరముక్రియన్= మేఘంవలె; ఉక్కు+అఱి= బలంచెడి; భువనంబు+ఎల్లన్= జగము అంతయును; అద్రువన్= అదరగా; ఆర్చుచున్= అరచుచు; కడిమిన్= శౌర్యంతో.

తాత్పర్యం: రెక్కలు గల కులపర్వతంవలె వేగంగా వెడలివచ్చి ఆకసానికి ఎగిరి మేఘంవలె గర్జిస్తూ, మిక్కుటమైన పౌరుషం ప్రకాశించేటట్లుగా, జగత్తంతా అదరేటట్లుగా. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: (1)అలం: ఉపమ. (2) కులపర్వతాలు ఏడు. అవి భూమిని భరించేవి అని సనాతనసంప్రదాయం. 1. మహేంద్రం, 2. మలయం, 3. శుక్తిమంతం, 4. గంధమాదనం, 5. వింధ్యం, 6. పారియాత్రం, 7. సహ్యం. (3) అద్రువ- III నగణం; ఇచట అ- గురువు కాదు; 'అ' తేల్చి పలకాలి. (4) జటాయువు- ఎఱకలు గల కులపర్వతంవలె వినువీథికి ఎగసినట్లు కవి వర్ణన. పర్వతానికి రెక్కలు ఉండవు. ఇక- కులపర్వతం రెక్కలు గలిగితే ఎట్లుంటుందో అట్లాఉన్నది జటాయువు- అని వర్ణన.

ఉ. 'ఓరి దురాత్మ! యీ యబల నోడక యేటికిఁ బట్టినాఁడ? వం
భోరుహనేత్ర విడ్వు; మెట వోయినఁ బ్రాణముఁ గొందు నింక; ను
గ్రారివిభేదివిక్రము జటాయు నెఱుంగవె?' యంచు దర్పదు
ర్వారుఁడు వీఁకఁ దాఁకె సురవర్గవిఘాతకు నద్దశాననున్. 80

ప్రతిపదార్థం: ఓరిదురాత్మ!= ఓరి దుష్టుడా (రావణా!); ఈ అబలన్= ఈ వనితను, బలంలేని ఆడుదానిని (సీతను); ఓడక= జంకక; ఏటికిన్= ఎందుకు; పట్టినాఁడవు= అపహరించావు; అంభోరుహనేత్రన్- అంభస్+రుహ, నేత్రన్= పద్మాలవంటి కన్నులు కలదానిని (ఈవనితను); విడ్వుము=

విడువుము; ఎట+పోయినన్= నీవు ఎటు వెళ్ళినను; ప్రాణమున్+కొందున్= (నీ) అసువులను గైకొంటాను, నిన్నుచంపుతాను; ఇంకన్= ఇంతవరకును; ఉగ్ర+అరి, విభేది, విక్రమున్= భయంకరు లైన శత్రువులను సంహరించే పరాక్రమం కలవాడిని; జటాయువున్= జటాయువును; ఎఱుంగవె= తెలియవా; అంచున్= అని పలుకుతూ; దర్ప+దుర్వారుఁడు= గర్వంచేత వారించ నలవి కానివాడు; ఆ+దశ+ఆననున్= ఆ పదితలలు కల రావణుడిని; సుర, వర్గవిఘాతకున్= వేల్పుల సముదాయానికి మిక్కుటమైన హాని కలిగించేవాడిని రావణుడిని; వీఁకన్= ఉత్సాహంతో; తాఁకెన్= ఎదుర్కొన్నాడు.

తాత్పర్యం: 'ఓరీ, దుష్టుడా! ఈ ఆడుదానిని ఎందుకు చెరబట్టావురా? పద్మాలవంటి కన్నులు గల ఈమెను విడిచిపెట్టుము; నీవు నన్ను తప్పించుకొని పారిపోలేవు. నీవు ఎటుపోయినా నేను నిన్ను పట్టుకొని సంహరిస్తాను. భయంకరమైన శత్రువర్గాన్ని చీల్చిచెండాడే పరాక్రమంగల జటాయువును నేను; నన్ను నీవు ఎరుగవా?' అంటూ దర్పంతో చేరి వేలుపులకు హాని కలిగించే ఆ రావణుడిని ఉత్సాహంతో ఎదుర్కొన్నాడు.

మ. ఘనపక్షాహతులం బ్రకాండపరిఘాఘాతంబులం దీవ్రశా
తనఖోచ్ఛేదములం బ్రదీప్తశరవేధక్రీడలం గ్రూరచం
చునిపాతంబులఁ బ్రౌఢకుంతముఖవిస్ఫోటంబులం దత్ఖగేం
ద్రనిశాటేంద్రుల పోరు సాధనసమత్వస్ఫూర్తి నొప్పెం గడున్. 81

ప్రతిపదార్థం: ఘన, పక్ష+ఆహతులన్= గొప్పవైన రెక్కలదెబ్బలచేతను; ప్రకాండపరిఘ+ ఆఘాతములన్= నిడివి అయిన ఇనుపకట్ల గుదియలతో కొట్టటంచేతను; తీవ్ర, శాత, నఖ+ఉత్+ఛేదములన్= గాఢమైన వాడిఅయిన గోళ్ళతో రక్కుటలచేతను; ప్రదీప్త, శరవేధక్రీడలన్= వాడియైన బాణాలచేత బాధించటం అనే ఆటలచేతను; క్రూరచంచుని పాతంబులన్= కఠినమైన ముక్కుతో పొడవటంచేతను; ప్రౌఢ, కుంత, ముఖ విస్ఫోటంబులన్= ముదురు మొనగలిగిన ఈటెపోటులచేతను; తత్, ఖగ+ఇంద్ర, నిశాట+ఇంద్రుల, పోరు= ఆ పక్షిరాజు (జటాయువు) రాక్షసరాజు (రావణుడు) ల యుద్ధం; సాధన, సమత్వ, స్ఫూర్తిన్= పరికరాల యొక్క సమానత్వం అగుపించటంలో; కడున్= మిక్కిలి; ఒప్పెన్= శోభిల్లింది.

తాత్పర్యం: పక్షులలో శ్రేష్ఠుడు అయిన జటాయువుకూ నిశాచరులలో శ్రేష్ఠుడు అయిన రావణాసురుడికీ జరిగిన భయంకరమైన యుద్ధంలో సాధనసమత్వం (ప్రయోగించిన పరికరాలలో సామ్యం) గోచరించింది. పక్షీంద్రుడు తనరెక్కలతో కొట్టాడు. రాక్షసేంద్రుడు ఇనుపకట్ల గుదియలు ప్రయోగించాడు. జటాయువు వాడియైన గోళ్లతో రక్కినాడు. రావణుడు వాడి అయిన బాణాలను ఉపయోగించాడు. పక్షి వెరపుగొలిపే ముక్కుతో చీరినాడు. రక్కసుడు నిడివిగల ఈటెను విసిరాడు.

చ. పటుతరపక్షిపక్షముఖపాదనఖప్రవిఘాతఖండిత
స్ఫుటితశరీరుఁడై బహుళశోణితధారలు మేనఁ గ్రమ్మఁగాఁ
దటసముపాంతనిర్గళితధాతురసారుణసాంద్రనిర్ఝ రో
త్కటకులశైలలీల దశకంఠుఁడు నిల్చె నకుంఠితస్థితిన్. 82

ప్రతిపదార్థం: దశకంఠుఁడు= పదికంఠాలు కల రావణుడు; పటు, తర, పక్షి, పక్ష, ముఖ, పాద, నఖ, ప్ర, వి, ఘాత, ఖండిత, స్ఫుటిత, శరీరుఁడు+ఐ= మిక్కుటంగా పక్షియొక్కరెక్కలవలన, ముక్కువలన, పాదాలవలన, గోళ్ళవలన తగిన దెబ్బలుగలిగి బాగుగా నరుకబడి చిట్లిన దేహం కలవాడై; బహుళ, శోణితధారలు= పెక్కు నెత్తురు చారలు; మేనన్= దేహంలో, క్రమ్మగాన్= ఆవరించగా; తట, సముపాంత, నిర్గళిత, ధాతు, రస+అరుణ, సాంద్ర, నిర్ఝర+ఉత్కట, కులశైల, లీలన్= గట్టు సమీపంలో వెలికిజారిన మణిశిలలచేత ఎర్రనై దట్టమైన సెలయేళ్ళతో విరివిఅయిన కులపర్వతంవలె; అకుంఠిత, స్థితిన్= మొక్కవోని ధైర్యంతో; నిల్చెన్= నిలబడ్డాడు.

తాత్పర్యం: జటాయువుచేత మార్కొనబడిన రావణుడు కులపర్వతంవలె శోభిల్లాడు. జటాయువు తనరెక్కలచే, ముక్కుచే, పాదాలచే, గోళ్లచే, గీరి రావణుడిశరీరంనుండి నెత్తురు కారేటట్లు చేశాడు. తీరసమీపాన గల గైరికాదిధాతువులతో కలిసి ఎఱ్ఱబడిన నీళ్ళతో ప్రవహించే సెలయేళ్ళతో గూడిన కులపర్వతంవలె శోభిల్లుతూ రావణుడు ధీరుడై జటాయువును ఎదుర్కొన్నాడు.

విశేషం: అలం: ఉపమ. పూర్ణోపమ.

వ. తదనంతరంబ. **83**

తాత్పర్యం: అటు పిమ్మట.

క. తెలిపి గని దానవేశ్వరుఁ।
డులుక కృపాణమున నాఖగోత్తము నెఱకల్
నఱకినఁ గూలె నతం డిల।
నఱవఱలై పవనహతమహాభ్రమ పోలెన్. **84**

ప్రతిపదార్థం: తెఱిపి+కని= (పోరులో) కొంతవిరామాన్ని గమనించి; దానవ+ఈశ్వరుఁడు= రాక్షసప్రభువు; ఉఱక= లెక్కచేయక కృపాణమునన్= కత్తితో; ఆ ఖగ+ఉత్తము+ ఎఱకల్= ఆ పక్షీంద్రుడిరెక్కలు; నఱకినన్= ఖండించగా; అతండు= ఆతడు (జటా యువు); పవనహతమహా+ అభ్రము+అ, పోలెన్= గాలిచేత కొట్టబడిన పెద్ద మేఘంవలె; అఱవఱలు+ఐ= తుత్తునియలు అయి; ఇలన్= భూమిపై; కూలెన్= పడిపోయాడు.

తాత్పర్యం: ఆ పోరాటంలో కొంత విరామాన్ని గమనించి, రాక్షసప్రభువు రావణుడు తన కత్తిని ఎత్తి సులువుగా ఆ పక్షిరాజు అయిన జటాయువుయొక్క రెక్కలను తుత్తునియలుగా ఖండించాడు. అప్పుడు ఆ జటాయువు గాలిచేత కొట్టబడిన గొప్పమేఘంవలె ముక్కలుముక్కలుగా చెదరి పడ్డాడు.

విశేషం: అలం: ఉపమ.

వ. ఇట్లు జటాయువుం గూల్చి రావణుం డధికరయంబున నరుగునెడ జానకి తనకు దిక్కెవ్వరు లేమిం జేసి నిరాశయై యొక్కశైలశృంగంబు నందుఁ గొందఱు వానరులు మెలంగుచున్నంగని, తన కట్టిన పుట్టంబు కొంగు సించి భూషణంబులు ముడిచి తత్ప్రదేశంబున వైచెం; బంక్తి వదనుండును లంకాపురంబునకుం జని యం దశోకవనమధ్యంబున నాసుమధ్య నునిచి, తదీయరక్షణార్థంబు రాక్షసీనివహంబు నియోగించె; నిట రాఘవుండు మాయామృగంబు వధియించి మగుడం జనుదెంచు వాఁడు దన కెదురుగా వచ్చు లక్ష్మణుం గని 'రాక్షస గోచరం బైన వనంబున జానకి నొంటి యునిచి వచ్చి తప్పుసేసి' తని పలుకుటయు, సుమిత్రా నందనుండు ధాత్రీతనయ తన్ను నవమానించి పలికిన తెఱంగు సెప్పిన. **85**

ప్రతిపదార్థం: ఇట్లు= ఈరీతిగా; జటాయువున్+కూల్చి= జటాయువును సంహరించి; రావణుండు= రావణుడు; అధిక, రయంబునన్= మిక్కుటమైన వేగంతో; అరుగు+ఎడన్= వెడలుతున్నప్పుడు; జానకి= జనకుడికూతురు- సీత; తనకున్, దిక్కు= తనకు సాయం; ఎవ్వరున్= ఎవరును; లేమిన్+చేసి= లేకపోవటంచేత; నిరాశ+ఐ= ఆస లేనిది అయి; ఒక్క శైలశృంగంబునందున్= ఒక పర్వతంయొక్క కొనభాగంలో; కొందఱు వానరులు= కొన్ని కోతులు; మెలంగుచున్నన్= సంచరిస్తూ ఉండటం; కని= చూచి; తనకట్టిన పుట్టంబు= తాను ధరించిన చీర; కొంగు+చించి= చివరిభాగం చింపి; భూషణంబులు= ఆభరణాలు; ముడిచి= కట్టకట్టి; తత్+ప్రదేశంబునన్= ఆ స్థలంలో; వైచెన్= పడవేసింది; పంక్తివదనుండును= పదితలలుకలవాడును- రావణుడును; లంకాపురంబునకున్= లంకాపట్టణానికి; చని= వెళ్లి; అందున్= (ఆలంకాపురంలో); అశోకవన మధ్యంబునన్= అశోకవృక్షాలతో నిండిన ఉద్యానవనంలో; ఆ సుమధ్యన్= అందమైన నడుము కలదానిని- సీతను;

ఉనిచి= ఉంచి; తదీయరక్షణ+అర్థంబు= ఆమెనుకాపాడటం కొరకై; రాక్షసీ, నివహంబున్= ఆడురక్కసి గుంపులను; నియోగించెన్= ఏర్పాటు చేశాడు; ఇట= ఇక్కడ (ఈకథలో ఇచట అంటే దండకారణ్యంలో పర్ణశాలదరిని); రాఘవుండు= శ్రీరాముడు; మాయా, మృగంబు= మాయలేడిని; వధియించి= సంహరించి; మగుడన్+చనుదెంచువాఁడు= తిరిగి (ఆశ్రమానికి) వచ్చేవాడు; తనకున్+ఎదురుగాన్ వచ్చు= తనకు ఎదురుగా అరుగుదెంచే; లక్ష్మణున్+కని= లక్ష్మణుడిని చూచి; రాక్షస, గోచరంబు+అయిన= రక్కసులు నివసించేదైన; వనంబునన్= అడవిలో; జానకిన్= సీతను; ఒంటి+ఉనిచి= ఒంటరిగా విడిచిపెట్టి; వచ్చి= అరుగుదెంచి; తప్పు+చేసితి(వి)= దోషం చేశావు; అని పలుకుటయున్= అని (రాముడు) చెప్పుటయు; సుమిత్రా, నందనుండు= సుమిత్రకొడుకు- లక్ష్మణుడు; ధాత్రీతనయ= భూదేవి కూతురు- సీత; తన్నున్= తనను (లక్ష్మణుడిని); అవమానించి= అగౌరవం చేసి; పలికిన తెఱంగు= మాటాడినతీరు; చెప్పినన్= వచించగా.

తాత్పర్యం: ఈవిధంగా జటాయువును సంహరించి రావణుడు మిక్కిలివేగంతో పోతూ ఉండగా, సీత తనకు ఇంక సాయం చేసేవారు ఎవరున్నూ లేరని నిరాశపడి, ఒక కొండశిఖరంపై కొంతమంది వానరులు విహరిస్తూ ఉండటం చూచి, ఆ శిఖరంమీద పడేటట్లుగా తన ఆభరణాలను చీరచెంగు చించి మూటకట్టి పడవేసింది. రావణుడు సీతను గైకొని లంకాపురానికి చేరి అందుగల అశోకవనంలో ఆమెను ఉంచాడు. ఆమెను సంరక్షించటానికై రాక్షసస్త్రీలను కొంతమందిని నియమించాడు. ఇట దండకారణ్యంలో శ్రీరాముడు మారీచుడిని సంహరించిన పిదప తమ పర్ణశాలకు వెళ్లుతున్నాడు. మార్గమధ్యంలో లక్ష్మణుడు ఎదురువచ్చాడు. అప్పుడు శ్రీరాముడు- 'రాక్షసులు నిండిఉండే దండకారణ్యంలో సీతను ఒంటరిగా విడిచిపెట్టి రావటం తప్పు సుమీ' అని హెచ్చరించాడు. లక్ష్మణుడు సీత తనను నిందించిన తీరు శ్రీరాముడికి చెప్పాడు. శ్రీరాముడి హృదయంలో ఆందోళన అధికమయింది.

మధురాక్కర

కనకమృగ మట్లు దను దవ్వుగాఁ ద్రిప్పి తెచ్చుటకు,
వనజముఖి నేకతమ శూన్యవనమునయం దునిచి
వెనుక ననుజుండు వచ్చిన విధమునకు, మదిలోన
ననఘుఁ డెంతయు వగచుచు నరిగె నాశ్రమమునకు. 86

ప్రతిపదార్థం: కనక, మృగము= బంగారులేడి; అట్లు= ఆరీతిగా; తనున్= తనను (శ్రీరాముడిని); దవ్వుగాన్= దూరంగా; త్రిప్పి= సంచరింపజేసి; తెచ్చుటకున్= తీసికొని రావటానికిన్నీ; వనజముఖిన్= పద్మంవంటి ముఖం కలదానిని- సీతను; ఏకతము+అ= ఒంటరిగా; శూన్యవనమునందున్= ఎవరున్నూ లేని (నరసంచారం లేని) అడవిలో; ఉనిచి= ఉంచి; వెనుకన్= (తాను వెళ్లిన మార్గం) వెంబడి; వచ్చిన= అరుదెంచిన; విధమునకున్= తీరుకు; మదిలోనన్= చిత్తంలో; అనఘుఁడు= పాపరహితుడు- శ్రీరాముడు; వగచుచున్= విచారిస్తూ; ఆశ్రమమునకున్= తాను నివసించే తోటవిడిదికి, పర్ణశాలకు; అరిగెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: బంగరులేడి తనను అడవిలో దవుదవ్వులకు కొనిపోయినందుకూ, పద్మంవంటిముఖంగల సీతను ఒంటరిగా నరసంచారం లేని ఆ అడవిలో విడిచిపెట్టి తన వద్దకు సోదరుడు లక్ష్మణుడు వచ్చినందుకూ అంతరంగంలో చింతిల్లుతూ పుణ్యాత్ముడైన శ్రీరాముడు తన ఆశ్రమానికి తిరిగి వచ్చాడు.

విశేషం: మధురాక్కర పాదంలో వరుసగా 1 సూర్యగణం 3 ఇంద్రగణాలు, 1 చంద్రగణం ఉంటాయి. నాల్గవ గణం మొదటి అక్షరం యతి. ప్రాస నియమం ఉన్నది.

వ. అట్లు సని చేతనారహితం బైన శరీరంబునుంబోలె సీతావి హీనంబయి యున్న పర్ణగృహంబుం గనుంగొని రాఘవుండు మూర్ఛితుండై,

లక్ష్మణ ప్రయత్నంబునఁ గొండొకవడికిఁ దెలివొందె; నంత నయ్యన్నయుం దమ్ముండును దత్ప్రదేశంబుల యందు సుందరిం దడవుచుం జనువారు ముందట. 87

ప్రతిపదార్థం: అట్లు+చని= ఆ విధంగా నడచి; చేతనా, రహితంబు+ఐన= కదలిక మెదలిక లేనట్టి (అసువులు పాసిన); శరీరంబునున్+పోలెన్= దేహంవలె; సీతా విహీనంబు+అయి+ఉన్న= సీత లేనిది అయిఉన్న; పర్ణగృహంబున్= ఆకులతో నిర్మించిన ఇంటిని; కనుంగొని= చూచి; రాఘవుండు= రఘువంశంలో పుట్టినవాడైన రాముడు; మూర్ఛితుండు+ఐ= స్పృహ కోలుపోయినవాడు అయి; లక్ష్మణప్రయత్నంబునన్= లక్ష్మణుడు చేసిన కృషివలన; కొండొక వడికిన్= కొంతసేపటికి; తెలివి+ఒందెన్= తేరుకొన్నాడు; అంతన్= అటుమీద; ఆ+అన్నయున్, తమ్ముండును= ఆ అగ్రజుడును, లక్ష్మణుడును; తత్+ప్రదేశంబుల+అందున్= ఆయాచోటులలో; సుందరిన్= సౌందర్య వతిని- సీతను; తడవుచున్= వెదకుతూ; చనువారు= వెళ్ళేవారు; ముందటన్= ఎదుట.

తాత్పర్యం: రామలక్ష్మణులు ఆ విధంగా ఆందోళన చెందుతూ నడిచి సీత లేని పర్ణశాలను ప్రాణం లేని దేహంవలె నున్నదానిని చూచారు. రాముడు ఆ శూన్యపర్ణకుటీరాన్ని కాంచి మూర్ఛిల్లాడు. లక్ష్మణుడు శీతలోపచారాలు చేయగా కొంతతడవుకు శ్రీరాముడు తేరుకొన్నాడు. అంతట ఆ అన్నదమ్ములు ఇరువురును ఆయా ప్రదేశాలలో సీతాదేవిని వెదకుకొంటూ వెళ్ళుతున్నారు. ముందట....

విశేషం: అలం: ఉపమ.

తే. కులిశపాతభంగుర మైన కులనగంబు।
కరణిఁ బడియున్న గృధ్రంబుఁ గాంచి బుద్ధి

నదియు రాక్షసమాయయౌ నని తలంచి।
యేయ సమకట్టుటయు విహగేంద్రుఁ డెఱిఁగి. 88

ప్రతిపదార్థం: కులిశపాతభంగురము+ఐన= వజ్రం (దెబ్బ) పడటంచేత పగిలినది అయిన; కుల, నగంబు= కులపర్వతం; కరణిన్= వలె; పడి+ఉన్న= నేలపై కూలి ఉన్న; గృధ్రంబున్= గద్దను; కాంచి= చూచి; బుద్ధిన్= చిత్తంలో; అదియున్= (ఆ గద్దయును); రాక్షసమాయ+ఔన్+అని= రక్కసుల మోసమే అని; తలంచి= భావించి; ఏయన్= బాణంతో కొట్టటానికి; సమకట్టుటయున్= పూనుకోగా; విహగ+ఇంద్రుఁడు= పక్షులలో శ్రేష్ఠుడు- జటాయువు; ఎఱిఁగి= తెలిసికొని.

తాత్పర్యం: వజ్రాయుధం యొక్క దెబ్బతో కుప్పకూలిన కులపర్వతంవలె నేలపై పడిఉన్న గొప్పగద్దను చూచి అదికూడా రక్కసులు కల్పించిన మోసంగా భావించి, రామలక్ష్మణులు బాణాలను ప్రయోగించటానికి ఉద్యుక్తులైనారు. అంతట ఆసంగతి గ్రహించి వారలతో ఆ జటాయువు ఇట్లా పలికాడు.

విశేషం: (1) అలం: ఉపమ (2) పురాణకథ : పూర్వకాలంలో పర్వతాలు రెక్కలు కలిగి విహరిస్తూ ఉండేవట. అవి ఎక్కడ వ్రాలితే అక్కడ జనపదాలు, పొలాలు, అడవులు నాశనమౌతూ ఉండటంవలన దేవేంద్రుడు తన వజ్రాయుధంతో సంధించి ఆ కొండల రెక్కలను ఖండించాడు.

క. 'ఓయయ్యలార! యేను జ।
టాయు వనంబరఁగు పక్షి నరుణతనయుఁడన్
మీయయ్య దశరథక్షితి।
నాయకునకుఁ బ్రియసఖుండ' నావుడు వారల్. 89

ప్రతిపదార్థం: ఓ+అయ్యలార!= ఓ ఆర్యులారా- ఓరామలక్ష్మణులారా!; ఏను= నేను; జటాయువు+అనన్+పరఁగు= జటాయువు అనే పేర పిలువబడే;

పక్షిన్= పక్షిని; అరుణతనయుఁడన్= అరుణుడి పుత్రుడను; మీ+అయ్య= మీతండ్రి; దశరథ, క్షితి, నాయకునకున్= దశరథమహారాజుకు; ప్రియసఖుండన్= ఇష్టుడ నయిన మిత్రుడను; నావుడున్= అనవుడు, అని చెప్పగా; వారల్= వారు, శ్రీరామలక్ష్మణులు.

తాత్పర్యం: 'ఓ ఆర్యులారా! శ్రీరామలక్ష్మణులారా! నేను జటాయువు అనే పక్షిని. అరుణుడి కుమారుడను. మీ తండ్రి దశరథమహారాజుకు మిత్రుడను' అని చెప్పాడు. అంతట శ్రీరామలక్ష్మణులు.

విశేషం: అరుణుడు= అనూరుడు- సూర్యుడి సారథి, గరుత్మంతుడి అన్న.

వ. డాయ నరుగుదెంచుటయు నతండు వారితో రావణుండు వైదేహిం గొనిపోవుటయుఁ, దదర్థంబై తాను నద్దనుజుం దొడరి పెనంగుటయుం జెప్పి, యావల రావణుం డరిగినదెస నెఱింగించి విగతజీవుం డయ్యె; నయ్యిరువురు నప్పులుఁగుఱేనికి నతిగౌరవంబున నగ్నిసంస్కారాదికరణీయంబులు నిజజనక నిర్విశేషంబుగా నాచరించి దక్షిణాభిముఖులై చని చని. 90

ప్రతిపదార్థం: డాయన్+అరుగుదెంచుటయున్= సమీపంగా రావటమున్నూ; అతండు= అతడు (ఆ జటాయువు); వారితోన్= రామలక్ష్మణులతో; రావణుండు; వైదేహిన్= సీతను (విదేహరాజు కూతురును); కొనిపోవుటయున్= తీసికొని వెళ్ళటమున్నూ; తత్+అర్థంబు+ఐ= అందుకొరకై; తాను= తాను (జటాయువు); ఆ+దనుజున్= ఆ రాక్షసుడిని (రావణుడిని); తొడరి= పూని; పెనంగుటయున్= పోరాడటమున్నూ; చెప్పి= వచించి; ఆవలన్= ఆ పిదప; రావణుండు; అరిగిన= వెళ్ళిన; దెసన్= దిక్కును; ఎఱింగించి= తెలిపి; వి,గత, జీవుండు+అయ్యెన్= పోయిన జీవం కలవాడు అయ్యాడు, మరణించాడు; ఆ+ఇరువురున్= ఆ ఇద్దరు- రామలక్ష్మణులు; ఆ+పులుగు ఱేనికిన్= ఆ పక్షిరాజుకు (జటాయువుకు); అతి, గౌరవంబునన్= గొప్పభక్తితో; అగ్నిసంస్కార+ఆది, కరణీయంబులు= దహనం చేయటం మున్నగు (దినవార) క్రియలు: నిజ, జనక, నిర్విశేషంబుగాన్= తమయొక్క తండ్రితో సమానంగా; ఆచరించి= చేసి; దక్షిణ+అభిముఖులు+ఐ= దక్షిణదిక్కుగా మొగాలు కలవారై; చని, చని= వెళ్ళి వెళ్ళి.

తాత్పర్యం: రామలక్ష్మణులు జటాయువును సమీపించి నిలిచారు. అంతట ఆ పక్షిరాజు వారితో రావణుడు సీతను కొనిపోవటాన్నీ, తాను ఆ అత్యాచారాన్ని ఎదుర్కొని పోరాడి రెక్కలు కోల్పోయి నేలగూలటాన్నీ వివరించి చెప్పి, మరణించాడు. అంతట రామలక్ష్మణులు ఇరువురు తమ తండ్రితో సమానంగా భావించి జటాయువుకు అగ్నిసంస్కారాలు చేసి అంత్యక్రియలు నిర్వర్తించారు. జటాయువువలన రావణుడు దక్షిణదిక్కుకు పోయాడని తెలిసికొని తాముకూడ దక్షిణదిశగా పయనంచేయసాగారు.

**ఉ. ఉరమునయందుఁ గన్నులుఁ బృథూదరదేశమునందు నోరుఁ బ్ర
స్ఫురితభుజద్వయంబుఁ గులభూమిధరోన్నతభావముం గరం
బరుదుగ నుగ్రమైన వికృతాకృతితోడ నశేషసత్త్వఘ
స్మరుఁ డగుచున్నవానిఁ బటుసత్త్వుఁ గబంధునిఁ గాంచి రచ్చటన్.91**

ప్రతిపదార్థం: అచ్చటన్= ఆ ప్రదేశంలో; ఉరమునయందున్= వక్షంలో; కన్నులున్; పృథు+ఉదరదేశమునందున్= విస్తార మైన కడుపు ఉన్న చోటులో; నోరున్= నోరున్నూ; ప్రస్ఫురిత, భుజ, ద్వయంబున్= బాగా విస్తరించిన రెండు బాహువులున్నూ; కుల, భూమిధర+ఉన్నతభావమున్= కులపర్వతం వంటి ఔన్నత్యాన్నీ; కరంబు= మిక్కిలి; ఉగ్రము+ఐన= భయంకర మైన; వికృత+ఆకృతితోడన్= వికారమయిన రూపంతో; అశేష సత్త్వ ఘస్మరుఁడు= పెక్కుజంతువులను చంపి తినేవాడు; అగుచున్నవానిన్= అయినవాడిని; పటుసత్త్వున్= మిక్కుటమైన బలం కలవాడిని; కబంధునిన్= కబంధుడు అనేవాడిని; కాంచిరి= చూచారు.

తాత్పర్యం: రామలక్ష్మణులు, అచట వికృతమైన రూపం గల కబంధుడిని చూచారు. ఆ కబంధుడికి కన్నులు వక్షంలో ఉన్నవి. పెద్దకడుపులో నోరు ఉన్నది. మిక్కిలి పొడవైన బాహువులతో కులపర్వతంవలె ఎత్తైన, మిగుల భీతిని గొల్పే వికార స్వరూపంతో ఉన్నాడు. అమిత బలంగల ఆ కబంధుడు పెక్కుజంతువులను చంపి పొట్టనింపుకొనే గొప్ప తిండిపోతు.

ఆ. అక్కబంధుఁ డామిషార్థియై లక్ష్మణుఁ।
బట్టికొనియె బాహుబల మెలర్పః
నతఁడు గడువిషణ్ణుఁడై 'యన్న! ననుఁ జూడు'।
మనుచు రాముఁ జూచి యనియె మఱియు. 92

ప్రతిపదార్థం: బాహుబలము+ఎలర్పన్= చేతులశక్తి శోభిల్లేటట్లుగా; ఆ+కబంధుఁడు; ఆమిష+అర్థి+ఐ= మాంసాన్ని కోరినవాడై; లక్ష్మణున్+ పట్టికొనియెన్= లక్ష్మణుడిని పట్టు కొన్నాడు; అతఁడు= లక్ష్మణుడు; కడున్= మిక్కిలి; విషణ్ణుఁడు+ఐ= విచారంతో కూడిన వాడై; అన్న!= అగ్రజా, శ్రీరామా!; ననున్= నన్ను; చూడుము= అరయుము; అనుచున్= అంటూ; రామున్= రాముడిని; చూచి; మఱియున్= వెండియు; అనియెన్= పలికాడు.

తాత్పర్యం: ఆ కబంధుఁడు మాంసాహారం కొరకై అన్వేషిస్తూ యాదృచ్ఛికంగా లక్ష్మణుడిని పట్టుకొన్నాడు. లక్ష్మణుడు కబంధుడి బాహుబంధాన్ని విడిపించుకొనలేక పోయాడు. కబంధుడి బలం అట్టిది! అంత లక్ష్మణుడు విషాదంతో నిండిన చిత్తం కలవాడై 'అన్నా! శ్రీరామా! నన్ను చూడుము. నేను ఎట్టి దుఃస్థితిలో చిక్కానో!' అని చెప్పి, ఇంకా ఇట్లా పలికాడు.

శ్రీరాముఁడు కబంధుఁ డను రాక్షసుం జంపుట (సం. 3-263-27)

సీ. 'మహనీయసామ్రాజ్యమహిమ వాయుటయును,।
బితృమరణంబు, నాభీలవిపిన

భూములఁ గడుదుఃఖమునఁ జరించుటయు, వై।
దేహిఁ గోల్పడి వగఁదిరుగుటయును,
దుదిఁ బోయి యే నిట్టు దొడరి యీ దానవు।
వాతఁ జిక్కుటయును వగవ నీకుఁ
బైపయిఁ బెక్కులాపద లయ్యె నక్కట!।
ధరణీశ! నీవు నా ధరణిసుతయుఁ

ఆ. గలసి పూజ్యరాజ్యగౌరవంబున వెలుఁ।
గంగ నెలమిఁ జూడఁ గాన నైతి
నేను దలఁప నెట్టి హీనభాగ్యుండనో!'।
యనుచు ననుజుఁ డార్తి నడలుట యును. 93

ప్రతిపదార్థం: ధరణీ+ఈశ!= రాజా, శ్రీరామా!; మహనీయసామ్రాజ్య మహిమ= గొప్ప దైనది, విస్తరించినది అయిన రాజ్యం యొక్క గౌరవం; వాయుటయును= వదలిపోవటమున్నూ; పితృ, మరణంబున్= తండ్రి చనిపోవటమున్నూ; ఆభీల, విపిన, భూములన్= భయంకరమైన అడవి ప్రదేశాలలో; కడున్= మిక్కుటమైన; దుఃఖమునన్= ఆవేదనతో; చరించుట యున్= తిరుగుటయున్నూ; వైదేహిన్= సీతను; కోల్పడి= పోగొట్టుకొని; వగన్= దుఃఖంతో; తిరుగుటయును= సంచరించటమున్నూ; తుదిన్+ పోయి= చిట్టచివరకు; ఏన్= నేను; ఇట్టు= ఈరీతిగా; తొడరి= కడగి; ఈదానవు వాతన్= ఈరాక్షసునినోటికి; చిక్కుటయును= వశం కావటమున్నూ; వగవన్= ఆలోచించగా; నీకున్= ఓరామా! నీకు; పై+పయిన్= ఒకదానిపై మరొకటి; పెక్కులు= అనేకాలైన; ఆపదలు+అయ్యెన్= కష్టాలు సంప్రాప్తాలయ్యాయి; అక్కట= అయ్యో! ఎంత దురవస్థ వాటిల్లింది; నీవున్= నీవును; ఆ ధరణిసుతయున్= భూమికి కూతురు అయిన సీతాదేవియున్నూ; కలసి= కూడి; పూజ్య, రాజ్య, గౌరవంబునన్= ఆరాధించదగిన రాజ్యమర్యాదలతో; వెలుగంగన్= ప్రకాశించగా; ఎలమిన్= సంతోషంతో; చూడన్+కానన్+

ఐతిన్= దర్శింపజాలకపోయాను; నేను= నేను; తలఁపన్= యోచించగా; ఎట్టి= ఎటువంటి; హీనభాగ్యుండన్+ఓ= దురదృష్టవంతుడనో కదా; అనుచున్= అని అంటూ; అనుజుఁడు= తమ్ముడు (లక్ష్మణుడు); ఆర్తిన్= దుఃఖంతో; అడలుటయును= కలతచెందినవాడు కాగా.

తాత్పర్యం: 'అగ్రజా, శ్రీరామా! నీకు ఆపదలపై ఆపదలు దాపురించాయి. భోగభాగ్యాలతో తులతూగే రాజ్యం తొలగిపోయింది. తండ్రిగారు మరణించారు. భయంకరమైన అడవులలో తిరుగాడవలసి వచ్చింది. చిట్టచివరకు దురదృష్టదశకు పరాకాష్ఠగా- నేను ఈ రాక్షసుడికి చిక్కాను. ఇక ఈతడు నన్ను తన పొట్టనపెట్టు కొంటాడు. అయ్యో! శ్రీరామచంద్రా! నీవును నీదేవియైన సీతాదేవియు పట్టాభిషేకం చేసికొని, రాజలాంఛనాలతో శోభిల్లే సుందరదృశ్యాన్ని కనులపండువుగా కాంచలేకపోయానుగదా! ఇక నావంటి దురదృష్టవంతుడు ఎవడైనా ఉన్నాడా?' అంటూ లక్ష్మణుడు విచారంతో కలతచెందాడు.

తే. విగతసంభ్రముఁ డై రామవిభుఁడు గడఁగి ।
'యన్న! లక్ష్మణ! యోడకుమన్న, యేను
గలుగ నీ కేల యాపద గలుగనేర్చు?
ననుచు గ్రక్కున నిశితమహాసి వెఱికి. 94

ప్రతిపదార్థం: రామవిభుఁడు= రామరాజు; విగతసంభ్రముఁడు+ఐ= పోయిన తత్తరపాటు కలవాడై, ధైర్యం కలవాడై; కడఁగి= పూని; అన్న! లక్ష్మణ!= ప్రేమపాత్రుడ వైన లక్ష్మణా!; ఓడకుము+అన్న!= భయపడవద్దయ్యా!; ఏను= నేను; కలుగన్= ఉండగా; నీకున్= నీకు; ఆపద= కీడు; ఏల కలుగనేర్చున్= ఎందుకు ఏర్పడుతుంది; అనుచున్= అని అంటూ; గ్రక్కునన్= వేగంగా; నిశిత, మహా+అసి= వాడి అయిన గొప్పకత్తిని; వెఱికి= (ఒరనుండి) బయటకు లాగి.

తాత్పర్యం: శ్రీరాముడు ఎట్టి తత్తరపాటు చెందకుండా ధీరుడై నిలిచి 'ప్రియమైన తమ్ముడా! లక్ష్మణా! నేను ఉండగా నీకు ఎట్టి కీడు వాటిల్లదు' అంటూ ఒరనుండి గొప్పదైన తన కత్తిని తీశాడు.

వ. ఆ రక్కసు డాచేయిఁ దునియ వ్రేసిన లబ్ధమోక్షుండయి లక్ష్మణుండు ప్రకటసైంహికేయ దంష్ట్రాయంత్ర విముక్తుండయిన తిగ్మభానుండునుం బోలెఁ బ్రదీప్తుండయి తీక్ష్ణకౌక్షేయకంబునఁ దదీయ దక్షిణబాహు ఖండనంబు సేసి పార్శ్వద్వయంబు భేదించిన నాక్షణంబ కబంధుఁడు దివ్యరూపధరుం డగుటయుం గని రాఘవుండు విస్మితుండై. 95

ప్రతిపదార్థం: ఆ, రక్కసు, డా, చేయిన్= ఆ రాక్షసుడియొక్క ఎడమచేతిని; తునియన్‌వ్రేసినన్= ఖండించగా; లబ్ధమోక్షుండు+ అయి= పొందిన విముక్తి కలవాడు అయి (విముక్తి పొందినవాడై); లక్ష్మణుండు= లక్ష్మణుడు; ప్రకట, సైంహికేయదంష్ట్రా, యంత్ర, విముక్తుండు+అయిన= తేటతెల్లంగా కనుపించిన రాహువుయొక్క కోరలు అనే మరనుండి విడిచిపెట్టబడిన; తిగ్మ, భానుండునున్+పోలెన్= తీక్ష్ణమైన కిరణాలు కల సూర్యుడివలె; ప్రదీప్తుండు+అయి= వెలుగొంది; తీక్ష్ణ+కౌక్షేయకంబునన్= వాడి అయిన కత్తిచేత; తదీయ, దక్షిణ, బాహు, ఖండనంబు+చేసి= ఆతడియొక్క (ఆ కబంధుడియొక్క) కుడిచేతిని నరికి; పార్శ్వద్వయంబు= ప్రక్కలజంటను (కుడిప్రక్కగా, ఎడమప్రక్కగా ఉన్న ఉదరభాగాన్ని - అనగా చంకల క్రింది భాగాలను); భేదించినన్= చీల్చగా; ఆ, క్షణంబు+అ= ఆత్రుటిలోనే (వెంటనే); కబంధుఁడు; దివ్య, రూప, ధరుండు+అగుటయున్= దేవతలకు సంబంధించిన ఆకారం కలవాడు కావటం; కని= చూచి; రాఘవుండు= శ్రీరాముడు; విస్మితుండు+ఐ= అచ్చెరువును పొందినవాడై.

తాత్పర్యం: శ్రీరాముడు కబంధుడి ఎడమచేతిని తనకత్తితో ఖండించాడు. వెనువెంటనే కబంధుడిబారినుండి విముక్తుడైన లక్ష్మణుడు రాహువుయొక్క

కోరలనుండి విడివడిన సూర్యుడివలె ప్రకాశిస్తూ వాడికత్తిని తీసి కబంధుడి కుడిచేతినికూడ ఖండించి, వాడిపొట్టను ఇరుప్రక్కల చీల్చాడు. ఆక్షణంలోనే ఆరాక్షసుడు దివ్యరూపం ధరించి నిల్చాడు. శ్రీరాముడు ఆశ్చర్యపోయాడు.

విశేషం: కౌక్షేయకం= కుక్షికిదగ్గరగా ధరించబడే కత్తి. సంశోధితప్రతిలో గౌక్షేయకంఅని ఉన్నది. అది అచ్చుపొరపాటు. పూర్వకాలంలో వీరులు తనపొట్టకు కత్తిని ఆత్మరక్షణకై ఉపయోగించేనిమిత్తం కట్టుకొంటూ ఉండేవారు.

క. 'ఈవనమునందు రాక్షస।
భావంబున నున్న నీకుఁ బ్రకటితదివ్య
త్వావాప్తి యైన కారణ।
మేవిధ?' మనుటయును నాతఁ డిట్లని చెప్పెన్. 96

ప్రతిపదార్థం: ఈవనమునందున్= ఈ అరణ్యంలో; రాక్షసభావంబునన్= రక్కసివై; ఉన్న= ఉన్నటువంటి; నీకున్= నీకు; ప్రకటిత దివ్యత్వ+అవాప్తి= తేటతెల్ల మైన దేవతాస్వరూపం పొందటానికి; ఐన, కారణము= అయిన హేతువు; ఏవిధము= ఏరీతిగా ఏర్పడింది అనుటయునున్= (అని రాముడు) ప్రశ్నించటమున్నూ!; ఆతఁడు= అతడు (దివ్యరూపం తాల్చిన కబంధుడు); ఇట్లు+అని= ఈరీతిగా; చెప్పెన్= వచించాడు.

తాత్పర్యం: 'ఓ దివ్యపురుషుడా! నీవు ఇంతవరకు ఈ అడవిలో రాక్షసరూపంలో రాక్షసజీవితాన్ని గడపి ఉన్నావుకదా! ఇప్పుడు నీకు ఈ దివ్యరూపం ఏవిధంగా సంప్రాప్తించింది?' అని శ్రీరాముడు ప్రశ్నించాడు. అంతట దివ్యరూపం తాల్చి నిల్చిన భూతపూర్వ కబంధుడు ఈ రీతిగా పలికాడు.

వ. ఏను విశ్వావసుం డను గంధర్వుండ; బ్రహ్మశాపంబునం జేసి రాక్షసత్వంబు నొంది మీవలన శాపమోక్షంబు వడసితి; రావణుం డను రక్కసుండు జానకిం గొనిపోయి, లంకానగరంబున నునిచినవాఁడు; మీకు

హితోపదేశంబు సేసెద; నిట పోవంబోవఁ బంపాభిధానం బయిన సరోవరంబు గలదు; దాని యావల ఋశ్యమూకం బనుశైలంబునందు వాలిసహోదరుండు సుగ్రీవుం డను వానరుండు సచివ చతుష్టయ సహితుండై యుండు; నతనితోడ సఖ్యంబు సేయుము; దానం జేసి నీకుఁ గార్యసిద్ధి యగు' నని పలికి గంధర్వుండు వారి వీడ్కొని నిజేచ్ఛం జనియెఁ ; దదనంతరంబ యట చని చని. 97

ప్రతిపదార్థం: ఏను= నేను; విశ్వావసుండు+అను= విశ్వావసుడు అనే పేరుకల; గంధర్వుండన్= గంధర్వుడను; బ్రహ్మశాపంబునన్+చేసి= బ్రహ్మదేవుడి యొక్క శాపంవలన; రాక్షసత్వంబున్= రాక్షసభావాన్ని; ఒంది= పొంది; మీవలనన్= (ఓ రామా! ఓలక్ష్మణా!) మీవలన; శాపమోక్షంబున్= శాపంనుండి విడుదల; పడసితిన్= పొందాను; రావణుండు+అను= రావణుడు అనేపేరు కల; రక్కసుండు= రాక్షసుడు; జానకిన్= సీతను; కొనిపోయి= అపహరించి; లంకానగరంబునన్= లంక అనే పట్టణంలో; ఉనిచినవాఁడు= ఉంచాడు; మీకున్= (రామలక్ష్మణులైన) మీకు; హిత+ఉపదేశంబు+ చేసెదన్= మేలు కలిగించే మాటలను చెప్పుతాను; ఇట, పోవన్+పోవన్= ఇక్కడ నుండి వెళ్లగా వెళ్లగా, చాలాదూరం పయనించగా; పంపా+ అభిదానంబు+అయిన= పంప అనే పేరు కలిగిన; సరోవరంబు= సరస్సు; కలదు= ఉన్నది; దాని+ఆవలన్= ఆ పంపాసరోవరం దాటినపిదప; ఋశ్యమూకంబు+అను, శైలంబునందున్= ఋశ్యమూకం అనేపేరు గల కొండమీద; వాలి సహోదరుండు= వాలియొక్క తమ్ముడు; సుగ్రీవుండు+అను= సుగ్రీవుడు అనే పేరు గల; వానరుండు= కోతి; సచివచతుష్టయ, సహితుండు+ఐ= మంత్రులు నలుగురితో కూడినవాడు అయి; ఉండున్= నివసిస్తూ ఉంటాడు; అతనితోడన్= ఆ సుగ్రీవుడితో; సఖ్యంబు+ చేయుము= మైత్రి నెరపుము; దానన్+చేసి= దానివలన; నీకున్= నీకు; కార్యసిద్ధి+అగున్= కార్యం నెరవేరగలదు; అని పలికి= అని వచించి; వారిన్= వారిని (రామలక్ష్మణులను);

వీడ్కొని= మర్యాద పూర్వకంగా సెలవు గైకొని; గంధర్వుండు= గంధర్వుడు; నిజ+ఇచ్చన్= తనయిచ్చ వచ్చిన చొప్పున; చనియెన్= వెళ్ళాడు; తత్+అనంతరంబు+అ= అటు పిమ్మట; చని చని= వెడలివెడలి (చాలదూరం ప్రయాణం చేసి).

తాత్పర్యం: 'నేను విశ్వావసుడు అనేపేరు గల గంధర్వుడను. బ్రహ్మదేవుడిశాపంవలన నాకు రాక్షసజన్మ వచ్చింది. నేడు మీమూలంగా నాకు శాపవిమోచనం కలిగింది. రావణుడు అనే రాక్షసుడు సీతను అపహరించి లంకాపట్టణానికి కొనిపోయాడు. మీమేలు కోరి నేను చెప్పే వాక్యాలు వినండి. ఇటనుండి బహుదూరం పయనించిన పిదప 'పంప' అనే పేరు గల సరోవరం చేరుతారు. ఆ సరస్సుకు కొంచెం దూరంలో ఋశ్యమూకం అనేపేరు గల పర్వతం ఉన్నది. ఆ పర్వతంమీద వాలితమ్ముడు సుగ్రీవుడు అనే వానరుడు నలుగురు మంత్రులతో కలిసి నివసిస్తున్నాడు. మీరు ఆ సుగ్రీవుడితో స్నేహం చేయండి. దానివలన మీపని నెరవేరగలదు' అని చెప్పి ఆ గంధర్వుడు రామలక్ష్మణులవద్ద మర్యాదగా సెలవుతీసికొని ఇచ్చవచ్చినచోటికి వెళ్ళాడు. పిమ్మట రామలక్ష్మణులు బహుదూరం పయనించి.

సీ. కమనీయకమలినీకహ్లారదళకేస ।
రాన్వితజలముల నర్ఘ్యవిధియుఁ,
దరళతరంగహస్తములఁ బాద్యంబు, ను ।
న్మద చక్రసారసమధుపహంస
రుతులఁ బ్రియోక్తులు, రుచిరవానీర ని ।
వేశనచ్ఛాయల విశ్రమంబు
మందసంచారితమారుతంబుల నురు ।
తాపనోదనమును దగిలి యెపుడు

ఆ. నాచరించుచును సమంచితాతిథి జన ।
సేవనమునఁ దనదుజీవనంబు
ఫలము నొంద నొప్పు పంపాసరోవరం ।
బెదురఁ గాంచి రన్నరేంద్ర సుతులు. 98

ప్రతిపదార్థం: ఆ+నర+ఇంద్ర, సుతులు= ఆ రాజపుత్రులు (రామలక్ష్మణులు); కమనీయ, కమలినీ, కహ్లార, దళ, కేసర+అన్విత, జలములన్= మనోహరాలైన తామరతంపరలతో, ఇంచుక తెలుపు ఇంచుక ఎఱుపు రంగును గల సౌగంధికపుష్పాల యొక్క రేకులలోని కింజల్కాలతో కూడిననీళ్లతో; అర్ఘ్యవిధియున్= పూజాసత్కారానికి ఇచ్చే నీరును; తరళ, తరంగహస్తములన్= మెరుస్తున్న కెరటాలు అనేచేతులతో; పాద్యంబున్= పాదాలు కడుగుకొనటానికై స్వాగతపూర్వకంగా ఇచ్చే నీరును; ఉన్మద, చక్ర, సారస, మధుప, హంస, రుతులన్= బాగా మత్తిల్లిన చక్రవాకముల యొక్కయు, బెగ్గురుపక్షుల యొక్కయు, తుమ్మెదలయొక్కయు, అంచలయొక్కయు ధ్వనులచేత; ప్రియోక్తులు= ప్రియ+ఉక్తులు= (యోగక్షేమాల నడిగే) మంచిమాటలును; రుచిర, వానీర, నివేశన+ఛాయలన్= ప్రకాశించే నీటిప్రబ్బలిచెట్లు సమకూర్చే విడిదిఇండ్లనీడలలో; విశ్రమంబు= విశ్రాంతి; మంద, సంచారితమారుతంబులన్= మెలమెల్లగా వీచే గాలులచేత; ఉరు, తాపనోదనమును= మిక్కుటమైన ఎండను తొలగించుటయును; తగిలి= పూని; ఎపుడున్= ఎల్లప్పుడును; ఆచరించుచును= చేస్తూ; సమంచిత+అతిథి, జనసేవనమునన్= ఒప్పిద మయ్యేటట్లుగా అతిథిజనులకు పరిచర్యచేయటంలో; తనదు= తనయొక్క; జీవనంబు=(1) బ్రదుకు, (2)జలం; ఫలమున్+ఒందన్+ఒప్పు= ఫలించే టట్లుగా శోభిల్లు; పంపాసరోవరంబు= పంప అనే పేరు గల సరస్సును; ఎదురన్= తమముందర; కాంచిరి= చూచారు.

తాత్పర్యం: రాజపుత్రులైన ఆ రామలక్ష్మణులు తమకట్టెదురుగా ఉన్న పంపాసరోవరాన్ని చూచారు. ఆ పంపాసరోవరం సతతం అతిథి సత్కారం చేస్తూ తనజీవనం ధన్య మయ్యేటట్లు చేసికొంటున్నట్లు ఒప్పుతున్నది. పంపాసరస్సు ఎల్లప్పుడూ అతిథులకు అర్ఘ్యం సమర్పిస్తూ ఉన్నది. ఆ అర్ఘ్యజలం మనోహరా లైన తామరలచేతను, ఇంచుక తెలుపు ఇంచుక ఎఱుపురంగు గల రేకులతో శోభిల్లే సౌగంధికపుష్పాల కింజల్కాలతో పుప్పొడులతో పరిమళిస్తూ ఉన్నది. ఇక, మెరసే కెరటాలు అనే చేతులతో అతిథులకు కాళ్ళుకడిగేనీటిని సమర్పిస్తూ ఉన్నది. అలాగే చక్రవాకములు, హంసలు మున్నగు జలపక్షుల ధ్వనులనే ప్రియోక్తులతో ఆదరిస్తూ ఉన్నది. తీరాలలోని పొదరిండ్ల నీడలనే విశ్రమస్థలాలను నిర్దేశిస్తున్నది. మందమారుతాలచే తాపశ్రమను తొలగిస్తూ ఉన్నది. ఈ రీతిగా ఈ అతిథిసేవయే తనజీవనానికి ధన్యత కలిగించేటట్లు భావించేదిగా పంపాసరోవరం వారికి గోచరించింది!

విశేషం: (1) అతిథిసేవాపరాయణత్వమే ఉత్తమసంస్కృతికి నికషాయమానం. 'అతిథిదేవోభవ'- సనాతన భారతీయసంప్రదాయాన్ని సూచించే ఉపనిషదుక్తి. (2) అలం: సంపూర్ణ రూపకం. పంపాసరోవరానికి ఆతిథేయునకు ఇట అభేదాధ్యవసాయం హృదయంగమంగా వర్ణించబడింది. (3) అలం: శ్లేష, జీవనం అనగా అర్థం బ్రదుకు. అర్థాంతరం నీరు. ఆతిథేయునిపట్ల బ్రదుకు, పంపా సరోవరంపట్ల నీరు అన్వర్థం. (4) ఈ సీసపద్యం ప్రబంధపరమేశ్వరుడైన ఎఱ్ఱనకు గల వర్ణనాభినివేశానికి ఉదాహరణం.

వ. ఆ సరోవరతీరంబునం గౌసల్యానందనుండు తత్తద్విషయ విశేషోల్లా సంబుల వలనం గ్రొత్తయై చిత్తజానలంబు దరికొని చేతోవృత్తంబు నెరియింపం దొడంగినఁ దాల్మి దొఱంగి జానకిం బేర్కొని యాక్రందన వచనవివశుం డగుటయు, నతనికి లక్ష్మణుం డి ట్లనియె. 99

ప్రతిపదార్థం: ఆ, సరోవర, తీరంబునన్= ఆ (పంపా)సరస్సుయొక్క ఒడ్డునందు; కౌసల్యానందనుండు= కౌసల్యకొడుకు- శ్రీరాముడు; తత్+ తత్+విషయ, విశేష+ ఉల్లాసంబుల వలనన్= ఆయా ఇంద్రియార్థములు విశేషమైన వికాసమును పొందినవగుట వలన; క్రొత్త+ఐ= వినూతన మైనట్టిదై; చిత్తజ+అనలంబు= మన్మథుడికి సంబంధించిన అగ్ని- కామోద్రేకం; దరికొని= సంక్రమించి; చేతస్+వృత్తంబున్= మానసికవ్యాపారాన్ని; ఎరియింపన్+తొడంగినన్= కలత చెందింప సాగగా; తాల్మి= ఓర్పు; తొఱంగి= వీడి; జానకిన్+పేర్కొని= సీతను స్మరించి బిగ్గరగా పలవించి; ఆక్రందన, వచన, వివశుండు+ అగుటయున్= ఏడుస్తూ వశంతప్పినవాడు కాగా; అతనికిన్= రాముడికి; లక్ష్మణుండు; ఇట్లు+అనియెన్= ఈవిధంగా వచించాడు.

తాత్పర్యం: ఆ పంపాసరోవర తీరంలో ఉద్దీపనవిభావా లైన ఆయా మనోహ పరిసరాలను చూచిన శ్రీరాముడు మన్మథభావవివశుడై సీతాదేవిని స్మరిస్తూ బిగ్గరగా ఎలుగెత్తి ఆమెను పేర్కొంటూ ఆక్రోశింపసాగాడు. అంతట లక్ష్మణుడు రాముడితో ఇట్లా పలికాడు.

ఉ. 'పురుషవరేణ్య! యిట్లు మిముబోఁటులకుం జనునయ్య? యాపదల్
వొరసినచోఁ గలంగుట; ప్రభుత్వ మెలర్పఁగఁ దాల్మి యూఁది దు
స్తరతరమానసవ్యథలు దల్గుము; సంభృతపౌరుషుండ వై
యరయుము దేవి యున్నయెడ యారసి కార్యము దీర్ప నేర్పునన్. 100

ప్రతిపదార్థం: పురుష, వరేణ్య!= పురుషులలో శ్రేష్ఠుడవైనవాడా- శ్రీరామా!; ఆపదల్+ పొరసినచోన్= ఇడుములు తారసిల్లినపుడు; కలంగుట= కలత చెందటం; మిము బోఁటులకున్= మీవంటివారికి (మీవంటి మహానుభావులకు); ఇట్లు= ఈ రీతిగా; చనున్+ అయ్య= తగునా?; ప్రభుత్వము+ఎలర్పఁగన్= పరిపాలన అతిశయించగా, అనగా నిగ్రహం శోభిల్లేటట్లుగా; తాల్మి+ ఊఁది= ఓర్పు వహించి; దుస్తర, తర, మానసవ్యథలు= దాటటానికి మిక్కిలి

కష్టమైన మనస్సులోని బాధలు; తల్గుము= (తలుగుము)= వదలిపెట్టుము; సంభృత, పౌరుషుండవు+ఐ= పౌరుషంగలవాడవు అయి; దేవి+ఉన్న+ ఎడ= (సీతా)దేవి ఉన్నచోటు; అరయుము= కనుగొనుము; ఆరసి= కనుగొని; నేర్పునన్= సామర్థ్యంతో; కార్యము+తీర్పుము= పనిని నెరవేర్చుము.

తాత్పర్యం: పురుషులలో శ్రేష్ఠుడవైన శ్రీరామా! ఇక్కట్టులు దాపురించినపుడు మీవంటి మహానుభావులు కలతచెందరాదు. ఓర్పు వహించి నిగ్రహంతో మనస్సులోని వెతలను పారద్రోలాలి. అదే పౌరుషం అనిపించుకొంటుంది. సీతాదేవి ఉన్నచోటు తెలిసికొనుము. తెలిసికొనినపిమ్మట నేర్పుతో కర్తవ్యం నెరవేర్చుము.

ఆ. అధిప! శిష్యుఁడను సహాయుండు భృత్యుండ।
నైన యేను గల్గ నాత్మ నీకు
నేల వగవ?' నని మహీపతిచిత్తంబు।
నలఁత డిందుపఱిచె నవరజుండు. 101

ప్రతిపదార్థం: అధిప!= ఓరాజా, శ్రీరామా!; శిష్యుఁడను= నీవు చెప్పిన చొప్పున నడచుకొంటూ నీకడ జ్ఞానం, శీలం నేర్చుకొనటానికి చేరినవాడిని; సహాయుండన్= నీకు తోడుపడే వాడిని; భృత్యుండన్= సేవకుడను; ఐన= ఐనట్టి; నేను= ఏను; కల్గన్= ఉండగా; నీకున్= నీకు; ఆత్మన్= మనస్సులోపల; వగవన్+ఏల?= విచారించటం ఎందుకు?; అని= అని చెప్పి; మహీపతి చిత్తంబు= రాజుయొక్క అనగా శ్రీరాముడి యొక్క మనస్సులోని; అలఁత= వ్యాకులతను; అవరజుండు= తమ్ముడు- లక్ష్మణుడు; డిందుపఱిచెన్= తగ్గించాడు.

తాత్పర్యం: ఓరాజా! శ్రీరామా! నేను నీకు శిష్యుడిని, భక్తితో ఆరాధించేవాడిని, తోడుపడేవాడిని, పరిచారకుడను. నేను నీప్రక్కన ఉండగా మనస్సులో నీవు ఎందుకు విచారపడాలి?' అని ఊరడించి తమ్ముడైన లక్ష్మణుడు శ్రీరాముడి మనస్సులోని కలవరాన్ని ఉపశమింపజేశాడు.

వ. తదనంతరంబ యయ్యిరువురుం బంపాసరోవరంబునం గృతస్నాను లయి దేవపితృతర్పణంబులు సేసి చని ముందట నతిబహుళబలాహక వ్యూహసన్నాహ సమున్నతంబు లైన యభంగోత్తుంగ శృంగసముదయంబుల నఖిలగగన క్రోడపీడనంబు సేయుచున్న దాని ఋశ్యమూకశైలంబుఁ జేరి తదుపకంఠ ప్రదేశంబున విశ్రమించి యున్నంత. 102

ప్రతిపదార్థం: తత్+అనంతరంబు+అ= అటుపిమ్మట; ఆ+ఇరువురున్= ఆ ఇద్దరును (రామలక్ష్మణులు); పంపాసరోవరంబునన్= పంప అనే సరస్సులో; కృతస్నానులు+అయి= చేయబడిన స్నానం కలవారై (స్నానం చేసినవారై); దేవపితృతర్పణంబులు+చేసి= దేవతలకును, చనిపోయిన తండ్రితాతలు మున్నగువారలు తరించటానికై ఇచ్చే నీళ్లను వదలటం ద్వారా శ్రాద్ధక్రియలు నిర్వహించి; చని= పయనం కొనసాగించి; ముందటన్= ఎదురుగా; అతి, బహుళ బలాహకవ్యూహసన్నాహసమున్నతంబులు+ఐన= తరచైన పెక్కు మేఘాల సముదాయాల చేరికగలవై, మిక్కిలి ఎత్తై ఉన్న; అభంగ+ఉత్తుంగ, శృంగసముదయంబులన్= వంకరటింకరలు లేకుండా నిటారుగా ఉన్న శిఖరాలయొక్క గుంపులచేత; అఖిల, గగన, క్రోడ, పీడనంబు= సమస్తమైన ఆకాశంయొక్క వక్షానికి ఒరిపిడి; చేయుచున్నదానిన్= సలుపుచున్న దానిని; ఋశ్యమూకశైలంబున్+చేరి= ఋశ్యమూకం అనేపేరుగల పర్వతాన్ని చేరి; తత్+ఉపకంఠ; ప్రదేశంబునన్= ఆ (కొండయొక్క) సమీపంలో ఉన్న స్థలంలో - ఆ కొండచరియపై; విశ్రమించి+ఉన్నంతన్= అలపు దీర్చుకొనే సమయంలో.

తాత్పర్యం: పిమ్మట, రామలక్ష్మణులు పంపాసరోవరాన్ని చేరి అందులో స్నానంచేసి వేల్పులకు, పితరులకు తర్పణాలు విడిచారు. పిదప ఆ సరోవరానికి ముందుగా ఉన్న ఋశ్యమూకపర్వతాన్ని చూచారు.ఎత్తైన ఆ పర్వతపు శిఖరాలు మిక్కిలి ఎత్తుగా, నిటారుగా ఉండి ఆకాశం యొక్క వక్షఃస్థలాన్ని రాచుకొంటున్నట్లుగా ఉన్నాయి. ఆ శిఖరాల మీద దట్టంగా మేఘాలు ఆవరించి ఉన్నాయి. వారు- ఇరువురు ఆ కొండను చేరి- ఆ కొండ సమీప ప్రదేశంలో అలపు తీర్చుకొనడానికి కూర్చున్నారు.

సీ. ఆ రాజపుత్త్రుల నారూఢతేజుల ।
వీరుల నున్నతోదారభుజులఁ
గనుఁగొని సుగ్రీవుఁ డనఘుఁ డగ్గిరిశృంగ ।
ముననుండి తానును దన సచివులుఁ
జింతించి వారివృత్తాంతము నెఱుఁగంగ ।
సంతతోత్సాహు ధీమంతు శౌర్య
వంతు నుత్తము హిమవంతునిఁబోని య ।
త్యంతసుస్థిరు హనుమంతుఁ బనిచె;

ఆ. నతఁడు నరిగి నృపతిసుతులతెఱం గెల్ల ।
నెఱిఁగి వనచరేంద్రు నెఱుఁగఁజెప్పి
యుగ్రతేజుఁ డైన సుగ్రీవుతోఁ జెల్మి ।
యొనర సంఘటించె మనుజపతికి. 103

ప్రతిపదార్థం: ఆ రాజపుత్త్రులన్= ఆ రాచబిడ్డలను; ఆరూఢతేజులన్= దేదీప్యమాన మైన కాంతికల వారిని; వీరులన్= పరాక్రమవంతులను; ఉన్నత+ఉదార, భుజులన్= ఎత్తైనవి, గొప్పవి అయిన భుజాలు కలవారిని; అనఘుఁడు= పాపం లేనివాడు; సుగ్రీవుఁడు= సుగ్రీవుడు అనే వానరరాజు; ఆ+గిరి, శృంగమునన్+ఉండి= ఆ కొండకొమ్మున నిలిచి ఉండి; తానును= తానున్నూ; తనసచివులున్= తనమంత్రులున్నూ; కనుగొని= చూచి; చింతించి= ఆలోచించి; వారి, వృత్తాంతమున్= వారిసంగతిని; ఎఱుఁగంగన్= తెలియటానికి; సంతత+ఉత్సాహున్= ఎడతెగని ఉత్సాహం కలిగినవాడిని; ధీమంతున్= తెలివితేటలు కలవాడిని; శౌర్యవంతున్= పరాక్రమం కలవాడిని; ఉత్తమున్= మంచి వాడిని; హిమవంతునిన్+పోని= హిమవంతుని వలె; అత్యంత సుస్థిరున్= మిక్కిలి స్థైర్యం కలవాడిని; హనుమంతున్= హనుమంతుడిని; పనిచెన్= నియోగించాడు; అతఁడున్= ఆ హనుమంతుడును; అరిగి= వెళ్లి (రామలక్ష్మణుల దగ్గరికి వెళ్లి); నృపతి, సుతుల,

తెఱంగు+ఎల్లన్= రాజపుత్రుల (రామలక్ష్మణుల) తీరుతెన్నులన్నిటిని; ఎఱిఁగి= తెలిసికొని; వన, చర+ఇంద్రున్= అడవిలో సంచరించే కోతులకు ప్రభువును- సుగ్రీవుడిని; ఎఱుఁగన్+చెప్పి= తెలిసేటట్లుగా వివరించి చెప్పి; మనుజపతికిన్= మానవుల రాజుకు శ్రీరాముడికి; ఉగ్ర తేజుఁడు+ఐన= మిక్కుటమైన వర్చస్సు కలవాడు అయిన; సుగ్రీవుతోన్= సుగ్రీవుడితో; చెల్మి= మైత్రి; ఒనరన్= ఒప్పిదంగా; సంఘటించెన్= ఏర్పరిచాడు.

తాత్పర్యం: వానరులప్రభువూ పుణ్యాత్ముడూ అయిన సుగ్రీవుడు ఆ రాజపుత్రులైన శ్రీరాముడిని లక్ష్మణుడిని దేదీప్యమానమైన తేజస్సుతో వెలుగొందుతున్నవారిని ఎత్తైనభుజాలతో మహావీరులుగా కన్పిస్తున్నవారిని ఆ కొండకొమ్మననుండి చూచాడు. అంతట ఆ సుగ్రీవుడు తన మంత్రులతో చర్చించి, ఆ రాజపుత్రులవృత్తాంతం తెలిసికొనటానికై హనుమంతుడిని నియోగించాడు. హనుమంతుడు సుగ్రీవుడి సచివుడు, పురుషకార్యం నిర్వహించటంలో లోకోత్తరకార్యాలను సాధించటంలో స్థిరమైన సంకల్పం కలవాడు, మేధావి, పరాక్రమం కలవాడు. మంచివాడు. చలించనిచిత్తం కలవాడు, స్థైర్యంలో హిమాలయపర్వతంవంటివాడు ఆ హనుమంతుడు- సుగ్రీవుని దూతగా ఆ రాజపుత్రులవద్దకు వెళ్లి, వారి సమాచారం సేకరించి, తేజస్వి అయిన సుగ్రీవుడిని గూర్చి వారికి తెలిపి, సుగ్రీవుడికి శ్రీరాముడికి స్నేహం సంఘటించాడు.

విశేషం: (1) అలం: ఉపమ. ధైర్యం గల వీరుడిని చలించని కొండతో పోల్చటం పరిపాటి. హనుమంతుడు హిమవంతుడితో ఇట పోల్చబడ్డాడు. (2) పూర్వకాలంలో రాయబారిగా రాజకార్యాలను తీర్చు సచివుడికి ఉండవలసిన లక్షణాలు ఇట హనుమంతుడి పరంగా పేర్కొనబడ్డాయి.

వ. సుగ్రీవుండును మున్ను సీతాపరిత్యక్తంబై తమ ముందటం బడినం దారు గైకొని సంగ్రహించియున్న భూషణ నిచయంబు రామునకు నివేదించినం జూచి, యతండు సముత్సుకుండై వానికి వానరైశ్వర్యంబు

ప్రతిశ్రుతంబు సేసి తదీయశత్రుం డైన వాలిం జంపఁ బ్రతిజ్ఞ సేసెఁ; గపీశ్వరుండును జానకిం దెచ్చుటకు సహాయంబుగా నొడంబడియె; నంతట నందఱుం గూడికొని వాలి నివాసం బైన కిష్కంధానగరంబున కరిగి; రప్పుడు భానుసూనుండును. 104

ప్రతిపదార్థం: సుగ్రీవుండును= సుగ్రీవుడుసయితం; మున్ను= అంతకు ముందు; సీతా, పరిత్యక్తంబు+ఐ= సీతాదేవిచేత విడువబడినదై; తమ ముందటన్+పడినన్= తమ యెదుట పైనుండి క్రిందకు పడగా; తారు= తాము (సుగ్రీవాదివానరులు); కైకొని= స్వీకరించి; సంగ్రహించి+ఉన్న= దాచిఉంచిన; భూషణనిచయంబున్= ఆభరణాల సముదాయాన్ని, రామునకున్= శ్రీరాముడికి; నివేదించినన్= సమర్పించగా; అతండు= అతడు - శ్రీరాముడు; సముత్సుకుండు+ఐ= మిక్కుటమైన ఉద్వేగాన్ని పొందినవాడై; వానికిన్= అతడికి - సుగ్రీవుడికి; వానర+ఐశ్వర్యంబు= కోతులయొక్క ప్రభుత్వం; ప్రతిశ్రుతంబు చేసి= వాగ్దానం కావించి (సంపాదించిపెట్టటానికి అంగీకరించి); తదీయశత్రుండు+ఐన= ఆతడియొక్క (సుగ్రీవుడియొక్క) విరోధి అయిన; వాలిన్= వాలిని; చంపన్= సంహరించటానికై; ప్రతిజ్ఞ+చేసెన్= శపథం గైకొన్నాడు; కపి+ ఈశ్వరుండును= కోతులరేడును-సుగ్రీవుడును; జానకిన్= సీతను; తెచ్చుటకున్= తీసికొనిరావటానికి (రావణుడి చెఱనుండి విడిపించి తేవటానికి); సహాయంబు+కాన్= సాయం చేయటానికి; ఒడంబడియెన్= సమ్మతించాడు; అంతట= అటుపిమ్మట; అందఱున్= అందరును (రాముడు, లక్ష్మణుడు, సుగ్రీవుడు, అతని సచివులును); కూడికొని= కలసి; వాలినివాసంబు+ఐన= వాలి నివసించే చోటు అయిన; కిష్కింధా నగరంబునకున్= కిష్కింధ అనే పేరు కల పట్టణానికి; అరిగిరి= వెళ్ళారు; అప్పుడు= ఆసమయంలో; భానుసూనుండును= సూర్యుడికొడుకు-సుగ్రీవుడును.

తాత్పర్యం: అప్పుడు సుగ్రీవుడు శ్రీరాముడికి సీతాదేవి ఆభరణాలమూటను సమర్పించాడు. సీత అంతకుముందు రావణుడిచేత కొనిపోబడేటప్పుడు తనసొమ్ములను మూట కట్టి వానరులు సంచరిస్తున్న ఋశ్యమూకపర్వతంమీద పడవేసింది గదా! శ్రీరాముడు సీతఆభరణాలను చూచి మిక్కుటమైన ఉద్వేగాన్ని చెంది ఆ మూటను దాచి తన కిచ్చిన సుగ్రీవుడికి ప్రత్యుపకారం చేయటానికి నిశ్చయించి, వానరరాజ్యాన్ని సుగ్రీవుడికి చెందేటట్లుగా చేయటానికి సుగ్రీవుడిశత్రువు అయిన వాలిని సంహరించటానికి శపథం చేశాడు. కోతులరేడు అయిన సుగ్రీవుడు సీతను రావణుడిచెరనుండి విడిపించే కార్యంలో సాయం చేయటానికి సమ్మతించాడు. అంతట వారందరూ కలిసి వాలిరాజధాని పట్టణమైన కిష్కింధకు వెళ్లారు. అప్పుడు రవిసుతుడైన సుగ్రీవుడు.

విశేషం: రామాయణగాథలో నవీనవిమర్శకుల దృష్టిని మిక్కుటంగా ఆకర్షించిన సన్నివేశం వాలిసంహారం. శ్రీరాముడి శీలానుశీలనంలో మిక్కిలిప్రాముఖ్యం వహించిన చర్చనీయాంశం కూడ వాలివధయే. శ్రీరాముడు వాలిని సంహరించటంలోని ఔచిత్యమేమిటి? శ్రీరాముడు తననుగురించి రామాయణంలోనే ఇతరులు ఏవిధంగా భావించినప్పటికి తానుమాత్రం దశరథుడిపుత్రుడు అయిన మానవమాత్రుడిగనే భావించుకొంటున్నట్లు వచించాడు. సీతావియోగభారంతో శ్రీరాముడు ఋశ్యమూకాన్ని చేరాడు. అప్పుడు అతడికి సుగ్రీవుడితో మైత్రి ఏర్పడింది. అది యాదృచ్ఛిక సంఘటన. మిత్రుడి శత్రువు తనకుగూడ శత్రువే అని భావించటం ఆదర్శమిత్రధర్మం.

క. వాలిగృహద్వారంబున।
వాలి మదం బెసఁగ నార్చి వారక బాహా
స్ఫాలనము సేయుటయు విని।
వాలి మహారోషదుర్నివారోద్ధతుఁ డై. 105

ప్రతిపదార్థం: వాలిగృహద్వారంబునన్= వాలియొక్క ఇంటికడపముందర; వాలి= క్రిందికి దిగి; మదంబు+ఎసఁగన్= గర్వం అతిశయించేటట్లుగా; ఆర్చి= పెనుకేక లిడి; వారక= ఉడుగక; బాహా+స్ఫాలనము+చేయుటయు= బుజాలపై చరచటం; విని= ఆలకించి; వాలి= వాలి; మహా, రోష,

దుర్నివార+ఉద్ధతుఁడు+ఐ= గొప్పకోపం గలిగి, వారించటానికి వీలులేని గర్వంతో అతిశయించినవాడై.

తాత్పర్యం: సుగ్రీవుడు గర్వించినవాడై వాలి ఇంటికడపముందు నిలిచి, తన బాహువులను చేతులతో చరచి, చప్పుడుచేయటం విని, వాలి కోపంచేత, వారించటానికి వీలులేని పరాక్రమంచేత ఉప్పొంగినవాడై.

వ. సమరసన్నాహం బమర వెలువడంబోయినఁ దదీయవల్లభ యగు తార యతని వారించి యిట్లను; 'నేఁటిచందంబు సూడ సుగ్రీవుండు బలవత్సహా యుండై వచ్చినవాఁ; డది యెట్లనిన దశరథనందనుం డైన రాముండు రావణుచేత నపహృతదారుం డయి, నిజసహోదరుం డగు లక్ష్మణుండును దానును సుగ్రీవ సహాయత్వం బపేక్షించి యతనికార్యంబు దీర్పంబూనె నని వింటి; నదియునుంగాక మహాబలు లైన మైందద్వివిదులు నతిలోకపౌరుషుం డయిన హనుమయు బ్రసిద్ధబుద్ధి యగు జాంబవంతుండును వానికి మంత్రులై యుండుదురు; గావున నీ విప్పుడు గయ్యంబునకుఁ బోక నా కిష్టంబు గా' దనిన, నవ్వుచు నవ్వనచర వీరుండు. **106**

ప్రతిపదార్థం: సమర సన్నాహంబు+అమరన్= యుద్ధానికి ముందుచేసే ప్రయత్నాలు శోభిల్లగా, కవచం మున్నగు ఆహార్యాలను అమర్చుకొని; వెలువడన్+పోయినన్= పో బోగా; తదీయ, వల్లభ+అగు= వాలియొక్క భార్య అయిన; తార= తార అనే ఆమె; అతనిన్= వాలిని; వారించి= ఆపి; ఇట్లు+అనున్= ఈవిధంగా చెప్పింది; నేఁటి, చందంబు+చూడన్= ఈరోజు (సుగ్రీవుడి) వైఖరి గమనించగా; సుగ్రీవుండు= సుగ్రీవుడు; బలవత్+ సహాయుండు+ఐ= సామర్థ్యం గలవారి తోడ్పాటు కలవాడై; వచ్చిన వాఁడు= వచ్చాడు; అది= (ఆ విషయం); ఎట్లు+అనినన్= ఏవిధంగా తెలుసు అని అడిగితే; దశరథనందనుండు= దశరథమహారాజు కొడుకు అయిన; రాముండు= రాముడు; రావణుచేతన్= రావణుడిచేత; అపహృతదారుండు+

అయి= అపహరించబడిన భార్య కలవాడై; నిజ, సహోదరుండు+అగు= తనయొక్క తమ్ముడు అయిన లక్ష్మణుండును; తానును= తానును, శ్రీరాముడును; సుగ్రీవసహాయత్వంబు= సుగ్రీవుడియొక్క తోడ్పాటు; అపేక్షించి= కోరి; అతనికార్యంబున్= సుగ్రీవుడియొక్క పనిని; తీర్పన్= నెరవేర్చటానికి; పూనెను+అని= పట్టుపట్టాడు అని; వింటిన్= విన్నాను; అదియునున్+కాక= అంతేకాక; మహాబలులు+ఐన= గొప్పబలం కలవారు అయిన; మైంద ద్వివిదులును= మైందుడు, ద్వివిదుడును; అతిలోక పౌరుషుండు+అయిన= లోకాతీతమైన పరాక్రమం కలవాడు అయిన; హనుమయున్= హనుమంతుడును; ప్రసిద్ధబుద్ధి+అగు= గొప్పమేధావిగా కీర్తి వడసిన; జాంబవంతుండును; వానికిన్= సుగ్రీవుడికి; మంత్రులు+ఐ= సచివులు అయి; ఉండుదురు= ఉంటారు; కావునన్= కాబట్టి; నీవు+ఇప్పుడు= నీవు ఈ సమయంలో; కయ్యంబునకున్= యుద్ధానికి; పోక= వెళ్ళటం; నాకు+ఇష్టంబు+కాదు= నాకు సమ్మతం కాదు; అనినన్= అని (తార) వచించగా; ఆ+వనచర, వీరుండు= ఆ కోతులజాతికి చెందిన శూరుడు (వాలి); నవ్వుచున్= నవ్వుతూ.

తాత్పర్యం: వాలియుద్ధానికి పోయేటప్పుడు కావలసినయత్నాలను చేసి బయలుదేరటానికి చూస్తుండగా, అతడిభార్య అయిన తార, అతడిని ఆపి ఈ విధంగా అన్నది. 'సుగ్రీవుడి వైఖరి ఈనాడు వేరేవిధంగా కన్పిస్తున్నది. ఆతడికి వెనుక ఏదో గొప్ప బలం ప్రోత్సాహంగా ఉన్నట్లు తేలుతున్నది. నేను విన్నమాట ఒకటి ఉన్నది. దశరథమహారాజుకొడుకు శ్రీరామచంద్రుడు, అతడి తమ్ముడితో కలిసి వచ్చి సుగ్రీవుడితో స్నేహం చేశాడు. రావణుడు శ్రీరాముడి భార్యను అపహరించాడు, శ్రీరాముడికి సుగ్రీవుడు సాయం చేయటానికీ, సుగ్రీవుడికి శ్రీరాముడు తోడ్పడటానికీ పరస్పరమైత్రితో మెలగటానికీ వారలకు అంగీకారం కుదిరిందట. అంతేకాక, సుగ్రీవుడికి గొప్ప బలశాలులైన మైందుడు, ద్వివిదుడు, లోకోత్తరపరాక్రమశాలి అయిన హనుమంతుడు,

మేధావులలో మేటి అయిన జాంబవంతుడును తోడ్పడగలరు. ఇప్పుడు నీవు సుగ్రీవుడితో యుద్ధంచేయటం నాకు సమ్మతం కాదు’. తారమాటలు విని వాలి నవ్వాడు.

క. ఆ వనిత వచనములు సు।
గ్రీవవిషయపక్షపాతకృత్రిమములుగా
భావించి యాదరింపక।
తా వెడలె ననూనబాహుదర్పం బెసఁగన్. 107

ప్రతిపదార్థం: ఆ, వనిత, వచనములు= ఆ తారయొక్కమాటలు; సుగ్రీవ, విషయ, పక్షపాత, కృత్రిమములుగాన్= సుగ్రీవుడినిగూర్చిన ప్రస్తావనకు సంబంధించి అభిమానం చూపే కల్పితాంశాలుగా; భావించి= తలపోసి; ఆదరింపక= సరకు గొనక; అనూన, బాహుదర్పంబు= గొప్పదైన పరాక్రమగర్వం; ఎసఁగన్= అతిశయించగా; తాన్= తాను (వాలి); వెడలెన్= బయలుదేరాడు.

తాత్పర్యం: తార మాటాడినవాక్యాలు, ఆమె సుగ్రీవుడియెడ గల అభిమానం చొప్పున లేనిపోని ఊహలతో కల్పించినవి అని తలపోసి, ఆ వాలి పరాక్రమగర్వంతో ముందుకు సాగాడు.

వ. ఇట్లు వెడలి కట్టెదుర నున్న సుగ్రీవుం జూచి యి ట్లనియె. 108

తాత్పర్యం: ఈవిధంగా, బయలుదేరి తనకు ఎదురుగా ఉన్న సుగ్రీవుడిని చూచి వాలి ఇట్లా పలికాడు.

వాలిసుగ్రీవుల యుద్ధము (సం. 3-264-27)

తే. ‘ఓరి దుష్టాత్మ! యే నిట్లు పోరఁ బెక్కు।
మాఱు లెగువంగ సిగ్గఱి పాఱుచుండు
నట్టి నీ కున్న యునికిన యిట్టలముగ।
నిట్టి బీర మెక్కడనుండి పుట్టెఁ జెపుమ!’ 109

ప్రతిపదార్థం: ఓరి దుష్ట+ఆత్మ!= ఓరీ నీచుడా!; ఏను= నేను; ఇట్లు= ఈరీతిగా; పోరన్= యుద్ధంలో; పెక్కుమాఱులు= అనేకపర్యాయాలు; ఎగువంగన్= తరిమి తరిమి కొట్టగా; సిగ్గు+అఱి= సిగ్గు నశించి (సిగ్గులేక); పాఱుచుండు+అట్టి= పారిపోతూఉండేటి; నీకున్= నీకు; ఉన్న+ఉనికిన= ఉన్నట్లుండి, ఆకస్మికంగా; ఇట్టలముగన్= అధికంగా; ఇట్టి= ఇటువంటి; బీరము= అహంకారంతో కూడిన ధైర్యం; ఎక్కడనుండి= ఏచోటినుండి; పుట్టెన్= పుట్టింది? చెపుమ!= చెప్పరా!

తాత్పర్యం: ‘ఓరీ నీచుడా! సుగ్రీవా! నేను ఎన్నోసారులు లోగడ నిన్ను యుద్ధంలో తఱిమి తఱిమి కొట్టానుకదా! నీవు అన్నిసారులు సిగ్గు లేక పారిపోయిన పిరికిపందవు. ఇప్పుడు ఉన్నట్లుండి ఒక్కమారు నన్ను ఈ విధంగా ఎదిరించే ధైర్యం నీకు ఏవిధంగా వచ్చిందిరా? చెప్పుము’.

వ. అనినఁ బ్రహసితముఖుం డగుచు నబ్బలిముఖుం డి ట్లనియె. 110

ప్రతిపదార్థం: అనినన్= అని వాలి వచించగా; ప్ర, హసిత, ముఖుండు+ అగుచున్= పకపక నవ్విన వదనం కలవాడు ఔతూ; ఆ, బలి, ముఖుండు= ఆ కోతి; ఇట్లు+ అనియెన్.

తాత్పర్యం: అని వాలి అధిక్షేపించగా, అతడితో సుగ్రీవుడు పకపకనవ్వుతూ ఈవిధంగా బదులు పలికాడు.

క. ‘ఆలిని రాజ్యముఁ గోల్పడి।
యాలంబునఁ దూలపోయి యక్కట బ్రదు కిం
కేలా యని తెగువమెయిన్।
వాలి! రణము సేయ నమరి వచ్చితి నీతోన్. 111

ప్రతిపదార్థం: వాలి!= ఓవాలీ!; ఆలిని= భార్యను; రాజ్యమున్= ప్రభుత్వాన్ని; కోల్పడి= పోగొట్టుకొని; ఆలంబునన్= యుద్ధంలో; తూలపోయి= ఓడిపోయి; అక్కట= అయ్యో! (ఎంతటిదురవస్థదాపురించింది); బ్రదుకు= జీవితం; ఇంకన్= ఇకమీద; ఏలా+అని= ఎందుకు అని; తెగువ మెయిన్=

సాహసంచొప్పున; నీతోన్= నీతోడ; రణము+చేయన్= యుద్ధం చేయటానికి; అమరి= సిద్ధపడి; వచ్చితిన్= అరుగుదెంచాను.

తాత్పర్యం: 'ఓవాలీ! నేను ఎందుకు ఇంతటి ధైర్యంతో ఏగుదెంచానో చెప్పుతాను వినుము. నేను నాభార్యను కోల్పోయాను. నా రాజ్యాన్ని కూడా పోగొట్టుకొన్నాను. అయ్యో! ఇంతటి దురవస్థ నాకు దాపురించింది. ఇక ఈ నిరర్థక మైన జీవితం గడిపి నేను బావు కొనేది ఏమున్నది? అందుచేత నాకు ధైర్యం వచ్చింది. నీతో యుద్ధానికి సిద్ధమై వచ్చాను.

తే. చక్కఁ గమ్మింక ముందటి చంద మొందఁ।
గలదె? తొంటి సుగ్రీవుండు గాఁడు నేఁడు;
నిన్నుఁ బొరివుచ్చి కాని పోనేర్చు నెట్లు?'
ననుచు నుగ్రుఁడై యవ్వీరు నార్చి కవిసె. 112

ప్రతిపదార్థం: చక్కన్+కమ్ము= నీవు సన్నద్ధుడవు కమ్ము; ఇంకన్= ఇక; ముందటి చందము= లోగడరీతి; ఒందన్+కలదు+ఎ= జరుగునా? (వెనుకటిమాదిరిగా ఇక జరుగదు సుమా); తొంటి, సుగ్రీవుండు= పూర్వపు సుగ్రీవుడు; నేఁడు= ఈదినం; కాఁడు= కాడు; నిన్నున్= నిన్ను (ఓవాలీ నిన్ను); పొరి+పుచ్చికాని= నిన్ను సంహరించి కాని; ఎట్లు= ఏరీతిగా; పోనేర్చున్= పోగలడు? (నిన్నుసంహరించనిదే నేటి సుగ్రీవుడు పోజాలడు); అనుచున్= అని వచిస్తూ; ఉగ్రుఁడు+ఐ= భయంకరుడై; ఆ+వీరుని= ఆవాలిని; ఆర్చి= సింహనాదం చేసి, పెనుకేక పెట్టి; కవిసెన్= ఎదుర్కొన్నాడు.

తాత్పర్యం: ఓవాలీ! నీవు ఇంక సవ్యంగా యుద్ధానికి సన్నద్ధుడవు కమ్ము. వెనుకటి చరిత్ర వేరు. అలనాటి సుగ్రీవుడు వేరు. నేటి సుగ్రీవుడు వేరు. నేటి సుగ్రీవుడు నిన్ను యుద్ధంలో సంహరించకుండగా తిరిగిపోజాలడు సుమా' అంటూ భయంకరుడై సుగ్రీవుడు వాలిని ఎదుర్కొన్నాడు.

వ. ఇవ్విధంబున. 113

తాత్పర్యం: ఈ రీతిగా.

ఉ. భూవినుతప్రభావులు ప్రభూత బలోద్ధతు లుగ్రవైరితే
జోవిజయుల్ నిరంతరయశోజయకాంక్షులు భూరిభూరుహ
గ్రావనఖాయుధుల్ బలిముఖప్రవరుల్ గడుఁ బొంగి వాలిసు
గ్రీవులు దాఁకి రొండొరు లకృత్రిమరోషకషాయవక్త్రులై. 114

ప్రతిపదార్థం: భూవినుతప్రభావులు= భూమిచేత పొగడబడిన మహిమ కలవారు- అనగా భూలోకంలోని ప్రజలందరిచేత గుర్తించబడిన గొప్పతనం కలవారు; ప్రభూత, బల+ఉద్ధతులు= గొప్పబలం కలిగి ఉండటంచేత మదించినవారు; ఉగ్ర, వైరి, తేజస్+ విజయుల్= భయంకరమైన శత్రువులయొక్క వర్చస్సును బాగా జయించ గలవారు; నిరంతర, యశస్+జయ, కాంక్షులు= ఎల్లప్పుడును కీర్తిని, గెలుపును కోరేవారు; భూరి, భూరుహ, గ్రావ, నఖ+ఆయుధుల్= గొప్పచెట్లు, రాళ్ళు, గోళ్ళు ఆయుధాలుగా కలవారు; బలిముఖ, ప్రవరుల్= కోతులలో శ్రేష్ఠులు; వాలి, సుగ్రీవులు= వాలియును, సుగ్రీవుడును; అకృత్రిమ, రోష, కషాయవక్త్రులు+ఐ= సహజమైనకోపంచేత ఎర్రబడిన మొగాలు కలవారై; కడున్= మిక్కిలి; పొంగి= ఉత్సహించి; ఒండు+ఒరులన్= ఒకరినొకరు; తాకిరి= మార్కొన్నారు.

తాత్పర్యం: ఈ రీతిగా, భూలోకంలోని ప్రజలందరిచేత పొగడబడిన గొప్పతనం గలవారు; శత్రువుల తేజస్సును హరించేవారు. ఎల్లప్పుడును కీర్తిని, గెలుపును కోరుకొనేవారు, గొప్ప చెట్లు, రాళ్ళు, గోళ్ళు ఆయుధాలుగా చేసికొని పోరాడేవారు అయిన వాలిసుగ్రీవులు మిక్కుటమైన ఉత్సాహంతో విజృంభించి ఒకరినొకరు తలపడ్డారు.

మ. తరుసంఘంబులు పూన్చి యొండొరుల నుద్యద్బాహులై వ్రేయ ని
ష్ఠురవక్షస్స్థలపాతవేగవిరళస్తోకంబులై పోయె న
త్తరుసంఘంబులు; వెండియుం గడఁగి యుద్యల్లీల నయ్యిద్దఱుం
బరుషానేకశిలాప్రయోగముల నొంపం జొచ్చి రన్యోన్యమున్. 114

ప్రతిపదార్థం: తరుసంఘంబులు= చెట్లసముదాయాలు; పూన్చి= సంధించి; ఉద్యత్+ బాహులు+ఐ= ఎత్తిన చేతులు కలవారలై; (చేతులు పైకెత్తి);

ఒండు+ఒరులన్= ఒకరినొకరు; వ్రేయన్= కొట్టగా; ఆ+తరు+సంఘంబులు= ఆ చెట్లసమూహాలు; నిష్ఠుర, వక్షః+స్థల, పాత, వేగ, విరళ, స్తోకంబులు+ఐ= కఠిన మైన రొమ్ములపై పడి వేగంగా తుత్తునియలై నశించినవై; పోయెన్; వెండియున్= మరల; కడఁగి= పూని; ఆ+ఇద్దఱున్= ఆ వాలిసుగ్రీవులు; ఉద్యత్+లీలన్= ప్రకాశించే రీతిగా; పరుష+అనేక, శిలాప్రయోగములన్= కఠినా లైన పెక్కురాళ్ల విసరుకొనటంచేత; అన్యోన్యమున్= ఒండొరులను; నొంపన్+చొచ్చిరి= బాధించసాగారు.

తాత్పర్యం: ఆ వాలిసుగ్రీవులు ఇరువురును మొట్టమొదట చెట్లను పెరికి ఒకరిపై నొకరు విసరి యుద్ధంచేశారు. ఆ చెట్లు వారి కఠినమైన రొమ్ములను తాకి తుత్తునియలై నశించాయి. ఇక, చెట్లు నశించగానే వారు రాళ్ళను గైకొని ఒండొరులతో యుద్ధం చేశారు.

క. అతులితశిలావితానం ।
బితరేతరతనునిపాతహేలా సంచూ
ర్ణిత మగుటయు, వారలు పటు ।
గతిఁ గవిసిరి బాహుయుద్ధకౌతుకమతులై. 115

ప్రతిపదార్థం: అతులిత, శిలావితానంబు= సాటిలేని రాళ్లసముదాయం; ఇతర+ఇతర, తను, నిపాత, హేలా, సంచూర్ణితము+ అగుటయున్= ఒండొరుల దేహాలపై విసరటం అనే ఆటలో పొడిపొడి అయిపోవటంచేత; వారలు= వాలిసుగ్రీవులు; బాహు, యుద్ధ, కౌతుకమతులు+ఐ= చేతులతోనే పోరాటం సాగించటంలో వేడుక కలిగిన చిత్తం కలవారు అయి; పటుగతిన్= సామర్థ్యంతో; కవిసిరి= మార్కొన్నారు.

తాత్పర్యం: చెట్లు పట్టుకొని పోరాటం సాగించారు. చెట్లు నశించాయి. ఇక, రాళ్ళనే ఆయుధాలుగా స్వీకరించి వాలిసుగ్రీవులు పోరాటం కొనసాగించారు. కాని, ఆ రాళ్ళుకూడా వారి ఇరువురి శరీరాలను తాకి పొడిపొడి

అయిపోయాయి. ఇకచెట్లు, రాళ్ళు కానరాక, వారుఇద్దరును చేతులతోడనే ముష్టియుద్ధం చేయటానికి తారసిల్లారు.

ఉ. ఒండొరుఁ బట్టుచుం దిగుచు చొండొరుఁ బాయుచు వ్రేయుచున్ మహో
ద్దండత నొండొరుం దొలఁగఁ దాఁకుచు నీఁగుచు లోఁగుచుం జలం
బొండొరు మీఱు చొండొరుల యుద్ధతి సైఁపక వీఁకఁ బోరి రా
ఖండలభానుసూను లవిఖండిత చండభుజాప్రచండతన్. 117

ప్రతిపదార్థం: ఆఖండల, భానుసూనులు= దేవేంద్రుడి కొడుకు- వాలియున్నూ, సూర్యుడి కొడుకు- సుగ్రీవుడున్నూ; ఒండు+ఒరున్= ఒకరిని ఒకరు; పట్టుచున్= పరిగ్రహిస్తూ; తిగుచుచున్= లాగుతూ; ఒండు+ఒరున్= ఒకరిని ఒకరు; పాయుచున్= దూరంగా జరుగుతూ (తొలగుతూ); వ్రేయుచున్= కొట్టుతూ; మహా+ఉద్దండతన్= మిక్కిలి భీకరంగా; ఒండు+ఒరున్= ఒకరినొకరు; తొలఁగన్+తాఁకుచున్= దూరంగా పోయేటట్లుగా, మార్కొంటూ; ఈఁగుచున్= తొలగిస్తూ; లోఁగుచు= లొంగుతూ, చలంబు= పట్టుదలతో; ఒండు+ఒరు= ఒకరిని ఒకరు; మీఱుచున్= అతిక్రమిస్తూ; ఒండు+ఒరుల+ఉద్ధతిన్= ఒకరియొక్క అతిశయాన్ని ఇంకొకరు; సైఁపక= ఓర్వక; వీఁకన్= ఉత్సాహంతో; అవి, ఖండిత, చండ, భుజా, ప్రచండతన్= పరిపూర్ణమైన పరాక్రమం యొక్క వేడిమితో; పోరిరి= పోరాడారు.

తాత్పర్యం: దేవేంద్రుడి కొడుకైన వాలియున్నూ సూర్యుడికొడుకైన సుగ్రీవుడున్నూ పరస్పరం భీకరంగా పోరాటం కొనసాగించారు. ఒకరినొకరు ఒకసారి పట్టుకొనేవారు. ఒకసారి ఒకరికొకరు లాగుకొనేవారు ఒకసారి తొలగిపోయేవారు, మరొకసారి కొట్టుకొనే వారు. ఒకసారి ఒకరినొకరు దూరంగా త్రోసివేసికొనేవారు. ఒకసారి ఒకరికొకరు లొంగిపోయేవారు, మరొకసారి ప్రక్కకు నెట్టుకొనేవారు. ఈ రీతిగా ఒకరిని ఒకరు మీరుతూ ఉత్సాహంతో పరిపూర్ణపరాక్రమప్రాభవాలు ప్రదర్శిస్తూ ఒకరికొకరు ఏమాత్రం తీసిపోకుండా వాలిసుగ్రీవులు ఘోరయుద్ధం చేశారు.

శా. దేహోత్సాహ మెలర్ప నుద్ధతమదాంధీభూతులై యాహవో
త్సాహవ్యగ్రులు విగ్రహంబు మిగులన్ సంరంభశుంభద్గతిన్
బాహాబాహిఁ బెనంగ నప్పు డమరెం బ్రౌఢద్విపద్వంద్వహే
లాహస్తద్వయగాఢకర్షణరణోల్లాసంబు విస్పష్టమై. 118

ప్రతిపదార్థం: దేహ+ఉత్సాహము+ఎలర్పన్= శరీరాలలోని పొంగారేశక్తి అతిశయించగా; ఉద్ధత, మద+అంధీభూతులు+ఐ= గర్వంతో కూడిన మదంచేత కన్నులు కానరానివారై; ఆహవ+ఉత్సాహ, వ్యగ్రులు= పోరాటంలో పొంగులువారే శక్తితో తొందరపడే వారై; విగ్రహంబు= శత్రుత్వం; మిగులన్= అతిశయించగా; సంరంభ శుంభద్గతిన్= తొట్రుపాటుతో కూడిన వేగిరపాటుతో; బాహాబాహిన్= చేతులు చేతులతో కలిపి; పెనంగన్= పోరాటం సలుపగా; అప్పుడు= ఆ సమయంలో; ప్రౌఢ; ద్విప, ద్వంద్వ, హేలా, హస్త, ద్వయ, గాఢ, కర్షణ, రణ+ఉల్లాసంబు= ముదిరిన (మదించిన) ఏనుగులజంట వినోదంగా చేసే రెండు తొండాల తీవ్రమైన పెనగులాటవలె ఒప్పుతూఉన్న యుద్ధంలోని సంతోషశోభ; విస్పష్టము+ఐ= బాగా కనిపించేదై; అమరెన్= ఏర్పడింది.

తాత్పర్యం: వాలిసుగ్రీవులు ఇరువురు బలమైన దేహాలు కలవారు. వారిశరీరంలోని ఉత్సాహంతో వారు ఇరువురు కన్నుమిన్నుగానక యుద్ధంమీది అభిలాషతో ఏర్పడిన తొందరపాటుతో చేతులు చేతులు కలిపి ఘోరయుద్ధాన్ని చేశారు. వారిరువురి ద్వంద్వయుద్ధం రెండు మదించిన ఏనుగులు తొండం తొండం కలిపి గాఢంగా లాగుతూ పెనగుతూ పట్టువీడక చేసే పోరాటాన్ని స్ఫురింపచేసింది.

వ. మఱియు నన్యోన్యదంతనఖముఖవిఖండితశరీరులై హరివీరులు రుధిర ధారలం దడిసి పుష్పితంబు లగు నశోకంబులుం బోలె నొప్పి చలంబులు మెఱయం బెనంగునెడం దుల్యబలరూపవిక్రములై యున్న యయ్యన్నదమ్ముల నిరువుర నేర్పడ లక్షింపనేరక లక్ష్మణాగ్రజుండు విలక్ష్యహృదయుండై వీక్షించుచున్న నాంజనేయుండు రాఘవునకు

నభిజ్ఞానార్థంబుగా నొక్కపల్లవదామంబు సుగ్రీవునఱుతం బెట్టఁ దదనంతరంబ రాఘవుం డమోఘబాణంబు దొడిగి వాలియురంబు వగుల నేసినం, బడి యవ్వాన రుండు దశరథనందను నిందించుచుఁ బ్రాణవియోగంబు నొందె; నిత్తెఱంగున. 119

ప్రతిపదార్థం: మఱియున్= వెండియు; హరివీరులు= వానరవీరులు; అన్యోన్య, దంత, నఖ, ముఖ, విఖండిత, శరీరులు+ఐ= ఒకరినొకరు దంతములయొక్క, గోళ్ళయొక్క మొనలచే బాగుగా చీరబడిన దేహాలు కలవారై; రుధిరధారలన్= నెత్తురు జాలులతో; తడిసి= ఆర్ద్రమయి; పుష్పితంబులు+అగు= పూచినట్టి, అశోకంబులున్+పోలెన్= అశోకవృక్షాలవలె; ఒప్పి= శోభిల్లి; చలంబులు= స్పర్ధలు; మెఱయన్= ప్రకాశించగా; పెనంగు+ ఎడన్= పోరాడేటప్పుడు; తుల్య, బల, రూప, విక్రములు+ఐ= సమానమైన శక్తి, ఆకార, శౌర్యాలు కలవారు అయి; ఉన్న= ఉన్నటువంటి; ఆ+అన్నదమ్ములన్; ఇరువురన్= ఇద్దరియందు; ఏర్పడన్= భేదం తెలిసేటట్లు; లక్షింపనేరక= గురిపెట్టలేక; లక్ష్మణ+ అగ్రజుండు= లక్ష్మణుడిఅన్న (శ్రీరాముడు); విలక్ష్యహృదయుండు+ ఐ= చెదరిన గురిగల డెందం కలవాడై; వీక్షించుచున్+ఉన్నన్= చూస్తుండగా; ఆంజనేయుండు= హనుమంతుడు; రాఘవునకున్= రాముడికి; అభిజ్ఞాన+ అర్థంబుగాన్= గుర్తుగా ఉండటం కొరకై; ఒక్క= ఒక; పల్లవదామంబున్= చిగురుటాకులదండను; సుగ్రీవు+ అఱుతన్+పెట్టన్= సుగ్రీవుడి మెడయందు వేయగా; తత్+అనంతరంబు+ అ= అటు పిమ్మట వెంటనే; రాఘవుండు= రాముడు; అమోఘబాణంబు= మొక్కవోని అమ్ము; తొడిగి= వింట సంధించి; వాలి+ఉరంబు= వాలియొక్క రొమ్ము; పగులన్+ఏసినన్= బ్రద్దలయ్యేటట్లుగా కొట్టగా; పడి= నేలపైకూలి; ఆ+వానరుండు= ఆ కోతి - వాలి; దశరథనందనున్= దశరథుడి కుమారుడైన శ్రీరాముడిని; నిందించుచున్= అధిక్షేపిస్తూ; ప్రాణ వియోగంబున్+ఒందెన్= అసువులు వీడాడు, మరణించాడు; ఈ+తెఱంగునన్= ఈ విధంగా.

తాత్పర్యం: వెండియును ఆ కపివీరులు వాలిసుగ్రీవులు ఇరువురున్నూ ఒకరినొకరు పండ్లతో, గోళ్ళతో పీడించుకొంటూ నెత్తుటిజాలులతో తడిసి పూచిన అశోకవృక్షాలవలె శోభిల్లారు. ఆ విధంగా వారు స్పర్థతో పోరాడుతుండగా, ఆ అన్నదమ్ములు సమానరూపాలతో, సమానపరాక్రమంతో ఉండటంచేత వారిద్దరిలో ఎవరెవరో భేదం తెలియటానికి వీలులేకపోయింది. అందుచేత శ్రీరాముడు బాణాన్ని గురిపెట్టి సంధించలేక, వారిరువురి పోరాటాన్ని తిలకిస్తూ ఉండిపోయాడు. రాముడి అవస్థ గుర్తించి ఆంజనేయుడు వడిగా ఒకచిగురుటాకులదండను సుగ్రీవుడికంఠంలో వేశాడు. వెనువెంటనే శ్రీరాముడు గురిపెట్టి అమోఘబాణాన్ని వింటినుండి విడిచాడు. ఆ బాణం వాలిరొమ్మును భేదించింది. వాలి నేలపై వ్రాలి, దశరథమహారాజుపుత్రు డైన శ్రీరాముడు అట్టి అకృత్యం చేయటం పాడిగాదని నిందిస్తూ అసువులు వదిలాడు. ఈ విధంగా.

విశేషం: అలం: ఉపమ. రుధిరధారలతో నొప్పారిన వాలిసుగ్రీవులు పూచిన అశోకవృక్షాలవలె శోభిల్లారు.

ఆ. వాలిఁ జంపి యతనివనిత సుగ్రీవుని।
వశము సేసి నిఖిలవనచరేంద్ర
పదవియందు నెమ్మిఁ బట్టంబుఁ గట్టె వి।
స్ఫారయశుఁడు రామభద్రుఁ డెలమి. 120

ప్రతిపదార్థం: వాలిన్= వాలిని; చంపి= సంహరించి; రామభద్రుఁడు= శ్రీరాముడు; వి, స్ఫార, యశుఁడు= బాగా విస్తరించిన కీర్తి కలవాడు; ఎలమిన్= సంతోషంతో; అతని వనితన్= వాలిభార్యను; సుగ్రీవునివశము+చేసి= సుగ్రీవుడి అధీనంకావించి; నిఖిల, వనచర+ఇంద్ర, పదవి+అందున్= సమస్తమైన కోతులకు రేడు అయిన పదవిలో; నెమ్మిన్= ప్రీతితో; పట్టంబున్+ కట్టెన్= పట్టాభిషేకం చేశాడు.

తాత్పర్యం: శ్రీరాముడు వాలిని సంహరించి, సమస్త మైన కోతులకు రాజుగా సుగ్రీవుడికి పట్టాభిషేకం చేశాడు. ఆ విధంగా శ్రీరాముడు గొప్పకీర్తిని ఆర్జించాడు. మఱియును వాలిభార్యయైన తారను శ్రీరాముడు సుగ్రీవుడి వశం చేశాడు.

విశేషం: తార వాలిభార్య। ఒక యుద్ధంలో వాలి చచ్చిపోయాడని తలంచటంచేత సుగ్రీవుడు కిష్కింధకు రాజయినాడు. అప్పుడు తార సుగ్రీవుని చేరింది. వాలి సుగ్రీవుని జయించి తన భార్యయైన తారను తీసుకుపోయాడు. రాముడు వాలిని సంహరించిన పిమ్మట తార మరల సుగ్రీవుని చేరింది. రుమ సుగ్రీవుడు వివాహమాడిన భార్య.

వ. ఆ వనచరుండును రామునకుఁ గృతాంజలియై 'దేవా! యీఘర్మ సమయ శేషంబును ఘనసమయంబునుం గడపి మఱి సీతాన్వేషణం బునకు నుత్సహించుట లెస్స' యని యయ్యిరువురకును మాల్యవత్కూటం బున నివాసంబు గావించి తానును గిష్కింధాపురంబున నుండె; నంత.121

ప్రతిపదార్థం: ఆ వనచరుండును= ఆ వానరుడును, (ఆ సుగ్రీవుడును;) రామునకున్= శ్రీరాముడికి; కృత+అంజలి+ఐ= ఘటించిన అంజలికలవాడై, నమస్కరించినవాడు అయి; దేవా!= ప్రభూ!; ఈ ఘర్మసమయశేషంబును= ఈ వేసవికాలంలో మిగిలిన కాలాన్నీ; ఘనసమయంబునున్= వర్షాకాలాన్నీ; కడపి= పుచ్చి; మఱి= పిదప; సీతా+ అన్వేషణంబునకున్= సీతను వెదకటానికి; ఉత్సహించుట= పూనటం; లెస్స= మంచిది; అని= అని వచించి; ఆ+ఇరువురకును= ఇద్దరకును, ఆరామలక్ష్మణులకు; మాల్యవత్+ కూటంబునన్= మాల్యవంతం అనే కొండకొమ్మున(సమతలాన); నివాసంబు= ఉనికి; కావించి= ఏర్పరచి; తానును= సుగ్రీవుడును; కిష్కింధాపురంబునన్= కిష్కింధ అనే నగరంలో; ఉండెన్= నివసించాడు; అంతన్= అటు పిమ్మట.

తాత్పర్యం: ఆ వనచరు డైన సుగ్రీవుడు శ్రీరాముడికి నమస్కరించి ఇట్లన్నాడు - 'దేవా! ఈ మండువేసవికాలం మిగులు ఎంతయో లేదు. ఇక వచ్చేది వానకాలం. అది ప్రయాణానికి అనువైన సమయం కాదు. వర్షాకాలం గడచిన వెనువెంటనే కపులను సీతను వెదకటంకొరకై పంపటం మంచిది' అని పల్కిన అనంతరం సుగ్రీవుడు రామలక్ష్మణులకు మాల్యవంతం మీద విడిది యేర్పరచి తాను రాజధానిఅయిన కిష్కింధానగరంలో నివసిస్తూ ఉన్నాడు. అంతట.

మ. ఉరుఘర్మౌఘవిఘాతసంవిహితవిశ్వోల్లాసమై సంచల
త్సరసాంభోదనినాదతూర్యరవమై చంచద్బలాకాగరు
ద్భరలీలానవచామరస్ఫురణమై పర్జన్యసామ్రాజ్యమొ
ప్పె రమామందిరమై యుదగ్రశిఖినీపింఛాతపత్రంబులన్. 122

ప్రతిపదార్థం: పర్జన్యసామ్రాజ్యము= మేఘాలయొక్క విస్తారమైన ఏలుబడి; ఉరు, ఘర్మ+ఓఘ, విఘాత, సంవిహిత, విశ్వ+ఉల్లాసము+ఐ= మిక్కుటమైన చెమటవెల్లువలు లేకుండ చేయటంచేత జగత్తుకు సంతోషం కలిగించేదై; సంచలత్+సరస+ అంభస్+ద, నినాద, తూర్యరవము+ఐ= కదలేవి నీటితో కూడినవి అయిన మేఘాల గర్జనలనే బూరలధ్వనితో కూడినదై; చంచత్+ బలాకా, గరుత్+భర, లీలా, నవ, చామర, స్ఫురణము +ఐ= విహరించే బెగ్గురుపక్షుల యొక్క అతిశయించిన రెక్కల విలాసముల వలన క్రొత్త చామరాలనే (చమరీమృగంయొక్క వెంట్రుకలతో చేయబడిన వీవనలను) తలపింప చేసేదై; ఉదగ్ర, శిఖినీపింఛ+ఆతపత్రంబులన్= గొప్పనెమలి పింఛాలనే గొడుగులతో; రమామందిరము+ఐ= లక్ష్మీనిలయమై; ఒప్పెన్= శోభిల్లింది.

తాత్పర్యం: మిక్కుటాలైన చెమటవెల్లువలను ఇంకింపచేయటంచేత జగత్తుకు సంతోషం కలిగించేదై, కదలాడే మేఘాలగర్జనలు అనే తూర్యనినాదాలు కలదై, బెగ్గురుపక్షుల రెక్కలు అనే చామరాలు కలదై, నెమలిపింఛా లనే గొడుగులు కలదై, లక్ష్మీనిలయమై పర్జన్యసామ్రాజ్యం శోభిల్లింది.

విశేషం: (1) అలం: రూపకం. (2) ఈ పద్యం ఎఱ్ఱన ప్రబంధపరమేశ్వరబిరుదాన్ని సార్థకం చేసే హృదయంగమకల్పన. ఇదివర్షాకాల వర్ణనం. వర్షఋతువులో కానవచ్చేవి కదలియాడే మబ్బులు; మేఘగర్జనలు బెగ్గురుపక్షులరెక్కల అతిశయం, పురివిప్పి ఆడే నెమళ్లు, జగత్తు ఆనందంలో ఓలలాడుతున్నట్లుగా సిరికళలతో శోభిల్లుతాయి. వర్షఋతువు పర్జన్యసామ్రాజ్యంగా వర్ణించబడింది. సామ్రాజ్యలాంఛనాలు విశ్వోల్లాసం, తూర్యరావాలు, ఛత్రచామరాలు- అన్నీ సమకూరాయి.

వ. ఆ సమయంబున నక్కడ. 123

తాత్పర్యం: అదేకాలంలో లంకలోని అశోకవనంలో.

క. దానవనాయకు చెఱఁ బడి।
జానకి యురిఁ బడిన హరిణశాబమ పోలెన్
మానిని సంతత భర్తృ।
ధ్యానవివశ యగుచు నుండెఁ దాపం బెసఁగన్. 124

ప్రతిపదార్థం: జానకి= జనకుడి కూతురు (సీత); దానవనాయకుచెఱన్+పడి= రాక్షసనేత అయిన రావణుడిచేత బంధించబడి; ఉరిన్+పడిన= కంఠానికి అడ్డంగా తగుల్కొన్న ముడిలో పడిన (చావునకు ఆ విధంగా సుస్థిరమైన); హరిణశాబము+అ, పోలెన్= లేడిపిల్లవలెనే; మానిని= అభిమానం కల ఆడుది- సీత; సంతత, భర్తృ, ధ్యాన, వివశ+అగుచున్= ఎల్లప్పుడును భర్తను (శ్రీరాముడిని) గూర్చి ఆలోచించటంలోనే ఉండటంచేత వశంతప్పినదై; తాపంబు+ఎసఁగన్= బాధ అధికం కాగా; ఉండెన్= ఉన్నది.

తాత్పర్యం: సీతాదేవి రావణాసురుడిచెరలో ఉరిత్రాడుముడిలో చిక్కుకొన్న లేడిపిల్లవలె మిక్కిలి కష్టాలను అనుభవిస్తూ, ఎల్లప్పుడున్నూ తనపతి అయిన శ్రీరాముడిని స్మరించు కొంటూ తెలివితప్పి పడి ఉండింది.

విశేషం: అలం: ఉపమ.

వ. అమ్మగువ కాపున్న దనుజాంగనలు త్ర్యక్షియు లలాటాక్షియుఁ ద్రిస్తనియు నేకపాదయు దీర్ఘజిహ్వయు నజిహ్వయుఁ ద్రిజటయు

నేకలోచనయు మొదలయిన వారు పెక్కండ్రు వికృతాకారంబులతోడ నయ్యబలం బరివేష్టించి యహర్నిశంబును నుఱక యదల్చువారును బెలుచం దిట్టువారును ఖరోష్ట్రనిస్వనంబులు సెలంగ వెఱపించువారును ద్రిభువనాధిపతియైన మన దశగ్రీవునొల్లని యీ దుష్టమానుషిఁబట్టి చెండి కండలు దిందు మనువారునునై యున్న నయ్యుగ్మలి గళద్బాష్పయు గద్గదకంఠియు నగుచు నారాక్షసస్త్రీల కిట్లనియె. **125**

ప్రతిపదార్థం: ఆ+మగువ= ఆ ఆడుది(సీత); కాపు+ఉన్న= కావలి కాస్తున్న; దనుజ+ అంగనలు= రాక్షసస్త్రీలు; త్ర్యక్షియున్= త్ర్యక్షిఅనే ఆమెయు; లలాట+అక్షియున్= లలాటాక్షి అనే ఆమెయు; త్రిస్తనియున్= త్రిస్తని యనే ఆమెయు; ఏకపాదయున్= ఏకపాద అనేదియు; దీర్ఘజిహ్వాయున్= దీర్ఘజిహ్వా అనేదియు; అజిహ్వాయున్= అజిహ్వాఅనేదియు; త్రిజటయున్= త్రిజట అనేదియును; ఏకలోచనయున్= ఏకలోచన అనేదియును; మొదలు+ అయినవారు= మున్నగువారు; పెక్కండ్రు= పెక్కుమంది; వికృత+ ఆకారంబులతోడన్= వికార మైన రూపాలతో; ఆ+అబలన్= ఆ వనితను - సీతాదేవిని; పరివేష్టించి= చుట్టుముట్టి; అహర్నిశంబును= పగలును రాత్రియును; ఉఱక= నిష్కారణంగా; అదల్చువారును= భయపెట్టేవారును; పెలుచన్= ఎక్కువగా; తిట్టువారును= దూషించేవారును; ఖర+ఉష్ట్ర నిస్వనంబులన్= గాడిదల యొక్కయు, ఒంటెలయొక్కయు, అరుపులు, చెలంగన్=ఒప్పేటట్లుగా, వెఱపించువారును= భయపెట్టేవారును, త్రి, భువన+అధిపతి+ఐన= మూడు లోకాలను ప్రభువు అయిన, మన, దశగ్రీవున్= దశకంఠుడిని,-రావణుడిని; ఒల్లని= అంగీకరించని; ఈ, దుష్ట, మానుషిన్= ఈ చెడుమనుజస్త్రీని, సీతను; పట్టి= పట్టుకొని; చెండి= ఖండించి; కండలు= శరీరంలోనిమాంసపు ముద్దలు, తిందుము= భుజిస్తాం; అనువారునున్, ఐ+ఉన్నన్= అయి ఉండగా; ఆ+ఉగ్మలి= ఆ వనిత- ఆ సీత; గళత్+బాష్పయున్= జారునటువంటి కన్నీరు కలిగినట్టిదియును; గద్గద, కంఠియును= డగ్గుత్తిక పడిన గొంతుక కలదియు; అగుచున్= ఔతూ; ఆ, రాక్షసస్త్రీలకున్= ఆ రక్కసి మగువలకు; ఇట్లు+అనియెన్= ఈవిధంగా పలికింది.

తాత్పర్యం: వికృతాలైన రూపాలుకలవారు త్ర్యక్షి, లలాటాక్షి, త్రిస్తని, ఏకపాద, దీర్ఘజిహ్వా, అజిహ్వా, త్రిజట, ఏకలోచన మున్నగువారు, సార్థకనామధేయలు సీతాదేవికి కావలి కాస్తున్నారు. పగలు రేయి ఆమెను అదలిస్తున్నారు. నిష్కారణంగా బాధిస్తున్నారు. పలుసారులు సీతను తిట్టుతూ గాడిదలవలె లొట్టిపిట్టల(ఒంటెల) వలె అరుస్తూ ఆమెను భయపెట్టసాగారు. 'ఈ నీచురాలు ఈ మానవస్త్రీ మూడులోకాలకు ప్రభువైన రావణుడిని కాదన్నది. ఈమె శరీరంలోని మాంసపుముద్దలు ఖండించి భుజిస్తాం' అంటూ ఆమెను బెదిరించసాగారు. సీత డగ్గుత్తిక వడిన గొంతుకతో ఆ రక్కసి వనితలతో ఇట్లా పలికింది.

విశేషం: అశోకవనిలో సీతను చుట్టుముట్టి కావలి కాచిన రక్కసి మగువలపేర్లు అనుశీలించ దగినవి. వారు వికృతాకారలు - కాబట్టి సార్థకనామధేయలు అని ఎంచవచ్చును; త్ర్యక్షి= మూడు కన్నులు కలది; లలాటాక్షి= నొసటియందు నేత్రం కలది; త్రిస్తని= మూడుగుబ్బలు గలది; ఏకపాద= ఒక కాలు కలది; దీర్ఘజిహ్వా= పొడుగుపాటి నాలుక కలది; అజిహ్వా= నాలుక లేనిది; త్రిజట= మూడు జడలు గలది; ఏకలోచన= ఒకేకన్ను కలది.

తే. **'అమ్మలార! మీవలసినయట్ల చేయుఁ ।**
డింక నేటికిఁ దడయంగఁ? నేను రాముఁ
దప్ప నొండొకపురుషుఁ జిత్తమునఁ దలఁప ।
నింత నిజము; నాకును జీవితేచ్ఛ లేదు'. **126**

ప్రతిపదార్థం: అమ్మలార!= ఓతల్లులార! (తల్లితో సమానలైనవారా!); మీవలసిన+ అట్లు+చేయుఁడు= మీకు తోచినట్లు చేయండి; ఇంకన్+ఏటికిన్+ తడయంగన్?= ఇక ఆలస్యం చేయుటం ఎందుకు?; ఏను= నేను; రామున్+తప్పన్= రాముడిని తప్ప; ఒండు+ఒక, పురుషున్= మరొక మగవాడిని; చిత్తమునన్= మనస్సులో; తలఁపన్= స్మరించను; ఇంత= ఇది అంతయు; నిజము= సత్యం; నాకును= నాకు సయితం; జీవిత+ఇచ్ఛ= బ్రదుకు కోరిక; లేదు= లేదు.

తాత్పర్యం: 'ఓ తల్లులారా! మీకు నన్ను చంపవలెనని ఉన్నది. నాకుకూడ బ్రదుకవలెననే కోరిక లేదు. మీరు నన్ను మీకు తోచినట్లు చేయండి. నేను శ్రీరాముడిని తప్ప మనసులో వేరొకడిని కోరను'.

వ. అనిన నజ్జానకితెగువ రావణున కెఱింగింపఁ గొందఱు సనిరి; మఱియు సంతతప్రియవాదినియు ధర్మజ్ఞయు నైన త్రిజట యను రక్కసి రామాంగనం జేరంజని యి ట్లనియె. 127

ప్రతిపదార్థం: అనినన్= అనిచెప్పగా; ఆ+జానకి= ఆసీత(యొక్క); తెగువ= సాహసం; రావణునకున్= రావణుడికి; ఎఱింగింపన్= తెలియచెప్పటానికి; కొందఱు= కొంతమంది (రాక్షస స్త్రీలు); చనిరి= వెళ్ళారు; మఱియున్= అంతేకాక; సంతతప్రియవాదినియున్= ఎల్లప్పుడును ప్రీతి కొలిపే మాటలు పలికేదిన్నీ; ధర్మజ్ఞయున్= ధర్మం తెలిసినదిన్నీ; ఐన= అయిన; త్రిజట, అను= త్రిజట అనే పేరు కల; రక్కసి= రాక్షసి; రామ+అంగనన్+చేరన్+చని= రాముడిభార్య అయిన సీత వద్దకు వెళ్ళి; ఇట్లు+ అనియెన్= ఈ విధంగా చెప్పింది.

తాత్పర్యం: సీతాదేవి చావుకు తెగించిన సంగతి రావణుడికి తెలియ చెప్పటానికి కొందరు రాక్షస స్త్రీలు అతడివద్దకు వెళ్ళారు. అంతట, ఎల్లప్పుడు మృదువైన మంచిమాటలు మాటాడే త్రిజట అనేరాక్షస స్త్రీ, శ్రీరాముడిభార్య అయిన సీతను సమీపించి ఇట్లా పలికింది.

త్రిజట తన స్వప్నవృత్తాంతము సీతతోఁ జెప్పుట (సం. 3-264-53)

సీ. 'అమ్మ! నీ కెంతయు హర్షంబుగా నొక ।
వార్త నే నెఱిఁగింతు వనజవదన!
నామాట నిజముగా నమ్ముము వినవె! య ।
వింధ్యుఁడు నా నొక్కవృద్ధదైత్యుఁ
డనఘుండు రామహితాన్వేషి యై నీకు ।
నాశ్వాస మొనరింప నబల! నన్ను

బనిచెను; విను, నిన్నుఁ బాసిన పిదప ల ।
క్ష్మణుఁడును దాను సేమమునఁ గలసి

ఆ. యఖిలవానరేంద్రుఁ డైన సుగ్రీవుతోఁ ।
జెలిమి సేసి, యిపుడు శీఘ్రమునన
వీరవరుఁడు నిన్ను విడిపించు పనికినై ।
యొదవి యుత్సహించి యున్నవాఁడు. 128

ప్రతిపదార్థం: అమ్మ!= తల్లీ! (తల్లివంటిదానా); వనజ వదన!= పద్మంవంటి మొగం కలదానా, ఓ సీతాదేవీ!; నీకున్+ఎంతయున్, హర్షంబుగాన్= నీకు మిక్కిలి సంతసం కలిగించేటట్లు; ఒక వార్తన్= ఒక సమాచారాన్ని; ఏన్= నేను; ఎఱిఁగింతున్= తెలుపుతాను; నామాట= నాపలుకు; నిజముగాన్= సత్యం అని; నమ్ముము= విశ్వసించుము; వినవె= ఆలకించుము; అవింధ్యుఁడు; నాన్= అనగా; ఒక్క, వృద్ధ, దైత్యుఁడు= ఒక ముసలి రక్కసుడు; అనఘుండు= పుణ్యాత్ముడు; రామ, హిత+అన్వేషి= శ్రీరాముడి మేలు కోరేవాడు; ఐ= అయి; అబల= ఓవనితా!- సీతా!; నీకున్= నీకు; ఆశ్వాసము+ఒనరింపన్= ఊరట కలిగించటానికై; నన్నున్= నన్ను; పనిచెను= నియోగించాడు; విను= ఆలకించుము; నిన్నున్+పాసిన, పిదపన్= నీ నుండి వేరుపడిన పిదప; లక్ష్మణుఁడును+తాను= లక్ష్మణుడును తానును (శ్రీరాముడును); సేమమునన్+కలసి= క్షేమంగా కూడుకొని; అఖిల, వానర+ఇంద్రుఁడు+ఐన= ఎల్ల కోతులకు రాజు అయిన; సుగ్రీవు తోన్= సుగ్రీవుడితో; చెలిమి+చేసి= స్నేహం ఏర్పరచుకొని; ఇపుడు= ఈ సమయంలో; శీఘ్రమునన్+అ= వేగంగా; వీర, వరుఁడు= శూరులలో శ్రేష్ఠుడు అయినవాడు-శ్రీరాముడు; నిన్నున్= ఓసీతా నిన్ను; విడిపించు పనికిన్+ఐ= రావణునిచెర నుండి విడిపించే కార్యంకొరకు; ఒదవి= పూని; ఉత్సహించి+ ఉన్నవాఁడు= ఉద్యుక్తుడై ఉన్నాడు.

తాత్పర్యం: 'తల్లివంటిదానా! పద్మంవంటి ముఖం కల సీతాదేవీ! నేను నీకు ఒక శుభవార్త తెలుపుతాను. సావధానంగా వినుము. నాపలుకులు

సత్యాలు. నామాట నమ్ముము. అవింధ్యుడు అనే ఒక ముదుసలిరక్కసుడు శ్రీరాముడి మేలుగోరేవాడు నీతో ఈమాటలు చెప్పి నిన్ను ఊరడించుమని నన్ను వేడాడు. అలనాడు నిన్ను ఎడబాసిన పిమ్మట లక్ష్మణుడు శ్రీరాముడు క్షేమంగా కలిసికొన్నారు. పిదప వారు వానరరాజు అయిన సుగ్రీవుడితో స్నేహం చేశారు. ఇపుడు శీఘ్రంగా దండెత్తి ఇచటికి వచ్చి రావణుడిచెరనుండి నిన్ను విడిపించటానికై వస్తున్నారు.

వ. రావణునకు రంభానిమిత్తం బయిన నలకూబరు శాపంబుగలదు గావున నీయందు బలాత్కారంబు సేయరాదు; నీకు వీనివలని భయంబు వలదు; మఱి యిద్దురాత్మునకుం జేటు దెలుపునట్టి దుస్స్వప్నంబు గలిగె; నది యాకర్ణింపుము. 129

ప్రతిపదార్థం: రావణునకున్; రంభా, నిమిత్తంబు+అయిన= రంభకారణంగా కల; నలకూబరుశాపంబు= నలకూబరుడు ఇచ్చిన శాపం; కలదు= ఉన్నది; కావునన్= కాబట్టి; నీయందున్= నీ విషయంలో; బలాత్కారంబు= బలిమితో పీడించటం, భోగించటం; చేయరాదు= చేయజాలడు; నీకున్= నీకు; వీనివలన= ఇతడి వలన (రావణుడి వలన); భయంబు= భీతి; వలదు= పొందనక్కరలేదు; మఱి= ఇంక; ఈ+ దురాత్మునకున్= ఈ చెడ్డ ఆత్మకలవాడికి (రావణుడికి); చేటు= కీడు; తెలుపు+ అట్టి= సూచించేటి; దుస్స్వప్నము= చెడుకల; కలిగెన్= ఏర్పడింది; అది= ఆ కలను; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: రావణుడు నిన్ను బలిమితో పీడించి సంభోగించనేరడు. దానికి ఒక కారణం ఉన్నది. రంభను బలాత్కరించి భోగించటంచేత నలకూబరుడు రావణుడిని శపించాడు. ఇక నీకు రావణుడి వలని భయం అనవసరం. ఇక ఆ దురాత్ముడైన రావణుడికి కీడు మూడింది. దానిని తెలిపే స్వప్నం నాకు వచ్చింది. ఆ కలను వివరించి చెప్పుతాను; వినుము.

విశేషం: 1. నలకూబరుడు కుబేరుడి కొడుకు. రంభ స్వర్గలోకంలో వేశ్య. నలకూబరుడి ప్రేయసి. ఒకసారి రావణుడు రంభను బలాత్కరించి

సంభోగించాడు. నలకూబరుడు కోపించి, ఇకమీద రావణుడు ఏ వనితనైనా బలాత్కారంగా సంభోగిస్తే అతడి శిరస్సులు పగిలి చచ్చేటట్లు శాపం పెట్టాడు.

క. ఖరములఁ బూనిన రథమున।
విరిసిన వెండ్రుకలు వెంట వ్రేలఁగ దశకం
ధరుఁడు బహుళతైలాప్లుత।
శరీరుఁడై దక్షిణంబు సనఁ గలఁ గంటిన్. 130

ప్రతిపదార్థం: దశకంధరుఁడు= పదికంఠాలు కలవాడు - రావణుడు; ఖరములన్+పూనిన, రథమునన్= గాడిదలను పూన్చిన తేరుపై; విరిసిన= చెదరిన; వెండ్రుకలు= రోమాలు; వెంటన్= వెనుకగా; వ్రేలఁగన్= వ్రేలాడగా; బహుళ, తైల+ఆప్లుత, శరీరుఁడు+ఐ= మికుటమైన నూనెతో ముంచబడిన దేహం కలవాడై; దక్షిణంబు+చనన్= దక్షిణపు దిక్కుగా ఏగుతున్నట్లు; కలన్+కంటిన్= స్వప్నాన్ని కన్నాను.

తాత్పర్యం: గాడిదలు లాగుతున్న అరదాన్ని ఎక్కి, జారుతున్న వెంట్రుకలతో, నూనెతో తడుపబడిన దేహం కలవాడై పదితలలు కల రావణుడు దక్షిణదిక్కువైపు వెళ్లుతున్నట్లు నాకు స్వప్నంలో కనబడ్డాడు.

విశేషం: 1. దక్షిణదిక్కుకు పాలకుడు యముడు. 2. గాడిదలు గుర్రాలకు బదులు రథాన్ని లాగటం అపశకునం.

తే. అతని చుట్టును గుంభకర్ణాదు లెల్ల।
నరుణమాల్యానులేపనులై వికీర్ణ
పతితకేశులై నగ్నులై పరఁగఁ బ్రేత।
పతిదిశకు నేఁగు గతి గానఁబడియె నాకు. 131

ప్రతిపదార్థం: అతని చుట్టును= రావణుడికి అన్నివైపులను; కుంభకర్ణ+ ఆదులు+ఎల్లన్= కుంభకర్ణుడు మున్నగువారు అందరును; అరుణ, మాల్య+ అనులేపనులు+ఐ= ఎర్రనిపూలదండలతో, ఎర్రనిమైపూతలతో కూడినవారై; వికీర్ణ, పతిత, కేశులు+ఐ= చెదరి క్రిందికి పడినజుట్టు కలవారయి; నగ్నులు+

ఐ= దిగంబరులై; పరఁగన్= ఒప్పుగా; ప్రేతపతిదిశకున్= యముడి దిక్కునకు- దక్షిణదిశకు; ఏఁగు, గతిన్= వెడలుతున్న రీతి; నాకున్= నాకు; కానఁ బడియెన్= గోచరించింది.

తాత్పర్యం: ఆ రావణుడి చుట్టూ, కుంభకర్ణుడు మొదలైన రాక్షసులు అందరును ఎర్రనిపువ్వులు ఎర్రనిమైపూతలు కలవారై, విరబోసిన జుట్టు ముడులు జారిపోయి, వస్త్రాలు లేకుండ యముడిదిశకు వెడలుతున్నట్లు నాకు కన్పించారు.

చ. **చారుసితోష్ణ వారణలసత్సితమాల్యసితాంగరాగుఁడై**
ధీరగుణోత్తరుం డధికధీనిలయుండు విభీషణుండు వి
స్ఫారసితాద్రిశృంగమున భవ్యుఁడు మంత్రిచతుష్టయాన్వితుం
డై రమణీయలక్ష్మిఁ బొలుపారఁగ నేఁ గలగంటి నుగ్మలీ! **132**

ప్రతిపదార్థం: ఉగ్మలీ!= ఓకాంతా! సీతాదేవీ! చారు, సిత+ఉష్ణ, వారణ, లసత్+సితమాల్య, సిత+అంగరాగుఁడు+ఐ= మనోజ్ఞమైన, తెల్లని ఛత్రమున్నూ, వెలుగొందే తెల్లనిపూలదండలున్నూ, తెల్లనిమైపూతలున్నూ కలవాడై; ధీర, గుణ+ఉత్తరుండు= చలించని ధైర్యము మున్నగుమంచి గుణాలచేత గొప్పవాడు అయి; అధిక, ధీ, నిలయుండు= మిక్కిలి తెలివితేటలకు నెలవు అయినవాడు; విభీషణుండు= విభీషణుడు (రావణుడి తమ్ముడు); భవ్యుఁడు= సాత్త్వికుడు; విస్ఫార, సిత+అద్రి, శృంగమునన్= ప్రకాశించే తెల్లనికొండకొమ్మునందు; మంత్రి; చతుష్టయ+ అన్వితుండు+ఐ= మంత్రులు నలువురితో కూడిఉన్నవాడై; రమణీయలక్ష్మిన్= అందమైనశోభతో; పొలుపారఁగన్= విలసిల్లగా; నేన్= నేను; కల+కంటిన్= కల కన్నాను.

తాత్పర్యం: మనోజ్ఞమైన తెల్లని గొడుగును ధరించి, తెల్లనిపువ్వులను ముడిచి, తెల్లని మైపూత వహించి, ధైర్యంఅను మంచిగుణంతో గొప్పవాడై తెలివితేటలకు నెలవు అయిన విభీషణుడు తెల్లనికొండకొమ్మన తననలుగురు మంత్రులతో పాటు మిక్కుటమైనశోభతో విలసిల్లుతూండటం నేను స్వప్నంలో చూచాను.

విశేషం: తెలుపురంగు స్వచ్ఛతకు గుర్తు. రావణాదులు ఎర్రనిపూలు, ఎర్రనిమైపూతలు వహించటం, ప్రతియోగంగా విభీషణుడు తెలిపువ్వులు తెలుపుమైపూతలు వహించటం గమనించతగింది. పూర్వకాలంలో మరణదండన విధించబడినవారల మెడలో ఎర్రని పూలదండలు వేయటం కద్దు.

చ. **తన సిత కీర్తి విశ్వవసుధా గగనాంతరపూరితంబుగా**
ఘనభుజుఁ డున్నతద్విరదకంధరసుస్థితుఁడై ముదంబుతో
ననుజుఁడు దాను రాఘవకులాగ్రణి సన్మధుసిక్తపాయసం
బొనర భుజింపఁ గంటి వికచోత్పలలోచన! నిక్కమింతయున్.133

ప్రతిపదార్థం: వికచ+ఉత్పల, లోచన!= వికసించిన కలువలవంటి కన్నులు కలదానా- ఓ సీతాదేవీ!; అనుజుఁడున్= తమ్ముడును; తాను= తాను; రాఘవ, కుల+అగ్రణి= రఘువుయొక్కకులంలో పుట్టినవారిలో శ్రేష్ఠుడు- శ్రీరాముడు; తన, సిత, కీర్తి= తనదైన తెల్లని యశస్సు; విశ్వవసుధా, గగన+అంతర, పూరితంబుగాన్= సమస్త మైన నేలకు, నింగికి కల మధ్యభాగాన్ని అంతటిని నింపుతుండగా; ఘనభుజుఁడు= గొప్పభుజాలు కలవాడు, అధికమైన శౌర్యంకలవాడు; ఉన్నత, ద్విరద, కంధర, సుస్థితుఁడు+ఐ= ఎత్తైన ఏనుగు మెడపై హాయిగా కూర్చున్నవాడై; ముదంబుతోన్= సంతోషంతో; సత్+మధు, సిక్త, పాయసంబు= మంచితేనెతో తడిసిన పరమాన్నం; ఒనరన్= ఒప్పిదంగా; భుజింపన్= తినుచుండటం; కంటిన్= చూచాను; ఇంతయున్= ఈ స్వప్న మంతయూ; నిక్కము= నిజం.

తాత్పర్యం: చెంగలువరేకులవంటి కనులు కల ఓ సీతాదేవీ! నాకు శ్రీరాముడు కలలో కన్పించాడు. తన తెల్లనియశస్సు భూమ్యాకాశాల మధ్యభాగాన్ని అంతటిని నింపగా, మహాపరాక్రమశాలి అయిన శ్రీరాముడు ఎత్తైన ఏనుగుమెడపై తమ్ముడు లక్ష్మణుడితో కలిసి కూర్చొని సంతోషంతో తేనెతో కూడిన పాయసాన్ని ఆరగిస్తున్నట్లు కల వచ్చింది. నాకు వచ్చిన కల నిజం (నిజమౌతుంది).

విశేషం: కీర్తి తెల్లగా ఉంటుంది. ఇది కవిసమయం.

క. పులిచేత వ్రేటువడి మ్యెఁ।
గలయఁగ నెత్తురులు గ్రమ్మఁగా నేడ్చుచు ని
మ్ముల నుత్తరాభిముఖి వై।
కలుషితగతి నరుగ నిన్నుఁ గనుఁగొంటిఁ గలన్. 134

ప్రతిపదార్థం: పులిచేతన్= వ్యాఘ్రంచేత; వ్రేటు+పడి= దెబ్బవేయబడి; మైన్+కలయఁగన్= శరీరంలో కలిసేటట్లుగా; నెత్తురులు= రక్తాలు; క్రమ్మఁగాన్= ఆవరించగా; ఏడ్చుచున్= ఆక్రోశిస్తూ; ఇమ్ములన్= యథేచ్ఛగా; ఉత్తర+అభిముఖివి+ఐ= ఉత్తరదిక్కుకు మొగం పెట్టినదానివై; కలుషితగతిన్= తొట్రుపడే నడకతో; అరుగు= వెడలే; నిన్నున్= ఓ సీతాదేవీ నిన్ను; కలన్= స్వప్నంలో; కనుఁగొంటిన్= చూచాను.

తాత్పర్యం: పెద్దపులిచేత కొట్టబడి శరీరంనిండా నెత్తురులు జాలువారుతుండగా శోకిస్తూ నీవు యథేచ్ఛగా ఉత్తరదిశవైపుకు తొట్రుపాటుతో కూడిన నడకతో పోవటం నేను నా స్వప్నంలో చూచాను.

క. నా కల నిక్కల యయ్యెడు।
శోకింపకు మమ్మ యింక సుందరి! పుణ్య
శ్లోకు జితలోకు నతులవి।
వేకుం బ్రియుఁ బొందఁగలుగు వేగమ నీకున్'. 135

ప్రతిపదార్థం: సుందరి!= (అందగత్తె వైన) ఓ సీతాదేవీ!; నా కల= నాకు వచ్చిన స్వప్నం; నిక్కల+అయ్యెడున్= నిజం అయ్యే కల కాగలదు (నిక్కము+కల= నిక్కల); శోకింపకుమమ్మ= దుఃఖించకుము; ఇంకన్= ఇకమీద; పుణ్యశ్లోకున్= పుణ్యం కలిగించే కీర్తికలవాడిని; జితలోకున్= జయించబడిన లోకం కలవాడిని (లోకవిజేతను); అ,తుల, వివేకున్= సాటిలేని విచక్షణాజ్ఞానం కలవాడిని; ప్రియున్= భర్తను; వేగము+అ= శీఘ్రంగా; నీకున్= నీకు; పొందన్+కలుగున్= పొందటానికి వీలు కలుగుతుంది.

తాత్పర్యం: అందగత్తె వైన ఓ సీతాదేవీ! నా కల నిజం కా గలదు. తల్లీ! ఇక దుఃఖించకుము. గొప్పయశస్సు నార్జించిన మహానుభావుడు, గొప్పపరాక్రమవంతుడు అయిన నీభర్తను నీవు శీఘ్రంగా పొందగలవు'.

ఆ. అనినఁ ద్రిజటపలుకు లవి నిక్కములు గాఁగ।
వగచి సీత గొంత వనట దక్కి
యాసతోడ నుండె; నట దశవదనుండు।
సీతఁ దలఁచి వివశచిత్తుఁ డగుచు. 136

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; త్రిజట పలుకులు= త్రిజట చెప్పిన మాటలు; అవి= అవి అన్నియును; నిక్కములు+కాఁగన్= నిజాలుగా; వగచి= భావించి; సీత= జానకి; కొంత= కొంచెం; వనట+తక్కి= విచారం మాని; ఆసతోడన్= ఆశతో; ఉండెన్= ఉండింది; అటన్= అక్కడ; దశవదనుండు= పదిమొగాలు కలవాడు, రావణుడు; సీతన్+తలఁచి= సీతను స్మరించి; వి, వశ, చిత్తుఁడు+అగుచున్= వశం తప్పిన మనస్సు కలవాడు ఔతూ.

తాత్పర్యం: త్రిజట చెప్పిన పలుకులు విని, అవి నిజాలు కావచ్చునని ఆశతో సీత కొంత ఊరటచెంది ఉండింది. అట రావణుడు సీతను స్మరించి వశం తప్పిన మనస్సుకలవా డయ్యాడు.

వ. తాను దేవదానవ గంధర్వాది భూతవర్గంబుల నెల్ల జయించియుం గందర్పదర్పంబు వారింప నోపక యాక్షణంబ దివ్యమాల్యాంబరాభరణ భూషితుండై సంచారశీలం బైన కల్పపాదపంబునుంబోలె నొప్పియుఁ దనయొప్పుఁ బితృపనంబునందలి వటభూరుహంబుసొంపునుంబోలె నతిభీషణం బగుచుండ నశోకవనమధ్యంబు సొత్తెంచి రోహిణీసమీపంబునకు వచ్చు శనైశ్చరుండునుంబోలె జానకిం జేరం జనుదెంచి ప్రణయపూర్వకం బుగా నిట్లనియె. 137

ప్రతిపదార్థం: తాను= తాను (రావణుడు); దేవ, దానవ, గంధర్వ+ఆది, భూత, వర్గంబులన్= వేల్పులు రాక్షసులు గంధర్వులు మున్నగునట్టి

చేతనాచేతనజాతులను; ఎల్లన్= అన్నింటిని; జయించియున్= గెలిచియున్నా; కందర్ప, దర్పంబు= మన్మథుడియొక్క విజృంభణం; వారింపన్+ఓపక= అడ్డగింపజాలక; ఆ+క్షణంబు+అ= ఆ నిముసంలోనే; దివ్య, మాల్య+అంబర+ ఆభరణ, భూషితుండు+ఐ= దేవతా మహిమగల పూవులు, వస్త్రాలు, భూషణాలచేత అలంకరించబడిన వాడై; సంచార శీలంబు+ఐన= నడచునట్టి స్వభావంగల; కల్ప, పాదపంబునున్+పోలెన్= కల్పవృక్షంవలె; ఒప్పియున్= శోభిల్లికూడ; తన+ఒప్పున్= తనశోభను, పితృవనంబు నందలి= శ్మశానంలోని; వటభూరుహంబు, సొంపునున్+పోలెన్= మర్రిచెట్టుయొక్క సొగసువలె; అతిభీషణంబు= మిక్కిలి భయంకరం; అగుచున్+ఉండన్= ఔతుండగా; అశోకవనమధ్యంబు+చొత్తెంచి= అశోకవనంయొక్క మధ్యభాగాన్ని చేరి; రోహిణీ, సమీపంబునకున్= రోహిణీనక్షత్రం దగ్గరకు; వచ్చు= అరుగుదెంచే; శనైశ్చరుండునున్+ పోలెన్= శనిగ్రహం వలె; జానకిన్= సీతను; చేరన్+చనుదెంచి= చేరడానికి వచ్చి; ప్రణయ పూర్వకంబుగాన్= ప్రేమ తొణికిసలాడేటట్లుగా; ఇట్లు+అనియెన్= ఈవిధంగా పలికాడు.

తాత్పర్యం: రావణుడు వేల్పులు రాక్షసులు గంధర్వులు మున్నగు భూతజాతులను అన్నింటినీ గెలిచినవాడే అయినను మన్మథుడిని గెలువజాలకపోయాడు. ఇక సీతాదేవియొక్క అనురాగాన్ని చూరగొనటానికై రావణుడు దివ్యపుష్పాలు ముడిచి మంచివస్త్రాలను ఆభరణాలను ధరించి, నడుస్తున్న కల్పవృక్షంవలె అశోకవనానికి వచ్చాడు. కాని, ఆతడు శ్మశానంలో విస్తరించిన మర్రిచెట్టువలెనే భాసించి మిక్కిలి భయంకరంగా కన్పించాడు. రావణుడు అశోకవనంలో ఉన్న సీతాదేవివద్దకు రావటం రోహిణీనక్షత్రం సమీపానికి శనిగ్రహం చేరుతున్నట్లు కన్పించింది. ఆ రీతిగా రావణుడు సీతదరి చేరి అనురాగం తొణికిసలాడేటట్లుగా ఇట్లా పలికాడు.

విశేషం: 1. రావణుడు జంగమకల్పవృక్షంవలె చనుదెంచాడు అన్నప్పుడు. అలంకారం ఉత్ప్రేక్ష. కల్పవృక్షము- కదలునట్టిదికాదు. ఒకవేళ కదలితే ఎట్లుంటుందో అట్లా ఉన్నాడని ఊహించుకొనవలెను కాబట్టి ఉత్ప్రేక్ష. 2.

కల్పవృక్షం స్వర్గంలో నందనవనంలోని చెట్టు. కోరిన కోరికల నిచ్చే మహిమ కలది. 3. వటవృక్షంవోలె అనుచో అలంకారం ఉపమ. 4. అట్లే శని రోహిణీ నక్షత్రాన్ని చేరినట్లు అనుచో అలంకారం ఉపమ. రోహిణీనక్షత్రాన్ని శనిగ్రహం చేరినప్పుడు లోకంలో పెక్కు అరిష్టాలు సంభవిస్తాయని జ్యోతిష్కులు చెప్తారు.

క. **'ఏల మదిరాక్షి! వలవని।**
జాలింబడి నవసెదవు లసద్భూషణ లీ
లాలంకృతవై ననుఁ గృప।
నేలికొనం గదవె వేయు నేటికి నింకన్. 138

ప్రతిపదార్థం: మదిర+అక్షి!= మత్తెక్కించే నేత్రాలు కలదాన- ఓసీతాదేవీ! ఏల= ఎందుకు; వలవని= కూడని; జాలిన్+పడి= దుఃఖంలో పడి; నవసెదవు= వెతచెందుతావు; లసత్+భూషణ+అలంకృతవు+ఐ= ప్రకాశించే ఆభరణాలను సింగారించుకొనినదానివై; ననున్= నన్ను (రావణుడనైన నన్ను); కృపన్= దయతో; ఏలికొనన్+కదవె= పాలించుకొనవే; ఇంకన్= ఇక; వేయున్+ ఏటికిన్?= వేలకొలది మాటలు ఎందుకు?

తాత్పర్యం: మత్తెక్కించే కన్నులు గల ఓ సీతాదేవీ! నీ కనుచూపులు చాలు. నేను మరులుగొని ఉన్నాను గదా! ఇటు నాపై దయచూపుము. ఎందుకు నీవు ఈరీతిగా కూడనిదుఃఖాన పడి కృశిస్తున్నావు? వెలుగొందే ఆభరణాలు ధరించి నన్ను దయతో ఏలుకొనుము. వేలకొలదిమాటలు మాటాడి నేను అధికప్రసంగం చేయదలచుకోలేదు.

చ. **అనిమిష యక్ష రాక్షస వియచ్చర కిన్నర పన్నగాసురాం**
గనలఁ గరంబు చిత్తమునఁ గైకొన కే ననురాగలీలమై
నిను మది నాదరించు టిది నీదగుభాగ్యము గాదె? యింతయున్
వనిత! యెఱుంగ వైతి; గరువంపువిచారము లేల నీయెడన్. 139

ప్రతిపదార్థం: వనిత!= మగువా! ఓసీతాదేవీ!; అనిమిష. యక్ష, రాక్షస, వియత్+చర; కిన్నర, పన్నగ+అసుర+అంగనలన్= వేల్పులకు, యక్షులకు, కిన్నరులకు, పాములకు, అసురులకు చెందిన ఆడువారిని; కరంబు= మిక్కిలిగా; చిత్తమునన్= మనస్సులో; కైకొనక= స్వీకరించక; ఏన్= నేను; అనురాగలీలమైన్= ప్రేమతో నిండిన కేళిచొప్పున; నినున్= నిన్ను; మదిన్= మనస్సులో; ఆదరించుట= ప్రేమించటం; ఇది= ఇట్టి ప్రేమ; నీదు+అగు= నీది అయిన; భాగ్యము+కాదె= అదృష్టమే కదా?; ఇంతయున్= ఇది (అంతయు నీ అదృష్టయోగమే అని); ఎఱుంగవు+ఐతి= తెలిసికొనలేక పోయావు; గరువంపు విచారములు= గర్వంతో కూడిన ఆలోచనలు; ఈ+ఎడన్= ఈపట్టున; ఏల= ఎందుకు?

తాత్పర్యం: ఓ సీతాదేవీ! నేను దేవతలను యక్షులను గంధర్వులను కిన్నరులను పన్నగులను అందరను జయించినవాడను కదా! ఆయా జాతులలోని సుందరాంగులు ఎందరు లేరు? వారు అందరు నా అధీనంలో ఉన్నవారే అయినను వారిని ఎవ్వరిని వరించక నేను అనురాగంతో నిన్ను కోరటం నిజంగా నీకు పట్టిన గొప్ప అదృష్టయోగం సుమా! ఆ సంగతి నీవు గుర్తించలేదు. అనవసరమైన దుఃఖంలో మునిగి ఉన్నావు. గర్వంతో కూడిన ఆలోచనలు చేయటం ఈ పట్టున భావ్యం కాదు.

విశేషం: 1. కిన్నరులు - అశ్వముఖం నరశరీరంకల దేవజాతివారు. 2. అనిమిషులు - రెప్పపాటు లేనివారు- వేల్పులు. 3. రాక్షసులు, అసురులు దైత్యదానవులు. దితిసంతతి దనుసంతతి అని రక్కసులలో రెండు తెగలు. ఈ పద్యంలో రాక్షస అసుర పదాలు రెండూ వాడబడినవి.

ఉ. రాముఁ డనంగఁ బేర్మియును రాజ్యముఁ గోల్పడి కానలోన దుః
ఖామయ మగ్నుఁ డైన యొకయల్పమనుష్యుఁడు వానిపైఁ గడుం
బ్రేముడి సేయుచున్ వగపుపెల్లునఁ జిత్తము దల్లడిల్లఁగా
నీ మెయి నుండు నీయునికి యేసుఖ మంద్రు లతాంగి చెప్పుమా! 140

ప్రతిపదార్థం: లతా+అంగి!= తీగవంటి సుకుమార మైన శరీరం కలదానా!; ఓసీతాదేవీ!; రాముఁడు+అనంగన్= రాముడు అనగా; పేర్మియును= గొప్పతనాన్ని; రాజ్యమున్= రాజ్యపరిపాలనమును; కోల్పడి= పోగొట్టుకొని; కానలోనన్= అడవిలో; దుఃఖ+ఆమయ, మగ్నుఁడు+ఐన= ఆవేదన అనే రోగంలో మునిగినవాడు అయిన; ఒక= ఒకానొక; అల్పమనుష్యుఁడు= తక్కువ అయిన మానవుడు; వానిపైన్= అతనిపై, ఆ రాముడిపై; కడున్= మిక్కిలి; ప్రేముడి+చేయుచున్= అనురాగం చూపుతూ; వగపు పెల్లునన్= విచారంయొక్క అతిశయంతో, గొప్పదుఃఖంతో; చిత్తము= మనస్సు; తల్లడిల్లఁగాన్= ఆందోళన చెందగా; ఈ మెయిన్= ఈ రీతిగా; ఉండు= ఉన్నటువంటి; నీ+ఉనికి= నీ బ్రదుకు; ఏసుఖము= ఎట్టి సౌఖ్యంతో కూడింది; అంద్రు= అని చెప్పుతారు; చెప్పుమా= వచించుమా.

తాత్పర్యం: తీగవలె సుకుమారమైన శరీరంగల సీతాదేవీ! రాముడు ఎవడు? గొప్పతనమును, రాజ్యాన్ని గోలుపోయి అడవులలో తిరుగాడుతూ దుఃఖం అనే రోగంలో మునిగిన ఒక అల్పమానవుడు. అట్టి రాముడిపై నీవు ప్రేమ వహించి నీ మనస్సును దుఃఖంతో తల్లడిల్లేటట్లు చేస్తున్నావు. ఇది ఎటువంటి సుఖం? ఎవరు దీనిని సుఖమని చెప్పుతారు? నీవే చెప్పుము.

విశేషం: ఉ.వి. ఆంధ్రమహాభారత సంశోధిత ముద్రణ ప్రతిలో- "పేర్మియును రాజ్యము'' అనే పాఠం ఉన్నది. (పేర్మియుమ- అనే అచ్చుతప్పుతో ఉన్న పాఠాన్ని సరిచేసుకోవాలి). "పేర్మి యువరాజ్యము' - అన్నది పాఠాంతరంగా గుర్తించబడింది. రాముడరణ్యావాసదీక్ష పూనే సమయంలో అతడు త్యాగంచేసింది యౌవరాజ్యాభిషేకమే కాబట్టి 'పేర్మి యువరాజ్యము' అనే పాఠాన్నే ఈ ప్రతిలో గ్రహించటమైనది.

వ. ఏను సకలలోకేశ్వరుండ; నాకుం గింకరులై పదునాలుగుకోట్లు నిశాచర భటులును, నిరువది యెనిమిదికోట్లు రాక్షసులును,

నెనుబదియాఱు కోట్లు యక్షులును వర్తిల్లుదురు; నిఖిలధనాధ్యక్షుండయిన యక్షేశ్వరుండు నాయగ్రజుండు; బ్రహ్మసమానుం డగు విశ్రవసుండు మదీయజనకుండు; గుబేరునకు వినోదపాత్రంబు లైన గంధర్వాప్సరో గణంబులు నన్ను సేవించుఁ; బంచమలోకపాలుం డని నన్నుఁ ద్రిభు వనంబులుఁ గీర్తించు; భక్ష్యభోజ్యాది వస్తువులును సురేశ్వరగృహంబునం దెట్లట్లనాగృహంబున నక్షయంబు; లిట్టినావిభవం బింతటికిని మదీయజీవితంబునకు నధీశ్వరివై సుఖంబున భోగింపు' మనిన విని, వైదేహి క్రోధశోకవ్యాకులహృదయ యగుచు వానిదెసం జూడక యొక్కతృణాంకురం బుపలక్షించి యి ట్లనియె. 141

ప్రతిపదార్థం: ఏను= నేను; సకల, లోక+ఈశ్వరుండన్= సమస్తభువనాలకు అధినేతనైన పరిపాలకుడను; నాకున్= నాకు; కింకరులు+ఐ= సేవకులు అయి; పదునాలుగుకోట్లు నిశాచరభటులును= పదునాలుగుకోట్లమంది రాత్రించరులు- రాక్షసులును; ఇరువది+ఎనిమిదికోట్లు రాక్షసులును= ఇరువది ఎనిమిదికోట్లు రక్కసులును; ఎనుబది ఆఱుకోట్లు, యక్షులును= ఎనుబది ఆరుకోట్ల జక్కులును; వర్తిల్లుదురు= పనిచేస్తారు; నిఖిల, ధన+అధ్యక్షుండు+ అయిన= సమస్తమైన ధనానికి అధిపతి అయిన; యక్షేశ్వరుండు = (యక్ష+ఈశ్వరుండు=) యక్షులయొక్క ప్రభువు- కుబేరుడు; నా+అగ్రజుండు= నా అన్న; బ్రహ్మసమానుండు+అగు= బ్రహ్మదేవుడితో తుల్యుడు అయిన; విశ్రవసుండు; మదీయ, జనకుండు= నా తండ్రి; కుబేరునకున్; వినోద పాత్రంబులు+ఐన= వేడుకను ఒనగూర్చేవి అయిన; గంధర్వ= గంధర్వుల కన్నెలు; అప్సరోగణంబులు= వేలుపుకన్నెల సముదాయాలు; నన్నున్= నన్ను; సేవించుచున్= కొలుస్తూ; పంచమ లోకపాలుండు+ అని= అయిదవ లోకపాలకుడు అని; నన్నున్= నన్ను; త్రి, భువనంబులున్= మూడు లోకాలున్నూ; కీర్తించున్= కొనియాడుతాయి; భక్ష్యభోజ్య+ఆది వస్తువులును= తినుబండారాలు మున్నగునవి; సుర+ఈశ్వర, గృహంబునందున్= దేవేంద్రుడి

ఇంటిలో; ఎట్లు+అట్లు+అ= ఏయేవిధాలుగా ఉంటాయో అట్లా; నా గృహంబునన్= నా ఇంటిలో; అక్షయంబులు= తరుగనట్టివి; ఇట్టి= ఇటువంటి; నా విభవంబు= నా సంపద; ఇంతటికిని= సర్వస్వానికి; మదీయ, జీవితంబునకున్= నా బ్రదుకుకు; అధి+ ఈశ్వరివి+ఐ= ఏలికసానివై; సుఖంబునన్= సౌఖ్యంతో; భోగింపుము= అనుభవించుము; అనినన్= అని (రావణుడు చెప్పగా); విని= ఆలకించి; వైదేహి= విదేహరాజుకూతురు సీతాదేవి; క్రోధ, శోక, వ్యాకుల, హృదయ,+ అగుచున్= కోపంచేత, దుః ఖంచేత, కలత చెందిన డెందం కలది ఔతూ; వానిదెసన్= అతడి (రావణుడి) వైపు; చూడక= వీక్షించక; ఒక్క= ఒక; తృణ+అంకురంబు= గడ్డిపరక; ఉపలక్షించి= అన్యాపదేశంగా నిలిపి- అనగా రావణుడికి బదులుగా ఉద్దేశించి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికింది.

తాత్పర్యం: 'నేను ఎవరో నీకు తెలియునా? నేను సకలభువనాలకు సార్వభౌముడిని. నాకు సేవకులుగా పదునాలుగుకోట్లమంది దైత్యులు, ఇరువదియెనిమిదికోట్లమంది దానవులు; ఎనుబదిఆరుకోట్లమంది యక్షులు ఉన్నారు. సమస్తమైన ధనానికి అధిపతి అయిన యక్షులప్రభువు కుబేరుడు నా అన్న. బ్రహ్మతో తుల్యుడు అయిన విశ్రవసుడు నా తండ్రి. కుబేరుడికి వినోదం కల్పించే గంధర్వకన్యలు అప్సరసలు నన్ను కొలుస్తూ ఉంటారు. మూడులోకాలు నన్ను 'పంచమలోకపాలకుడు' అని మన్నిస్తాయి. దేవేంద్రుడి ఇంటిలో ఉన్నట్లే నాగృహంలోనూ తినుబండారాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి నా సిరిసంపదలు. ఇట్టి నా ఐశ్వర్యానికే కాక నా జీవితానికి నీవు ఏలికసానివి కమ్ము. సమస్తసౌఖ్యాలు అనుభవించుము' అని రావణుడు చెప్పగా విని సీతాదేవి ఆతడి ముఖం చూడనొల్లక, మిక్కుటమైన కోపంచేత దుఃఖంచేత పీడించబడిన హృదయం కలదై, ఒక పచ్చగడ్డిపరకను రావణుడికి బదులుగా ఉద్దేశించి ఇట్లా పలికింది.

విశేషం: 1. భక్ష్యాలు= తినుబండారాలు. ఇవి 5 విధాలు. 1. భక్ష్యం 2. భోజ్యం 3. లేహ్యం 4. చోష్యం 5. పానీయం- ఉపలక్షణం ఇంకొక దానిని ఉద్దేశించి చెప్పింది. ఇచట తృణాంకురము (రావణుడి స్థానంలో) ఉపలక్షించబడింది.

సీ. 'అకట! పరాంగన, నబలఁ, బతివ్రతఁ, ।
బరికింపఁగా మర్త్యభామ నేను,
రాక్షసుండవు నీవు; రాగంబు మది నించు ।
కయు లేని నాదు సంగమమునందుఁ
గలిగెడు నట్టి సౌఖ్యం బెంత? యదియును ।
గాక యాద్యుం డైన కమలగర్భు
పౌత్త్రుఁడ నని లోకపాలతుల్యుఁడ నని ।
హరసఖుం డైన ధనాధినాథు

ఆ. భ్రాత నని భవత్ప్రభావంబు సెప్పితి; ।
విట్టి నీవు ధర్మ వెఱిఁగి దురిత
వర్తనంబు విడువవలదె? సిగ్గేది యి ।
ప్పగిదిఁ బ్రల్లదములు వలుకఁ దగునె?' 142

ప్రతిపదార్థం: అకట!= అయ్యో!; పర+అంగనన్= ఒరుని భార్యను; అబలన్= బలంలేనిదానను (కోమలిని అని భావం); పతివ్రతన్= భర్తయందే అనురక్తి కలిగినదానను; పరికింపఁగాన్= అరయుగా; ఏను= నేను; మర్త్యభామను= మనుష్యస్త్రీని; నీవు= ఈవు; రాక్షసుండవు= రక్కసుడవు; మదిన్= చిత్తంలో; రాగంబు= ప్రేమ; ఇంచుకయున్ లేని= ఏమాత్రమున్నూ లేని; నాదు, సంగమము నందున్= నాపొందులో; కలిగెడు+అట్టి= ఏర్పడునట్టి; సౌఖ్యంబు= సుఖం; ఎంత= ఏమాత్రమైనది?; అదియును+కాక= అంతమాత్రమేగాక; ఆద్యుండు+ఐన= మొదటివాడు అయిన (సృష్టికి ఆద్యుడు అయిన); కమలగర్భు, పౌత్త్రుఁడన్= బ్రహ్మదేవుడి మనుమడిని; అని= అంటూ; లోకపాలతుల్యుఁడన్+అని= దిక్పాలకులతో సమానమైనవాడను అని; హరసఖుండు+ఐన= శివుడి మిత్రుడు అయిన; ధన+అధినాథు, భ్రాతన్= కుబేరుడిసోదరుడను; అని= అనుచూ; భవత్+ప్రతాపంబు= నీదైన మహిమ; చెప్పితివి= వచించావు; ఇట్టి నీవు= ఇటువంటి ప్రతాపం కల నీవు; ధర్మమువు+ఎఱిఁగి= ధర్మాన్ని తెలిసికొని; దురిత, వర్తనంబు= చెడునడవడి; విడువన్‌వలదె= వీడవలెను కదా; సిగ్గేది(సిగ్గు+ఏది)= సిగ్గువీడి; ఈరీతిగా; ప్రల్లదములు= పారుష్యాలు (కఠినమైన మాటలు); పలుకన్= తగునె?= వచించటం భావ్యమా? (భావ్యం కాదుకదా);

తాత్పర్యం: 'అయ్యో, రావణా! నాకు ఎంతటి దురవస్థ ఏర్పడింది. నేను ఒరుని భార్యను. కోమలిని, భర్తయందే అనురాగం కలిగి భర్తనే దైవంగా భావిస్తున్నదానను. నీవా రాక్షసుడవు. నీయందు ఏమాత్రం అనురాగం లేని నాపొందు నీకు ఏవిధంగానూ ఎట్టిసుఖం ఈయజాలదు కదా. అదియునుంగాక, నీవు బ్రహ్మదేవుడి మనుమడవు అని, దిక్పాలకులతో సమానుడను అనీ, పరమశివుడిమిత్రుడు ధనపతి అయిన కుబేరుడిసోదరుడను అని గొప్పలు చెప్పుకొంటున్నావు. మఱి అంతటి గొప్పవాడికి ధర్మం తెలియాలి. చెడునడవడి వదలిపెట్టాలి. అంతే కాని ఈ రీతిగా నోటికి వచ్చినట్లు కండకావరంతో ప్రల్లదాలు ప్రేలవచ్చునా? నీ ప్రవర్తన ఎంతమాత్రం బాగా లేదు'.

విశేషం: కమలగర్భుఁడు= బ్రహ్మదేవుడు. విష్ణుమూర్తి నాభికమలంనుండి ఉద్భవించినగాథ సుప్రసిద్ధం.

వ. అని పలికి జానకి యుత్తరీయసంవృతవదనయై యతికరుణంబుగా నేడ్చిన నద్దురాత్మ్ముండు వెండియుఁ గొన్ని దుర్వచనంబులు పచరించి యనంతరంబ యంతర్ధానంబు నొందె; నప్పొలఁతియు నెప్పటియట్ల రాక్షసీరక్షిత యై యుండె నని మార్కండేయుండు ధర్మరాజునకు నిర్దేశించిన

తెఱఁగు వైశంపాయనోక్తం బైన యాఖ్యానంబు విఖ్యాత మాధుర్య మనోహరంబుగా. 143

ప్రతిపదార్థం: అని పలికి= అని చెప్పి; జానకి= సీత; ఉత్తరీయ సంవృత వదన+ఐ= పైవస్త్రంచేత కప్పబడిన మొగం కలది అయి; అతి కరుణంబు గాన్= మిక్కిలి జాలిగా; ఏడ్చినన్= ఆక్రోశించగా; ఆ+దురాత్ముండు= ఆ చెడ్డ ఆత్మ కలవాడు- రావణుడు; వెండియున్= మఱియును; కొన్ని= కొన్ని; దుర్వచనంబులు= చెడు పలుకులు; పచరించి= పలికి; అనంతరంబు+అ= వెనువెంటనే; అంతర్ధానంబున్+ఒందెన్= కనుపించకుండా పోయాడు; ఆ+పొలఁతియున్= ఆ వనితయు- సీతాదేవియు; ఎప్పటి+అట్ల= యథా ప్రకారంగా, ఇదివరకు వలెనే; రాక్షసీ రక్షిత+ఐ= రాక్షసస్త్రీలచేత కావలి కాయ బడింద్తె; ఉండెన్= ఉండింది; అని= అని చెప్పి; మార్కండేయుండు; ధర్మరాజునకు; నిర్దేశించిన= తెలియచెప్పిన; తెఱఁగు= తీరు; వైశంపాయన+ఉక్తంబు+ఐన= వైశంపాయనుడిచేత చెప్పబడిన; ఆఖ్యానంబు= పెద్ద కథ; విఖ్యాత, మాధుర్య, మనస్+హరంబుగా= సుప్రసిద్ధమై, తియ్యనిదై, మనస్సును ఆహ్లాదపరిచేదిగా.

తాత్పర్యం: అని చెప్పి సీత ఉత్తరీయంతో ముఖం కప్పుకొని మిక్కిలి దీనంగా ఏడువగా, ఆ దుర్మార్గుడైన రావణుడు ఇంకా కొన్ని దుర్భాషలాడి వెళ్లిపోయాడు. సీత ఎప్పటివలెనే రాక్షస స్త్రీ రక్షితయై ఉన్నది అని మార్కండేయ మహర్షి ధర్మరాజుతో చెప్పినట్లు వైశంపాయనుడు విఖ్యాతంగానూ, మధురంగానూ, మనోహరంగానూ చెప్పాడు.

* * *